

'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 322

సోమవారం 12-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కుర్రాళ్లు వదిలేశారు

అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో ఆసీస్ చేతిలో ఓడిపోయిన భారత్ - 14లో



ఆర్థిక విజయానికి రామబాణం


రిస్క్ నిర్వహణ తెలియాలి.. నిపుణుల మార్గదర్శకం అవసరం - 15లో



సంకీర్ణం దిశగానే పాక్

పాక్ ఎన్నికల్లో హంగ్ ఫలితాలు రావడంతో మూడు ప్రధాన పార్టీలు సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి.

వివరాలు 6లో ▸



కాల్చేసే కాంతిపుంజం!

క్షిపణులను బూడిద చేసే 'ఐరన్ బీమ్' రక్షణ వ్యవస్థను ఇజ్రాయెల్ రంగంలోకి దించనున్నట్లు సమాచారం.

వివరాలు 6లో ▸



ఎన్నికలప్పుడే పేదలు గుర్తొస్తారు

కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల సమయంలోనే గ్రామీణులు, రైతులు, పేదలు గుర్తొస్తారని ప్రధాని నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు.

వివరాలు 6లో ▸



రేపు రైతు సంఘాల 'ఛలో ఢిల్లీ'

రైతు సంఘాలు ఈ నెల 13న తలపెట్టిన ఆందోళన నేపథ్యంలో పోలీసులు ఢిల్లీ సరిహద్దుల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

గిరిజనులను గుండెల్లో పెట్టుకున్నారు!

- అడవి బిడ్డలను ఆదుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- అయినా ఈనాడులో 'పచ్చ' కళ్ల రామోజీ అబద్ధపు రాతలు
- గిరిజన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కంటే అధిక ధరలు చెల్లింపు
- మద్దతు ధర నిర్ణయానికి అపెక్స్ కమిటీ ఏర్పాటు
- సాగు పెట్టుబడికి ప్రభుత్వ సాయంతోపాటు ముందస్తు రుణాలు
- అరకు కాఫీకి అంతర్జాతీయ బ్రాండింగ్
- ఆర్గానిక్ సర్టిఫికేషన్ కోసం ప్రత్యేక చర్యలు

5లో

ఆర్బీకేలపై నిత్యం ఏడుపే


- గ్రామస్థాయిలో 10,778 ఆర్బీకేల ఏర్పాటు.. రైతుల గడప వద్దకే సాగు ఉత్పాదకాలు
- విత్తు నుంచి విక్రయం వరకు రైతు సేవలో నిమగ్నం
- జాతీయ, అంతర్జాతీయ ప్రశంసలు, అవార్డులు
- 10,252 ఆర్బీకేల నూతన భవనాల నిర్మాణానికి చర్యలు
- ఇప్పటికే వినియోగంలోకి 4,554 భవనాలు
- మార్చిలోగా మిగిలినవి పూర్తి
- ఇంటర్నెట్‌తో సహా సకల సదుపాయాలు.. స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం
- అయినా అదే పనిగా విషం కక్కుతున్న ఈనాడు

10లో

ఎవరితో కలిసినా.. ఎవరిని వదిలేసినా.. ఏం చేసినా

నా ప్రయోజనాలే రాష్ట్ర ప్రయోజనాలు

చంద్రబాబు అవకాశవాద రాజకీయాలకు 'రాష్ట్రం' ముసుగు



- పవన్, బీజేపీ, కాంగ్రెస్.. ఎవరితో కలిసినా, విడిపోయినా ఇదే మాట
- స్వప్రయోజనాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నక్కజిత్తులు
- 1999లో వాజ్‌పేయితో కలిసినప్పుడు రాష్ట్ర హితం కోసమంటూ హడావుడి
- విడిపోయాక మతతత్వ పార్టీతో కలిసి తప్పు చేశానని పశ్చాత్తాపం
- 2014లో పాజిటివ్ ఓటు కోసం మళ్లీ రాష్ట్ర ప్రయోజనాలంటూ బీజేపీతో పొత్తు
- 2019లో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే విడిపోయానంటూ డాంబికాలు
- మళ్లీ ఇపుడు రాష్ట్రం కోసమే బీజేపీతో కలిసే ప్రయత్నాలంటూ వ్యాఖ్యలు
- ప్రత్యేక హోదా సంజీవని కాదు.. ప్యాకేజీ చాలన్నప్పుడు కూడా ఇదే మాట
- ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచినప్పుడూ... ప్రజాస్వామ్యం కోసమేనని ప్రచారం.. ఆఖరికి మద్య నిషేధం ఎత్తివేసినపుడు కూడా అదే ముసుగు
- బాబు ఏం చేసినా 'రాష్ట్ర ప్రయోజనాల' కోసమేనంటూ ఎల్లో మీడియా దరువు.. వాస్తవానికి అధికారం, కుటుంబ ప్రయోజనాలు తప్ప ఏవీ పట్టని చంద్రబాబు
- తనయుడి కోసం, అధికారం కోసం ఏం చేయటానికైనా నారా వారు రెడీ

- వివరాలు 11లో

మన బడికి అంతర్జాతీయ ఖ్యాతి

జపాన్ సకురా సైన్స్ ఫెయిర్‌కు ఏపీ విద్యార్థులు

- ప్రభుత్వ పాఠశాలల నుంచి ఏడుగురు ఎంపిక
- ఇన్‌స్పైర్ పోటీల్లో ఇప్పటికే ముందంజ
- గతేడాది యూఎస్‌ఏకు వెళ్లిన 10 మంది విద్యార్థుల బృందం.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణలతో సత్ఫలితాలు
- నాడు–నేడుతో మారిన ప్రభుత్వ బడులు, పెరిగిన వసతులే కారణమంటున్న విద్యావేత్తలు
- జిల్లా స్థాయిలో ప్రారంభమైన ఇన్‌స్పైర్ పోటీలు

16లో



జపాన్ వెళ్లి వచ్చిన ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు

విద్యా వ్యవస్థలో మరో విప్లవం

- ప్రభుత్వ బడుల్లో ప్రాథమిక స్థాయి నుంచే కంప్యూటర్ సైన్స్ పాఠాలు
- 2024-25లో పైలట్ ప్రాజెక్టుగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో ప్రారంభం
- అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ ప్రోగ్రామ్ పేరుతో ఒప్పందం

2లో



వికసిత్ భారత్‌కు ప్రధాన ఆర్థిక దిక్సూచి విశాఖ

రాష్ట్రంలో ప్రముఖ నగరమైన విశాఖపట్నం .. దేశ ఆర్థికవ్యవస్థను పరుగులు పెట్టించడంలో కూడా తన వంతు పాత్ర పోషించనుంది. విశాఖ ప్రాధాన్యాన్ని గుర్తించిన సీఎం జగన్ ఇప్పటికే పరిపాలన రాజధానిగా ప్రకటించగా.. తాజాగా నీతి ఆయోగ్ కూడా విశాఖ ప్రాముఖ్యతను గుర్తించింది. 2047 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థను 30 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక విజన్‌తో ముందుకెళుతోంది. ఇందులో భాగంగా భారత ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించే నగరాలను గుర్తిస్తూ నీతి ఆయోగ్ విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తోంది. ఇందులో ముంబై, సూరత్, వారణాసి, విశాఖ పట్నానికి చోటు కల్పించింది.

- వివరాలు 3లో

విత్తన పరిశోధనలో మరో ముందడుగు

విత్తన రంగంలో మరో విప్లవాత్మక సంస్థ రాష్ట్రంలో అందుబాటులోకి రాబోతోంది. కృష్ణా జిల్లా గన్నవరం వద్ద నిర్మిస్తున్న డాక్టర్ వైఎస్సార్ విత్తన పరిశోధన, శిక్షణా సంస్థ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఖరీఫ్‌కల్లా ఈ సంస్థ సేవలు అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోంది. ప్రాజెక్టులో భాగంగా దేశంలోనే తొలి రాష్ట్రస్థాయి విత్తన జన్యు బ్యాంకుతో పాటు సీడ్ గ్రో అవుట్ టెస్ట్ ఫామ్, సీడ్ టెస్టింగ్ ల్యాబ్, గ్రీన్ హౌస్, సీడ్ ప్రాసెసింగ్, కోల్డ్‌స్టోరేజ్ యూనిట్లు ఏర్పాటవుతున్నాయి. రైతులతో పాటు వ్యవసాయ విద్యార్థుల శిక్షణ, పరిశోధనల కోసం ట్రైనింగ్ సెంటర్‌లు, హాస్టల్‌ను నిర్మిస్తున్నారు.



- వివరాలు 2లో



రహదారులు.. రాచబాటలు

రాష్ట్రంలోని జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ రోడ్లు రాచబాటలను తలపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో రోడ్ల దుస్థితిని గుర్తించిన సీఎం జగన్ చొరవ, పట్టుదల వల్ల పలు జాతీయ రహదారులకు మోక్షం కలిగింది. కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు 216 ఎన్‌హెచ్, రూ.6,300 కోట్లతో విశాఖ–భోగాపురం మధ్య ఆరు లేన్ల బీచ్ కారిడార్, చిత్తూరు జిల్లాలో రూ.6,960 కోట్లతో రోడ్లు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అలాగే నాడు అడుగుకొక గుంతతో కనిపించే ఆర్ అండ్ బీ రోడ్లు ఇప్పుడు సరికొత్త రూపును సంతరించుకున్నాయి. అన్ని జిల్లాల్లోనూ రోడ్ల పనులు చకచకా కొనసాగుతున్నాయి.

- వివరాలు 12లో

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

అప్పు చేయాల్సిన అవసరమే లేదు



మా కుటుంబం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తోంది. నాకు ఒకటిన్నర ఎకరాల పొలం ఉంది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం యరకన్నపాలెంలోని మా పొలాల పక్కనే తాండవ జలాశయం కాలువ పారుతుండటంతో నీటికి ఇబ్బంది లేదు. నీటి వసతి ఉండటంతో ఏటా వరి పంట వేస్తుంటాం. 30 సెంట్లలో జీడిమామిడి తోట ఉంది. మిగిలిన ఎకరా 20 సెంట్లలో వరి పంట వేశాను. జీడి తోట సంరక్షణ, వరికి నాట్ల దగ్గర నుంచి కోతకోసే వరకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు ఖర్చవుతుంది. ఈ ప్రభుత్వం రాకముందు వ్యవసాయ పెట్టుబడికి అప్పుచేయాల్సి వచ్చేది. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత రైతు భరోసా కింద ఏటా రూ.13,500 చొప్పున వస్తుండటంతో పెట్టుబడికి ఇబ్బంది లేదు. వరి పంట కోత దశకు వచ్చింది. ఈ సమయంలో రైతు భరోసా కింద రూ. 4 వేలు పడింది. ఈ డబ్బు కోత పనులకు ఉపయోగపడుతుంది. నా భార్య రామలక్ష్మి కి వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.13 వేలు వచ్చింది. గుంటూరు ప్రైవేటు కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న నా కుమారుడు ప్రవీణ్‌కుమార్‌కు జగనన్న విద్యా దీవెన ద్వారా ఏటా రూ.55 వేల వంతున వచ్చింది. గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం కాలేజీలో డిప్లమా ఫైనల్ ఇయర్ చదువుతున్న మా అమ్మాయి శ్రావణికి ఏటా రూ.25 వేల వంతున వచ్చింది. జగనన్న ప్రభుత్వంలో పైసా ఖర్చు లేకుండా ఇద్దరు బిడ్డలను ప్రైవేటు కళాశాలలో చదివించుకుంటున్నాను. అప్పు కోసం తిరగాల్సిన అవసరమే లేకుండా పోయింది. ఈ ప్రభుత్వంలో జరిగిన మేలు మరువలేను.

– రుత్తల సాంబశివరావు, రైతు, యరకన్నపాలెం
(ఏనుకూరి అప్పారావు, విలేకరి, నర్సీపట్నం, అనకాపల్లి జిల్లా)

సొంతిల్లు కల్పించిన జగనే మా దేవుడు





మా సొంతూరు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు. ఆర్ఎంపీగా జీవనం సాగిస్తున్నాను. 26 ఏళ్ల కిందట ఉపాధి కోసం అనంతపురం జిల్లాకు వలస వచ్చా. నాకు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఉరవకొండ, విడపనకల్లు, అనంతపురం రూరల్ మండలం కందుకూరు తదితర ప్రాంతాల్లో పనిచేశా. ప్రస్తుతం కందుకూరు గ్రామంలో స్థిరపడ్డా. పిల్లలు పెద్దయ్యేకొద్దీ ఖర్చులు పెరుగుతూ వచ్చాయి. వచ్చే సంపాదనంతా ఇంటి అద్దెలు, కుటుంబ నిర్వహణకే సరిపోయేది. సొంతగూడు కట్టుకోవాలని కలలు కనేవాడిని. ప్రతీరోజూ ఆ దేవుడ్ని మొక్కుకునేవాడిని. బాడుగ డబ్బు చెల్లించడంలో కాస్తా ఆలస్యమైతే చాలు ఇల్లు ఖాళీ చేయమనేవారు. ఇంతకుముందు ఎక్కడా అరసెంటు కూడా లబ్ధి పొందలేదు. మహానుభావుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాత కందుకూరు జగనన్న లే అవుట్‌లో సెంటున్నర స్థలం ఇచ్చారు. ప్రస్తుతం ఈ స్థలం విలువ రూ.5 లక్షల దాకా ఉంది. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేయడంతో ఇల్లుకూడా నిర్మించుకున్నా. ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు చేసేశా. నా కొడుకుకు సచివాలయ ఉద్యోగం వచ్చింది. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా అనంతపురంలో పనిచేస్తున్నాడు. ఇంతకంటే ఇంకేమి కావాలి? అందుకే నా ఇంట్లో దేవుని గూటిలో మా నాయన ఫొటో పెట్టుకోలేదు కాని వైఎస్ జగన్ ఫొటో పెట్టుకుని పూజిస్తున్నా.

– సీహెచ్ గోవిందరెడ్డి, కందుకూరు
(రిపోర్టర్: బొద్దు నగేష్, అనంతపురం ఎడ్యుకేషన్)

వృద్ధాప్యంలో ఈ ప్రభుత్వమే పోషిస్తోంది



నేను వృద్ధురాలిని..ఒంటరి మహిళను. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం బాపులపాడులో వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాను. రెక్కాడితే కాని డొక్కాడని జీవితం నాది. వయోభారంతో కూలీ పనులు చేసే ఓపిక లేకపోవటంతో బతుకు భారంగా మారింది. ఆదాయం లేకపోవటంతో డ్వాక్రా గ్రూపు ద్వారా తీసుకున్న బ్యాంకు రుణం చెల్లించటం కష్టంగా మారింది. ఇలాంటి తరుణంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నన్ను భగవంతుడిలా ఆదుకుంది. ఈ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మనోధైర్యాన్ని ఇచ్చాయి. వైఎస్సార్ చేయూత, ఆసరా, రైతు భరోసా, వైఎస్సార్ ఫించన్ కానుక పథకాలతో పెద్ద కొడుకుగా జగన్ నన్ను ఆదుకున్నాడు. వృద్ధాప్య ఫించన్‌తో పాటు ఏటా నాలుగు సంక్షేమ పథకాల ద్వారా బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతోంది. ప్రతి నెల ఒకటో తేదీనే వలంటీర్ ఇంటికి వచ్చి నాకు రూ.3 వేలు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్నారు. ఆసరా పథకం క్రింద రూ.30 వేలు డ్వాక్రా రుణ మాఫీ చేశారు. వైఎస్సార్ చేయూత కింద ఏటా రూ.18,750, రైతు భరోసా కింద ఏటా రూ.13,500 అందుతున్నాయి. దీంతో ఎవ్వరిపైనా ఆధార పడకుండా ఎంతో సంతోషంగా జీవనం సాగిస్తున్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు నెలకు సరిపడా అందిస్తున్నారు. జగనన్న రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది.

– జోగి లక్ష్మి, బాపులపాడు
చలమలశెట్టి శ్యామ్, విలేకరి, హనుమాన్‌జంక్షన్

విత్తన పరిశోధనలో మరో ముందడుగు

వచ్చే ఖరీఫ్‌కల్లా డాక్టర్ వైఎస్సార్ విత్తన పరిశోధన, శిక్షణా సంస్థ సేవలు



గన్నవరం వద్ద శరవేగంగా నిర్మాణం జరుగుతున్న ఏపీ విత్తన పరిశోధన, శిక్షణా సంస్థ భవన సముదాయాలు

- దేశంలోనే తొలి రాష్ట్రస్థాయి విత్తన జీన్స్ బ్యాంక్
- గ్రో అవుట్ టెస్ట్ ఫామ్, సీడ్ టెస్టింగ్ ల్యాబ్..
- గ్రీన్‌హౌస్, సీడ్ ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజ్ యూనిట్ల నిర్మాణం
- రైతు శిక్షణకోసం ఫార్మర్స్ ట్రెయినింగ్ సెంటర్, హాస్టల్ కూడా ఏర్పాటు
- రాష్ట్రంలో విత్తన పరీక్ష నెట్‌వర్క్‌ని బలోపేతం చేయడమే లక్ష్యం
- గన్నవరం వద్ద 8 ఎకరాల్లో రూ.40 కోట్లతో శరవేగంగా నిర్మాణ పనులు

విత్తన రంగంలో విప్లవాత్మక మార్పులు



రైతులకు అధిగ దిగుబడినిచ్చే నాణ్యమైన, మేలు రకం వంగడాలు అందించేందుకు విస్తృత పరిశోధనలు చేసే దిశగా ఆలోచన చేయాలన్న సీఎం జగన్ సూచనల మేరకు డాక్టర్ వైఎస్సార్ విత్తన పరిశోధన, శిక్షణా సంస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టాం. సంస్థ సేవలు అందుబాటులోకి వస్తే విత్తన రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోనున్నాయి.

– డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు, ఎండీ, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ

సాక్షి, అమరావతి: విత్తన రంగంలో మరో విప్లవాత్మక సంస్థ రాష్ట్రంలో అందుబాటులోకి రాబోతోంది. కృష్ణా జిల్లా గన్నవరం వద్ద నిర్మిస్తున్న డాక్టర్ వైఎస్సార్ విత్తన పరిశోధన, శిక్షణా సంస్థ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ఈ సంస్థ సేవలు అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోంది. రైతులకు నాణ్యమైన సర్టిఫై చేసిన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావాలన్న సత్సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం గడిచిన నాలుగున్నరేళ్లలో ఎన్నో విప్లవాత్మక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా.. దేశంలోనే తొలిసారిగా నియోజకవర్గ స్థాయిలో వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్‌ను తీసుకొచ్చింది. ఇక్కడ సర్టిఫై చేసిన విత్తనాలనే మార్కెట్‌లోకి విడుదల చేయడమే కాదు.. ఆర్బీకేల ద్వారా గ్రామ స్థాయిలో రైతులకు సరఫరా చేస్తోంది. మరోవైపు.. విత్తన పరిశోధనలకు మరింత ఊతమిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఏపీ విత్తనాభివృద్ధి సంస్థకు అనుబంధంగా రాష్ట్ర విత్తన పరిశోధన, శిక్షణా సంస్థను ఏర్పాటుచేస్తోంది. ఈ తరహా పరిశోధనా కేంద్రం జాతీయ స్థాయిలో ఒక్క వారణాసిలో మాత్రమే ఉంది. స్వాతంత్య్రం సిద్ధించిన తర్వాత ప్రభుత్వపరంగా ఈ తరహా పరిశోధనా కేంద్రాల ఏర్పాటుకు దేశవ్యాప్తంగా ఎక్కడా కనీస ప్రయత్నాలు కూడా జరగలేదు. ఇప్పుడు గన్నవరంలోని విత్తనాభివృద్ధి సంస్థకు చెందిన ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో రూ.45 కోట్ల అంచనాతో తలపెట్టిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు గతేడాది మార్చిలో శంకుస్థాపన చేశారు. తొలిదశలో రూ.18 కోట్లతో చేపట్టనున్న నిర్మాణాలకు పరిపాలనామోదం ఇవ్వగా, ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ పర్యవేక్షణలో నిర్మిస్తున్నారు.

కొత్త రకాల విత్తనాలకు రూపకల్పన..

ఈ సంస్థ ఏర్పాటుతో రాష్ట్రంలో విత్తన నాణ్యత పరీక్షించే యంత్రాంగం బలోపేతం కానుంది. మానవ వనరుల అభివృద్ధి కార్యకలాపాలను నిర్వహించడం ద్వారా సీడ్ సైన్స్, టెక్నాలజీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రానుంది. వాతావరణాన్ని తట్టుకోగల, అధిక దిగుబడినిచ్చే కొత్త రకాల విత్తనాల రూపకల్పనతో పాటు సంకర జాతుల అభివృద్ధిలో ఈ సంస్థ భవిష్యత్తులో కీలక భూమిక పోషించనుంది. జాతీయ స్థాయిలో ఈ రంగంలో ఉన్న ఇతర సంస్థల సమన్వయంతో వ్యవసాయ పట్టభద్రులు, డిప్లమో హోల్డర్లకు కెపాసిటీ బిల్డింగ్ కింద శిక్షణ ఇవ్వనున్నారు. ఏటా కనీసం వెయ్యిమంది అగ్రి గ్రాడ్యుయేట్స్, రెండువేల మంది అగ్రి డిప్లమో హోల్డర్స్‌కు శిక్షణ ఇవ్వడం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించారు.



శరవేగంగా కొనసాగుతున్న ఏపీ విత్తన పరిశోధన, శిక్షణా సంస్థ భవన నిర్మాణాలు

అత్యాధునిక సౌకర్యాలు..

ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రస్థాయి విత్తన జన్యు బ్యాంకుతో పాటు సీడ్ గ్రో అవుట్ టెస్ట్ ఫామ్, సీడ్ టెస్టింగ్ ల్యాబ్, గ్రీన్ హౌస్, సీడ్ ప్రాసెసింగ్, కోల్డ్‌స్టోరేజ్ యూనిట్లు ఏర్పాటు కాబోతున్నాయి. అలాగే..

- విత్తనాలు నిల్వచేసేందుకు ప్రత్యేకంగా గోదాములు నిర్మిస్తున్నారు.
- రైతుల శిక్షణ కోసం ఫార్మర్స్ ట్రెయినింగ్ సెంటర్‌తో పాటు వ్యవసాయ పట్టభద్రులు, పీజీ, డిప్లమో చదివే విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించి ఈ రంగంలో పరిశోధనల వైపు అడుగువేసే వారికి ప్రత్యేకంగా శిక్షణనిచ్చేందుకు ట్రెయినింగ్ సెంటర్, హాస్టల్ భవన సముదాయాలు నిర్మిస్తున్నారు.
- ఇప్పటికే పరిశోధనా సంస్థ భవన సముదాయంతో పాటు ట్రెయినింగ్ సెంటర్‌కు సంబంధించి గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్, హాస్టల్ బిల్డింగ్స్ నిర్మాణం పూర్తికావచ్చింది.
- వచ్చే జూలై నాటికి వీటి సేవలను అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది.

విద్యా వ్యవస్థలో మరో విప్లవం

- ప్రభుత్వ బడుల్లో ప్రాథమిక స్థాయి నుంచే కంప్యూటర్ సైన్స్ పాఠాలు
- విద్యార్థులకు జగన్ సర్కారు మరో 'విద్యా' వరం
- 2024–25లో పైలట్ ప్రాజెక్ట్‌గా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో ప్రారంభం.. రెండేళ్లలో 10 వేల మంది విద్యార్థులకు లబ్ధి
- అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ ప్రోగ్రామ్‌తో సమగ్ర శిక్ష ఒప్పందం



ఎంవోయూపై సంతకం చేసిన సమగ్రశిక్ష, అమెజాన్ ఇండియా ప్రతినిధులు (ఫైల్)

రాష్ట్రంలో ప్రతి పేద విద్యార్థికి కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న సంకల్పంతో సీఎం జగన్ విభిన్న ప్రాజెక్టులతో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు సుకొస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో పునాది స్థాయిలోనే కంప్యూటర్ విద్యను అందిస్తే.. భవిష్యత్తులో ప్రపంచాన్ని శాసించే యువతగా విద్యార్థులు తలెత్తుకొని జీవించగలరనే నమ్మకంతో మరో కీలక ప్రాజెక్టుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అమెజాన్ ఇండియాతో జతకడుతూ 'అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ ప్రోగ్రాం' కింద వరుసగా రెండో ఏడాది కూడా ఏపీ ప్రభుత్వం అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది.

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర జిల్లాల విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి కంప్యూటర్ సైన్స్ పాఠాలు పాఠశాల స్థాయిలో 6వ తరగతి నుంచి బోధించేందుకు అడుగులు పడనున్నాయి. వెనకబాటు జిల్లాలుగా ఉన్న ఈ ప్రాంత భవిష్యత్తు సారథులైన విద్యార్థులకు ప్రభుత్వం ఈ గొప్ప అవకాశం కల్పిస్తోంది. 2024–25 విద్యా సంవత్సరం నాటికి 10 వేల మంది ఏపీ విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ విద్యతో సాధికారత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమెజాన్ ఇండియాతో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. 2026–27 నాటికి సంపూర్ణంగా ఈ ప్రయోజనాలను లక్ష మందికి అందించాలన్నదే ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఇందులో భాగంగా విజయవాడలో ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, సమగ్రశిక్ష ఎస్‌పీడీ బి.శ్రీనివాసరావు సమక్షంలో ఒప్పంద సంతకాలు జరిగాయి. రాబోయే విద్యా సంవత్సరం నుంచి ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

ప్రపంచ బ్యాంకు భాగస్వామ్యంతో..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన ఈ బృహత్తర కార్యానికి అనేక సంస్థలు ముందుకువచ్చాయి. అమెజాన్ ఇండియా ఫండ్స్, సమగ్ర శిక్షతో పాటు ప్రపంచబ్యాంక్ టెక్నికల్ సపోర్ట్ సిస్టమ్, లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ, క్వెస్ట్ అలయన్స్ అనే ఎన్‌జీవో ఇందులో ఉన్నాయి. వీరందరి భాగస్వామ్యంతో ఉత్తరాంధ్ర విద్యార్థుల భవితను తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వం తీసుకుంది. 'కంప్యూటేషనల్ థింకింగ్ అండ్ 21 సెంచరీ స్కిల్స్'పై శిక్షణా కార్యక్రమం ద్వారా తరగతి గదుల్లో కంప్యూటర్ సైన్స్ పాఠ్యాంశాలను సమర్థవంతంగా అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. కేవలం విద్యార్థులకే కాకుండా ఉపాధ్యాయులకు కూడా బోధన, సాంకేతిక, నాయకత్వ నైపుణ్యాలపై శిక్షణ ఇస్తారు.

10 వేల మంది నుంచి లక్ష వరకూ..

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు కంప్యూటర్ సైన్స్ పాఠ్యాంశాలు సులువుగా అర్థమయ్యేలా ఈ ప్రోగ్రామ్ డిజైన్ చేశారు. పైలట్ ప్రాజెక్టు కింద ఉత్తరాంధ్రలో 10 వేల మంది విద్యార్థులకు ఈ తరగతులు అందుబాటులోకి రానున్నాయి. ఏపీలో లక్ష మందికి ఈ విద్యను చేరువ చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఎస్‌సీఈఆర్‌టీతో కలిసి పాఠశాలల్లో కంప్యూటేషనల్ థింకింగ్ క్లబ్‌లు ఏర్పాటు చేయనుంది. విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ పాఠాల బోధన, ప్రాక్టికల్‌గా శిక్షణ ఇలా విభిన్న అంశాల్లో తరగతులు నిర్వహించి పిల్లల్ని నిష్ణాతుల్ని చేయనుంది.

ఎక్సలెన్స్ కోర్సుల అనుసంధానం



కంప్యూటర్ సైన్స్ టీచింగ్ ఎక్సలెన్స్ కోర్సులను అనుసంధానం చేయడం ద్వారా డిజిటల్ యుగానికి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. ప్రైవేట్ పబ్లిక్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సాంకేతిక విద్యను చేరువ చేస్తున్నాం. దీనివల్ల విద్యార్థుల ఉన్నత చదువులకు ఈ ప్రోగ్రాం ఒక పునాదిలా మారుతుంది.

– బి.శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్

ప్రతి విద్యార్థికి అవకాశం




అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులందరినీ సాంకేతిక విద్యను చేరువ చేయాలన్నదే అమెజాన్ ఇండియా లక్ష్యం. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వంతో అడుగులు వేస్తున్నాం. విద్యార్థులకు వారి కెరీర్‌లకు అవసరమైన నైపుణ్యాల్ని అందిస్తాం. బెస్ట్ కెరీర్‌కు కంప్యూటర్ సైన్స్ విద్య ఎంతో దోహద పడుతుంది. రెండేళ్లలో దేశ వ్యాప్తంగా 1.5 మిలియన్ మంది విద్యార్థులకు, 8 వేల మంది టీచర్లకు కంప్యూటర్ సైన్స్ విద్య అందించాం.

– అక్షయ్ కశ్యప్, అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ ఇండియా లీడర్

పోలవరం ముంపుపై ఒడిశా మంకుపట్టు

- ముంపు ప్రభావంపై ఛత్తీస్‌గఢ్‌లో పూర్తికావొస్తున్న సంయుక్త సర్వే
- సంయుక్త సర్వేకు అంగీకరించని ఒడిశా సర్కార్
- ఇదే అంశాన్ని సుప్రీం కోర్టుకు నివేదించాలని కేంద్రం నిర్ణయం



సాక్షి, అమరావతి : పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రభావంపై ఛత్తీస్‌గఢ్‌లో సంయుక్త సర్వే పూర్తి కావొస్తోంది. కానీ.. ఆ సర్వేకు ఒడిశా సర్కార్ అంగీకరించకుండా మంకుపట్టుపడుతోంది. స్పిల్ వే సామర్థ్యాన్ని(దిగువకు వదిలే వరద ప్రవాహం) 36 నుంచి 50 లక్షల క్యూసెక్కులకు పెంచినా ముంపు ఏమాత్రం పెరగదని ఇప్పటికే కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తేల్చి చెప్పింది. ఒడిశా సర్కార్ వైఖరిపై సుప్రీం కోర్టుకు నివేదించాలని కేంద్ర జల్ శక్తి శాఖ నిర్ణయించింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే సామర్థ్యాన్ని 36 లక్షల నుంచి 50 లక్షల క్యూసెక్కులకు పెంచిన నేపథ్యంలో తమ రాష్ట్రాల్లో ముంపు ప్రభావం అధికంగా ఉంటుందంటూ ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రభుత్వాలు వేర్వేరుగా సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్సెల్పీ)లు దాఖలు చేశాయి. వాటిపై విచారించిన సుప్రీం కోర్టు.. ఆ రాష్ట్రాలతో పాటు ఏపీ ప్రభుత్వంతో చర్చించి, వారి అనుమానాలు నివృత్తి చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. దాంతో గతేడాది పలు దఫాలుగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఏపీ జలవనరుల శాఖల ఉన్నతాధికారులతో కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ఛైర్మన్‌లు సమీక్షలు నిర్వహించారు. స్పిల్ వే సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచినా ముంపు పెరగదని సీడబ్ల్యూసీ ఛైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా చెప్పారు. తెలంగాణలో ఒక్క ఇంచు భూమి కూడా అదనంగా ముంపునకు గురికాదన్నారు. ముంపు ప్రభావంపై ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో సంయుక్త సర్వే(ఆయా రాష్ట్రాల ప్రతినిధులు, ఏపీ, పీపీఏ అధికారులు) నిర్వహించాలని ఆ రాష్ట్రాల ప్రతిపాదనకు కేంద్ర జల్ శక్తి శాఖ అంగీకరించింది. ఈ మేరకు ఛత్తీస్‌గఢ్‌లో చేపట్టిన సంయుక్త సర్వే పూర్తికావొస్తోంది. సంయుక్త సర్వేపై ఏడాదిగా ఒడిశా సర్కార్‌తో ఇటు రాష్ట్ర అధికారులు, అటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ అధికారులు సంప్రదిస్తున్నా.. ఆ రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు. ఇదే అంశాన్ని సుప్రీం కోర్టుకు వివరించి.. పోలవరం ముంపు వివాదానికి తెరదించాలని కేంద్రం నిర్ణయించింది.

ఆరోగ్య సూచీల్లో ఏపీ ఫస్ట్

- రక్తహీనత నివారణ చర్యల్లో దేశంలో మొదటి బహుమతి
- డిజిటల్ వైద్య సేవల కల్పన, టెలీమెడిసిన్‌లో మొదటి స్థానం

వైద్య సూచీల్లో జాతీయ స్థాయిలో ఏపీ స్థానం ఇదీ..

విభాగం	జాతీయస్థాయిలో ర్యాంక్/అవార్డు
రక్తహీనత నివారణ	మొదటి అవార్డు
న్యూట్రిషన్ రీహేబిలిటేషన్ సెంటర్ల నిర్వహణ	రెండో అవార్డు
పౌరుల డిజిటల్ హెల్త్ అత్యధిక రికార్డుల అనుసంధానం	మొదటి స్థానం
వెల్‌నెస్ సెంటర్ల నిర్వహణ	మొదటి అవార్డు
ముస్కాన్	దేశంలోనే అత్యధికంగా 42 ఆస్పత్రులతో తొలి స్థానం
ఎన్‌క్వాష్	దేశంలోనే అత్యధికంగా 640 ఆస్పత్రులకు ఎన్‌క్వాష్ గుర్తింపుతో మొదటి స్థానం

సాక్షి, అమరావతి: చేసే పనిలో చిత్తశుద్ధి ఉంటే గుర్తింపు దానంతట అదే వస్తుంది. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా వైఎస్ జగన్ సర్కార్ నిలుస్తోంది. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా.. వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలతో ప్రభుత్వం తొలినుంచీ ముందడుగు వేస్తోంది. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వంటి అనేక కార్యక్రమాల అమలు ద్వారా ప్రజారోగ్యానికి భరోసాగా నిలుస్తోంది. నీతిఆయోగ్ విడుదల చేస్తున్న ఆరోగ్య సూచీల్లో ఏపీ అగ్రస్థానంలో ఉంటోంది.

రక్తహీనత నివారణ చర్యల్లో భేష్

రక్తహీనత నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దీని నివారణకు సమర్థవంతమైన చర్యలు తీసుకుంటున్న ఏపీకి జాతీయ స్థాయిలో మొదటి అవార్డు లభించింది. అంగన్‌వాడీలు, పాఠశాలల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్, జగనన్న గోరుముద్ద కార్యక్రమాల కింద ప్రభుత్వం పోషకాహారం పంపిణీ చేస్తోంది. స్కూల్ హెల్త్ యాప్‌తో విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ చేపడుతోంది.

డిజిటల్ వైద్య సేవల్లో ఫస్ట్

ప్రజలకు డిజిటల్ వైద్యసేవల కల్పనలో దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ నిలుస్తోంది. పౌరులకు డిజిటల్ హెల్త్ అకౌంట్‌లు సృష్టించి, అందులో వారి ఆరోగ్య వివరాలను అప్‌లోడ్ చేయడం, భవిష్యత్‌లో వారు పొందే వైద్య వివరాలను డిజిటలైజ్ చేస్తున్నారు. మొత్తం జనాభాలో అత్యధికులకు హెల్త్ అకౌంట్‌లు సృష్టించడంతోపాటు ఆస్పత్రుల్లోనూ డిజిటల్ వైద్యసేవల కల్పనలో ఏపీకి ఇప్పటికే జాతీయస్థాయిలో అనేక మొదటి బహుమతులు లభించాయి. డిజిటల్ వైద్య సేవల కల్పనలో ఇతర రాష్ట్రాలు సైతం ఏపీ విధానాలను అవలంబించాలని అన్ని రాష్ట్రాలకు నేషనల్ హెల్త్ అథారిటీ సీఈవో లేఖ రాశారు.రాష్ట్రంలోని పౌరులకు టెలీ మెడిసిన్ సేవల కల్పనలో దేశంలో ఏపీ తొలి స్థానంలో నిలుస్తోంది. 2019 నుంచి దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 20.41 కోట్లకు పైగా టెలీకన్సల్టేషన్లు నమోదు కాగా.. ఇందులో 25 శాతానికిపైగా టెలీకన్సల్టేషన్లు కేవలం ఏపీ నుంచే ఉంటున్నాయి.

ఆరోగ్య ధీమా

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా మధ్యతరగతి, పేద కుటుంబాల ఆరోగ్యానికి సీఎం జగన్ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. రూ.5 లక్షలలోపు వార్షికాదాయం ఉన్న కుటుంబాలన్నింటినీ ఈ పథకం పరిధిలోకి తెచ్చింది. దీంతో ఏపీలోని 95 శాతం కుటుంబాలకు ఆరోగ్య బీమా లభిస్తోంది. అత్యధిక జనాభాకు పూర్తి ఆరోగ్య బీమా కల్పిస్తున్న రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉందని నీతిఆయోగ్ ప్రశంసించింది.



2019 నుంచి ఇప్పటివరకు వైద్యరంగం బలోపేతానికి తీసుకున్న చర్యలివీ

- వైద్య శాఖలో 53 వేలకు పైగా పోస్టుల భర్తీ. ఎప్పటి ఖాళీలకు అప్పుడే యుద్ధప్రాతిపదికన భర్తీ చేస్తున్న ప్రభుత్వం. ఇందుకోసమే ప్రత్యేకంగా రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు
- రూ.16,852 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలలు, వివిధ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంతోపాటు నాడు–నేడు ద్వారా ప్రభుత్వాస్పత్రుల బలోపేతం
- గ్రామాల్లో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు. 12 రకాల వైద్యసేవలు, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులతో సొంత ఊళ్లలోనే ప్రజలకు వైద్య సేవలు
- దేశంలోనే తొలిసారిగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు. నెలకు రెండుసార్లు గ్రామాలకు పీహెచ్‌సీ వైద్యులు
- టీడీపీ హయాంలో నిర్వీర్యమైన ఆరోగ్యశ్రీ బలోపేతం. వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో వ్యాధుల సంఖ్య 1,059 నుంచి 3,257కు పెంపు. వైద్య ఖర్చుల పరిమితి రూ.25 లక్షలకు పెంపు
- 108 (768 వాహనాలు), 104 (936) వాహనాలతో వైద్య సేవలు బలోపేతం.

క్లుప్తంగా...

జగన్ వల్లే వన్నెకుల క్షత్రియులకు తగిన గుర్తింపు

వన్నెకుల క్షత్రియ జైత్రయాత్రలో ఆ సామాజిక వర్గ నేతలు



మోపిదేవి, మధుసూదన్‌రెడ్డి, భరత్‌ను సత్కరిస్తున్న వన్నెకుల క్షత్రియులు

సాక్షి, తిరుపతి: సీఎం వైఎస్ జగన్ వల్లే రాష్ట్రంలో వన్నెకుల క్షత్రియులకు తగిన గుర్తింపు, గౌరవం వచ్చాయని ఆ సామాజికవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు స్పష్టంచేశారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ఆదివారం వన్నెకుల క్షత్రియుల జైత్రయాత్ర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్‌తోపాటు వన్నెకుల క్షత్రియ నాయకులు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ప్రభుత్వంలోనూ వన్నెకుల క్షత్రియులకు తగిన ప్రాధాన్యం దక్కలేదని చెప్పారు. తమ సామాజికవర్గానికి చెందిన మోపిదేవి వెంకటరమణ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఓటమి పాలైనా.. ఆ తర్వాత ఎమ్మెల్సీని చేసి మంత్రిగా తన పక్కన కూర్చోబెట్టుకున్న నాయకుడు సీఎం జగన్ అని వివరించారు. అంతటితో ఆగకుండా రాజ్యసభ సభ్యుడిని చేసి గల్లీ నుంచి ఢిల్లీకి పంపించి.. వన్నెకుల క్షత్రియ వర్గానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. కుప్పంలో చంద్రబాబు వన్నెకుల క్షత్రియుల ఓట్లతో గద్దెనెక్కి వారినే అణగదొక్కేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం టీడీపీకి ఎనలేని సేవ చేసినా.. ఆ పార్టీ గుర్తించలేదని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గుర్తుచేశారు. కానీ సీఎం జగన్ 48 గంటల్లోనే ఆయనను ఎమ్మెల్సీగా ప్రకటించి.. ఆ సామాజికవర్గానికి తగిన గౌరవం కల్పించారని పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వన్నెకుల క్షత్రియులకు రెండు ఎమ్మెల్సీ పదవులిచ్చారని.. అంతగా ప్రాధాన్యమిస్తున్న వైఎస్సార్‌సీపీకి వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు.

నేడు ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం చర్చలు

సాక్షి, అమరావతి: ఉద్యోగ సంఘాల నాయకులతో సోమవారం ప్రభుత్వం చర్చలు జరపనుంది. వెలగపూడి సచివాలయంలో మధ్యాహ్నం 3.30 గంటలకు మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం కానున్నారు. ఉద్యోగులకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించనున్నారు. ఈ సమావేశానికి ఏపీ ఎన్జీవో అసోసియేషన్, ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీటీఎఫ్, యూటీఎఫ్ తదితర సంఘాల నేతలను ఆహ్వానించారు.

ఆయుష్ సంయుక్త కార్యదర్శిగా భావన సక్సేనా

సాక్షి, న్యూఢిల్లీ: ఆయుష్ మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శిగా ఆంధ్రప్రదేశ్ కేడర్ ఐఎఫ్ఎస్ అధికారి భావన సక్సేనా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్స్ శాఖలోని సిబ్బంది శిక్షణ విభాగం ఆదేశాలు జారీ చేసింది. 1996వ బ్యాచ్‌కు చెందిన భావన సక్సేనా గతంలో ఢిల్లీలోని ఏపీ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్‌గా, జీ–20 సెక్రటేరియేట్ సంయుక్త కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు. ఫిబ్రవరి 15, 2027 వరకు లేదా తదుపరి ఆదేశాలు వచ్చే వరకూ ఆయుష్ సంయుక్త కార్యదర్శిగా భావన సక్సేనా కొనసాగుతారు.

పొత్తులపై అధిష్టానానిదే నిర్ణయం

- రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి



సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో పొత్తులపై తమ అధిష్టానానిదే నిర్ణయం అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. పొత్తులకు సంబంధించి బీజేపీ నాయకులు, కార్యకర్తలలో ఎలాంటి గందరగోళం లేదన్నారు. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసుకోవడమే బీజేపీ లక్ష్యమని, రానున్న రోజుల్లో అనేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పొత్తులపై ఆధారపడి పార్టీ ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించబోదని చెప్పారు. బీజేపీ మూలసిద్ధాంత కర్త దీన్‌దయాళ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పురందేశ్వరి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'బీజేపీ తన ప్రస్థానాన్ని ఇద్దరు ఎంపీలతో ప్రారంభించుకుంది. ఈ రోజు 303 మందిని గెలిపించుకుంది. రాబోయే రోజుల్లో 350 మందిని కూడా గెలిపించుకునే స్థాయిలో బీజేపీ ఉంది. ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం వల్లే పార్టీ ఈ స్థాయికి ఎదగ గలిగిందన్నారు. అమిత్‌షా, మోదీ, నడ్డాలు ప్రస్తుత పరిస్థితులన్నీ సమీక్షించుకుని పొత్తులపై సరైన నిర్ణయం తీసుకుంటారన్నారు. బీజేపీని బలోపేతం చేసుకోవాలనే వారందరూ పనిచేస్తున్నారని, ఇప్పుడు 'పల్లెకు పోదాం' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో కార్యక్రమాలు చేస్తున్నారని చెప్పారు.

వికసిత్ భారత్‌కు

ప్రధాన ఆర్థిక దిక్సూచి విశాఖ

- 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలో వైజాగ్ కీలకం
- నీతి ఆయోగ్ విజన్ డాక్యుమెంట్-2047లో విశాఖకు చోటు
- రానున్న కాలంలో ఇండియాను పరుగులు పెట్టించే నగరాలు ముంబై, సూరత్, వారణాసి
- త్వరలో వికసిత్ భారత్ విజన్ డాక్యుమెంట్ విడుదల చేయనున్న ప్రధాని మోదీ
- విశాఖ ప్రాధాన్యాన్ని గుర్తించి ఇప్పటికే పరిపాలన రాజధానిగా ప్రకటించిన సీఎం వైఎస్ జగన్
- మరిన్ని వసతులు, వనరుల కల్పనకు కృషిచేస్తున్న సీఎం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కీలకమైన విశాఖ నగరం దేశ ఆర్థికవ్యవస్థను పరుగులు పెట్టించడంలో తనవంతు పాత్ర పోషించనుంది. రాష్ట్ర ఆర్థికవ్యవస్థకు దిక్సూచిగా విశాఖను మరింత ఉన్నతస్థితికి తీసుకెళ్లేందుకు దీనిని పరిపాలన రాజధానిగా ప్రకటించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఈ నగరాన్ని మరింత పరిపుష్టం చేసేందుకు నిరంతరం కృషిచేస్తున్నారు. ఇక్కడి పలు ప్రాజెక్టులను పూర్తిచేయాలని ఇటీవల ప్రధాని మోదీని కోరిన విషయం తెలిసిందే. దేశ ఆర్థికవ్యవస్థలో విశాఖ నగర ప్రాధాన్యాన్ని తాజాగా నీతి ఆయోగ్ కూడా గుర్తించింది. భారత ఆర్థికవ్యవస్థను పరుగులు పెట్టించే కీలక నగరాల్లో విశాఖపట్నం కీలక పాత్ర పోషించనుందని ప్రకటించింది. వికసిత్ భారత్–2047 కింద దేశీయ ఆర్థికవ్యవస్థను 30 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.2,500 లక్షల కోట్లు)కి చేర్చాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక విజన్‌తో ముందుకెళుతోంది. 2047 నాటికి భారత ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించే నగరాలను గుర్తిస్తూ నీతి ఆయోగ్ విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తోంది. ఇందులో భాగంగా తొలి సారిగా 2047 వరకు దేశ ఆర్థికవ్యవస్థను పరుగులు పెట్టించే నగరాల్లో ముంబై, సూరత్, వారణాసి, విశాఖపట్నం ఉన్నాయని నీతి ఆయోగ్ సీఈవో బి.వి.ఆర్.సుబ్రమణ్యం ప్రకటించారు. వీటితోపాటు దేశ ఆర్థిక వ్యవస్థలో ఎకనామిక్ హబ్స్‌గా కీలక పాత్ర పోషించే మరో 20 నుంచి 25 పట్టణాలను గుర్తించే పనిలో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటివరకు పట్టణాల ఆర్థిక ప్రణాళికలు కాకుండా కేవలం పట్టణ అభివృద్ధి ప్రణాళికలకు పరిమితమయ్యామని, కానీ ఇప్పుడు ముంబై, సూరత్, వారణాసి, విశాఖపట్నంలను ఆర్థిక చోదకశక్తులుగా తీర్చిదిద్దే విధంగా ప్రణాళికలను రూపొందించనున్నట్లు వివరించారు. వికసిత్ భారత్–2047 లక్ష్యాలను చేరుకోవడానికి కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 11న సూచనలు, సలహాలు ఇవ్వాల్సిందిగా దేశ యువతను కోరింది. ఇప్పటివరకు 10 లక్షలకుపైగా వివరణాత్మకమైన సూచనలు, సలహాలు వచ్చాయని, వీటిని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా క్రోడీకరించి విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తామని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ ఈ విజన్ డాక్యుమెంట్ వికసిత్ భారత్–2047ను విడుదల చేయనున్నట్లు చెప్పారు.

ఐటీకి అనుకూలమని గతంలోనే గుర్తించిన నాస్కామ్–డెలాయిట్

ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు విశాఖ అనువైన ప్రాంతమని గతంలో నాస్కామ్–డెలాయిట్ గుర్తించిన సంగతి తెలిసిందే. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, మౌలిక వసతులు, రిస్క్–వ్యవస్థల నియంత్రణ, స్టార్టప్ ఎకోసిస్టమ్, సోషల్–లివింగ్ ఎన్విరాన్‌మెంట్ అనే అయిదు అంశాలను ప్రాతిపదికగా తీసుకుని వీటిని ఎంపిక చేసినట్లు తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం బీచ్ ఐటీ పేరుతో ఇప్పటికే విశాఖను ప్రోత్సహిస్తుండటమే కాకుండా నూతన తరం సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించే విధంగా సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లు, స్టార్టప్ ఇంక్యుబేటర్స్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. దీంతో ఇన్ఫోసిస్, రాండ్‌స్టాండ్, బీఈఎల్, అమెజాన్ వంటి ఐటీ కంపెనీలు తమ కార్యకలాపాలను విశాఖకు విస్తరించగా, మరికొన్ని కంపెనీలు త్వరలో కార్యకలాపాలను ప్రారంభించడానికి ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నాయి.

అంతర్జాతీయ బ్రాండింగ్

శక్తిమంతమైన ఈ నగరానికి మరిన్ని వసతులు, వనరులు కల్పించేందుకు, అంతర్జాతీయంగా విశాఖ బ్రాండింగ్‌ను పెంచే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. జీ20 సమావేశాలు, గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్, అంతర్జాతీయ వైద్యసదస్సు, మారిటైమ్ సదస్సు.. ఇలా అనేక అంతర్జాతీయ సమావేశాలను నిర్వహించడం ద్వారా విశాఖకు గ్లోబల్ బ్రాండింగ్‌ను తీసుకొచ్చింది. తద్వారా మరిన్ని పెట్టుబడుల ఆకర్షణకు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు మార్గం ఏర్పడింది. ఇటీవల ప్రధానితో సమావేశమైన సీఎం వైఎస్ జగన్ విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టుకు త్వరగా ఆమోదం తెలపాలని కోరారు. విభజన చట్టంలో పొందుపరచిన విశాఖ–కర్నూలు హైస్పీడ్ కారిడార్‌ను కడప మీదుగా బెంగళూరు వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ నగరాన్ని భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుతో అనుసంధానిస్తూ భోగాపురం, భీమిలి, రుషికొండ, విశాఖ పోర్టును కలిపే 55 కిలోమీటర్ల పొడవైన ఆరు లైన్ల రహదారి నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

బతికున్నా 'ఈనాడు' చంపేసింది



ఈనాడు కథనంలో చనిపోయినట్లుగా ప్రచురించిన చాన్ బాషా షేక్ ఫొటో



చాన్ బాషా ఓటర్ కార్డు



చాన్ బాషా షేక్

తాడేపల్లిగూడెం: ఓటర్ జాబితాలో తప్పులు కుప్పల తెప్పలన్నట్టుగా వరుస కథనాలు ప్రచురిస్తోన్న ఈనాడు దినపత్రికలో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన ఒక వ్యక్తి బతికుండగానే చనిపోయినట్లుగా వార్తను ప్రచురించారు. చనిపోయిన వ్యక్తి పేరును జాబితాలో తొలగించలేదంటూ శనివారం ఒక వార్త రాశారు. ఈ వార్తను చూసిన స్థానిక పెద్ద మసీదు ఎదురు సందులో నివాసముంటున్న చాన్ బాషా షేక్ ఆందోళన వ్యక్తంచేశారు. తాను బతికి ఉండగా ఇలా రాయడమేంటని కంగారుపడ్డారు. తాడేపల్లిగూడెంలో 4–42–2 ఇంటి నంబర్‌లో ఉంటున్న ఆయన గతంలో ఉద్యాన వర్సిటీలో ఉద్యోగిగా పని చేశారు. ఈ విషయాన్ని పత్రికలో చూసిన ఆ ప్రాంత వీఆర్‌వో అనసూయ శనివారం చాన్ బాషా షేక్ ఇంటికి వెళ్లి ఆయన గురించి వాకబు చేశారు. చాన్‌బాషా బతికే ఉన్నారని నిర్ధారించుకుని ఆయనతో కలిసి ఫొటో దిగి ఉన్నతాధికారులకు పంపారు. ఈనాడులో తప్పుడు వార్త ప్రచురించడంపై చాన్‌బాషా ఆగ్రహం వ్యక్తంచేశారు.

డయేరియా బాధితులకు మెరుగైన వైద్యం

- ఇప్పటికే వైద్యులు కొందరిని డిశ్చార్జ్ చేశారు
- ఏమైనా సమస్యలు ఉంటే 8341396104కు ఫోన్ చేయొచ్చు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రజిని



నగరంపాలెం: డయేరియా బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. 24/7 వైద్యులను అందుబాటులో ఉంచామని చెప్పారు. ఏమైనా సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 8341396104కు ఫోన్ చేయొచ్చన్నారు. గుంటూరు కలెక్టరేట్‌లో ఆదివారం మేయర్ కావటి మనోహర్ నాయుడు, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏకుల కిరణ్ కుమార్‌తో కలిసి మంత్రి మాట్లాడారు. 2018లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డయేరియా వచ్చిందని.. గుంటూరు నగరంలో పది ప్రాంతాల్లో అది తలెత్తిందని గుర్తుచేశారు. నాడు 2,400 మంది డయేరియాతో బాధపడ్డారని.. అందులో 24 మంది మృతి చెందారని తెలిపారు. శనివారం గుంటూరుతోపాటు ఇతర ప్రాంతాల నుంచి 32 మంది వాంతులు, విరేచనాలతో జీజీహెచ్‌కు వచ్చారన్నారు. వీరందరికి వైద్యులు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారని చెప్పారు. దీంతో ఏడుగురు డిశ్చార్జ్ అయ్యారని, మిగతావారు సోమవారం నాటికి డిశ్చార్జ్ అవుతారని వివరించారు. ఘటనపై జిల్లా కలెక్టర్, నగర కమిషనర్ పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారని తెలిపారు. బాధితుల నుంచి శాంపిల్స్ తీసుకుని పరీక్షలకు పంపించామన్నారు. ప్రతి విషయాన్ని రాజకీయం చేస్తున్న ప్రతిపక్షాలకు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ప్రభావిత ప్రాంతాల్లో సర్వే..

డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటా సర్వే చేయిస్తున్నామని విడదల రజిని వెల్లడించారు. ఏమైనా లక్షణాలు కనిపిస్తే వైద్యులు వెంటనే వైద్యసేవలు అందిస్తున్నారని చెప్పారు. అన్ని ప్రాంతాల్లో తాగునీటిని రోస్టర్ విధానంలో సరఫరా చేస్తున్నారని తెలిపారు. శారదా కాలనీలో మూడు షిఫ్టులలో వైద్యులు, ఐదుగురు సిబ్బందిని 24/7 అందుబాటులో ఉంచామన్నారు. కాగా, ఇటీవల కృష్ణానదిలోకి పులిచింతల నుంచి కొత్త నీరు వస్తోందని ప్రజలకు 15 రోజుల కిందటే కమిషనర్ తెలియజేశారన్నారు. కొళాయిల నుంచి వచ్చే తాగునీటిని వేడి చేసుకుని తాగాలని సూచించారని తెలిపారు.

వికేంద్రీకరణతోనే అసమానతల్లేని సమాజం

- బహుజన పరిరక్షణ సమితి నేతల స్పష్టీకరణ



దీక్షలో పాల్గొన్న బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: పాలనా వికేంద్రీకరణతోనే అసమానతల్లేని సమాజం ఏర్పడుతుందని బహుజన పరిరక్షణ సమితి నేతలు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం 1,232వ రోజుకు చేరాయి. ఈ దీక్షల శిబిరంలో పలువురు ప్రసంగించారు. మూడు రాజధానుల ద్వారానే బహుజన రాజ్యాధికారం సాధ్యమన్నారు. పెత్తందారులు–పేదవాడు అనే అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం సీఎం జగన్ పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం కోసం 35 లక్షల ఇళ్ల స్థలాలిచ్చి అందులో పక్కా ఇళ్లను నిర్మించడంతోపాటు రాజధానిలో 54 వేల మంది పేదలకు ఆవాసం కల్పించి బహుజనులకు న్యాయం చేశారని చెప్పారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని 14 ఏళ్ల బాబు చేసిన అవినీతి కేసులు వెలికితీసి పూర్తిస్థాయి విచారణ చేస్తే ఆయన బయటకు రాకుండా జైల్లోనే మగ్గాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సమితి నేతలు మాదిగాని గురునాథం, పల్లె బాబు, పులి దాసు, ఈపూరి ఆదాం, బొలిమేర శ్యామ్యూల్, బేతపూడి సాంబయ్య పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

ప్రజల కోసం సీఎం జగన్ అసలేం చేశారు?



లోకేశ్ ప్రసంగిస్తున్న సమయంలో కార్యకర్తలు వెళ్లిపోతుండటంతో దర్శనమిచ్చిన ఖాళీ కుర్చీలు



ఇచ్ఛాపురంలో లోకేశ్ శంఖారావం సభకు రాకుండా జనసేన నేతల్ని అడ్డుకుంటున్న టీడీపీ నేతలు

- టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్
- ఇచ్ఛాపురంలో శంఖారావం సభలోకి రానీయకుండా జనసేన నేతలను అడ్డుకున్న టీడీపీ నేతలు

కంచిలి/పలాస/టెక్కలి: టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదివారం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం సురంగి రాజావారి మైదానంలో శంఖారావం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పలాస, టెక్కలి ప్రాంతాల్లో పర్యటించి ఆయా సభల్లో మాట్లాడారు. 'జగన్ ప్రతిదానికి సిద్ధం సిద్ధం అంటున్నాడు, దేనికి సిద్ధం? జైలుకెళ్లడానికి జగన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారు. జైలుకు పంపడానికి మేము సిద్ధం' అన్నారు. బీసీ బిడ్డ అమర్‌నాథ్‌గౌడ్ లాంటి వాళ్లను హతమార్చినా, డాక్టర్ సుధాకర్ లాంటి దళిత బిడ్డలను, మైనారిటీలను చంపిన జగన్‌ను ఇంటికి పంపడానికి మీరు సిద్ధమా? అని ప్రశ్నించారు. బాపట్లలో అగ్రికల్చర్ అసిస్టెంట్ పూజిత, విజయనగరం జిల్లాలో పంచాయతీరాజ్ జేఈ రామకృష్ణ ఆత్మహత్యలకు ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. నాలుగేళ్ల పది నెలల్లో జగన్ ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. ప్రజలకు ఉపశమనం కల్పించడానికి చంద్రబాబు, పవన్ కలిపి సూపర్ సిక్స్ ప్రకటించినట్లు తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తే విశాఖ ఉక్కును కొనుగోలు చేస్తుందని పలాసలో చెప్పారు. లోకేశ్ ప్రసంగాలు నిస్సారంగా ఉండడంతో చాలామంది ప్రారంభంలోనే వెళ్లిపోయారు. సభల్లో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.

జనసేన నేతలకు తీవ్ర అవమానం

ఇచ్ఛాపురంలో లోకేశ్ ప్రారంభించిన శంఖారావం సభలో జనసేన నేతలకు తీవ్ర అవమానం జరిగింది. సభ స్థలిలోనికి రాకుండా టీడీపీ నేతలు జనసేన నేతలను అడ్డుకున్నారు. ఆ సమయంలో ఇరు పార్టీ నేతల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ సభకు మిమ్మల్ని ఎవరైనా ఆహ్వానించారా? అంటూ జనసేనవారిని టీడీపీ నేతలు ప్రశ్నించారు. లోకేశ్ సభాస్థలికి వచ్చే ముందు జనసేన నేతలు, కార్యకర్తలను లోపలికి రానివ్వకుండా అవమానించారు.

కన్వేయన్స్ డీడ్ల పంపిణీకి సన్నాహాలు

20 లక్షల రూ.10 స్టాంపు పేపర్లు సిద్ధం చేయిస్తున్న ప్రభుత్వం


సాక్షి, అమరావతి: పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేస్తున్న ప్రభుత్వం అందుకు సంబంధించిన కన్వేయన్స్ డీడ్లు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే 7 లక్షలకుపైగా రిజిస్ట్రేషన్లు చేయగా, మరో పది రోజుల్లో మిగిలిన అన్ని ఇళ్లకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేసింది. రిజిస్ట్రేషన్లు అయిన తర్వాత రూ.10 జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లపై కన్వేయన్స్ డీడ్లను ముద్రించి ఇవ్వనుంది. ఇందుకోసం 20 లక్షల రూ.10 స్టాంప్ పేపర్లకు ఆర్డర్ ఇచ్చి తెప్పిస్తోంది. ఇప్పటికిప్పుడు అత్యవసరంగా స్టాంప్ పేపర్లు ముద్రించాల్సి వస్తుండడంతో ఒక్కో స్టాంప్ పేపర్‌కు రూ.16.50 ఖర్చవుతోంది. ముద్రించిన ప్రాంతాల నుంచి జిల్లాలకు రవాణా ఖర్చులతో కలిపి ఒక్కో స్టాంప్ పేపర్‌కు రూ.20 ఖర్చు అవుతోంది. ఈ నెల మూడో వారంలో కన్వేయన్స్ డీడ్ల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించనున్నారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో భూ సమస్యల పరిష్కారం

- వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి



సాక్షి,అమరావతి: ఆంధ్రప్రదేశ్ ల్యాండ్‌టైట్లింగ్ చట్టంతో భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ చట్టంపై న్యాయవాదులకు ఆందోళనలు, అపోహలు వద్దన్నారు. న్యాయవాదులు ఆందోళనలను తక్షణమే విరమించి విధులకు హాజరు కావాలని కోరారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం పార్టీ లీగల్‌సెల్ జోనల్ ఇన్‌చార్జ్‌లు, జిల్లా అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఇది న్యాయవాదుల సంక్షేమ ప్రభుత్వం అని.. ఎటువంటి పరిస్థితుల్లోనూ వారికి నష్టం వాటిల్లే కార్యక్రమాలు చేపట్టదన్నారు. సమగ్ర భూసర్వే పూర్తి అయ్యే వరకు ఈ చట్టాన్ని అమలు చేయబోమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తుచేశారు. అయినా న్యాయవాదులు ఆందోళన చేయడం శోచనీయమన్నారు. ఈ ప్రజా సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తెచ్చేందుకు న్యాయవాదులమంతా కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియలో నామినేషన్లు మొదలు కౌంటింగ్ వరకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలనే అంశాలపై వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ సభ్యులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ నెల 24న న్యాయవాదులకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి శిక్షణా శిబిరం ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురు న్యాయవాదులు ఈ శిక్షణలో పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన న్యాయవాదులు పాల్గొన్నారు.



వాస్తవాలు లేవు.
ఉన్నవల్లా వ్యాఖ్యానాలు మాత్రమే!
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 12 ఫిబ్రవరి 2024

పాటకు పట్టం

'పాట' అనే మాటలో ఎన్ని ఉద్వేగాల ఊటలో! ఎన్ని ఉద్రేకాల తంత్రులో! ఎగిసిపడి ఎదను రసప్లావితం చేసే ఎన్నెన్ని పారవశ్యాల జలయంత్రాలో! ప్రతి రాత్రీ వసంతరాత్రిగా, ప్రతి గాలీ పైరగాలిగా, బతుకంతా పాటలా సాగాలంటాడు ఒక కవి. ఏదో ఒక పాట వింటూనే జీవితం గడుపుతాం. చెవులను, మనసును తాకి హాయి గొలిపే పాటల తుంపరలలో తడుస్తూనే జీవన రహదారిలో సాగుతాం. మరి, బతుకే పాటైన మేటి పాటగాళ్ళ సంగతేమిటి! కాలికి గజ్జె కట్టి బుజాన కంబళి వేసుకుని జీవితమే ఆటగా, పాటగా గడిపిన గద్దర్లు; పాటల వియద్గంగలో జీవితాంతం మునకలేసిన వంగపండులు, పలుకే పాటై జీవనదిలా ప్రవహించే అందెశ్రీలు, పాటను పుక్కిటపట్టి రాగమే జీవనరాగంగా బతుకును పండించుకుంటున్న గోరటి వెంకన్నలు... చెప్పుకుంటూ వెడితే ఒకరా ఇద్దరా! ఆపైన, సినీగీతాన్ని వినీలాకాశానికెత్తిన కృష్ణశాస్త్రులు, శ్రీశ్రీలు, ఆత్రేయలు, సినారేలు, ఆరుద్రలు, వేటూరులు..!

పేరుకు పాటైనా తీరులు ఎన్నో! కొన్ని పాటలు జాతి మొత్తంలో ఉత్తేజపు విద్యుత్తును నింపి ఉద్వేగాల అంచుల వైపు నడిపిస్తాయి. జనగణమన లాంటి అలాంటివి జనరంజకమై జాతి గళమెత్తి పాడుకునే గీతాలు అవుతాయి. తెలంగాణ ఉద్యమంతోపాటు ఉవ్వెత్తున ఎగసిన ఉద్రేకపు పొంగు పాటగా మారి అందెశ్రీ ఆలపించిన 'జయజయహే తెలంగాణ' గీతానికి ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రగీతం ప్రతిపత్తిని ఇచ్చి తనను తాను గౌరవించుకుంది. పాటలో పలికించలేని రసమే లేదు. ప్రజోద్యమాల అగ్నిశిఖలలోంచి నిప్పురవ్వల్లా పుట్టుకొచ్చిన పాటే ప్రేయసీప్రియుల యుగళగీతంగా మారి మోహరాగాలతో విరితావులనీనగలదు. 'నీవే నేనుగా ఒకటైన చోట' 'వలపుల పూదోట' పూయించగలదు. మనిషైతే మనసుంటే కనులు కరగాలని, కరుణ కురియాలని, జగతి నిండాలని ప్రబోధిస్తూ; ప్రకృతి సమస్తంలో ఇమిడి ఉన్న కారుణ్యాన్ని జాలిజాలిగా కరిగే నీలిమేఘం మీదుగా రూపుగట్టి మనల్ని నిలువునా కదిలించి కరిగించగలదు. తూరుపు సిందూరపు మందారపు వన్నెలలోని ఉదయరాగానికి చూపుల్ని, హృదయగానానికి చెవుల్ని అప్ప జెబుతూనే కాలగర్భం లోలోతులకు వెళ్లి వేనవేల వత్సరాల కేళిలో మానవుడుదయించిన శుభ వేళను – మలయ మారుతాలతో, పుడమి పలుకు స్వాగతాలతో, తారకలే మాలికలై మలచిన కాంతితోరణాలతో ఉత్సవీకరించి మన కళ్ళముందు నిలపగలదు. 'చిరునవ్వు వెన్నెల్లు చిలికేటి వాడా, అరుదైన చిరుముద్దు అరువియ్య రారా' అంటూ; 'అల్లారు ముద్దుకదే, అపరంజి ముద్ద కదే... ఒంటరి బతుకైనా ఓపగలుగు తీపికదే' అంటూ పాట లాలిగా జోలగా మారి వాత్సల్య రసంలో ఓలలాడించగలదు.

పాటను కైకట్టిన ఆదికవి 'అమ్మ' అంటారు అందెశ్రీ. నేల పొరలను చీల్చుకుని విత్తనం రెండు ముక్కలుగా పగిలి మొలకెత్తినట్లుగా ప్రకృతిమాత పొత్తిళ్ళల్లో కవలశిశువులుగా ప్రాణి పుట్టుక, పాట పుట్టుక అంటూ పాటను సృష్ట్యాదిన ప్రతిష్ఠిస్తారు. గగనాంతరసీమ గానసమూహమై పాటందుకుంటే, నేల రంగస్థలమై ఆటందుకుందంటారు. ప్రకృతి పురుషులు కేళీవిలాసాల్లో తేలుతున్న వేళ జంతుధ్వనుల నుంచి పుట్టిన సప్తస్వరాల అన్వయింపే ఏ పాట అయినా అంటూ పాటల భిన్నత్వంలోనే ఏకత్వాన్ని రూపిస్తారు. పురామానవ పరిణామ కోణం నుంచి గ్రీకు సాహిత్యాన్ని, ఇతర యూరోపియన్ భాషల సాహిత్యంతో బేరీజు వేస్తూ చర్చించిన జార్జి థామ్సన్ అనే పండితుడు కూడా విచిత్రంగా ఇలాగే పాటను సాహిత్యపు ఆదిమదశలో నిలుపుతాడు. ఆధునిక ఇంగ్లీష్ కవిత్వానికి భిన్నంగా గ్రీకు కవిత్వం పాడుకోవడానికి వీలుగా ఉంటుంది. గ్రీకు మహాకవి హోమర్ కవిత్వం మన వాల్మీకి రామాయణంలానే తంత్రీలయ సమన్వితంగా ఉంటుంది. వ్యాసభారతం కూడా వాగ్రూపంలో విస్తరించి చివరికి లిఖితరూపం పొందినదే. అలా చూసినప్పుడు నేటి మన పాటకవులందరూ వ్యాసవాల్మీకి పరంపరలోకే వస్తారు. లిఖితరూపంలోకి వచ్చాక కవిత్వం కాళిదాసాదులతో భిన్నమైన మలుపు తిరిగింది.

తెలుగులో ఆధునిక కవిత్వం ఆదిలో పాటకు ప్రతిరూపంగా ఎలా వెలువడిందో వివరిస్తూ, అనంతరకాలంలో తెలుగునాట పాటకు ప్రచురణార్హత, కవితకు శ్రవ్యార్హత లేకుండా చేశారని అంబటి సురేంద్రరాజు ఆవేదన వ్యక్తం చేస్తారు. కంటితో చదవడం కన్నా, చెవితో వినడమే కవితకు స్వాభావికమంటాడు. నిన్నమొన్నటి వరకు ఐరిష్ కవిత్వం ప్రధానంగా ఆశుసంప్రదాయాన్నే అనుసరించిందని జార్జి థామ్సన్ కూడా చెబుతూ; మొదట అచ్చులో చదివిన కొన్ని ఐరిష్ కవితలను ఆ తర్వాత ఒక రైతుగాయకుని నోట వినడం తనకు అపూర్వమైన అనుభవంగా వర్ణిస్తాడు. నిరక్షరాస్యులైన ఐరిష్ గ్రామీణుల పెదాలపై కవిత్వం నర్తిస్తూ ఉంటుందని, వారు మాట్లాడే మామూలు మాటలు కూడా కవితాత్మకంగా మారిపోతాయని అంటాడు. సామూహిక శ్రమలో భాగంగా పుట్టిన వాక్కు కవితాత్మకంగా మారి శ్రమకు చోదకంగా మారిందనీ, ఆదిమ కాలంలో పనిలో భాగంగా పాట పుట్టింది తప్ప కేవలం తీరిక సమయాల్లో పాడుకునేందుకు కాదంటాడు.

పూర్తిగా లిఖిత సంప్రదాయంలో పెరిగిన కవిత్వం ఆలోచనామృతం కావచ్చు కానీ, సద్యస్స్పందన కలిగించే పాట ఆలోచనామృతమే కాక ఆపాతమధురం కూడా. ప్రజాక్షేత్రంలో, ప్రజలే ప్రభువులుగా ఉన్న ప్రజాస్వామ్యంలో సామాన్యజనం సహా అందరినీ ఉర్రూతలూగించే పాటకు పట్టం కట్టడం ఎంతైనా సముచితమూ, స్వాగతార్హమూ. పాట కవులందరికీ కోటిదండాలు.

లౌకిక వాదానికి హిందుత్వ వారధి

కామెంట్



కరణ్ థాపర్

'భారతరత్న' లభించడంతో వార్తలలోకి వచ్చిన బీజేపీ రాజకీయ దిగ్గజం లాల్ కృష్ణ అద్వానీ విలక్షణమైన నాయకుడు. ఆయన మాటల్లో దాపరికాలు ఉండవు. తన తప్పును అంగీకరించడానికి భేషజ పడటం ఉండదు. అవసరం అయితే క్షమాపణ అడిగేందుకు కూడా సుముఖంగా ఉంటారు! స్వచ్ఛమైన, సరళమైన జాతీయవాదం కోసం నిలబడిన నాయకుడాయన. హైందవ దుస్తుల్ని తొలగించుకున్న దిగంబర జాతీయవాదం అర్థం లేనిదని ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఆయనంతటి ఆత్మనిశ్చయం గల శక్తిమంతులు ఓ గుప్పెడు మంది మాత్రమే కనిపిస్తారు. పరస్పర వైరుధ్యం కలిగిన హిందుత్వానికి, లౌకికవాదానికి మధ్య వారధి నిర్మించే ప్రయత్నంలో అద్వానీ... లోకమాన్య తిలక్, గాంధీజీల దృక్పథాన్ని అనుసరించారు.

నాకు చాలాకాలంగా, అతి సన్నిహితంగా పరిచయం ఉన్న భారతీయ జనతా పార్టీ నాయకుడు – ఆయన ద్వారా ఆయన కుటుంబం కూడా – లాల్ కృష్ణ అద్వానీ అని నేను నిస్సందేహంగా చెప్పగలను. ఒక కాలం ఉండేది... నేను ఆయన విశ్వాసాన్ని స్పష్టంగా గెలుపొందిన కాలం; కొన్ని ప్రత్యేకమైన సందర్భాలలో నా సలహాను సైతం ఆయన తీసుకున్న కాలం. ఆ క్రమంలో ఆయన నన్ను భారత రాజకీయాలలోని గుంభనమైన అంతర్గత కార్యకలాపాలపైన కూడా నా దృష్టి చొరబాటును అనుమతించారు.

ఇప్పుడు ఆయనకు 'భారతరత్న' లభించడంతో ఆయనతో నా మొదటి ఇంటర్వ్యూ నా మదికి, మననానికి వచ్చింది. ఆయన్ని నిజమైన ప్రత్యేక రాజకీయ నాయకుడిగా మార్చిన ఆయనలోని లక్షణాలను సంగ్రహించిన ఇంటర్వ్యూ అది. తన మాటల్లో దాపరికాలు లేకుండా, నిజాయితీగా ఉండే నాయకుడు మాత్రమే కాదాయన... తన తప్పుల్ని అంగీకరించడానికి సైతం సుముఖంగా ఉండేవారు. అవసరం అయితే 'మన్నింపు'ను కోరేవారు. ఆయన లాంటి రాజకీయ నాయకులు అతికొద్ది మంది మాత్రమే నాకు తెలుసు.

1990లో అద్వానీ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఆ ఇంటర్వ్యూ జరిగింది. అప్పుడు నేను – ఆ ముందరే ఇండియాకు తిరిగి వచ్చిన – ఒక అనామక జర్నలిస్టుని. 'హిందూస్థాన్ టైమ్స్ ఐవిట్నెస్' ప్రారంభ ఎపిసోడ్ కోసం ఆ ఇంటర్వ్యూను చేశాన్నేను. డిసెంబరు నాటి ఒక అహ్లాదకరమైన అపరాహ్ణవేళ అద్వానీ పండారా పార్క్ నివాసంలో ఆయనతో కలిసి కూర్చున్నాను. మరీ దీర్ఘంగా ఏం కాదు, బహుశా కేవలం పది నిముషాలు మా మధ్య సంభాషణ జరిగినట్లుంది. అందులోని చిన్న భాగం ఇది:

కరణ్ థాపర్: మీరు అధికారంలో ఉండి ఉంటే కనుక ఇండియాను హిందూ దేశంగా మార్చేవారా? ఒక అధికారిక హిందూ దేశంగా?

ఎల్.కె. అద్వానీ: ఇంగ్లండ్ క్రైస్తవ దేశం అయినట్లే, ఇండియా హిందూ దేశం అని నేను నమ్ముతాను. ఇందులో ఎక్కువ తక్కువలేం లేవు.

''మీరు మాటలతో ఆడుకుంటారనే భావన చాలామందిలో ఉంది. కాబట్టి హిందుత్వం అంటే అర్థం ఏంటో చెప్పండి? హిందుత్వం కోసం మీరు నిలబడతారా, లేక తడబడతారా? హిందుత్వానికి మీరు అనుకూలమేనా?''

''నేను స్వచ్ఛమైన, సరళమైన జాతీయవాదం కోసం నిలబడతాను. కానీ తన హైందవ దుస్తుల్ని తొలగించుకున్న దిగంబర జాతీయవాదం అర్థం లేనిదని నమ్ముతాను. ఇంతకు మించి చెప్పేదేం లేదు.''



ఎల్.కె. అద్వానీకి ప్రధాని మోదీ శుభాభివందనాలు (ఫైల్ ఫొటో)

''ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడుకుందాం. కచ్చితంగా ఇదీ అని చెప్పండి. మీరు కోరుకుంటున్నది లౌకిక భారతదేశాన్నా లేక హిందూ భారతదేశాన్నా?''

''నిశ్చయంగా, నిజాయితీగా నేను లౌకిక భారతదేశం కోసమే నిలబడతాను.''

''అక్కడే సమస్య వస్తోంది మిస్టర్ అద్వానీ. చాలామంది ప్రజలు మీరు అనుకూలంగా ఉన్న హిందుత్వకు, మళ్లీ మీరే అనుకూలంగా ఉన్న లౌకికవాదానికి మధ్య తీవ్రమైన వైరుధ్యాన్ని చూస్తున్నారు. ఎక్కువ మంది ప్రజలు మీరు వంతెన వేయలేరని అనుకుంటున్న వాటికి మీరు వంతెన వేయటానికి ప్రయత్నిస్తున్నారు.''

''నేను విశ్వసిస్తున్నది లౌకికవాదం పట్ల నెహ్రూకి, లేదా సర్దార్ పటేల్‌కు ఉన్న దృక్పథాన్ని కాదు. లోకమాన్య తిలక్‌కు, గాంధీకి ఉన్నటువంటి దానిని. అయితే ఈ దృక్పథాన్ని గత నాలుగు దశాబ్దాలలో ఎన్నికల ప్రయోజనాలు వక్రీకరిస్తూ వచ్చాయి.''

''భారతదేశంలోని పది కోట్లమంది ముస్లింల పట్ల మీ వైఖరి ఏమిటి? వారు ఈ దేశంలోని విడదీయరాని భాగం అని మీరు విశ్వసిస్తారా?''

''కచ్చితంగా. కచ్చితంగా. నిస్సంకోచంగా.''

''అప్పుడైతే, దేశంలోని దాదాపు 3,000 మసీదులను కూల్చివేసి వాటి స్థానంలో దేవాలయాలు నిర్మించాలనే వీహెచ్‌పీ డిమాండ్‌కు వ్యక్తిగతంగా మీరు వ్యతిరేకం అని నేను నమ్మొచ్చా?''

''నేను వ్యతిరేకమే.''

''పూర్తిగా?''

''పూర్తిగా.''

కావలిస్తే ఈ సంభాషణను మళ్లీ చదవండి. ప్రశ్నల దృఢత్వాన్ని, జవాబులలోని నిజాయితీని గమనించండి. అద్వానీ తర్వాతి నాయకులలో ఎవరితోనైనా ఇలాంటి సంభాషణ ఈరోజు సాధ్యం అవుతుందని నేను అనుకోను. వాళ్లు దీనిని ఏమాత్రం సహించలేరు. లేచి వెళ్లిపోతారు.

అయితే అసలు విషయం, ఇంటర్వ్యూ తర్వాత ఏం జరిగిందన్నది. తర్వాత నేను అద్వానీని కలిసినప్పుడు ''ఇంటర్వ్యూ గురించి మీరేమనుకుంటున్నారు?'' అని అడిగాను. అందుకు ఆయన కఠినమైన పలుకులతో... అదొక హాస్యాస్పదం అని కొందరు తనతో అన్నట్లు చెప్పి, ఒక్కసారిగా వెనుదిరిగి అక్కడి నుంచి వెళ్లిపోయారు!

ఆయన ప్రవర్తన నన్ను నిరుత్తరుడిని చేసింది. ఆయనకు ఇంటర్వ్యూ వీడియోను పంపి, స్వయంగా తననే చూడమని కబురు పెట్టాను. ఆయన్ని ఎవరో తప్పుదారి పట్టించారని నా నమ్మకం.

వారాలు, నిజానికి నెలలు గడిచినా ఆయన్నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. నేను కూడా వస్తుందని ఎదురు చూడటం మానేశాను. హఠాత్తుగా... చీకటి పడుతున్న ఒక వేసవి సాయంత్రం నా ఫోన్ మోగింది. అటువైపు ఎల్.కె. అద్వానీ.

''కరణ్, నేనిప్పుడే ఇంటర్వ్యూ చూశాను. అందులో కొంచెం కూడా నాకు తప్పు కనిపించలేదు. కానీ నాకు తప్పుడు సమాచారం ఇచ్చారు. దానిని సాకుగా చూపడం నా వయసుకు తగినది కాదు. మనం చివరిసారి కలుసుకున్నప్పుడు నీతో అనుచితంగా ప్రవర్తించాను. క్షమాపణలు చెప్పడానికే నీకిప్పుడు ఫోన్ చేశాను'' అన్నారాయన.

తప్పును అంగీకరించడానికి ఏ సంకోచమూ లేని సంసిద్ధతే బహుశా అద్వానీలోని గొప్ప గుణంగా తక్షణం ఆయన పట్ల నాకు ఆకర్షణ కలిగేలా చేసింది. ఆయన తర్వాత మళ్లీ అతి కొద్దిమంది రాజకీయ నాయకులు ఓ గుప్పెడు మంది భేషజాలు లేకుండా తమ తప్పును ఒప్పుకుని క్షమాపణ అడగగల శక్తిమంతులు ఉన్నారు. అద్వానీ గురించి ఇంకా మీరేం అనుకున్నా – ఆయనపై ఇతరులకు భిన్నాభిప్రాయాలు ఉంటాయని నేను అంగీకరిస్తాను – ఒక మంచి మనిషి మాత్రమే అలా ఉండగలరు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆరోగ్య భారతం



140 కోట్ల మంది భారతీయుల్ని ఆరోగ్యవంతుల్ని చేయడం ఎలా? ప్రపంచ మధుమేహ రాజధానిగా కాకుండా, ఆరోగ్య రాజధానిగా చేయలేమా? నాకు తోచిన నాలుగు మార్గాలు ఇవీ: పెద్ద ఆహార కంపెనీలను జవాబుదారీగా నిలబెట్టడం; పాఠశాల కరిక్యులమ్‌లో ఆహారాన్ని ప్రవేశపెట్టడం; ప్యాకేజీల మీద స్పష్టమైన లేబ్లింగ్ చేసే బలమైన ఆహార విధానం తేవడం; సృజనాత్మక పరిష్కారాల కోసం టెక్నాలజీని వాడుకోవడం.

– రేవంత్ హిమత్‌సింగ్కా, ఆహార యాక్టివిస్ట్

పేరు పోయేలా...



ఆర్థిక, సాంస్కృతిక అంశాల్లో తమ పాతపేరును పోగొట్టుకునేలా తోడ్పడే అంతర్జాతీయ ప్రజా సంబంధాల కోసం... పాశ్చాత్య మీడియా, ఇంకా ఇన్‌ఫ్లుయెన్సర్ల మీద సౌదీ అరేబియా భారీగా ఖర్చు చేస్తోంది. కానీ బిన్ లాడెన్, వహాబిజంల బరువైన వారసత్వం ఉన్న ఆ దేశం ఇందులో ఎంతమేరకు సఫలీకృతం కాగలదో!

– జోసెఫ్ టి. నూనీ, థింకర్

మంచి డ్రైవర్లు



బస్ స్టాప్ కంటే పది మీటర్ల ముందే పార్క్ చేసే... పాదచారుల పక్కన నడిపినప్పుడు వేగాన్ని తగ్గించే... రోడ్డు మీద అనవసరంగా హారన్లు కొట్టకుండా ఉండే డ్రైవర్లు అందరిపట్లా నాకు చాలా గౌరవం!

– రుజుతా దివేకర్, న్యూట్రిషనిస్ట్

చూసి నేర్చుకుంటారు



ఏక ప్రభుత్వ ప్రపంచం ఉండకుండా, బహుళ దేశాలు ఉండటం వల్ల ఒక సానుకూలత ఏమిటంటే – ఒక దేశం ఏదైనా తప్పు చేస్తే, మిగిలినవి అది చేయకుండా ఉండగలగడం!

– పాల్ గ్రాహమ్, శాస్త్రవేత్త

అదే ముఖ్యం



మీరు ఎంత చదువుకున్నవాళ్లయినా, ఎంత ధనవంతులైనా, ఎంత ప్రతిభావంతులైనా... మీరు జనానితో ఎలా వ్యవహరిస్తారు అన్నదే మొత్తంగా మీ గురించి చెబుతుంది.

– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

వెలిగే బంధం




మానవ సంబంధాలు విద్యుత్ ప్రవాహాల లాంటివి. తప్పుడు కనెక్షన్లు జీవితాంతం షాకులు కలిగిస్తుండవచ్చు, కానీ సరైనవి మీ జీవితాన్ని వెలిగిస్తాయి.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

డార్విన్ సిద్ధాంతానికి రుజువులు

పందొమ్మిదో శతాబ్దం తొలి దశాబ్దాల్లో బ్రిటిష్ వాళ్ళు వివిధ ఖండాల ప్రకృతి వనరులనూ, వ్యాపార సాధ్యాసాధ్యాలనూ, ఓడ రేవులనూ సర్వే చేసేందుకు నౌకాయాత్రలు చేపట్టేవారు. దక్షిణ అమెరికా తీర ప్రాంత పరిశీలనకై అలా బయలుదేరినదే హెచ్ఎంఎస్ బీగిల్ అనే నౌక. ప్రకృతి పరిశీలకుడుగా ఆ నౌకపై పనిచేసిన వాడు చార్లెస్ డార్విన్. ఆ యాత్ర డార్విన్ జీవితాన్ని మలుపు తిప్పింది. ముఖ్యంగా పసిఫిక్ మహాసముద్రంలో అగ్ని పర్వతాలు పేలటం వలన ఏర్పడిన గొలుసు దీవులు 'గేలా పాగోస్ దీవులు'. జీవ వైవిధ్యానికి స్వర్గధామంగా ఉన్న ఆ దీవుల్లో తారసపడిన 'ఫించ్ పక్షులు' ప్రపంచ దృష్టి కోణాన్ని సైతం మార్చివేసేలా డార్విన్ ఆలోచనలను ప్రభావితం చేశాయి. అవి ప్రధాన భూభాగంపై ఉండే పక్షుల్లాగే ఉన్నా ఒక్కో దీవిపై ఒక్కో ప్రత్యేకతను కనబరిచాయి. సృష్టికర్త ఆ యా దీవులకు ఒక్కో రకం పక్షుల్ని సృష్టించాడా? అనుకున్నాడు. ముఖ్యంగా



వాటి ముక్కుల్లో కనిపించిన వైవిధ్యం! ఆహారాన్ని సంపాదించుకునే క్రమంలో ఈ మార్పులు రాలేదు కదా! ముక్కు ఆకారానికి, ఆహారానికీ మధ్య సంబంధం ఏమైనా ఉందా? ఈ ఆలోచనలే జీవ పరిణామ సిద్ధాంతానికి తొలి బీజాలు.

తన నౌకాయాత్రలో సేకరించిన వేలాది నమూనాలు ఆధారంగా చేసుకుని 1859లో డార్విన్ 'జీవజాతుల పుట్టుక' (The Origin of Species) రాశాడు. దానిలోనే 'ప్రకృతి ఎంపిక' ద్వారా దగ్గర లక్షణాలున్న జాతి నుండి కొత్త జాతి ఆవిర్భవిస్తుందని ప్రతిపాదించాడు. ఇది కేవలం భౌతిక ప్రక్రియ అనీ, ఈ మార్పునకు ఏ అతీత శక్తుల ప్రమేయం అవసరం లేదనీ తేల్చాడు. ఇప్పుడెలా ఉన్నాయో అలానే జాతులు సృష్టి చేయబడినాయనీ, వాటిలో ఏ రకమైన మార్పూ ఉండదనే సృష్టివాదుల నమ్మకం. ఇందుకు విరుద్ధంగా వచ్చిన పరిణామ సిద్ధాంతం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవలసి వచ్చింది. తన ఐదేళ్ల నౌకాయాత్రలో సేకరించిన ఆధారాలను రెండు దశాబ్దాలపాటు సానబట్టి జీవ పరిణామ సూత్రాన్ని కనుగొన్నాడు డార్విన్.

పారిశ్రామిక విప్లవం నేపథ్యంలో బ్రిటన్‌లో ఏర్పడిన కాలుష్య ప్రభావానికి లోనై తమ రంగు మార్చుకున్న సీతాకోక చిలుకలను ప్రకృతి ఎంపికకు ఒక ఉదాహరణగా పేర్కొంటారు. ఇటీవలి కాలంలో వెల్లువెత్తిన జీనోమ్ విజ్ఞానం సైతం డార్విన్ సిద్ధాంత విశిష్టతను చాటుతోంది. ఫించ్ పక్షుల్లో త్వరిత గతిన జరిగే జీవపరిణామాన్ని తెలియజెప్పిన పీటర్ గ్రాంట్, రోజ్‌మేరీ గ్రాంట్ దంపతులు టెక్సాస్ వ్యవసాయ, వైద్య యూనివర్సిటీకి చెందిన లీఫ్ అండర్సన్ బృందంతో కలిసి చేసిన ఫించ్ పక్షుల జీనోమ్ అధ్యయనం మరో కొత్త ఆవిష్కరణను 2023 సెప్టెంబర్‌లో వెల్లడించింది. పక్షి ముక్కు వైవిధ్యానికి కారణమైన జన్యువులు ఆరు స్థానాల్లో కేంద్రీకృతమై ఉన్నట్లు కనుగొన్నారు. నాలుగు జన్యువులు కలసి ఏర్పడిన 'సూపర్ జన్యువు'పై ప్రకృతి ఎంపిక పనిచేసి ఒకే మూల జాతి 18 జాతులుగా పరిణామం చెందిన వైనాన్ని నిరూపించారు. జీవుల డీఎన్ఏలో అణు పరాన్న జీవులుగా పిలవబడే ట్రాన్స్‌పోసాన్లు లేదా దూకుడు జన్యువులు జాతి మూలాలు తెలుసుకోవటంలో తోడ్పడతాయి. ఒకే రకం దూకుడు జన్యువు రెండు జంతువుల్లోనూ ఒకే ప్రదేశంలో ఉన్నట్లయితే అవి ఒకే మూలం నుండి వచ్చాయని అర్థం. నోరిహిరో ఒకాడా బృందం ఈ జన్యువులను బట్టి తిమింగలాలు, పార్పాయిస్ చేపల పరిణామ సంబంధాలను అంచనా వేసింది. మనుషులంతా ఒక్కటే జాతి అనీ, ఆ మాట కొస్తే సకల జీవులు పరస్పర సంబంధం కలిగి ఉన్నాయనీ డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం చెబుతోంది.

– ప్రొ॥ కట్టా సత్యప్రసాద్, జన విజ్ఞాన వేదిక (ఉమ్మడి) రాష్ట్ర మాజీ అధ్యక్షులు
(నేడు డార్విన్ జయంతి)

వక్రీకరణల వంకరలు తీసే యత్నం

గమ్యం అదే అయినా గమనం ఎలా సాగింది? లక్ష్యం అదే అయినా పయనించిన దారులు ఏమిటి? చేరుకున్న తీరాలేమిటి? ఆయా నేతల వ్యక్తిత్వాలు, దృక్కోణాలు, పాటించిన విలువలు, అవి తెలుగు జన జీవితాలపై, అభివృద్ధిపై వేసిన ముద్రలు ఏమిటి? విశాల ప్రజాహితానికి ఒనగూర్చిన ప్రయోజనాలేమిటి? చివరకు చిట్టాలో మిగిలిందేమిటి? నిగ్గు తేలిన నిజాలేమిటి?

జగమెరిగిన జర్నలిస్టు, పొలిటికల్ ఎనలిస్టు దేవులపల్లి అమర్... ఐదు దశాబ్దాల పాత్రికేయ అనుభవంతో, తెలుగు రాష్ట్రాల రాజకీయ, సామాజిక పరిణామాల ప్రత్యక్ష సాక్షిగా అనేకానేక విషయాలను క్రోడీకరించుకుని వ్యయప్రయాసలతో వెలువరించిన పుస్తకం 'మూడు దారులు'. రాజకీయ రణరంగాన భిన్న ధ్రువాలు అనేది ఉపశీర్షిక.

ప్రధానంగా వైఎస్ రాజశేఖర రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు, వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి వ్యక్తిత్వాల వ్యత్యాసాలనూ, వారు అనుసరించిన రాజకీయ మార్గాన్నీ సమగ్రంగా, ఆసక్తిదాయకంగా విశ్లేషించారు. 'ది దక్కన్ పవర్ ప్లే' పేరిట ఇంగ్లీషులోనూ ఇదే పుస్తకాన్ని వెలువరించారు. సమకాలిక రాజకీయ చరిత్రలోని వక్రీకరణల వంకర్లను సరిచేసి భావితరాలకూ, దేశ ప్రజానీకానికీ వాస్తవాలను అందించేందుకు ఈ పుస్తకంలో గట్టి ప్రయత్నమే చేశారు అమర్.

డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి, చంద్రబాబు నాయుడు 1978లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా ఒకే రోజు అసెంబ్లీలోకి అడుగు పెట్టారు. ఆ తర్వాత వైఎస్ పూర్తిగా కాంగ్రెస్‌కే అంకితమై తన నాయకత్వ సామర్థ్యంతో పార్టీని ముందుకు నడిపించి రాష్ట్ర సారథి అయ్యారు. 'మాట తప్పడు, మడమ తిప్పడు' అనే పేరూ పొందారు. సంక్షేమ పథకాల అమలులోనూ కొత్త పుంతలు తొక్కి 'రాజన్న రాజ్యం' అనే చెరగని ముద్ర వేయగలిగారు. వై.ఎస్. చేపట్టిన సుదీర్ఘ పాదయాత్ర ఆయన ఆలోచనలనూ, వ్యవహార సరళినీ పూర్తిగా మార్చేసింది.

మరోవైపు చంద్రబాబు నాయుడు రాజకీయ జీవితం పూర్తిగా భిన్నమైనది. తనకు రాజ



కీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి, మామ ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరి, చివరకు ఆ మామనే వెన్నుపోటు పొడిచి అధికారం హస్తగతం చేసుకున్న ఘన చరిత్ర ఆయనకే సొంతం. ఏ దశలోనూ తన బలంతో కాకుండా, పరాన్నజీవిలా ఇతర పార్టీల పొత్తులతో, జిత్తులతో నెట్టుకొస్తున్న ట్రాక్ రికార్డు చంద్రబాబుది.



ఆయన ఏమిటో అమర్ ఇలా చెప్పారు: 'జిత్తుల మారి రాజకీయాలకు చంద్రబాబు పెట్టింది పేరు. రాజకీయ సోపాన పటంలో పైకి పాకేందుకు ఆయన ఎంచుకున్న దారి ఇదే. తన ఎదుగుదలకు అడ్డువచ్చే వారిని సహించలేకపోవడం ఆయన బలహీనత. బంధువులైనా, స్నేహితులైనా సామదాన భేదోపాయాలతో వారిని తన దారి నుంచి తప్పించగల రాజకీయ చతురత ఆయన సొంతం. ఆది నుంచి ఆయన అవకాశవాద రాజకీయాల ఆసరాతోనే ఎదిగారన్నది సుస్పష్టం'.

వైస్రాయ్ హోటల్ వేదికగా చంద్రబాబు నడిపిన వెన్నుపోటు కుట్రలను ఎంతో భావోద్విగ్నంగా, 'ఆ తొమ్మిది రోజుల్లో ఏం జరిగింది?' అనే అధ్యాయంలో అమర్ పొందుపరిచారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ నిష్క్రియాపరత్వం, ముప్పు ముంచు కొస్తున్నా పసిగట్టలేకపోవడం గురించి కూడా వివరంగా రాశారు.

చంద్రబాబును దొడ్డిదారిన అధికారంలోకి తేవడంలో ఎంతో మంది పత్రికాధిపతులు, ఎడిటర్లు పోషించిన పాత్రను కూడా నీళ్లు నమలకుండా చెప్పారు. అప్పట్లో 'ఆంధ్రప్రభ'లో బ్యూరో చీఫ్‌గా ఉన్నారు. జరిగింది జరిగినట్లుగా నివేదించేందుకు తన ఎడిటర్లను కన్విన్స్ చేయడానికి అమర్ చేయని ప్రయత్నం లేదు. కానీ, అమర్ హిత బోధలను కీలక స్థానాల్లో ఉన్నవారు పెడచెవిన పెట్టడంతో ఉద్యోగ ధర్మంగా సర్దుకపోక తప్పని పరిస్థితులు.

ఆ తదనంతర కాలంలో వైఎస్ ఆకస్మిక మరణంతో అనివార్యంగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎవరికీ తలవంచక, కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి సొంతదారి నిర్మించుకున్నారు. తన తండ్రి వైఎస్ ఆశయాలూ, లక్ష్యాల బాటలోనే నడుస్తూ ప్రజా సంక్షేమం, అభివృద్ధిని జోడు గుర్రాల్లా పరుగులు తీయిస్తూ తండ్రికి మించిన తనయుడనిపించుకుంటున్నారు.

తెలుగువారి సమకాలిక రాజకీయ చరిత్రలోని అసలు కోణాలనూ, వాస్తవాలనూ తెలుసుకోవాలన్న జిజ్ఞాస ఉన్న ప్రతి ఒక్కరూ తప్పక చదవవలసిన పుస్తకం ఇది.

– గోవిందరాజు చక్రధర్
వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

మితాహారం

యోగ సాధన చేయగోరే వారు అలవరచుకోవలసిన లక్షణాలను గురించి ప్రస్తావిస్తూ, 'అతిగా తినే వారికి (అత్యశ్నతః) యోగసాధనలు సాధ్యం కావు. అలాగని బొత్తిగా ఆహారం తీసుకోని వాళ్ళకు (ఏకాంతం అనశ్నతః) కూడా అవి సాధ్యం కావు' అంటుంది భగవద్గీత (6-16).

యోగశాస్త్రం మాట అలా ఉంచినా, ఆహార విషయంలో పరిమితులలో ఉండకపోతే, ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని ఆధునిక వైద్య శాస్త్రం కూడా హెచ్చరిస్తూనే ఉంటుంది. వ్యక్తుల శరీర తత్త్వాలు వేరు వేరుగా ఉంటాయి గనక, మనిషన్న



వాడు ఇన్ని గ్రాముల ఆహారం తీసుకోవాలని పరిమితి నిర్ణయించడం కుదరదు. అయితే అవసరం మేరకే ఆహారం తీసుకోవాలన్న స్పృహ ఉన్న వాళ్ళకు, వాళ్ళకు వర్తించే పరిమితి ఏమిటో, అనుభవం ద్వారా వాళ్ళకే తెలుస్తుంది... కడుపు నిండినపుడు కడుపు నిండిన విషయం తెలిసినట్టే!

గీతలో పై శ్లోకానికి భాష్యం చెప్తూ, ఆదిశంకరులు రెండు ప్రాచీన సూత్రాలను ఉటంకించారు. ఒకటి, శతపథ బ్రాహ్మణంలో మాట. ఈ బ్రాహ్మణం నేటికి సుమారు మూడు వేల ఏళ్ల నుంచి జగమెరిగి ఉన్న శ్రుతి. 'శరీర అవసరాలకు సరిపడేట్టుగా భుజించే అన్నం రక్షిస్తుంది. అది బాధించదు (యదుహ వా ఆత్మ సమ్మితం అన్నం తత్ అవతు, తత్ న హినస్తి). అంతకంటే ఎక్కువ భుజిస్తే, అది బాధిస్తుంది. అలాగే, అంతకంటే తక్కువ ఆహారం తీసుకొంటే అది రక్షించలేదు, బాధిస్తుంది' అని.

ఎంత ఆహారం అయితే మితాహారం అవుతుంది అనే ప్రశ్నకు సమాధానంగా, ఆచార్యుల వారి భాష్యం మరో ప్రాచీన శ్లోకాన్ని ఉటంకిస్తుంది. అర్ధం సవ్యంజనం అన్నస్య, తృతీయం ఉదకస్య చ, / వాయోః సంచరణార్థం తు, చతుర్థం అవశేషయేత్– ఉదరంలో సగభాగం అన్నానికీ కూరలకూ, మూడో పావు నీటికీ. నాలుగో పావు వాయు సంచారానికీ వదిలి వేయాలి – అని.

ఏ ఆహారమైనా, ఎంత స్వీకరించినా అదేదో రోజుకు రెండు సార్లు మాత్రమే స్వీకరించి మిగతా సమయంలో కేవలం జలం మాత్రమే పుచ్చుకోవడం మంచిదనీ, అలా చేసే వాడు నిత్యోపవాసి కింద భావించబడతాడనీ మహాభారతంలో భీష్ముడు చెప్పిన ధర్మాలలో కనిపిస్తుంది. ఆహార సూత్రాలు అప్పట్నించే ఉన్నాయి. ఆచరించే క్రమశిక్షణకే ఇప్పటికీ కొరత.

– ఎం. మారుతి శాస్త్రి



గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.తదియ రా.10.40 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** పూర్వాభాద్ర రా.7.40 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** తె.4.37 నుండి 6.09 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.36 నుండి 1.21 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.40 వరకు, **అమృతఘడియలు:** ప.12.11 నుండి 1.40 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.35, **సూర్యాస్తమయం:** 5.53.

క్లుప్తంగా...

మనకు మేలు చేసిన జగన్‌కు అండగా ఉందాం

ముస్లింలకు ఏపీ హజ్ కమిటీ పిలుపు



గౌసులాజమ్, షేక్ ఆసిఫ్‌కు వినతిపత్రం అందిస్తున్న కమిటీ ప్రముఖులు

సాక్షి, అమరావతి/వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు ఎంతో మేలుచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా ఉండాలని, రానున్న ఎన్నికల్లో జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసుకుందామని ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చైర్మన్ బి.ఎస్.గౌస్ లాజమ్ పిలుపునిచ్చారు. విజయవాడలో ఆదివారం జరిగిన జమాతే అహ్లె హదీస్ సంస్థ రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో ముస్లిం సంక్షేమానికి రూ.24 వేల కోట్లు కేటాయించారన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముస్లింలు నలుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలు ఉన్నారని చెప్పారు. 12 కార్పొరేషన్లకు చైర్మన్లుగా, రెండు మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్లుగా, 11 మున్సిపాలిటీలకు చైర్మన్లుగా, 30 మందికి వైస్ చైర్మన్లుగా, దాదాపు 110 మందికి రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లుగా ముస్లింలకు అవకాశం కల్పించారని వివరించారు. రాష్ట్రంలో 800కు పైగా ముస్లిం మైనార్టీలకు పదవులు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. మనకు ఎంతో మేలుచేసిన సీఎం జగన్‌కు అండగా నిలిచి 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఈ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఫలుర్ రెహమాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తొమ్మిదిమంది సంస్థ రాష్ట్ర క్యాబినెట్ సభ్యులు, 13 మంది ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు. విజయవాడ పశ్చిమ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆసిఫ్‌ను సమావేశంలో పరిచయం చేశారు. జమాతే అహ్లె హదీస్ రాష్ట్ర క్యాబినెట్ సభ్యులు అబ్దుల్ గఫార్ వుమ్రి, మహమ్మద్ ఫారుఖ్ ఖాన్, అబ్దుల్ కరీం, హఫీజ్ ఖలీల్, రెహమాన్ హఫీజ్, నసీర్ వుమ్రి మాట్లాడారు.

చంద్రబాబు, లోకేశ్‌లను జనం మర్చిపోయారు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం రూరల్: చంద్రబాబు, లోకేశ్‌లను రాష్ట్ర ప్రజలు మర్చిపోయారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. శ్రీకాకుళం సమీపంలోని సానివాడలో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌లను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్ నివాసాలు, వ్యాపారాలు పక్క రాష్ట్రంలోని హైదరాబాద్‌లో ఉంటాయని, కానీ ఆంధ్రప్రదేశ్‌లో వారికి అధికారం కావాలని వెంపర్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రాన్ని దోచేసిన సంగతి అందరికీ గుర్తుందని చెప్పారు. ఏపీలో అరాచకాలు జరుగుతున్నాయని లోకేశ్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు లేనిదే ఎవరికీ ఏ పథకం అందేది కాదని, వైఎస్సార్‌సీపీ హయాంలో పారదర్శకత తీసుకొచ్చామని చెప్పారు. రాష్ట్రంలో పరిపాలన ఏ విధంగా మారిందో లోకేశ్ గ్రామాల్లోకి వచ్చి చూస్తే తెలుస్తుందన్నారు. కేవలం ఎల్లో మీడియా టీవీ ఫైవ్, ఏబీఎన్, ఈనాడు ప్రసారాలతో మాత్రమే తండ్రీకొడుకులిద్దరూ బతుకుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థులుగా గొల్ల బాబూరావు, వై.వి. సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డి సోమవారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. వారు ఉదయం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి బీ-ఫారాలు తీసుకుంటారు. తరువాత అసెంబ్లీలో రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ కొత్త నాటకం

బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కొత్త నాటకం మొదలుపెట్టిందని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ విమర్శించారు. ఆయన ఆదివారం అనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా ఏనాడూ ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టని కాంగ్రెస్ పెద్ద నాయకులు ఎన్నికలకు ముందు ఈ కొత్త నాటకం మొదలుపెట్టారని చెప్పారు. కేవీపీ రామచంద్రరావు డైరెక్షన్‌లో కాంగ్రెస్ నడుచుకుంటోందన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి బీజేపీకి ముడుపులు అందుతున్నాయని ఇటీవల కేవీపీ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కేంద్ర పార్టీ నాయకులకు ముడుపులు ఇచ్చిన సంప్రదాయం ఉందన్నారు. బీజేపీలో అవినీతి, అక్రమాలకు తావులేదని చెప్పారు. నరేంద్రమోదీ పేరు చెబితేనే అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరుగెడుతాయన్నారు. రాష్ట్రంలో జనసేనతో పొత్తు ఉంటుందని, టీడీపీతో పొత్తుల విషయం ఇంకా తమ దృష్టికి రాలేదని చెప్పారు. ఆ విషయం జాతీయ నాయకులు త్వరలో వెల్లడిస్తారని తెలిపారు.

తిరుమల గిరుల్లో తులిప్ విరులు

- కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ కొండ ప్రాంతాల్లో సాగు
- ప్రపంచంలో టాప్ 10 కట్ ఫ్లవర్స్‌లో తులిప్స్‌కు చోటు
- వీటి సాగుకు తిరుమలపై అనువైన వాతావరణం ఉన్నట్టు గుర్తింపు
- విజయవంతమైన పైలట్ ప్రాజెక్టు
- మరిన్ని రకాల సాగుకు సన్నాహాలు



తులిప్స్.. ఎన్నెన్నో రంగుల్లో మనసుల్ని ఇట్టే కట్టిపడేస్తాయి. మగువలు సిగలో అలంకరించుకునేందుకు ఉపయోగపడక పోయినా.. వేడుకల అలంకరణలో మాత్రం రాజసాన్ని చాటుతాయి. నింగినేలా చుంబించే లాలిలో ఓలలాడించే ఈ పుష్ప రాజాలు కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ కొండ ప్రాంతాల్లో మాత్రమే ప్రస్తుతం సాగులో ఉన్నాయి. కళ్లు తిప్పుకోనివ్వని అందాలతో ఆహ్లాదాన్ని పంచే ఈ పుష్పాలు ఉద్యాన శాస్త్రవేత్తల పుణ్యమా అని ఇప్పుడు తిరుమల గిరులపైనా విరబూస్తున్నాయి.

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న తులిప్ పూలను ఏపీలోనూ సాగు చేయించాలన్న తలంపుతో వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని సిట్రస్ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలు ఫలించాయి. వీటి సాగుకు తిరుమల గిరుల్లోనూ అనువైన వాతావరణం ఉన్నట్టు గుర్తించిన శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా చేపట్టిన సాగు సత్ఫలితాలనివ్వడంతో భవిష్యత్‌లో మరిన్ని రకాల సాగుకు సన్నాహాలు చేస్తున్నారు. శీతల పరిస్థితులు గల ఎత్తైన కొండ ప్రాంతాల్లో మాత్రమే సాగయ్యే ఈ పూల మొక్కలు జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాలకే పరిమితమైన తులిప్స్ రానున్న రోజుల్లో కలియుగ దైవం కొలువైన ఏడుకొండలపైనా ఇకపై కనువిందు చేయనున్నాయి.

తులిప్స్ పూలకు ప్రత్యేకతలెన్నో..: లిలియాసీ (లిల్లీ) పూల జాతికి చెందిన ఈ పుష్పాలు ప్రపంచంలోనే టాప్-10 కట్ ఫ్లవర్స్‌లో ఒకటిగా ఖ్యాతి చెందాయి. తులిప్‌లో దాదాపు వందకు పైగా రకాలు ఉన్నాయి. వీటిని దుంపల ద్వారా సాగు చేస్తారు. తల్లి దుంపల(బల్బ్స్)ను నెదర్లాండ్స్ నుంచి దిగుమతి చేసుకుంటారు. తల్లి దుంపల్ని 2 డిగ్రీల ఉష్ణోగ్రతలో 3 నెలపాటు ఫ్రీజ్ చేస్తారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో వీటిని నాటుకుంటారు. దుంపకు దుంపకు మధ్యలో 8-10 సెం.మీ. దూరంలో దుంప సైజును బట్టి 5-8 సెం.మీ. లోతులో నాటుకోవాలి. మొక్కల మధ్య 15 సెం.మీ., వరుసల మధ్య 10 సెం.మీ. దూరం ఉండేలా చూస్తారు. 20 చదరపు అడుగులకు 100 దుంపల చొప్పున ఎకరాకు 45 వేల దుంపల వరకు నాటుకోవచ్చు. ఏడాది పాటు భూమిలోనే ఉంచితే పిల్ల దుంపలు పుట్టుకొస్తాయి. వాటిని సేకరించి మరుసటి ఏడాది నాటుకోవచ్చు. పుష్పించే కాలంలో నీరు పెట్టాల్సిన అవసరం లేదు. నాటిన 45-60 రోజుల్లో పుష్పిస్తాయి. పుష్పించే సమయంలో రాత్రి పూట 5-12 డిగ్రీలు, పగటి పూట 20-26 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు ఉండాలి.

10 రోజుల పాటు తాజాగా..: రెండాకులు ఉండేలా పూలను కత్తిరించి, వాటి తాజాదనం కోల్పోకుండా ప్యాకింగ్ చేసి ఎగుమతి చేస్తారు. మొక్కకు ఒక పువ్వు మాత్రమే పూస్తుంది. కత్తిరించిన తర్వాత కనీసం 5-10 రోజుల వరకు తాజాదనం కోల్పోకుండా ఉంటాయి. పూలు కోసిన తరువాత 10 రోజుల్లో మొక్క ఎండిపోతుంది. ఎండిన మొక్కను తొలగించి భూగర్భంలో ఉన్న దుంప బయటకు తీసి మళ్లీ ఫ్రీజ్ చేయాలి. మరుసటి ఏడాది సీజన్ ప్రారంభమైన తర్వాత మళ్లీ నాటుకోవాలి. ఎత్తైన మడుల్లో డ్రిప్ ఇరిగేషన్ సాయంతో కూడా వీటిని సాగు చేసుకోవచ్చు. వసంతకాలంలో 3-7 రోజుల పాటు వికసించే ఈ పూలు దాదాపు అన్ని రంగుల్లోనూ కనువిందు చేస్తాయి. మెజార్టీ రకాల పూలు ఒకే విధమైన ఆకృతిలో ఉంటాయి. అత్యంత ఖరీదైన ఈ పూల రెమ్మలను తింటారు. కొన్ని వంటకాల్లో ఉల్లికి బదులు వీటి రెబ్బలనే వాడుతుంటారు. మార్కెట్‌లో ఒక్కో పువ్వు రూ.50 నుంచి రూ.75 వరకు ధర పలుకుతుంది.

ఫలించిన పరిశోధన

తిరుపతిలోని మైదాన ప్రాంతాలతోపాటు సముద్ర మట్టానికి 980 మీటర్ల ఎత్తులో ఉన్న తిరుమల కొండ ప్రాంతాల్లో ప్రత్యేక నర్సరీ నెలకొల్పి వీటి సాగుపై అధ్యయనం చేశారు. ఏడీ రెమ్, డెన్మార్క్, డా జోన్స్, రాజవంశం, ఎస్కేప్, గోల్డెన్ పరేడ్, పింక్ ఆర్డోర్, పురిస్సిమా, పర్పుల్ ఫ్లాగ్ సూపర్ మోడల్ రకాలకు చెందిన తులిప్ దుంపలను డిసెంబర్ 2023లో ఎంపిక చేసిన రెండు ప్రాంతాల్లో నాటారు. రెండుచోట్ల మొలకెత్తినట్టు గమనించినప్పటికీ తిరుమలలో మాత్రం నాటిన ప్రతి దుంప మొలకెత్తింది. డెన్మార్క్ రకం 10-12 రోజుల్లో పూర్తిగా పూలు విచ్చుకోవడాన్ని గుర్తించారు.



తులిప్స్ పూల సాగుపై అధ్యయనం చేస్తున్న పీహెచ్‌డీ విద్యార్థిని

తిరుమలలో తులిప్ పార్క్



అత్యంత శీతల ప్రాంతంలో సాగయ్యే ఈ పూల సాగుపై మేం చేసిన పరిశోధనలు ఫలించాయి. శ్రీనగర్ తరహాలోనే తులిప్ గార్డెన్స్ పెంచేందుకు తిరుమల గిరులు కూడా అనుకూలమని గుర్తించాం. భవిష్యత్‌లో టీటీడీ సౌజన్యంతో వీటి సాగు దిశగా సన్నాహాలు చేయబోతున్నాం. గుర్రం కొండతోపాటు ఇతర ఎత్తైన ప్రాంతాల్లో వీటి సాగును విస్తరించి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు గల అవకాశాలపై కూడా పరిశోధన చేస్తున్నాం.

– ఆర్.నాగరాజు, ప్రిన్సిపల్ సైంటిస్ట్, ఉద్యాన పరిశోధనా కేంద్రం, తిరుపతి

మా మంచి పనులే మమ్మల్ని గెలిపిస్తాయి

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



కార్వేటినగరం (చిత్తూరు జిల్లా): రాష్ట్రవ్యాప్తంగా సువర్ణపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ ఒక్కరే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అని, ఆయన వెంటే మంత్రులు, ఎమ్మెల్యేలు ఉంటారని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చెప్పారు. కార్వేటినగరం మండలం కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగనన్న ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన నవరత్నాలే 2024 ఎన్నికల్లో పార్టీకి విజయ సోపానాలుగా నిలుస్తాయని చెప్పారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రతి ఇంటికీ జగనన్న పెద్దదిక్కుగా నిలుస్తున్నారని గుర్తుచేశారు. లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్న రుణం తీర్చుకోవాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు చేరవేసిన వలంటీర్లకు త్వరలో అత్యుత్తమ పురస్కారాలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు 60 రోజుల పాటు పార్టీ విజయానికి సమష్టిగా కృషిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. జగనన్న పేదలను ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి ప్రతి ఇంటి గడపకు వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. చంద్రబాబు అధికారం కోసం వెంపర్లాడుతూ కూటమి ఏర్పాటు కోసం కేంద్రం వద్ద మోకరిల్లుతున్నారని విమర్శించారు. 2019 ఎన్నికల్లో మోదీని ఓడించాలని కంకణం కట్టుకున్న చంద్రబాబు, నేడు అధికారం కోసం ప్రధానిని కలవడం సిగ్గుచేటన్నారు. రోగాల పేరుతో కోర్టు కళ్లు కప్పినట్లు చంద్రబాబు ఓటర్ల కళ్లు కప్పలేడని చెప్పారు. బాబు ఊసరవెల్లి మాటలను ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు.

మహిళా సాధికారతకు ఆదర్శం ఏపీ

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- రాజానగరంలో ఆడపడుచుల ఆశీర్వాద సభ



మాట్లాడుతున్న మంత్రి తానేటి వనిత

రాజానగరం: మహిళా సాధికారత విషయంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శమని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలో స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆధ్వర్యాన ఆదివారం 'ఆడపడుచుల ఆశీర్వాద సభ' నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తానేటి వనిత మాట్లాడుతూ దేశంలో మహిళా ముఖ్యమంత్రులు ఉన్న రాష్ట్రాల్లో కూడా ఎక్కడా మహిళా సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నంత ప్రాధాన్యత ఇవ్వడం లేదని చెప్పారు. జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, ఇళ్ల స్థలాలు... ఇలా అనేక పథకాలను మహిళల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తూ నిరంతరం ఆడపడుచుల అభ్యున్నతికి పాటు పడుతున్నారని వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందుతాయని సీఎం జగన్ నమ్మారని, అందుకే అక్కచెల్లెమ్మలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక ఆ హామీనే మాఫీ చేసిన సంగతి ఏ మహిళా మరచిపోలేదని అన్నారు. అదే సమయంలో 2019 ఎన్నికల్లో అప్పటి వరకు ఉన్న డ్వాక్రా సంఘాల బ్యాంకు రుణాలను నాలుగు దఫాలుగా తాను చెల్లిస్తానంటూ అభయం ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక పక్కాగా అమలు చేసిన విషయాన్ని ప్రతి మహిళా గుర్తించాలని కోరారు. అనంతరం గత ఎన్నికల సమయంలో ఇంటింటికీ గోదావరి జలాలు అందిస్తామంటూ జక్కంపూడి రాజా ఇచ్చిన హామీని ఆచరణలోకి తీసుకువచ్చే విధంగా రూ.215 కోట్లతో అమలు చేసే వాటర్ గ్రిడ్ పథకానికి హోంమంత్రి తానేటి వనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శంకుస్థాపన చేశారు. వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, పోతుల సునీత పాల్గొన్నారు.

జగన్ పాలనలో బీసీలకు ప్రాధాన్యం

- బీసీ డిక్లరేషన్‌ను వంద శాతం అమలు చేశారు
- మంత్రి కారుమూరి

ఏలూరు (టూటౌన్)/కైకలూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే బీసీలకు ప్రత్యేక గుర్తింపు, ప్రాధాన్యత లభించాయని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఏలూరులో ఏర్పాటు చేసిన అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నాని అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి కారుమూరి మాట్లాడుతూ అంతగా గుర్తింపునకు నోచుకోని 139 బీసీ కులాలను వెలికితీసి వాటిని 56 కార్పొరేషన్ల పరిధిలోకి తీసుకువచ్చి ప్రత్యేక గుర్తింపు, ప్రాధాన్యత, గౌరవాన్ని ఇచ్చారన్నారు. టీడీపీ ఎప్పుడూ బీసీలను రాజ్యసభకు పంపలేదని, కోట్ల రూపాయలకు సీట్లు అమ్ముకుంటోందని విమర్శించారు. దానికి భిన్నంగా సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను రాజ్యసభకు పంపిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీద మస్తాన్‌రావు, పిల్లి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణ, ఆర్.కృష్ణయ్యతోపాటు తాజాగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గొల్ల బాబూరావుకు రాజ్యసభ సీట్లు కేటాయించారని గుర్తుచేశారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ సామాజిక న్యాయం విషయంలో సీఎం జగన్ దేశానికే ఒక రోల్ మోడల్‌గా నిలిచారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, వైఎస్సార్‌సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ పాల్గొన్నారు.



ఏలూరులో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

మాకు వ్యతిరేక ఓటు లేదు పవన్..

సీఎం వైఎస్ జగన్‌కి వ్యతిరేక ఓటు ఉందని చెబుతున్న పవన్‌కళ్యాణ్ మాటల్లో వాస్తవం లేదని మంత్రి నాగేశ్వరరావు చెప్పారు. ఏలూరు జిల్లా కైకలూరు మండలంలోని కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద ఆదివారం నిర్వహించిన అనివేటి మహామండపం ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నమ్మకంతో కాంగ్రెస్‌లో చేరా

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

నగరి (చిత్తూరు జిల్లా)/సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక హోదా అంశంపై నిలబడింది కనుకే అపారమైన నమ్మకంతో ఆ పార్టీలో చేరానని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చెప్పారు. నగరిలో ఆదివారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఓంశక్తి ఆలయం వద్ద నుంచి టవర్ క్లాక్ సెంటర్ వరకు రోడ్‌షో నిర్వహించి బస్టాండు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన బహిరంగసభలో మాట్లాడారు. బీజేపీ ఏ హామీని ఇప్పటివరకు నెరవేర్చలేదని చెప్పారు. పాలక, ప్రతిపక్షాలు బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీయడం లేదన్నారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు స్వప్రయోజనాల కోసం సాష్టాంగ నమస్కారం చేస్తుంటే.. జగనన్న ప్రధానమంత్రిని కలిసి పేపర్ ముక్క ఇచ్చేసి వచ్చేస్తున్నారని విమర్శించారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీసీసీ అదనపు ప్రధాన కార్యదర్శిగా రాజా


ఏపీసీసీ అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఎన్.రాజాను పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు నియమించినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం తెలిపారు. అలాగే పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చైర్‌పర్సన్‌గా ప్రదేశ్ ఎలక్షన్ కమిటీని నియమించినట్లు పేర్కొన్నారు.

గిరిజనులను గుండెల్లో పెట్టుకున్నారు!

- అడవి బిడ్డలను ఆదుకున్న సీఎం జగన్
- అయినా ఈనాడులో 'పచ్చ' కళ్ల రామోజీ అబద్ధపు రాతలు
- గిరిజన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కంటే అధిక ధరలు చెల్లింపు
- మద్దతు ధర నిర్ణయానికి అపెక్స్ కమిటీ ఏర్పాటు
- సాగు పెట్టుబడికి ప్రభుత్వ సాయంతోపాటు ముందస్తు రుణాలు
- అరకు కాఫీకి అంతర్జాతీయ బ్రాండింగ్
- ఆర్గానిక్ సర్టిఫికేషన్ కోసం ప్రత్యేక చర్యలు



సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనపై బురద చల్లడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈనాడు రామోజీ రోజుకో అబద్ధాన్ని వల్లెవేస్తూ గిరిజనుల సంక్షేమానికి అగ్ర పాధాన్యమిచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కారు. అటవీ ఫలసాయం, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలులో రికార్డు సృష్టిస్తున్న గిరిజన సహకార సంస్థ(జీసీసీ) వైఎస్ జగన్ హయాంలో గిరిజనులకు అంతర్జాతీయ మార్కెట్ ధరల కంటే అధికంగా చెల్లిస్తున్నా కబోది రామోజీ 'గుండెల్లో పెట్టుకుంటానని.. గుదిబండగా మారారు!' అంటూ ఈనాడులో అబద్ధాలు అచ్చేశారు. గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధర కోసం ప్రత్యేకంగా అపెక్స్ కమిటీ ఏర్పాటు చేయడమే కాకుండా, కమిటీ సిఫార్సులకు అనుగుణంగా కొనుగోళ్లు, అమ్మకాలు జరిగేలా జగన్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించింది. అరకు కాఫీకి అంతర్జాతీయ బ్రాండింగ్ కల్పించడంతోపాటు ఆర్గానిక్ సర్టిఫికేషన్ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టిన జగన్ ప్రభుత్వం గిరిజన రైతులను ప్రోత్సహిస్తోంది.



ఆరోపణ: ఆదాయం చూడడమే తప్ప ఆదుకోరా?

వాస్తవం: కాఫీకి అంతర్జాతీయంగా చెల్లించే ధర కంటే ఎక్కువకు జీసీసీ కొనుగోలు చేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో ముడి కాఫీ రూ.215, చెర్రీ ముడి కాఫీకి రూ.130 చెల్లించేవారు. ఏజెన్సీలో పండించే కిలో ముడి కాఫీకి రూ.280, చెర్రీ ముడి కాఫీకి రూ.145 ఇస్తున్నారు. కొనుగోళ్ల సమయంలో కేంద్ర కాఫీ బోర్డు సూచనల్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పార్చ్‌మెంట్ కాఫీ 10, చెర్రీ కాఫీ 10.5 తేమతో కొనుగోలు చేసేలా నిర్ణయించారు. ప్రైవేటు వ్యాపారుల బారిన పడి గిరిజన రైతులు నష్టపోకుండా కొనుగోలు సిబ్బందికి జీసీసీ తేమ శాతం నిర్ధారణ పరికరాలు అందించింది. ఖచ్చితమైన తేమ శాతం నిర్ధారించి కొనుగోలు చేసేలా ఆదేశాలు ఇచ్చింది. ముడి కాఫీ కొనుగోలు రిపోర్ట్‌ను జీసీసీ మేనేజర్లు ఇచ్చిన 24 గంటల వ్యవధిలోనే గిరిజన రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో 1000 మెట్రిక్ టన్నుల ముడి కాఫీ సేకరణ లక్ష్యంగా పెట్టుకోగా ఇంతవరకు 340 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. అకాల వర్షాలతో కాఫీ దిగుబడి తగ్గడం వల్ల గత సీజన్ కంటే ఈ ఏడాది కొనుగోలు తగ్గింది.

ఆరోపణ: మిగిలిన వాటికి 'మద్దతు' కరువే?

వాస్తవం: మిగిలిన ఉత్పత్తులకు జీసీసీ మద్దతు ధర ప్రకటించి జీసీసీ కొనుగోలు చేస్తోంది. ప్రస్తుత సీజన్‌లో జీసీసీ కిలో కరక్కాయలు రూ.15 నుంచి రూ.18, ఎండు ఉసిరి రూ.90, రాజ్మా రూ.90కి జీసీసీ కొనుగోలు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధరల్లో పిక్క చింతపండు రూ.23 నుంచి రూ.28 మాత్రమే ఉంటే జీసీసీ పిక్క చింతపండు రూ.32 నుంచి రూ.40, పిక్క తీసిన చింతపండు రూ.63 ధర ప్రకటించి కొనుగోలు చేస్తోంది.

ఆరోపణ: లాభాలే పరమావధా?

వాస్తవం: ఏజెన్సీ కాఫీకి మంచి గుర్తింపు తెచ్చిన 'అరకు వ్యాలీ కాఫీ' పేరుతో జీసీసీ బ్రాండింగ్ చేస్తోంది. ఫిల్టర్ కాఫీ, ఇన్‌స్టంట్ కాఫీ రకాలను జీసీసీ నెట్‌వర్క్ ద్వారా విక్రయిస్తోంది. వీటి గరిష్ట రిటైల్ ధర నిర్ణయించే సమయంలో ముడి కాఫీ ధర, శుద్ధీకరణ, తయారీ, ప్యాకింగ్, రవాణా ఖర్చులు, డిస్ట్రిబ్యూటర్, రిటైల్ మార్జిన్లను పరిగణనలోకి తీసుకుంటారు. ఇవేమీ తెలియనట్టుగానే వీటి అమ్మకాల ద్వారా జీసీసీ అధిక లాభాలు గడిస్తున్నట్టు ఈనాడు రోత రాతలు రాయడం దారుణం. శ్రీశైలం, చిత్తూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల అడవుల్లో గిరిజనుల నుంచి సేకరిస్తున్న తేనెను రాజమహేంద్రవరం, చిత్తూరులోని జీసీసీ తేనె శుద్ధి కర్మాగారాల్లో శుద్ధి చేసి 'గిరిజన్' బ్రాండ్‌తో మార్కెటింగ్ చేస్తోంది. కేజీ తేనెను రూ.200 చెల్లించి కొనుగోలు చేస్తోంది. తేనెకు గరిష్ట రిటైల్ ధర నిర్ణయంలో ముడి తేనె ధర, శుద్ధీకరణ ఖర్చు, శుద్ధీకరణలో తరుగుదల, బాట్లింగ్, ప్యాకింగ్, రవాణా ఖర్చులు, డిస్ట్రిబ్యూటర్, రీటైల్ మార్జిన్లు, నాణ్యత ప్రమాణాల పరీక్షలకు అయ్యే ఖర్చులు పరిగణనలోకి తీసుకుని ధర నిర్ణయిస్తారు. అయితే తేనే విక్రయాల్లో జీసీసీ లాభాలు గడిస్తున్నట్టు ఈనాడు పచ్చి అబద్ధాలు రాసింది. అలాగే ప్రైవేటు వ్యాపారుల మోసాలకు అడ్డుకట్ట వేసేలా జీసీసీ అనేక చర్యలు చేపట్టింది. మద్దతు ధర నిర్ణయించడం వల్ల ప్రైవేటు వ్యాపారులు పోటీ పడి ఎక్కువ ధరకు కొనుగోలు చేయక తప్పని పరిస్థితి.

ఆరోపణ: రుణాలిచ్చింది 160 మందికే?

వాస్తవం: గిరిజన రైతులకు పెట్టుబడి సాయం, యంత్ర పరికరాలు అందించి ప్రోత్సహిస్తున్నారు. దీనికితోడు జీసీసీ గిరిజన రైతుల వ్యవసాయానికి, కాఫీ సాగుకు రుణాలు మంజూరు చేస్తోంది. గతేడాది తీసుకున్న రుణాలు చెల్లించిన వారికి తిరిగి రుణాలు ఇస్తున్నారు. 2016-17 నుంచి 2022-23 వరకు జీసీసీ ద్వారా 4,839 మంది గిరిజన కాఫీ రైతులకు రూ.528.28 లక్షల రుణాలు ఇచ్చారు. వీటిలో ఇంకా రూ.252.86 లక్షల బకాయిలు వసూలు కావాల్సి ఉంది. ప్రస్తుత సీజన్‌లో రూ.22.80 లక్షల రుణాలు మంజూరు చేశారు.

'ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక' అధ్యక్షురాలిగా రజిత

ఖమ్మం గాంధీచౌక్: ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్ర.ర.వే.) జాతీయ, రెండు తెలుగు రాష్ట్రాల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఖమ్మంలో జరిగిన మహాసభల్లో ఎన్నుకున్నారు. వేదిక జాతీయ కమిటీ అధ్యక్షురాలిగా అనిశెట్టి రజిత, కార్యదర్శిగా మానస ఎండ్లూరి, సమన్వయకర్త పి.రాజ్యలక్ష్మి, కోశాధికారిగా రామలక్ష్మి కొమ్రాజు ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలిగా తిరునగరి దేవకీదేవి, కార్యదర్శిగా కాత్యాయనీ విద్మహే, సమన్వయకర్తగా బండారి సుజాత, నియామక ప్రతినిధిగా తాళ్లపల్లి యాకమ్మ, కార్యవర్గ సభ్యులుగా శాంతి ప్రబోధ, షమనాజ్ బేగంను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలిగా పి.అమరజ్యోతి, కార్యదర్శిగా కేఎన్ మల్లీశ్వరి, సమన్వయకర్తగా కావూరి శారద, నియామక ప్రతినిధిగా జహా ఆరా, కార్యవర్గ సభ్యులుగా మందరపు హైమావతి, రచన శృంగవరపు, లక్ష్మీ సుహాసిని ఎన్నికయ్యారు.

ట్రయాంగిల్ కాంబినేషన్‌లో షర్మిల పర్యటన

రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా



నగరి(చిత్తూరు జిల్లా): రచ్చబండ పేరిట నగరిలో షర్మిల పర్యటన 'ట్రయాంగిల్ కాంబినేషన్' అని రాష్ట్ర సాంస్కృతిక శాఖమంత్రి ఆర్కే రోజా అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో కాంగ్రెస్, టీడీపీ, జనసేన పార్టీలన్నీ ఒకే కొమ్మపై వాలాయని ఆమె విమర్శించారు. ఆదివారం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ రచ్చబండలో షర్మిల చేసిన ఆరోపణలపై స్పందించారు. వైఎస్సార్ చనిపోయిన తర్వాత ఆయన కుటుంబాన్ని ఇబ్బందుల పాలుచేసి, జగనన్నను 16 నెలలు జైల్లో పెట్టిన కాంగ్రెస్ పార్టీలో షర్మిల ఉన్నారంటే వైఎస్సార్ ఆత్మ క్షోభిస్తుందన్నారు. తండ్రి పేరు చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచేలా జగనన్న పాటుపడితే ఆ పేరుకు మచ్చతెచ్చేలా షర్మిల వ్యవహరిస్తున్నారన్నారు. తనపై షర్మిల చేసిన ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తానని సవాల్ విసిరారు.



ట్రైన్ రిసార్ట్

చుట్టూ పచ్చని పచ్చికబయళ్లు, వన్యప్రాణులు. నాలుగు అడుగులేస్తే మన కోసమే ప్రత్యేకంగా ఈతకొలను. ఇంకాస్త పక్కకెళితే ప్రకృతి రమణీయతను చూసేందుకు విడిగా వ్యూ డెక్కులు, మనం ఉన్నచోటు కిందే ఉరకలెత్తుతూ సాగే నది, సకల సౌకర్యాలతో సిద్ధంగా ఉన్న విలాసవంతమైన గది. ప్రకృతి ఒడిలో ఆహ్లాదకర జీవనానికి చిరునామాగా నిలిచే ఇలాంటి చోట కొంతకాలమైనా గడపాలని ఎంతో మంది ఆశ పడతారు. అలాంటి ప్రకృతి ప్రేమికుల కోసం ఒక రైలును సర్వాంగసుందరంగా తీర్చిదిద్ది ఒక పాత వంతెనపై హోటల్‌గా మార్చారు. ప్రపంచ వారసత్వ సంపదల్లో ఒకటిగా పేరొందిన దక్షిణాఫ్రికాలోని క్రూగర్ జాతీయ వనంలో ఈ 'ది ట్రైన్ ఆన్ ది బ్రిడ్జ్' హోటల్ ఉంది. ఈ కదలని రైలు అరుదైన అనుభూతిని పంచుతుంది. ఇందులో పర్యాటకుల కోసం అన్ని సౌకర్యాలతో 31 సూట్‌లు సిద్ధం చేశారు. అన్ని రకాల వంటకాలతోపాటు స్థానిక రుచులనూ ఆస్వాదించవచ్చు. గైడ్‌ల సాయంతో అడవిలోకెళ్లి స్వేచ్ఛగా సింహం, చిరుతపులి, ఏనుగు, నీటిగుర్రం, అడవి బర్రెలను దగ్గర్నుంచి చూసిరావచ్చు. ఒక ట్విన్(జంట)రూమ్‌లో పర్యాటకులు ఒక రాత్రి గడపాలంటే ఒక మనిషికి దాదాపు రూ.44,000 రుసుము వసూలుచేస్తారు. 100 ఏళ్లకు పైబడిన ఈ వంతెనపై గతంలో స్టీమ్ రైళ్లు నడిచేవి. వారసత్వంగా నిలిచిన ఈ వన వంతెనను విభిన్నంగా వినియోగిద్దామని ఈ హోటల్‌కు రూపకల్పన చేశామని మోట్సామయీ టూరిజం గ్రూప్ సీఈవో జెరీ మబేనా చెప్పారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కాల్చేసే కాంతిపుంజం!



ఇజ్రాయెల్ అమ్ములపొదిలో ఐరన్ బీమ్ | హెజ్బొల్లాను చావుదెబ్బ తీసే యోచన!

లెబనాన్‌పై పూర్తిస్థాయి యుద్ధానికి ఇజ్రాయెల్ సిద్ధమవుతోందా? పక్కలో బల్లెంలా మారిన హెజ్బొల్లాను సమూలంగా తుడిచిపెట్టాలని నిర్ణయించుకుందా? హెజ్బొల్లా ఉగ్రవాదుల డ్రోన్లు, రాకెట్లను కూల్చడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ 'ఐరన్ బీమ్' తొలిసారిగా రంగప్రవేశం చేయనుందా? ఇజ్రాయెలీలకు ప్రభుత్వం జారీ చేస్తున్న హెచ్చరికలను చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. హెజ్బొల్లాతో యుద్ధం మొదలైతే ఇజ్రాయెల్ ప్రజలకు కొన్ని రోజులపాటు విద్యుత్ సంక్షోభం తప్పదన్న హెచ్చరికల పత్రం దేశ న్యాయ శాఖలో రౌండ్లు కొడుతున్నట్టు 'ద జెరూసలెం పోస్ట్' ఓ కథనం ప్రచురించింది. చాలా ప్రాంతాల్లో ఒకటి నుంచి మూడు రోజుల దాకా కరెంటు సరఫరా ఉండకపోవచ్చని ఇజ్రాయెల్ నేషనల్ ఎమర్జెన్సీ అథారిటీ కూడా పేర్కొంది. ప్రజలు ఆహారం, నీరు, బ్యాటరీ వంటివి దగ్గరుంచుకోవాలని సూచించింది...!

ప్రపంచంలోనే తొలిసారి!

ఐరన్ బీమ్. ఉగ్రవాదుల రాకెట్లను గాల్లోనే తుత్తునియలు చేసి క్షణాల్లో కాల్చి బూడిదగా మార్చే అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థ. తీవ్రమైన కాంతిపుంజపు ఉష్ణశక్తితో కూడిన ఈ వినూత్న సాంకేతిక ఆయుధాల గురించి వినడమే తప్ప ఇప్పటిదాకా ఏ దేశమూ ప్రయోగించలేదు. చెప్పాలంటే ప్రయోగాత్మక దశలో ఉన్న టెక్నాలజీ ఇది. ఇజ్రాయెల్ రఫేల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసింది. ఇది స్టార్ ట్రెక్, స్టార్ వార్స్ వంటి సైన్స్ ఫిక్షన్ సినిమాల్లోని ఆయుధాల్లా ఉంటుందంటే అతిశయోక్తి కాదు. 'డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్'గా వ్యవహరించే ఈ కొంగొత్త వ్యవస్థను 2014 ఫిబ్రవరి 11న సింగపూర్ ఎయిర్ షోలో ప్రదర్శించారు. పాలస్తీనీ హమాస్, లెబనీస్ హెజ్బొల్లా ఉగ్ర సంస్థలతో తాజా ఘర్షణలు, యుద్ధం నేపథ్యంలో దీన్ని ఇజ్రాయెల్ రంగంలోకి దించనుందని తెలుస్తోంది.

ఇలా పని చేస్తుంది...

యారో–2, యారో–3, డేవిడ్స్ స్లింగ్, ఐరన్ డోమ్ తర్వాత ఇజ్రాయెల్ అమ్ములపొదిలో సరికొత్త ఆగ్నేయాస్త్రం ఐరన్ బీమ్. ఇది ఫైబర్ లేజర్ ఆధారంగా పనిచేస్తుంది. ఐరన్ డోమ్తో పోలిస్తే ఐరన్ బీమ్ చిన్నది, తేలికైనది. రహస్యంగా ప్రయోగించడానికి, ఒక చోట నుంచి మరో చోటికి తరలించడానికి మరింత అనువైనది. ఐరన్ డోమ్ కూడా ఇజ్రాయెల్ స్వల్పశ్రేణి క్షిపణి రక్షణ వ్యవస్థే. కానీ ఇటీవలి హమాస్ రాకెట్ దాడులను నిలువరించడంలో విఫలమైంది. ఇప్పుడు డోమ్‌కు బీమ్‌ను జతచేసి సత్ఫలితాలు రాబట్టాలని ఇజ్రాయెల్ భావిస్తోంది. అయితే ఐరన్ బీమ్‌కూ పరిమితులు లేకపోలేదు. తడి వాతావరణ పరిస్థితుల్లో ఈ లేజర్ వ్యవస్థ పనిచేయదు. ఎంతటి సానుకూల పరిస్థితులున్నా వాతావరణంలోని తేమ వల్ల 30% నుంచి 40% వరకు శక్తిని లేజర్ కోల్పోతుంది. అలాగే ధ్వంసం చేయాల్సిన లక్ష్యం ఐరన్ బీమ్ దృష్టి రేఖకు సూటిగా ఉండాలి. నేరుగా కంటికి కనిపించకుండా, బీమ్‌కు సూటిగా కాకుండా లక్ష్యం ఎక్కడో నక్కి ఉంటే లేజర్ కిరణాలతో నాశనం చేయడం అసాధ్యం. పైగా ఐరన్ బీమ్ ఫైరింగ్ రేటు కూడా తక్కువ. లక్ష్యాన్ని ధ్వంసం చేయడానికి సరిపోయేంత లేజర్ శక్తిని ప్రయోగించాలంటే కనీసం 5 సెకన్లు, అంతకు మించి సమయం కావాలి. అయినప్పటికీ శత్రు క్షిపణులను గగనతలంలోనే అడ్డుకుని కూల్చేసే సంప్రదాయ ఇంటర్‌సెప్టర్ క్షిపణులతో పోల్చితే ఐరన్ బీమ్ వ్యవస్థ అత్యంత శక్తిమంతమైనది. 'ఖర్చు తక్కువ, పనితీరు ఎక్కువ' అన్నది దీని సూత్రం. పైగా దీన్ని ఎన్నిసార్లైనా పేల్చవచ్చు. ఒక్కో షాట్‌కు అయ్యే వ్యయమూ తక్కువ. ఐరన్ డోమ్‌లో ఒక్కో ఇంటర్సెప్టర్ రాకెట్‌కు 60 వేల డాలర్ల దాకా అవుతుండగా ఐరన్ బీమ్‌లో మాత్రం ఆ ఖర్చు కేవలం కొన్ని డాలర్లే. అంతేకాదు, ఈ వ్యవస్థలో శత్రు క్షిపణిని ఢీకొట్టాక ఇంటర్‌సెప్టర్ శకలాలు పడే ముప్పు కూడా ఉండదు. 7 కిలోమీటర్ల పరిధిలోని క్షిపణులు, మానవరహిత వైమానిక వాహనాలు, మోటార్ షెల్స్ వంటివాటిని ఐరన్ బీమ్ క్షణాల్లో నిర్వీర్యం చేయగలదు. దీన్ని 2025 నాటికి మోహరించాలని ఇజ్రాయెల్ భావించినా యుద్ధం అవసరాలతో ఇప్పుడే రంగంలో దించేలా ఉంది.

ఐరన్ బీమ్ Vs లైట్ బీమ్!

ఈ రెండు హై ఎనర్జీ లేజర్ వ్యవస్థలనూ రఫేల్ సంస్థే అభివృద్ధి చేస్తోంది. లైట్ బీమ్ 7.5 కిలోవాట్ల ఇంటర్‌సెప్టర్. రెండు కిలోమీటర్ల దూరంలోని చిన్నపాటి మానవరహిత వైమానిక వాహనాలు, నేలమీద అత్యాధునిక మందుపాతరలు, పేలని మందుగుండు తదితరాలను ఇది నిర్వీర్యం చేయగలదు. ఐరన్ బీమ్ 100 కిలోవాట్ల తరగతికి చెందిన హై ఎనర్జీ లేజర్ సిస్టమ్. ఇది రాకెట్లు, శతఘ్నులు, యూఏవీలను కూల్చగలదు.

- జమ్ముల శ్రీకాంత్

అమెరికాలో హెలికాప్టర్ కూలి... ఆరుగురి దుర్మరణం

కాలిఫోర్నియా: అమెరికాలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో నైజీరియాకు ప్రముఖ ఏక్సెస్ బ్యాంకు సీఈవో, ఆయన భార్య, కొడుకు సహా ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. పామ్ స్ప్రింగ్స్ ఎయిర్‌పోర్టు నుంచి శుక్రవారం రాత్రి 8.45 గంటలకు బయలుదేరిన యూరోకాప్టర్ ఈసీ 120 రకం హెలికాప్టర్ నెవడాలోని బౌల్డర్ సిటీకి వెళుతుండగా మొజావ్ ఎడారిలోని ఇంటర్‌స్టేట్ 15 రహదారి సమీపంలో 10.30 గంటల సమయంలో కూలిపోయింది. ఘటనలో అందులో ఉన్న యాక్సెస్ బ్యాంక్ సీఈవో హెర్బర్ట్ విగ్వే(57), ఆయన భార్య, కొడుకుతోపాటు మొత్తం ఆరుగురూ మృత్యువాతపడ్డారు. నైజీరియాలోని రెండు అతిపెద్ద బ్యాంకుల్లో ఏక్సెస్ బ్యాంకు ఒకటి.

రేపు రైతు సంఘాల 'ఢిల్లీ చలో'

భారీ భద్రతతో దుర్భేద్యంగా ఢిల్లీ, హరియాణా సరిహద్దులు

న్యూఢిల్లీ/చండీగఢ్: రైతు సంఘాలు మంగళవారం తలపెట్టిన 'ఢిల్లీ చలో'మార్చ్ నేపథ్యంలో దేశ రాజధానితో పాటు హరియాణా సరిహద్దుల్లో అధికారులు భారీగా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. నిషేధాజ్ఞలను అమలు చేయడంతో పాటు వాహనాల ప్రవేశాన్ని అడ్డుకునేందుకు కాంక్రీట్ దిమ్మెలు, స్పైక్ బారియర్లు, ముళ్లకంచెలను ఏర్పాటు చేశారు. టొహానా బోర్డర్ వద్ద ఇసుక కంటెయినర్లను, కాంక్రీట్ బారికేడ్లను, మేకులను రోడ్డుపై ఏర్పాటు చేశారు. సోమవారం చర్చలకు రావాల్సిందిగా రైతు సంఘాలను కేంద్రం ఆహ్వానించింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత వంటి డిమాండ్లతో సంయుక్త కిసాన్ మోర్చా, పలు ఇతర రైతు సంఘాలు ఢిల్లీ మార్చ్‌కి పిలుపివ్వడం తెలిసిందే. దాంతో ట్రాక్టర్ ట్రాలీ మార్చ్ సహా ఎటువంటి నిరసనలు చేపట్టరాదంటూ హరియాణా ప్రభుత్వం 15 జిల్లాల పరిధిలో సెక్షన్ 144 విధించింది. శంభు వద్ద పంజాబ్‌తో సరిహద్దును మూసివేసింది. ఏడు జిల్లాల్లో ఇంటర్నెట్ సర్వీసులను, బల్క్ ఎస్ఎంఎస్‌లను మంగళవారం దాకా నిషేధించింది. 2020–21లో రైతులు ఏడాదికి పైగా నిరసనలు కొనసాగించిన సింఘు, ఘాజీపూర్, తిక్రీ సరిహద్దుల్లో బారికేడ్లనే ఏర్పాటు చేసి, తనిఖీలను ముమ్మరం చేశారు. ఢిల్లీలోని ఈశాన్య జిల్లాలో కూడా నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు. నిరసనకారులు ఢిల్లీలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటున్నారు. యూపీ, పంజాబ్ సరిహద్దుల్లో 5 వేల మంది పోలీసులను నియోగించారు. మెట్రో స్టేషన్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. నిరసనకారులు బారికేడ్లను తొలగించుకుని లోపలికి రాకుండా ఘగ్గర్ ఫ్లై ఓవర్ వద్ద రోడ్డుకు ఇరువైపులా ఇనుపషీట్లను అమర్చారు. ఏదేమైనా కనీసం 20 వేల మంది రైతులు ఢిల్లీ తరలుతారని రైతు సంఘాలంటున్నాయి. మోదీ సర్కారు నిరంకుశత్వంతో రైతులను అడ్డుకోజూస్తోందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. దాన్ని ఢిల్లీ నుంచి శాశ్వతంగా పారదోలాలని పిలుపునిచ్చారు.

ఎన్నికలప్పుడే పేదలు గుర్తొస్తారు

కాంగ్రెస్‌పై మోదీ ధ్వజం

- బీజేపీకి 370 దాటడం ఖాయం
- ఎన్డీయేకు 400 దాటుతాయని విపక్ష నేతలే అంటున్నారు
- మధ్యప్రదేశ్ సభలో ప్రధాని

భోపాల్: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 370కిపైగా స్థానాలు కచ్చితంగా గెలుచుకుంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో అధికార ఎన్డీయేకు 400కు పైగా స్థానాలు లభిస్తాయని సాక్షాత్తూ ప్రతిపక్ష నేతలే చెబుతున్నారని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఝాబూవా జిల్లాలో ఆదివారం గిరిజనుల బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన గిరిజన సంప్రదాయ దుస్తులు ధరించారు. కాంగ్రెస్ గిరిజన వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. ఆ పార్టీకి గ్రామీణులు, రైతులు, పేదలు కేవలం ఎన్నికల సమయంలోనే గుర్తుకొస్తారని ఎద్దేవా చేశారు. కొన్ని రోజుల క్రితం దక్షిణాది రాష్ట్రాల్లో శ్రీరాముడితో సంబంధం ఉన్న ఆలయాలను దర్శించుకున్నానని, స్థానిక ప్రజల నుంచి తనకు అపరిమితమైన ప్రేమ లభించిందని చెప్పారు.

కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోవడం ఖాయం

వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు గ్రహించాయని, అందుకే దింపుడు కళ్లం ఆశతో కుటిల ప్రయత్నాలకు పాల్పడుతున్నాయని ప్రధాని మోదీ ఆరోపించారు. లూటీ చేయడం, ప్రజలను విభజించడం.. ఇదే కాంగ్రెస్ విధానమని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు జనం సొమ్ము దోచుకోవడం, అధికారం పోయాక భాష, ప్రాంతం, కులం పేరిట విడదీయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిపోయిందన్నారు. అవినీతి, విభజన రాజకీయాలు అనే ఆక్సిజన్‌తో కాంగ్రెస్ బతుకుతోందన్నారు. ప్రజలకు నిజాలు తెలుసని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఆటలు సాగనివ్వబోమని తేల్చిచెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని అన్నారు. గిరిజనులు, పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నందుకే ప్రతిపక్షాలు తనను దూషిస్తున్నాయని ఆరోపించారు.

విలువలతో కూడిన విద్య కావాలి

భారతీయ విలువల ఆధారిత విద్యా వ్యవస్థ తక్షణావసరమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆర్య సమాజ్ వ్యవస్థాపకుడు స్వామి దయానంద సరస్వతి 200వ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని మోర్బీ జిల్లా తాంకారాలో ఆదివారం వేడుకల్లో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. భారతీయ వ్యవస్థ వేదాల వైపు మళ్లాలంటూ దయానంద సరస్వతి పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ఆయన గొప్ప సామాజిక సంస్కర్త అని కొనియాడారు. సమాజం నుంచి బానిసత్వం, మూఢనమ్మకాలను తొలగించేందుకు కృషి చేశారని తెలిపారు. ఆర్య సమాజ్ ఆధ్వర్యంలోని పాఠశాలలు విలువలతో కూడిన విద్యనందిస్తున్నాయని ప్రశంసించారు. 21వ శతాబ్దంలో జాతి నిర్మాణం అనే బాధ్యత చేపట్టాలని ఆర్య సమాజ్‌కు విజ్ఞప్తి చేశారు. దయానంద సరస్వతి జన్మించిన గుజరాత్‌లో తాను కూడా జన్మించడం అదృష్టంగా భావిస్తున్నానని మోదీ అన్నారు.

ప్రతి బూత్‌లో అదనంగా 370 ఓట్లు

గత లోక్‌సభ ఎన్నికల కంటే ఈసారి ప్రతి పోలింగ్ బూత్‌లో బీజేపీకి అదనంగా 370 ఓట్లు వేయాలని ప్రజలను నరేంద్ర మోదీ కోరారు. మొత్తం 543 లోక్‌సభ సీట్లకు గాను తమకు 370కిపైగా సీట్లు కట్టబెట్టాలన్నారు. మధ్యప్రదేశ్‌లో డబులు ఇంజన్ ప్రభుత్వం డబుల్ స్పీడ్‌తో పని చేస్తోందని హర్షం వ్యక్తం చేశారు. రూ.7,550 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఈ సందర్భంగా మోదీ ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ గిరిజనులను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తోందని ఆక్షేపించారు. గిరిజన మహిళ ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతి కాకుండా అడ్డుకొనేందుకు కాంగ్రెస్ ప్రయత్నించిందని ధ్వజమెత్తారు.



దేశ గౌరవం పెంచిన మోదీ: అమిత్ షా

మైసూరు: ''అయోధ్యలో రామమందిర నిర్మాణంతోపాటు ప్రముఖ పుణ్యక్షేత్రాలను ప్రధాని నరేంద్ర మోదీ అభివృద్ధి చేశారు. తద్వారా అంతర్జాతీయ వేదికలపై దేశ సాంస్కృతిక గౌరవాన్ని ఇనుమడింపజేశారు. దేశాన్ని సురక్షితంగా, సుభిక్షంగా తీర్చిదిద్దడంతోపాటు యోగ, ఆయుర్వేద, భారతీయ భాషల పరిరక్షణకు మోదీ చర్యలు తీసుకుంటున్నారన్నారు'' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఆదివారం ఆయన మైసూరు సమీపంలోని సుత్తూరు జాతరలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మైసూరులోని చాముండి హిల్స్‌పై కొలువుదీరిన చాముండేశ్వరీ మాతను దర్శించుకుని పూజలు చేశారు.

నాకు ఓటేయకుంటే తిండి మానండి

అమ్మానాన్నల్ని బెదిరించండి.. చిన్నారులకు ఎమ్మెల్యే ఉద్బోధ

ముంబై: తల్లిదండ్రులు తనకు ఓటేయకుంటే రెండు రోజులపాటు అన్నం మానేయాలంటూ మహారాష్ట్రలో అధికార శివసేన ఎమ్మెల్యే ఎమ్మెల్యే సంతోష్ బంగార్ చిన్నారులకు చెప్పడం వివాదాస్పదంగా మారింది. ఎన్నికల సంబంధ కార్యక్రమాల్లో చిన్నారులను ఉపయోగించుకోరాదంటూ ఎన్నికల కమిషన్ ఇటీవలే మార్గదర్శకాలు జారీ చేయడం తెలిసిందే. బంగార్ ఇటీవల ఓ జిల్లా పరిషత్ పాఠశాలలో పదేళ్లలోపు చిన్నారులతో ముచ్చటిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ''మీరేమీ తినకుండా ఉంటే ఏమైందని అమ్మానాన్న అడుగుతారు. బంగార్‌కే ఓటేయండి. అప్పుడే తింటాం అని చెప్పండి'' అన్నారు. వచ్చే ఎన్నికల్లో తనకే ఓటేయాలని తల్లిదండ్రులకు చెబుతామంటూ పిల్లలతో వల్లె వేయించారాయన. దీనిపై విపక్షాలన్నీ మండిపడ్డాయి.

చిన్నారిని ఓవెన్‌కు బలి చేసుకుంది...

కాన్సాస్ సిటీ: నిద్ర పుచ్చేందుకు ఉయ్యాలలో ఉంచాల్సిన శిశువును పొరపాటున ఓవెన్‌లో పెట్టింది ఓ తల్లి. తప్పు గ్రహించేలోగానే ఆ శిశువు తీవ్రంగా కాలిన గాయాలతో తనువు చాలించింది. ఈ విషాద ఘటన అమెరికాలోని మిస్సోరి రాష్ట్రం కాన్సాస్ సిటీలో చోటుచేసుకుంది. నగరానికి చెందిన మరియా థామస్ శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో తన శిశువును ఉయ్యాల తొట్టిలో పడుకోబెట్టి నిద్ర పుచ్చాలనుకుంది. అయితే, చిన్నారిని పొరపాటున ఓవెన్‌లో ఉంచి, ఆన్ చేసింది. తప్పు తెలుసుకునే సరికే చిన్నారి ఒళ్లు తీవ్రంగా కాలిపోయింది. ఆస్పత్రికి తరలించగా అప్పటికే శిశువు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఎన్సీపీని లాగేసుకున్న ఈసీ: పవార్

పుణే: ఎన్సీపీని ఎన్నికల సంఘమే తమనుంచి లాగేసుకుందని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శరద్ పవార్ వాపోయారు. ఎన్సీపీ పేరును, గుర్తును అజిత్ పవార్ వర్గానికి ఈసీ కేటాయించడం తెలిసిందే. ఆదివారం పుణేలో జరిగిన శరద్ పవార్ ఒక కార్యక్రమంలో దీనిపై స్పందించారు. ఎన్సీపీని స్థాపించి, బలోపేతం చేసిన వారి చేతుల్లో నుంచి లాగేసుకోవడమే గాక ఇతరులకు అప్పగిస్తూ ఈసీ తీసుకున్న నిర్ణయం ఆశ్చర్యం కలిగించిందన్నారు. దీన్ని ప్రజలు హర్షించరని నమ్మకం తనకుందని చెప్పారు.

జేడీ(యూ) ఎల్పీ భేటీకీ ఎమ్మెల్యేలు డుమ్మా

పట్నా: సీఎం నితీశ్ కుమార్ సర్కారుపై అసెంబ్లీలో సోమవారం జరిగే విశ్వాస పరీక్షలో నెగ్గుతామని అధికార జేడీయూ ధీమా వ్యక్తం చేసింది. శనివారం సీఎం నితీశ్ ఇచ్చిన విందుకు కొందరు డుమ్మా కొట్టిన విషయం తెలిసిందే. అలాగే, ఆదివారం మంత్రి విజయ్ కుమార్ చౌదరి అధ్యక్షతన జరిగిన పార్టీ శాసనసభా పక్షం భేటీకి సైతం కొందరు గైర్హాజరవడం కలకలం రేపింది. ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేలు తప్పనిసరి పరిస్థితుల్లో గైర్హాజరయ్యారని చౌదరి చెప్పారు. తొలుత ఆర్జేడీకి చెందిన స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం, అనంతరం ప్రభుత్వంపై విశ్వాస పరీక్షలో వారంతా ఓటేస్తారన్నారు. స్వతంత్ర ఎమ్మెల్యే సుమిత్ కుమార్ జేడీయూ ఎల్పీ భేటీలో పాల్గొనడం విశేషం. సోమవారం వామపక్ష సభ్యులతో కలిసి ఆర్జేడీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి చేరుకుంటారని తెలిసింది. వారం రోజులుగా హైదరాబాద్‌లో మకాం వేసిన 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆదివారం పట్నా చేరారు.



ఛత్తీస్‌గఢ్‌లో భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్

ప్రేమ మన డీఎన్‌ఏలోనే ఉంది

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

రాయ్‌గఢ్: మన దేశ డీఎన్‌ఏలోనే ప్రేమ ఉందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మాత్రం దేశంలో విద్వేషం వ్యాప్తి చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఆయన భారత్ జోడో న్యాయ్ యాత్ర రెండు రోజుల విరామం తర్వాత ఆదివారం ఛత్తీస్‌గఢ్‌లో మొదలైంది. రాయ్‌గఢ్ ర్యాలీలో రాహుల్ మాట్లాడారు. ''భారత్‌లో భిన్న మతాలు, భిన్న సంప్రదాయాల ప్రజలు పరస్పరం ప్రేమతో శాంతియుతంగా జీవిస్తున్నారు. కానీ బీజేపీ, ఆర్ఎస్ఎస్ విద్వేష రాజకీయాల వల్ల ప్రతి ప్రాంతంలో విద్వేషం, హింస పెరిగిపోతున్నాయి. భాష ఆధారంగా కొందరు, రాష్ట్రాన్ని బట్టి ఇంకొందరు ఇతరులను ద్వేషిస్తామంటున్నారు'' అని ఆవేదన వెలిబుచ్చారు. విద్వేషం, హింసకు తావులేని హిందుస్తాన్‌ను భవిష్యత్ తరానికి అందించడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు.

అయోధ్యలో యూపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

అయోధ్య/లక్నో: ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిపి సుమారు 325 మంది అయోధ్యలో రామ్‌లల్లా దర్శనం చేసుకున్నారు. ఆదివారం ఉదయం లక్నో నుంచి 10 బస్సుల్లో, కొందరు తమ కార్లలో బయలుదేరి అయోధ్యకు చేరుకున్నారు. నగరంలో వారికి ఘన స్వాగతం లభించింది. పుణేలో ఉన్న సీఎం యోగి ఆదిత్యనాథ్ అయోధ్యకు చేరుకుని వారితో కలిశారు. కొందరు శాసనసభ్యులు తమ కుటుంబసభ్యులతో కలిసి వచ్చారు. అంతా కలిపి సుమారు 400 మంది విడతల వారీగా సుమారు రెండున్నర గంటల సమయంలో బాల రాముడి దర్శనం చేసుకున్నారు. దర్శనం తర్వాత గ్రూప్ ఫొటోలు తీసుకున్నారు. రాముడిని దర్శించుకున్న వారిలో బీజేపీ మిత్ర పక్షాల శాసనసభ్యులతోపాటు కాంగ్రెస్, బీఎస్పీకి చెందిన వారు కూడా ఉన్నారు. ప్రధాన ప్రతిపక్షం సమాజ్ వాదీ పార్టీ ఎమ్మెల్యేలెవరూ ఈ కార్యక్రమానికి రాలేదు. ప్రస్తుతం యూపీ శాసనసభలోని 399 మందిలో బీజేపీకి 252 మంది, మిత్రపక్షాలకు 19 మంది సభ్యుల బలముంది. ప్రతిపక్షంలో ఎస్పీకి 108 మంది, ఇతరులకు 20 మంది ఎమ్మెల్యేలున్నారు. ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి సైతం ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ హాజరుకాలేదు.

సంకీర్ణం దిశగానే పాక్...

ఎంక్యూఎం–పీతో నవాజ్ పార్టీ పీఎంఎల్ పొత్తు చర్చలు సఫలం

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. గురువారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజార్టీ రాకపోవడం తెలిసిందే. మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సారథ్యంలోని పీఎంఎల్ (ఎన్) 75 సీట్లతో ఏకైక అతిపెద్ద పార్టీగా నిలిచింది. బిలావల్ భుట్టో సారథ్యంలోని పీపీపీకి 54, ముత్తాహిదా ఖ్వామి మూవ్‌మెంట్ పాకిస్తాన్ (ఎంక్యూఎం–పీ)కి 17, ఇతరులకు 12 సీట్లొచ్చాయి. 101 స్థానాల్లో ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారులు గెలిచారు. ప్రభుత్వ ఏర్పాటు యత్నాల్లో నవాజ్ ముందంజలో ఉన్నారు.ఇతర పార్టీలతో చర్చల బాధ్యతను సోదరుడు షహబాజ్ షరీఫ్‌కు అప్పగించారు. ఆయన ఆదివారం ఎంక్యూఎం–పీతో ఆదివారం చర్చలు జరిపారు. అనంతరం కలిసి పని చేయాలని అంగీకారానికి వచ్చినట్టు సమాచారం. నవాజ్ షరీఫ్ పార్టీతోనే తమకు పొత్తు సౌకర్యంగా ఉంటుందని భావిస్తున్నామని ఎంక్యూఎం–పీ నాయకుడు హైదర్ రిజ్వీ చెప్పారు. పీపీపీ మాజీ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీతో కూడా షెహబాజ్ షరీఫ్ ఇప్పటికే చర్చలు జరిపారు. కానీ ప్రధానమంత్రి పదవిని తన కుమారుడు బిలావల్ భుట్టోకే కట్టబెట్టాలని జర్దారీ షరత్ విధించారు. అందుకు పీఎంఎల్–ఎన్ అంగీకరించడం లేదు. పాకిస్తాన్‌లో పార్టీల మధ్య పొత్తులు, ప్రభుత్వ ఏర్పాటుపై రెండు మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉందంటున్నారు. నవాజ్ షరీఫ్‌కు పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్ కూడా మద్దతు పలుకుతున్నారు.

పాక్ జాతీయ అసెంబ్లీలో 266 స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా అభ్యర్థి మరణంతో ఒక చోట పోలింగ్ వాయిదా పడింది. రిగ్గింగ్ ఆరోపణలతో కొన్ని స్థానాల్లో తుది ఫలితాలను ఎన్నికల సంఘం ఇంకా ప్రకటించలేదు. ప్రభుత్వ ఏర్పాటుకు కనీసం 133 సీట్లు అవసరం.

సత్తా చాటిన ఇమ్రాన్ మద్దతుదారులు

అవినీతి ఆరోపణలతో జైలుపాలైనా పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ (పీటీఐ) అధినేత ఇమ్రాన్ ఖాన్ ఈ ఎన్నికల్లో సత్తా చాటారు. ఆయన పార్టీ అధికారికంగా పోటీలో లేదు. దాంతో ఆయన మద్దతుదారులు స్వతంత్ర అభ్యర్థులుగానే పోటీ చేశారు. వారికి ఎన్నికల సంఘం ఉమ్మడి గుర్తు కూడా కేటాయించలేదు. అయినా జాతీయ అసెంబ్లీలో ఏకంగా 101 స్థానాలను గెలుచుకుని సత్తా చాటారు. ఈ ఫలితాలు తమకు నైతిక విజయమంటూ ఇమ్రాన్ జైలునుంచే ప్రకటన విడుదల చేశారు.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024



భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక సంరక్షణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించారు.



తిరుపతమ్మ సేవలో..

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారిని ఆదివారం ఇంటెలిజెన్స్ ఐజీ రఘురాంరెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపించారు. ఆయనను ఆలయ అధికారులు సత్కరించారు.

నేడు స్పందన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ ఢిల్లీరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలోనూ కార్యక్రమం కొనసాగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



న్యూస్‌రీల్

దుర్గమ్మ సేవలో వైవీ సుబ్బారెడ్డి దంపతులు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. వీరికి ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు సాదరంగా స్వాగతం పలికారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విశాఖపట్నం సీతంపేటకు చెందిన సంపంగి శ్రీనివాసరావు కుటుంబం రూ. 1,01,116 విరాళాన్ని అందజేసింది. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, చైర్మన్ కర్నాటి రాంబాబు వారికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

శ్రీపంచమికి ఆరు వేల పెన్నులు..

గుంటూరు కృష్ణానగర్ బృందావన్ కాలనీకి చెందిన పద్మనాభుని జయరాం దేవస్థానానికి 6 వేల పెన్నులను విరాళంగా అందజేశారు. దాత ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలక మండలి సభ్యులు బచ్చు మాధవీకృష్ణలకు అందజేశారు. 14వ తేదీ శ్రీపంచమిని పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి విచ్చేసే విద్యార్థులకు ఈ పెన్నులను పంపిణీ చేయాలని దాత కోరారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

పాలిటెక్నిక్ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ నూతన కమిటీ



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పాలిటెక్నిక్ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ నూతన కమిటీ ఎన్నిక విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో ఆదివారం జరిగింది. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్వీ శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.శేషగిరిరావు, కార్యదర్శిగా వై.భార్గవ్, జాయింట్ సెక్రటరీగా కేఎస్ఎస్.ప్రకాష్‌రావు, కోశాధికారిగా కె.చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బి.రఘునాథరెడ్డి, బి.దేవుడు ఎన్నికయ్యారు. రిటైర్డ్ అయిన ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీకాంత్ తెలిపారు.

పిల్లల వైద్యుల సమాఖ్య అధ్యక్షుడిగా డాక్టర్ పరుచూరి



పటమట(విజయవాడ తూర్పు): పిల్లల వైద్యుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ పరుచూరి అనిల్ కుమార్ నియమితులయ్యారు. విజయవాడలోని ఐఎంఏ హాల్లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఐఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఐఎంఏ విజయవాడ శాఖ కార్యదర్శిగా, రాష్ట్ర శాఖ కోశాధికారిగా, ప్రభుత్వ వైద్యుల సంఘం కార్యదర్శిగా అనేక పదవులు చేపట్టారు. వైద్యుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేశారు. ప్రస్తుతం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పిల్లల వైద్య విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఐఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పి. అనిల్‌కుమార్‌ను పలువురు అభినందించారు.

పోలీస్ మినిస్టీరియల్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ పోలీస్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోపీకృష్ణ(అనంతపురం), సహాయ కార్యదర్శిగా భీమాబాయ్(విశాఖపట్నం), ఆర్గనైజింగ్ సెక్రటరీగా గంగాధర్(విజయవాడ) ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం నిర్వహించి సంఘంలో ఖాళీ అయిన పదవులను భర్తీ చేశారు. మినిస్టీరియల్ సిబ్బంది సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గోపీకృష్ణ అన్నారు.

తేజరిల్లిన భక్తిదీపం

వైభవంగా గుణదల పుణ్యక్షేత్ర శతాబ్ది ఉత్సవాలు సమాప్తం




కరుణామూర్తి ఒడి.. భక్తజనఝరి

భక్తజనంతో కిక్కిరిసిన గుణదల గిరి పరిసరాలు



విశ్వాస శిఖరం భక్తజన సంద్రమైంది. ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. దేశ, విదేశాల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన క్రైస్తవ లోకం ప్రశస్తమైన మరియమాత ఒడిలో సాంత్వన పొందింది. ఆ దయా ప్రాప్తురాలి చెంతన చేరి దీవెనలివ్వమ్మా అంటూ వేడుకుంది. మనసారా ప్రార్థించి, మొక్కుబడులు చెల్లించింది. గురువుల ప్రసంగాలు, భక్తుల మనోనేత్రాలను వెలిగించాయి. ఉదయం, సాయంత్రం వేళ్లలో నిర్వహించిన సమష్టి దివ్యబలి పూజ, అందించిన దివ్యసత్ప్రసాదాలు వారిలో విశ్వాసాన్ని మరింత ఇనుమడింపజేశాయి. నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు చరిత్రను పరిచయం చేయడంతో పాటు వారిలో ఉత్సాహాన్ని రెట్టింపు చేశాయి.



దివ్యబలిపూజ సమర్పిస్తున్న పోప్ రాయబారి జిరెల్లి, చిత్రంలో బిషప్ రాజారావు



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవ భక్తులు

గుణదల (విజయవాడ తూర్పు): ప్రసిద్ధ గుణదల పుణ్యక్షేత్రంలో మూడు రోజులుగా జరుగుతున్న మేరీ మాత శతాబ్ది ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ఆఖరి రోజు కావడంతో యాత్రికులు లక్షలాదిగా తరలివచ్చారు. మరియ తల్లిని కనులారా దర్శించుకుని తరించారు. పుణ్య క్షేత్రం స్థాపించి నూరు వసంతాలు పూర్తయిన నేపథ్యంలో శతాబ్ది ఉత్సవాలకు భక్తులు అంచనాలకు మించి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇండియా, నేపాల్ వాటికన్ సిటీ పోప్ రాయబారి లియోపోల్డో జిరెల్లి భక్తులకు దైవ సందేశాన్ని అందించారు. మరియమాత పవిత్రతకు మెచ్చి దేవాది దేవుడే ఆమె గర్భవాసాన జన్మించారని తెలిపారు. లోక రక్షకుడైన క్రీస్తును ఈ లోకానికి అందించిన మరియమాతను శ్రీ సభ అమలోద్భవిగా గౌరవిస్తుందన్నారు. గుణదల పుణ్యక్షేత్రం 100ఏళ్ల వేడుకల్లో పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు. అనంతరం బెల్జియం నుంచి వచ్చిన ఫాదర్ జాన్‌టిల్‌మన్, అమెరికా నుంచి వచ్చిన ఫాదర్ జఫరీ బెహల్, లూసియానా నుంచి వచ్చిన ఫాదర్ చుక్ స్వన్ సన్, విజయవాడ బిషప్ తెలగతోటి రాజారావు, ఏలూరు బిషప్ పొలిమెర జయరావు, విశాఖపట్నం బిషప్ మల్లవరపు ప్రకాష్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి జయరాజులతో కలసి సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు.

ఆంధ్రప్రదేశ్‌ను కీర్తించిన జిరెల్లి..

గుణదల మాత శతాబ్ది ఉత్సవాలలో అశేష భక్తుల సమక్షంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని, ఇక్కడి జనజీవనాన్ని పోప్ రాయబారి జిరెల్లి కొనియాడారు. ఏపీ ఎంతో సుందరమైన ప్రాంతమని బహుశా సృష్టి ఆరంభంలో దేవుడు ఆదామును, హవ్వను ఇక్కడే పుట్టించి ఉంటాడని చలోక్తులు విసిరారు. విజయవాడ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోందని చెప్పారు



శతాబ్ది ఉత్సవాల సావనీర్ ఆవిష్కరిస్తున్న పోప్ రాయబారి జిరెల్లి, బిషప్ రాజారావు తదితరులు



12 లక్షల మంది భక్తులు..

గుణదల మేరీమాత శతాబ్ది ఉత్సవాలకు యాత్రికులు, భక్తులు అంచనాలకు మించి హాజరయ్యారు. ఏటా జరిగే ఉత్సవాలలో సుమారు 8–10 లక్షల మంది హాజరవుతుంటారు. కానీ పుణ్యక్షేత్రం ఏర్పడి నూరు వసంతాలు పూర్తయిన సందర్భంగా మరియతల్లిని దర్శించుకునేందుకు అంతకుమించి తరలి వచ్చారు. ఆదివారం సెలవు దినం కావడంతో సాధారణ యాత్రికులతో పాటు నగర వాసులు సైతం కులమతాలకు అతీతంగా తిరునాళ్లకు వచ్చారు. దీంతో ఉత్సవాలు మరింత శోభాయమానంగా జరిగాయి. అర్ధరాత్రి 2గంటల వరకు దిగువ నుంచీ కొండ శిఖరాగ్రం వరకు భక్తులు బారులు తీరి మరియమాతను దర్శించుకున్నారు. ఈ యేడాది ఉత్సవాలకు సుమారు 12 లక్షల మంది యాత్రికులు గుణదల పుణ్యక్షేత్రానికి వచ్చి ఉంటారని ఆలయ కమిటీ అంచనా వేస్తోంది.

మరియమాత సన్నిధిలో ప్రముఖులు..

గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో ఆదివారం జరిగిన శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పలువురు రాజకీయ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఎంపీ కేశినేని నాని, సీఎం సెక్యూరిటీ ఆఫీసర్ జోషి, ఐఅండ్‌పీఆర్ కమిషనర్ టి. విజయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్చార్జ్ దేవినేని అవినాష్ సమష్టి దివ్యబలి పూజకు హాజరయ్యారు. పుణ్యక్షేత్ర గురువులు వేదిక పైకి ఆహ్వానించి సత్కరించి ఆశీర్వాద ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మరియతల్లిని దర్శించుకుని, పూల మాలలు సమర్పించి ప్రార్థించారు. అనంతరం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, నగర డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, పలువురు కార్పొరేటర్లు మరియమాతను దర్శించుకున్నారు.



విదేశీయుల సందడి..

గుణదల శతాబ్ది ఉత్సవాల ఆఖరి రోజున దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి లక్షలాది మంది యాత్రికులు రావడంతో పాటు విదేశాల నుంచి కూడా తరలివచ్చారు. అమెరికా, బెల్జియం, ఫ్రాన్స్, ఇటలీ దేశాల నుంచి విదేశీ భక్తులు హాజరయ్యారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో మరియతల్లి స్వరూపాన్ని దర్శించుకుని తరించారు. సమష్టి దివ్య బలిపూజలో పాల్గొని భక్తిశ్రద్ధలతో దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరించారు.



లూర్థుమాతకు కొవ్వొత్తులతో దీపారాధన చేస్తున్న భక్తులు

భరోసా ఇచ్చిన ధిలాసా

ఆర్బీకేలతో అద్భుత ఫలితాలు

- ఎన్టీఆర్ జిల్లాలో 267 రైతు భరోసా కేంద్రాలు
- 83 కేంద్రాలకు పక్కా భవనాల నిర్మాణం
- విత్తు నుంచి విత్తనం వరకు గ్రామంలోనే

సున్నావడ్డీ

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	విడుదల చేసిన మొత్తం (రూ.లక్షల్లో)
ఖరీఫ్ -2019	13,339	351.94
రబీ 2019-20	25,953	635.33
ఖరీఫ్ 2020	1,924	46.42
రబీ 2020-21	8,440	216.05
ఖరీఫ్ 2021	7,006	183.12
రబీ 2021-22	10,482	264



పెనమలూరులోని వణుకూరు ఆర్బీకేలో ధాన్యం కొనుగోళ్ల వివరాలు తెలుసుకుంటున్న రైతులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వ్యవసాయాన్ని పండుగ చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్బీకేలు రైతులకు దన్నుగా నిలుస్తున్నాయి. వ్యవసాయంపై రైతులకు భరోసా కల్పిస్తున్నాయి. భరోసా కేంద్రాల ఏర్పాటుతో రైతులకు విత్తు నుంచి విత్తనం వరకు గ్రామంలోనే అందుబాటులోకి వచ్చాయి. దీంతో రైతులు పనులు మానుకుని దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తప్పింది. పంట నష్టపోతే పరిహారం కోరుతూ మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరమే లేకుండా పోయింది. రైతులు, కౌలు రైతులకు కావాల్సిన వ్యవసాయ యంత్ర పరికరాలను రైతు భరోసా కేంద్రాల్లోని సీహెచ్‌సీ గ్రూపుల ద్వారా అద్దె ప్రాతిపదికన అందుబాటులోకి తెచ్చారు. భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులు రైతులకు అన్ని విధాల అండగా నిలుస్తున్నారు. సీజన్ ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు రైతుల అవసరాలు గుర్తించి వాటిని నెరవేరుస్తున్నారు. సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు ఆర్బీకేల్లో అందుబాటులోకి వస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన ఈ ఆర్బీకేల అండతో రైతులు వ్యవసాయాన్ని పండుగ చేస్తున్నారు.

ఒక ఆర్బీకే.. అనేక సేవలు

ఆర్బీకేల ఏర్పాటుతో గ్రామంలోనే రైతులకు కావాల్సిన అన్ని రకాల సేవలు లభిస్తున్నాయి. సీజన్ ప్రారంభానికి ముందే భూసార పరీక్షలు నిర్వహించి ఆ భూమిలో ఏయే పంటలు సాగు చేయవచ్చో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. విత్తనాలు, ఎరువులు ఈ కేంద్రాల్లో అందుబాటులో ఉంటున్నాయి. సాగు ప్రారంభం కాగానే రైతులు ఏయే పంటలు సాగు చేస్తున్నారో వీఏఏల ద్వారా ఆన్‌లైన్‌లో ఈ–క్రాప్ నమోదు చేస్తున్నారు. పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు యాజమాన్య పద్ధతులపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం పంటలకు వైఎస్సార్ ఉచిత బీమా సౌకర్యం కల్పించింది. రైతుల తరఫున ప్రభుత్వమే బీమా చెల్లిస్తోంది. కరువు, కాటకాలు, ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్నా ఇన్సూరెన్స్ వస్తుందన్న నమ్మకం రైతుల్లో ఏర్పడింది. బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లిస్తే సున్నా వడ్డీ అందిస్తోంది. ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా విడతల వారీగా రూ.13,500 ఆర్థిక సహాయం అందిస్తోంది. రైతు ఆత్మహత్య చేసుకుంటే అతని కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.7 లక్షల సాయం అందిస్తోంది.

మరి కొన్ని ప్రయోజనాలు..

- పెట్టుబడి రాయితీ కింద 2,255 మంది రైతులకు రూ.185.618 లక్షలు
- పీఎం ఫసల్ బీమా యోజన కింద 1,12,132 మంది రైతులకు రూ.296.262 లక్షలు
- ఆత్మహత్య చేసుకున్న 13 మంది రైతు కుటుంబాలకు ఒక్కక్కరికీ రూ.7 లక్షల చొప్పున మొత్తం రూ.91లక్షలు
- 257 సీహెచ్‌సీ గ్రూపులకు రూ.11.83 కోట్ల విలువైన 1,667 యంత్రపరికరాలు

రైతు భరోసా ఆర్థిక సహాయం ఇలా..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	రైతు భరోసా మొత్తం (రూ.లక్షల్లో)
2019-20	1,21,852	16,450.02
2020-21	1,25,659	16,963.965
2021-22	1,20,163	16,222.005
2022-23	1,34,338	15,610.65
2023 (మొదటి,రెండు విడతలు)	1,41,726	16,298.22

83 ఆర్బీకేలకు సొంత భవనాలు..

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 267 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే 83 ఆర్బీకేలకు సొంత భవనాలు ఒనగూరాయి. ఈ కేంద్రాల్లో అన్ని రకాల హంగులు సమకూర్చారు. మిగిలిన భవనాల నిర్మాణం పూర్తికావస్తోంది. ఆర్బీకేలు నిర్మాణం జరుగుతున్న గ్రామాల్లో పీఏసీఎస్‌లు, అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వీటిలో గ్రామ వ్యవసాయ సహాయకులు, హార్టికల్చర్ సహాయకులు రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు.

అన్నీ గ్రామంలోనే..



గతంలో ఏ చిన్న అవసరం ఉన్నా మండల కేంద్రానికి లేదా విజయవాడకు ఒక రోజు పనిమానుకుని వెళ్లాల్సిన పరిస్థితి. రైతు భరోసా కేంద్రాలు వచ్చిన తర్వాత విత్తనాలు, ఎరువులు అన్ని గ్రామంలోనే లభిస్తున్నాయి. పంట నమోదు చేస్తున్నారు. నష్టం జరిగితే రోజుల వ్యవధిలోనే అంచనా వేస్తున్నారు. నాకు పంటల బీమా వచ్చింది. నాలుగేళ్లుగా రైతు భరోసా అందుతోంది.

– రమావతు శ్రీనివాసరావు, మునగపాడు, జి.కొండూరు మండలం

అన్ని సౌకర్యాలూ అందుబాటులో..



రైతు భరోసా కేంద్రాల్లో రైతుల వ్యవసాయ అవసరాలకు కావాల్సిన అన్ని సౌకర్యాలూ అందుబాటులోకి వచ్చాయి. నూరు శాతం ఈ–క్రాప్ నమోదు చేస్తున్నాం. ఆర్బీకేల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. రైతులకు ఏ చిన్న ఇబ్బందీ లేకుండా చూస్తున్నాం

– ఎస్.నాగమణెమ్మ, జేడీ, వ్యవసాయశాఖ, ఎన్టీఆర్ జిల్లా

సీహెచ్‌ఓ యామినీకి జాతీయ అవార్డు



మంత్రిప్రగడ యామినీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): గ్రామీణ ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించినందుకు గాను కృష్ణా జిల్లా వణుకూరు–2 డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్(వెల్నెస్ సెంటర్)లో కమ్యునిటీహెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో)గా పనిచేస్తున్న మంత్రిప్రగడ యామినీకి కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నుంచి జాతీయ అవార్డు లభించింది. ఈ నెల 8న న్యూఢిల్లీలో నిర్వహించిన సుశ్రుత అవార్డుల పంపిణీ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. దేశ వ్యాప్తంగా హెల్త్‌కేర్ రంగంలో అత్యుత్తమ సేవలు అందించిన 53 మందికి కేంద్ర ప్రభుత్వం సుశ్రుత అవార్డులు అందజేయగా, మన రాష్ట్రం నుంచి యామిని ఒక్కరే ఈ అవార్డును అందుకున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ)/కమ్యూనిటీహెల్త్ ఆఫీసర్(సీహెచ్‌ఓ) కేటగిరిలో ఈ అవార్డు వరించింది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. విలేజ్ హెల్త్ క్లినిక్స్‌కు అధునాతన భవన నిర్మాణాలు చేపట్టింది. దీంతో ఇప్పటికే ఆమె పని చేస్తున్న విలేజ్ హెల్త్ క్లినిక్‌కు నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్ సర్టిఫికేషన్(ఎన్‌క్యూఏఎస్‌ఎస్) లభించింది. ఇప్పుడు అదే సెంటర్‌లో పనిచేస్తున్న సీహెచ్‌ఓకు జాతీయ గుర్తింపు లభించింది.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



విజేతను అభినందిస్తున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: క్రీడాకారులకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తోందని గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. కానూరు అశోక్ జిమ్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లా మిస్టర్ కృష్ణా–2024 పోటీల కార్యక్రమంలో ఆదివారం మంత్రి పాల్గొని ప్రసంగించారు. క్రీడాకారులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. క్రీడాకారులు తమ సత్తా చాటితే ప్రభుత్వం పూర్తి మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. క్రీడాకారులకు పూర్తి సహకారం జగనన్న ప్రభుత్వం మాత్రమే ఇస్తుందన్నారు. ప్రతి క్రీడాకారుడు తనలో ఉన్న ప్రతిభను చాటాలని అన్నారు. ఈ సందర్భంగా బాడీ బిల్డింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటిన క్రీడాకారులను బహుమతులు ఇచ్చి సత్కరించారు. బాడీబిల్డింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సులపై దృష్టి పెట్టాలి

ముగిసిన మహిళా ఉత్సవ్–2024



మాట్లాడుతున్న విక్టర్‌బాబు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్వయం ఉపాధి కోర్సులను నేర్పించి వారిని పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి జనశిక్షణ సంస్థాన్ చేస్తున్న కృషి అభినందనీయమని ఉమ్మడి కృష్ణాజిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దేవరపల్లి విక్టర్‌బాబు చెప్పారు. స్థానిక మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాలులో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మహిళాఉత్సవ్–2024 ఆదివారం సాయంత్రం ముగింపు సభ జరిగింది. విక్టర్‌బాబు మాట్లాడుతూ ఉపాధి కోర్సులను నేర్చుకున్న వారు ఉపాధి పొందడమే కాకుండా చిన్న తరహా పరిశ్రమలు స్థాపించి మరికొంత మందికి ఉపాధిని కల్పించవచ్చన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 11వ తేదీ (ఆదివారం) వరకు జరిగిన మహిళా ఉత్సవ్‌కు నగర ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. అనంతరం ఉత్సవ్‌లో స్టాల్స్ ఏర్పాటు చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు.

ముగిసిన భారత్ రంగస్థల మహోత్సవ్



అయోధ్యకాండ నాటకంలోని సన్నివేశం

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ నాటికల ప్రదర్శనలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు ప్రదర్శనగా ఇండియన్ థియేటర్ ఫౌండేషన్ వారి అయోధ్యకాండ నాటకాన్ని ప్రదర్శించారు. రచన, దర్శకత్వం ప్రసన్న వహించారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఆర్. మల్లికార్జున రావు, సాంస్కృతిక శాఖ మేనేజర్లు సీహెచ్ శ్రీనివాస్, సుమన్, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఫ్యాకల్టీ వివేక్ పాల్గొన్నారు.

అశ్లీల సాహిత్యంపై పోరాటం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అభ్యుదయ రచయితల సంఘం ప్రతినిధులు

పటమట(విజయవాడ తూర్పు): సమాచార ప్రసార మాధ్యమాల్లో వెలువడే అశ్లీల సాహిత్యంపై నిరంతర పోరాటం ద్వారానే విజయం సాధ్యమని పలువురు వక్తలు తెలిపారు. అశ్లీలత ప్రతిఘటన వేదిక అధ్యక్షుడు ఈదర గోపీచంద్ రచించిన 'కామోత్సవ దహనం' పుస్తకావిష్కరణ సభ స్థానిక బెంజి సర్కిల్ వద్ద ఉన్న సర్వోత్తమ గ్రంథాలయంలో ఆదివారం జరిగింది. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మచ్చ దుర్గా భవాని, ఏపీ గ్రంథాలయ సంఘం కార్యదర్శి రావి శారద పాల్గొన్నారు. దుర్గాభవాని మాట్లాడుతూ అందాల పోటీలు, అశ్లీల సాహిత్యం, సినిమాల మీద ప్రజా సంఘాలు చేసిన పోరాటంలో అక్రమ అరెస్టులు, కోర్టు కేసులు ఎదుర్కొంటూ ఉన్నామని తెలిపారు. ఏనాటికైనా న్యాయమే గెలుస్తుందని చెప్పారు. గోపీచంద్ పోరాటమే అందుకు నిదర్శనమన్నారు. రచయిత గోపీచంద్, రావి శారద, ప్రజాసాహితి అధ్యక్షుడు దివికుమార్ మాట్లాడుతూ నలభై ఏళ్లుగా పోరాటాలు చేసి విజయాలు సాధించామని వివరించారు. ఏపీ ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు పి.చంద్రా నాయక్, చల్లపల్లి విజయ మాట్లాడారు. అరసం కార్యదర్శి మోతుకూరి అరుణ కుమార్, ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్ కుమార్, జన విజ్ఞాన వేదిక నాయకులు జంపా కరుణశ్రీ, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు వేణుగోపాలరావు పాల్గొన్నారు.

మారుతున్న జీవన శైలితో వ్యాధులు

పద్మశ్రీ డాక్టర్ మోహన్ కామేశ్వర్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ మోహన్ కామేశ్వరన్, మధుసూదనశర్మ, రెహ్మాన్

లబ్బీపేట(విజయవాడ తూర్పు): సమాజంలో మారుతున్న జీవనశైలి కారణంగా ప్రతి మనిషి అనేక వ్యాధుల బారిన పడుతున్నాడని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ మోహన్ కామేశ్వరన్ అన్నారు. ఆ వ్యాధులను గుర్తించడంలో వైద్యులు తాము అభ్యసించిన వైద్య పరిజ్ఞానంతో పాటు, రోగి మానసిక స్థితిని కూడా పరిశీలించాలని కోరారు. ఈఎన్‌టీ వైద్యుల సంఘం ఆంధ్రప్రదేశ్, విజయవాడశాఖల ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని ఓ ఆస్పత్రిలో సదస్సు నిర్వహించారు. డాక్టర్ మోహన్ కామేశ్వరన్ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురక వ్యాధి నివారణ కోసం జరుగుతున్న పరిశోధనల ఫలితాల గురించి వివరించారు. అత్యాధునిక వైద్య విధానాల ద్వారా చికిత్స అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గురక ప్రారంభ దశలో పెద్ద సమస్య లేకున్నా, తీవ్రమయ్యే కొద్దీ మానసిక సమస్యలకు దారితీస్తుందని చెప్పారు. వైద్యరంగంలో ఈ వ్యాధికి మూల కారణం గుర్తించి శస్త్ర చికిత్సలు కనుగొనడంలో వైద్య పరిశోధకులు విజయం సాధించారన్నారు. హైదరాబాద్‌కు చెందిన దీనదయాళ్, విజయవాడకు చెందిన ఈఎన్‌టీ నిపుణులు డాక్టర్ పీవీ మధుసూదనశర్మ, డాక్టర్ రెహ్మాన్, డాక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

- ఆరంభమైన మాఘమాస సందడి
- సర్వ దర్శనానికి రెండున్నర గంటలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


క్యూలైన్‌లో అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రికి ఆదివారం భక్తులు విశేషంగా తరలివచ్చారు. మాఘమాసం ప్రారంభం కావడంతో శుభకార్యాలు, నిశ్చయ తాంబూలాలకు హాజరయ్యేందుకు నగరానికి విచ్చేసిన వారు ఇంద్రకీలాద్రికి తరలి రావడంతో రద్దీ కనిపించింది. మరో వైపున తెలంగాణ నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి విచ్చేయడం కనిపించింది. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల వాహనాలతో ఘాట్‌రోడ్డు ఉదయం 9 గంటలకే కిటకిటలాడగా, సీతమ్మ వారి పాదాలు, హెడ్ వాటర్ వర్క్సు పార్కింగ్ చేసుకుని దేవస్థాన బస్సుల్లో కొండపైకి చేరుకున్నారు. ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనం, రూ. 100, రూ. 300, రూ.500 టికెటు క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకున్నారు. మరో వైపున మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయగా, రద్దీ మరింత పెరిగింది. సర్వ దర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టింది. అమ్మవారి దర్శనంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఈఈ కోటేశ్వరరావు, ఏఈవోలు రమేష్‌బాబు, చంద్రశేఖర్ క్యూలైన్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవ, పల్లకీ సేవలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

చిన్నారులకు దైవ గ్రంథాలపై అవగాహన అవసరం


బహుమతులు పొందిన చిన్నారులతో నిర్వాహకులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): చిన్నప్పటి నుంచి పిల్లలకు దైవ గ్రంథాలపై అవగాహన కల్పిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ప్రముఖ వైద్యులు కాలేషావలి అన్నారు. ఆటోనగర్‌లోని ఏటీఏ హాలులో 9వ రాష్ట్ర దివ్య ఖురాన్ కంఠస్థ ప్రతిభా పోటీలు ఆదివారం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి చిన్నారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలేషావలి మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లలు సెల్‌ఫోన్‌లకు బానిసలవుతున్నారని చెప్పారు. చిన్నప్పటి నుంచి దైవ కార్యక్రమాల వైపు మళ్లించడం వల్ల వారి జీవితాలు బంగారుమయంగా మారతాయని తెలిపారు. సెల్‌ఫోన్ మోజులో పడి పిల్లలు అన్నం సైతం మానివేసే పరిస్థితి వచ్చిందన్నారు. పోటీలకు సుమారు 100 మందికి పైగా పిల్లలు హాజరయ్యారు. ఏబీసీడీ గ్రూపులుగా విభజించారు. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, కడప, తదితర జిల్లాలకు చెందిన 12 మంది పిల్లలు మొదటి, రెండవ, మూడో బహుమతులు గెలుపొందారు. కార్యక్రమంలో పర్వేజ్, షేక్ బాషా, హబీబ్‌ఖాన్, పర్వేజ్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఖురాన్ కంఠస్థ పోటీల్లో విజేతలు వీరే...
గ్రూప్ ఏలో మొదటి బహుమతి ఆయేషా అహ్మద్, రెండు మహమ్మద్ ఆలీ, మూడు అఫియా తెహ్రీమ్ పొందారు.
గ్రూప్ బీలో మొదటి బహుమతి అత్తర్ జులిఫిక్వర్, రెండు మహ్మద్ అమీనా, మూడు ఎస్‌కే సనోబర్ గెలుపొందారు.
గ్రూప్ సీలో మొదటి బహుమతి ఎండీ అనీక్విత్ ఇఫ్రా, రెండు ఎస్.అసిఫియా అంజుమ్, మూడు అబ్దుల్ ముహిమిన్.
గ్రూడ్ డీలో మొదటి బహుమతి ఎండీ అనాస్ హుస్సేన్, రెండు ఐమన్ మరియం, మూడు కె. ఇబ్రహీం బహుమతి పొందారు.

సమాజాన్ని చైతన్యపరిచే సాహిత్యం రావాలి

తెలుగు సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి


పురస్కార గ్రహీతలతో లక్ష్మీపార్వతి, కలిమిశ్రీ తదితరులు

విజయవాడ కల్చరల్: సమాజాన్ని చైతన్యపరిచే సాహిత్యం రావాలని అందుకు సాహితీవేత్తలు నూతన సృజన చేయాలని తెలుగు సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. సరోజినీనాయుడు జయంతి సందర్భంగా మల్లెతీగ సాహిత్యవేదిక, స్టేట్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్, నవభారత నిర్మాణ సంఘం, గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం పుణ్యభూమి నాదేశం నమో నమామి శతాధిక కవి సమ్మేళనం, కవి పండిత సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మీ పార్వతి మాట్లాడుతూ సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉండాలని చెప్పారు. కదిలించి పెనునిద్ర వదిలించేదిగా ఉండాలన్నారు. తెలుగు సంస్కృత అకాడమీ ద్వారా భాషా వ్యాప్తికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తెలుగు సంస్కృత అకాడమీ సభ్యుడు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ సభకు అధ్యక్షత వహించారు. కవులు సమాజంలో భాగస్వాములు కావాలని కోరారు. సమాజంలో వస్తున్న మార్పులను గమనించి భావి భారతానికి దిశా నిర్దేశం చేయాలని సూచించారు. మల్లెతీగ సాహిత్యవేదిక వ్యవస్థాపకుడు కలిమిశ్రీ మాట్లాడుతూ సాహిత్యవేదిక ద్వారా నూతన కవులకు దిశా నిర్దేశం చేస్తున్నామని పేర్కొన్నారు. సాహిత్యమేవ జయతే నినాదంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఫొటో జర్నలిస్ట్ వైబీ ఆనంద్ మాట్లాడుతూ లక్ష పదాలు చెప్పలేని భావాన్ని ఒక్క ఫొటో ద్వారా తెలుసుకోవచ్చన్నారు. సినీ దర్శకుడు ప్రభాకర్ జైనీ, వివిధ రంగాలకు చెందిన డాక్టర్ జి.సుధాకర్‌బాబు, డాక్టర్ ప్రభాకర్, నవ్యాంధ్ర రచయితల సంఘం ఉపాధ్యక్షుడు రామకచం సాగర్, సత్యవీణ మొంటేటి, ర్యాలీ శ్రీనివాసరావు, తమ్మిన శ్రీనివాసరావు, సూరేపల్లి రవికుమార్, గాంధీ నాగరాజన్ పాల్గొన్నారు. పుణ్యభూమి నాదేశం నమో నమామి అంశంగా జరిగిన కవి సమ్మేళనంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన కవులు 200 మంది స్వీయ కవితా గానం చేశారు. ఉత్తమ కవితలుగా ఎంపిక చేసిన కవులు బీవీ రాజు, బీవీ శివప్రసాద్, సరికొండ నరసింహరాజు, ఎస్ఎమ్ సుభాని, సయ్యద్ జానీ భాషా, శిఖా ఆకాష్, కుప్పిల వెంకటరాజారావు, వేమూరి రాధారాణి, జ్యోతి, అమూల్య చందులకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. డాక్టర్ లక్ష్మీపార్వతిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

కోడి పందేల శిబిరంపై మెరుపు దాడి

- 44 మంది జూదరుల అరెస్ట్
- రూ. 10.50 లక్షల నగదు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

గన్నవరం: మండలంలోని సూరంపల్లి గ్రామ శివారుల్లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న కోడిపందేల శిబిరంపై శనివారం అర్ధరాత్రి పోలీసులు మెరుపుదాడి చేశారు. పెద్ద సంఖ్యలో జూదరులను అదుపులోకి తీసుకోవడంతో పాటు భారీగా నగదు, కోడి పుంజులు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం ప్రకారం.... సూరంపల్లి శివారులోని పామాయిల్ తోటల్లో ఫ్లడ్ లైట్ల వెలుతురులో భారీఎత్తున కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ జయసూర్యకు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు గన్నవరం సబ్ డివిజన్‌లోని హనుమాన్‌జంక్షన్, వీరవల్లి, ఆత్కూరు పోలీసులు శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కోడి పందేల శిబిరంపై దాడిచేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన 44 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 10.50 లక్షల నగదు, 24 కార్లు, 32 బైకులు, 54 కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జూదరులు, వాహనాలు, కోడి పుంజులను గన్నవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరందరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇంత భారీ ఎత్తున కోడిపందేలు జరుగుతున్నా గన్నవరం పోలీసులకు ఎటువంటి సమాచారం లేకపోవడంపై ఉన్నతాధికారులు శాఖ పరమైన విచారణ చేపట్టారు. అందుకే గన్నవరం పోలీసుల ప్రమేయం లేకుండా ఇతర పీఎస్‌ల అధికారులు, సిబ్బందితో ఈ దాడులు చేయించినట్లుగా సమాచారం.

చెరువులో పడి వ్యక్తి మృతి

వినగడప(గంపలగూడెం): ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన గంపలగూడెం మండలం వినగడలో ఆదివారం చోటుచేసుకొంది. ఎస్ఐ ఎస్.శ్రీను తెలిపిన సమాచారం ప్రకారం... గ్రామానికి చెందిన మందడపు రామారావు కుమారుడు మందడపు వినయ్ (28)కు మతి స్థిమితం సక్రమంగా లేదు. చెరువు వద్దకు వెళ్లిన సందర్భంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. ఘటనపై మృతుడి తండ్రి రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పిపోయిన వ్యక్తి కుటుంబసభ్యులకు అప్పగింత


ఠాకూర్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్ఐ జనార్దన్

హనుమాన్‌జంక్షన్ రూరల్: మతి స్థిమితం లేకపోవటంతో తప్పిపోయిన జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. జార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్ జిల్లాలోని చాస్‌నాలాకు చెందిన కాంచన్ ఠాకూర్ చెన్నై నుంచి స్వగ్రామానికి రైలులో వెళుతుండగా మార్గం మధ్యలోనే దిగిపోయాడు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న కాంచన్ ఠాకూర్‌ను ఈ నెల 9వ తేదీన హనుమాన్‌జంక్షన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఆరా తీసేందుకు యత్నించిన పోలీసులు మతి స్థిమితం లేని వ్యక్తిగా గుర్తించారు. దుస్తుల్లో లభించిన ఫోన్ నంబర్ల ఆధారంగా ఆచూకీ తెలుసుకునేందుకు ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ ప్రయత్నించారు. జార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్ జిల్లాలోని చాస్‌నాలాకు చెందిన కాంచన్ ఠాకూర్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఆదివారం హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌కు జార్ఖండ్ నుంచి వచ్చిన సౌర్యభ్ కుమార్, బిట్టు వర్మలకు కాంచన్ ఠాకూర్‌ను అప్పగించారు. తప్పిపోయిన వ్యక్తిని తిరిగి కుటుంబ సభ్యుల దగ్గరకు చేర్చిన ఎస్ఐ జనార్దన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాపారం పేరుతో మోసగించిన వ్యక్తి పై కేసు

పెనమలూరు: వ్యాపారం చేద్దామని సొమ్ము తీసుకొని మోసగించిన వ్యక్తి పై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు.
పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరుకు చెందిన మాదు శివప్రసాద్ ఈవెంట్ మేనేజర్‌గా పని చేస్తాడు. చదువుకునే రోజుల్లో ఆయనకు ఎస్.సంపత్ మిత్రుడిగా ఉండేవాడు. కాగా కళ్ల జోళ్ల వ్యాపారం (ఆప్టికల్) కలిసి చేద్దామని గత కొద్ది సంవత్సరాల క్రితం శివప్రసాద్ వద్ద సంపత్ రూ.10 లక్షలు తీసుకున్నాడు. అయితే సంపత్ వ్యాపారం ప్రారంభించ లేదు. శివప్రసాద్ తన సొమ్ము ఇవ్వమని అడిగినా సొమ్ము తిరిగి ఇవ్వలేదు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

రథం పనులకు శ్రీకారం


రథం ఏర్పాటుకు పూజలు చేస్తున్న ఆలయ ఏసీ చక్రధరరావు

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు రథం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఆదివారం రథం ఏర్పాటుకు పూజలు నిర్వహించారు. ఏసీ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ రాత్రి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సూపరిటెండెంట్ బొప్పన సత్యనారాయణ, అర్చకులు బుద్ధు ఫణికుమార్ శర్మ పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి



కంచికచర్ల : లారీ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు... మండలంలోని చెవిటికల్లు గ్రామానికి చెందిన నున్న నాగేశ్వరరావు (73) పెనుగంచిప్రోలులో జరిగిన శుభకార్యానికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా కంచికచర్ల నెహ్రూబాలమ్మ సెంటర్ వద్దకు రాగానే ఆయన బైక్‌ను వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగేశ్వరరావు తలకు బలమైన గాయమవటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు సంతానం ఉన్నారు. కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

నేడు వీఎంసీ 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్పందన జరుగుతుందన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి ఒంటి గంట వరకు నగర వాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

కాచి, చల్లార్చి వడబోసిన నీటినే తాగండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర ప్రజలు కాచి, చల్లార్చిన అనంతరం వడబోసిన నీటినే తాగాలని నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. ప్రజలు ఆరోగ్యంగా, క్షేమంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి లోపం కలిగినా, వాసన వచ్చినా లేదా మురికిగా కనిపించినా వెంటనే దగ్గరలో ఉన్న సచివాలయంలో తెలియజేయాలన్నారు. సచివాలయం సిబ్బంది తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటారని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వరనగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. స్క్రూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11 కె.వి. ఎస్‌వీఎస్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. దీని కారణంగా రాఘవనగర్, సీతారామనగర్, చెన్నుపాటి రామకోటయ్యవీధి, ఎయిర్‌టెల్ హెచ్‌టీ సర్వీస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే నగర బహిష్కరణ



పటమట(విజయవాడతూర్పు): సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే నగర బహిష్కరణ విధిస్తామని పటమట సీఐ మోహన్‌రెడ్డి రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం ఆయన స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారమున్నా సహించమని, అలాంటి వాటికి పాల్పడే వారిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామన్నారు. రౌడీషీటర్లందరూ తప్పనిసరిగా ప్రతి ఆదివారం కౌన్సెలింగ్‌కు రావాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

100 మందికి వైద్య సేవలు



గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో జాస్తి చంద్రమౌళి సదన్‌లో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత ఈ వైద్య శిబిరాన్ని లయన్స్‌క్లబ్ ప్రతినిధి ఎంఎల్ఎస్ఆర్‌కె.ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం గన్నవరానికి చెందిన అరవింద్ హాస్పిటల్, భారతి కంటి ఆస్పత్రి, అవ్యాన్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్ వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు లయన్స్‌క్లబ్ కృషి చేస్తుందన్నారు. ఈ క్యాంప్‌లో మూత్రనాళాలు, కిడ్నీ, బీపీ, షుగర్, పిల్లలు, కంటి, ఎముకల వైద్య నిపుణులు 100 మందికిపైగా రోగులకు వైద్య సేవలందించినట్లు తెలిపారు. లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వజ్రాల కృష్ణారెడ్డి, సీహెచ్.వెంకటేశ్వరరావు, క్లబ్ ప్రతినిధులు దండమూడి శ్రీనివాసరావు, వై.సంజీవరావు పాల్గొన్నారు.

14న సరస్వతి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

పెనమలూరు: గంగూరు స్పిన్నింగ్ మిల్స్ ఆవరణలో సరస్వతి అమ్మవారి ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఈడుపుగంటి బుచ్చిబాబు తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ఈ నెల 14న ఉదయం 10.15 గంటలకు శ్రీవిద్యా సరస్వతీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందన్నారు. 12న దేవతహోమం, 13న చండీ హోమం, చండీ పారాయణ, సాయంత్రం హారతి, మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. 14న ప్రతిష్ఠ మహోత్సవం, అనంతరం అన్న సంతర్పణ నిర్వహిస్తామని చెప్పారు.













భక్త జనసంద్రం.. గుణదల పుణ్యక్షేత్రం

గత మూడు రోజులుగా జరుగుతున్న మేరీమాత శతాబ్ది ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. విదేశాలతో పాటు దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి లక్షలాది మంది క్రీస్తు విశ్వాసులు పుణ్యక్షేత్రానికి తరలివచ్చారు. దీంతో గుణదల కొండ భక్తజనసంద్రమైంది. ఫాదర్లు నిర్వహించిన సమష్టి దివ్యబలి పూజ కార్యక్రమంలో భక్తులు పాల్గొని దైవ సందేశాన్ని ఆలకించారు. దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో మరియతల్లి స్వరూపాన్ని భక్తులు దర్శించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

'తూర్పు కాపులకు అండగా ఉంటా'

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాజకీయంగా, సామాజికంగా ఉన్నత స్థానం
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



తూర్పు కాపుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న దేవినేని అవినాష్, వేదికపై తూర్పు కాపు నేతలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని తూర్పు కాపుల సంక్షేమంతో పాటు రాజకీయంగా, సామాజికంగా ఉన్నత స్థానం కల్పించింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. తన పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తూర్పు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేశారని చెప్పారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని తూర్పుకాపుల ఆత్మీయ సమావేశం ఆదివారం గురునానక్ కాలనీలోని ఎన్ఏసీ కల్యాణ మండపంలో జరిగింది.

తూర్పు కాపు సంక్షేమానికి సహకారం

సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. నాడు తన తండ్రి దేవినేని నెహ్రూకు విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని తూర్పు కాపు సోదరులు అందరూ వెన్నంటే నడిచారన్నారు. నేడు ఆయన తనయుడిగా మీరంతా నాకు మద్దతు తెలపడం చాలా సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో కూడా మీ మద్దతు ఇలాగే ఉండాలని, మీకు ఏ అవసరం వచ్చినా, తాను అండగా ఉంటానని అవినాష్ భరోసా ఇచ్చారు. తూర్పు కాపు సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన పేర్కొన్నారు. తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, రాష్ట్ర సీనియర్ నాయకుడు కడియాల బుచ్చిబాబు, ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొరివి చైతన్య(వర), తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇజ్జాడ తేజేష్, కార్పొరేటర్లు చలపతిరావు, బాల గోవింద్, నాయకులు లంకా అబ్బినాయుడు, సింహాచలం, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మధుర స్వరాల శాల ఘంటసాల



ఘంటసాల వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న చంద్రశేఖర్, నారాయణరావు తదితరులు

విజయవాడ కల్చరల్: మధుర స్వరాల శాల ఘంటసాల అని పద్మశ్రీ ఘంటసాల సంగీత కళావేదిక వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ అన్నారు. శ్రీ కళాభారతి, పద్మశ్రీ ఘంటసాల సంగీత కళావేదిక ఆధ్వర్యాన తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం సంగీత దర్శకుడు, గాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు 50వ వర్ధంతి సభను నిర్వహించారు. సభలో చంద్రశేఖర్ మాట్లాడుతూ ఘంటసాల సంగీత కళావేదిక ద్వారా యువతకు సంగీతంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఘంటసాల మాష్టారి గాన మాధుర్యాన్ని నేటితరం గాయనీ గాయకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ కృష్ణాజిల్లా కళల కాణాచి అని పేర్కొన్నారు. తెలుగు సినీ చరిత్రలో కృష్ణాజిల్లా స్థానం సుస్థిరమైనదని అన్నారు. హనుమంతరాయ గ్రంథాలయం అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు ఘంటసాల స్ఫూర్తివంతమైన జీవితం గడిపినట్లు తెలిపారు. కేంద్ర సాహిత్య అనువాద పురస్కార గ్రహీత డాక్టర్ వెన్నా వల్లభరావు, విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు, కళా సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, శ్యాంప్రసాద్, ప్రభల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా నలంద ఫేర్‌వెల్ వేడుకలు



ఎన్‌సీసీ కేడెట్లను అభినందిస్తున్న నలంద కరస్పాండెంట్ విజయబాబు, ప్రిన్సిపాల్ పద్మజ

లబ్బీపేట(విజయవాడతూర్పు): నలందలో విద్యాభ్యాసంతో బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుని రానున్న రోజుల్లో అద్భుత విజయాలు సాధించాలని ఆ స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ అన్నారు. ఆచార్య రంగా నగర్‌లోని నలంద విద్యానికేతన్ సెకండరీ విభాగంలో 9, 11 తరగతుల విద్యార్థులు ఆదివారం తమ సీనియర్లు అయిన 10, 12 తరగతుల విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాదల పద్మజ మాట్లాడుతూ నలందలో నేర్చుకున్న స్కిల్ డెవలప్‌మెంట్‌తో భవిష్యత్తుకు మంచి పునాది అని, విద్యార్థులు ఎన్నో అద్భుత విజయాలు సాధించాలన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో పాల్గొన్న 9వ తరగతి ఎన్‌సీసీ కేడెట్ ములుకుట్ల శ్రీహర్షకు స్కూల్ కరస్పాండెంట్ ఎ.విజయబాబు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సైనిక్‌లో ఎంపికైన 9వ తరగతి విద్యార్థిని తన్వీజైన్‌ను, ఇతర కార్యక్రమాల్లో విజేతలైన మరో ముగ్గురు విద్యార్థులను విజయబాబు అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిది

మీట్ ది ప్రెస్‌లో డాక్టర్ కేఏ పాల్



కేఏ పాల్‌ను సత్కరిస్తున్న ఏపీయూడబ్ల్యూజే బాధ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆర్ఎస్ఎస్ కబంధ హస్తాల్లో బీజేపీ చిక్కుకోవడంతో దేశం ప్రమాదకరమైన స్థితిలో ఉందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలోని ఏపీయూడబ్ల్యూజే భవన్‌లో ఆదివారం కేఏ పాల్‌తో మీట్ ది ప్రెస్ జరిగింది. కేఏ పాల్ మాట్లాడుతూ.. ప్రమాదకరమైన స్థితిలో ఉన్న దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డాక్టర్లు, ఐఏఎస్, ఐపీఎస్‌లు ఎంతో మంది సీనియర్లు ప్రజాశాంతి పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. 54 శాతం ఓటు బ్యాంకు ఉన్న పార్టీగా ప్రజాశాంతి పార్టీ నిలిచిందని చెప్పుకొచ్చారు. మోదీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రజారాజ్యం పార్టీని స్థాపించటం, దాన్ని కాంగ్రెస్‌లో విలీనం చేయటం వంటివి ఎందుకు చేశారని ప్రశ్నించారు. తాను అధికారంలోకి వస్తే రూ.10 లక్షల కోట్లు ఒక్క సమ్మిట్ ద్వారా తీసుకొచ్చి దేశాన్ని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతానన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన దగ్గరకు వచ్చి ఎకనామిక్ సమ్మిట్ పెట్టమని కోరితే తాను దానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ స్వస్థత పరచాలని ఆయన్ని పరామర్శించి ప్రార్థించానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తాను విశాఖపట్నం నుంచి పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఐజేయూ సభ్యుడు ఎస్‌కే బాబు, విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కంచల జయరాజ్, దాసరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ఆవిష్కరించారు. బందరు రోడ్డులోని ది కృష్ణాజిల్లా కోఆపరేటివ్ బ్యాంక్ ప్రాంగణంలో ఆదివారం జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ ఎస్ఎఫ్ఎల్ చైర్మన్, ఏపీ కోఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గౌతంరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సహకార రంగ బ్యాంకింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. దివంగత మహానేత వైఎస్సార్ రూ.2 వేల కోట్లు వెచ్చించి సహకార బ్యాంక్ వ్యవస్థను పునరుద్ధరిస్తే నేడు ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకార బ్యాంక్ రంగంలో నెలకొన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించారని తెలిపారు. అంతే కాకుండా జాతీయ బ్యాంక్ ఉద్యోగుల జీతాలకు సమానంగా సహకార బ్యాంక్ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నారన్నారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కోనేరు బాలాజీ ప్రసాద్ మాట్లాడుతూ.. సహకార బ్యాంక్ ఉద్యోగుల సర్వీస్‌ను 62 ఏళ్లకు పెంచాలని కోరారు.

వైభవంగా వాసవీ ఆత్మార్పణ పర్వదినం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి, నాయకులు



సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తున్న మహిళలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ పర్వదిన మహోత్సవం పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో వైభవంగా నిర్వహించారు. శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో వాసవీ అమ్మవారికి పలు విశేష పూజలు, అభిషేకాలను జరిపారు. అనంతరం ప్రత్యేక అలంకారం గావించారు. అమ్మవారికి స్వర్ణకిరీటాన్ని ధరింపజేశారు. వందలాది మహిళలతో సామూహిక కుంకుమార్చన, శాంతి హోమాన్ని నిర్వహించి అమ్మవారి ఆత్మార్పణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు. కొత్తగుళ్ల ప్రాంగణంలో విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలను, పూజలు చేశారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, యువజన సంఘం అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాసవీ సేవాదళ్, శ్రీ వాసవీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ పర్వదిన మహోత్సవం వైభవంగా జరిగాయి. కృష్ణానది నుంచి పవిత్ర నదీజాలాలను ఊరేగింపుగా తీసుకొచ్చి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని అభిషేకించారు. పాతబస్తీ లక్ష్మీనారాయణ ఆర్యవైశ్య కల్యాణమండపంలో జరిగిన ఈ మహోత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. శ్రీ లలితా సహస్రనామ సహిత కుంకుమార్చనలను, శ్రీవాసవీ హోమం జరిపారు. కార్యక్రమాలను ఫౌండేషన్ చైర్మన్ వీవీకే నరసింహారావు పర్యవేక్షించగా మాజీ కార్పొరేటర్ నూకల నాగేశ్వరరావు నాయకులు కొణిజేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వారంతా పీబీ సిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థులు. 1989–92 విద్యా సంవత్సరంలో పీబీ సిద్ధార్థ కళాశాలలో బీకామ్ చదువుకున్నారు. అప్పుడు బీకామ్ (చాలా సైలెంట్‌గా ఉండేవారు. 32 సంవత్సరాల తర్వాత ఆదివారం విజయవాడ నగరంలోని ఒక హోటల్‌లో కలుసుకుని, ఆనందంగా గడిపారు. కళాశాల తరగతి గదిలో చేసిన చిలిపి చేష్టలు, ఆనందక్షణాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషించారు. కుశల ప్రశ్నలు, కుటుంబ వివరాలను ఒకరినొకరు తెలుసుకుంటూ రోజంతా ఎంతో ఉత్సాహంగా గడిపారు. వచ్చే ఏడాది మరోసారి కలుసుకుందామంటూ వీడ్కోలు చెప్పుకున్నారు.

పవిత్రమైనది నర్సింగ్ వృత్తి

మధురానగర్(విజయవాడసెంట్రల్): పవిత్రమైనది నర్సింగ్ వృత్తి అని.. నర్సింగ్ విద్యార్థులు నైటింగేల్ స్ఫూర్తితో వైద్యసేవలు అందించాలని ఏపీ నర్స్ మిడ్‌వైఫ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ కే సుశీల పిలుపునిచ్చారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం ల్యాంప్‌లైటింగ్ అండ్ క్యాపింగ్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె నర్సింగ్ విద్యార్థులకు క్యాపింగ్ చేశారు.

భారతీయ సమాజానికి మూలం వేదం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు

విజయవాడరూరల్: వేద విజ్ఞానం వేలాది సంవత్సరాలుగా భారతీయ సమాజానికి దిశా నిర్దేశం చేస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు అన్నారు. కొత్తూరు తాడేపల్లిలో శ్రీ సుందర హనుమాన్ షణ్ముఖ వేద విద్యాలయం 21వ వార్షికోత్సవాల్లో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ భారతదేశంలో వేల ఏళ్లుగా వేద విజ్ఞానం పరఢవిల్లుతోందని పేర్కొన్నారు. విశ్వ మానవ శ్రేయస్సు కోసం దేవుడు వేదాలను సృష్టించారని వివరించారు. పరిశోధకులకు అంతుచిక్కని విద్య, వైజ్ఞానం, సామాజిక, ఆర్థిక పరమైన అంశాలు వేదాల్లో దాగున్నాయన్నారు. అజ్ఞానంలో ఉన్న మానవుడిని విజ్ఞానం వైపు నడిపేవి వేదాలేనన్నారు. వేద విద్య వ్యాప్తికి రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ విశేష కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి భారతీ కల్యాణ వేదిక ప్రారంభించారు. బ్రహ్మశ్రీ విష్ణుభట్ల లక్ష్మీనారాయణ, గోపిశెట్టి మల్లయ్య, తూనుగుంట్ల శ్రీనివాస్, గప్పగంతుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యం



విజయవాడకల్చరల్: భాషా, సంస్కృతి, సంప్రదాయాలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య, సంగీత కళాశాలలో సంగీత దర్శకుడు, గాయకుడు ఘంటసాల 50వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ తెలుగు జాతితోనూ సంగీతంతోనూ ఘంటసాల జీవితం ముడిపడి ఉందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఘంటసాల సంగీత కళాశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తి ఘంటసాల తెలుగు వారి ఆరాధ్యదైవమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుభొట్ల కృష్ణవేణి మాట్లాడుతూ ఘంటసాల సంగీత కళాశాల జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుందని వెల్లడించారు. విలువలతో కూడిన విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. తొలుత ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంగీత అధ్యాపకులు లక్ష్మీనరసమ్మ, శోభాలక్ష్మి, అమృతకుమార్, సిబ్బంది సుభానీ, అప్పారావు, ఘంటసాల అభిమాన సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

ఆర్బీకేలపై నిత్యం ఏడుపే

గ్రామస్థాయిలో 10,778 ఆర్బీకేల ఏర్పాటు • రైతుల గడప వద్దకే సాగు ఉత్పాదకాలు

- విత్తు నుంచి విక్రయం వరకు రైతుసేవలో నిమగ్నం
- జాతీయ, అంతర్జాతీయ ప్రశంసలు, అవార్డులు, రివార్డులు
- 10,252 ఆర్బీకేల నూతన భవనాల నిర్మాణానికి చర్యలు
- ఇప్పటికే వినియోగంలోకి 4,554 భవనాలు
- మార్చిలోగా మిగిలినవి పూర్తి
- ఇంటర్నెట్‌తో సహా సకల సదుపాయాలు
- స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం
- అయినా అదే పనిగా విషం కక్కుతున్న ఈనాడు


రైతు సేవ వట్టిదే.. భరోసా దక్కదే!

సాక్షి, అమరావతి: రైతుకు అడుగడుగునా అండగా నిలిచి, వారిని చేయిపట్టి నడిపించే లక్ష్యంతో రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే) వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అన్ని విధాలా అండగా నిలిచిన ఆర్బీకేలు దేశానికే ఆదర్శంగా నిలుస్తుంటే.. వాటి సేవలను రైతులకు దూరం చేయడమే లక్ష్యంగా ఈనాడు దినపత్రిక నిత్యం విషం కక్కుతోంది. ఏపల్లెకు వెళ్లినా సకల సౌకర్యాలతో ఆర్బీకేలు స్వాగతం పలుకుతుండడాన్ని.. రైతులు వీటి సేవలను కొనియాడుతుండడాన్ని ఓర్వలేక అదే పనిగా బురద జల్లే కార్యక్రమం చేపట్టింది. తాజాగా 'రైతు సేవ వట్టిదే.. భరోసా దక్కదే..!' అంటూ అబద్ధాలు అచ్చేసింది.

ఆరోపణ: వేధిస్తోన్న సిబ్బంది కొరత

వాస్తవం: గ్రామ స్థాయిలో ఏర్పాటైన 10,778 ఆర్బీకేల్లో 14,323 మంది సిబ్బందితో పాటు 1,573 మంది ఎంపీఈవోలు సేవలందిస్తున్నారు. ప్రతీ ఆర్బీకేకు గ్రామ వలంటీర్‌తో పాటు బ్యాంకింగ్ కరస్పాండెంట్‌ను అనుసంధానం చేశారు. సిబ్బంది కొరతను అధిగమించేందుకు రేషనలైజేషన్ చేస్తున్నారు. పశుసంవర్ధక శాఖ పరిధిలో రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయగా, 1896 మంది అవసరమని గుర్తించి ఆ పోస్టుల భర్తీ చేపట్టారు. ఇటీవలే ఫలితాలు విడుదల చేయగా, ఎంపికైన వారికి అపాయింట్‌మెంట్‌లు ఇస్తున్నారు. నెలకు రూ.12వేల వేతనంతో తాత్కాలిక సిబ్బంది(ఎంపీఈవో)ని రెండు దఫాలుగా నియమించి శాశ్వత ఉద్యోగాలు కల్పించారు. ఇప్పటి వరకు ఏ ఒక్కర్ని ప్రభుత్వం తొలగించిన దాఖలాలు లేవు.

ఆరోపణ: లక్ష్యాల పేరిట సిబ్బందిపై ఒత్తిళ్లు

వాస్తవం: వివక్షకు తావులేకుండా అడిగిన ప్రతీ రైతుకు సర్టిఫైడ్ సాగు ఉత్పాదకాల పంపిణీ, సాగులో సలహాలు, సూచనలు, ఈ–క్రాప్ బుకింగ్, సంక్షేమ పథకాల అమలు, ధాన్యంతో సహా ఇతర పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. వీరిపై అదనపు బాధ్యతలు మోపకుండా స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా పనిచేసుకునే వాతావరణాన్ని సృష్టించిందే తప్ప లక్ష్యాల పేరిట ఏ ఒక్కర్ని ఒత్తిడికి గురిచేసిన దాఖలాలు లేవు. అలా అని ఏ ఒక్క సిబ్బంది ఫిర్యాదు చేసిన ఘటనలు లేవు. సిబ్బందికి సచివాలయ శాఖ నుంచి సకాలంలో జీతభత్యాలు చెల్లిస్తున్నారు. మండల అధికారుల సిఫార్సుతో సెలవులు మంజూరు చేస్తున్నారు. రోజు మొత్తంలో ఏ సమయంలోనైనా హాజరు వేసే వెసులుబాటు కల్పించారు. సిబ్బంది అంతర్గత బదిలీలకు ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న 186 మందిని వారు కోరుకున్న చోటకు బదిలీ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసారు.

ఆరోపణ: అద్దె భవనాలే దిక్కు

వాస్తవం: 526 గ్రామాల్లో సొంత భవనాలుండగా, 10,252 గ్రామాల్లో రూ.2,260 కోట్ల అంచనాతో కొత్త భవనాలను నిర్మిస్తున్నారు. ఇప్పటికే రూ.1090.23 కోట్లతో నిర్మించిన 4,554 ఆర్బీకే భవనాలను వ్యవసాయ శాఖకు అప్పగించారు. వీటిలో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.357 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన వాటిని మార్చిలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సాగు ఉత్పాదకాల బుకింగ్‌తో పాటు ఎప్పటికప్పుడు వాతావరణ, మార్కెట్ సమాచారం తెలుసుకునేందుకు వీలుగా 9,484 ఆర్బీకేల్లో కియోస్క్‌లను.. వీటి పనితీరు పర్యవేక్షణకు ప్రత్యేక డాష్‌బోర్డును ఏర్పాటు చేశారు.

ఆరోపణ: అద్దెలు, బిల్లులు, ఇంటర్నెట్ చార్జీలేవీ?

వాస్తవం: అద్దె భవనాల్లో ఉన్న 3,830 ఆర్బీకేలకు అద్దెల రూపంలో రూ.43 కోట్లు ఖర్చుచేయగా, వచ్చే మార్చి వరకు అద్దెల నిమిత్తం సర్దుబాటు చేసేందుకు మరో రూ.32.98 కోట్లు విడుదల చేశారు. ఇప్పటికే రూ.22.98 కోట్లు భవన యజమానుల ఖాతాలకు జమ చేశారు. మిగిలిన మొత్తం చెల్లించేందుకు ఏర్పాట్లు చేశారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లుల కోసం రూ.12 కోట్లు విడుదల చేయగా.. వచ్చే మార్చి వరకు బిల్లుల చెల్లింపునకు అవసరమయ్యే బడ్జెట్‌ను నేరుగా విద్యుత్ శాఖకే కేటాయించేలా ఉత్తర్వులిచ్చారు. స్టేషనరీ కోసం రూ.3 కోట్లు విడుదల చేయగా, స్టేషనరీ కోసం ఖర్చు చేసిన సిబ్బందికి నేరుగా రూ.53.48 లక్షలు జమ చేసారు. స్థానికంగా అందుబాటులో ఉన్న హైస్పీడ్ ఇంటర్నెట్ నెట్‌వర్క్ సదుపాయాన్ని సమకూర్చేందుకు రూ.23 కోట్లు విడుదల చేశారు. వైఎస్సార్ రైతు భరోసా మాస పత్రిక కోసం ఆర్బీకే స్థాయిలో అవగాహన కల్పించి ఔత్సాహిక రైతులు చందాదారులుగా చేర్చే కార్యక్రమం చేపట్టారే తప్ప వీటి కోసం సిబ్బందికి ఎలాంటి టార్గెట్లు విధించలేదు.

ఆరోపణ: ఆర్బీకేలకు ఆదరణ కరువు

వాస్తవం: అదును దాటక ముందే.. సర్టిఫై చేసిన నాణ్యమైన సాగు ఉత్పాదకాలను బుక్ చేసుకున్న 24 గంటల్లోపే రైతులకు అందిస్తున్నారు. తొలి ఏడాది(2020–21) 1.07 లక్షల టన్నుల ఎరువుల విక్రయాలు జరగ్గా, 3వ ఏడాది (2022–23) 4 లక్షల టన్నులకు అమ్మకాలు చేరాయి. తొలి ఏడాదిలో 2.55 లక్షల మంది ఎరువులు తీసుకుంటే.. గతేడాది 10.90 లక్షల మంది తీసుకున్నారు. 2023–24లో ఇప్పటివరకు 8.95లక్షల మంది రైతులు 3.89 లక్షల టన్నుల ఎరువులు తీసుకున్నారు. ఆర్బీకే ద్వారా అమ్మే ఎరువుల రవాణా, నిల్వ, అమ్మకానికి కావాల్సిన సదుపాయాల భారం పూర్తిగా ప్రభుత్వమే భరిస్తోంది. మరొక వైపు 34.27 లక్షల క్వింటాళ్ల విత్తనాలను రూ.1,040.39 కోట్ల రాయితీతో 58.74 లక్షల మంది రైతులకు, నాన్ సబ్సిడీ కేటగిరీ కింద రూ.13.90 కోట్ల విలువైన 1,784.47 క్వింటాళ్ల పత్తి, మిరప, సోయాబీన్ తదితర విత్తనాలను 44వేల మంది రైతులకు సరఫరా చేశారు. 2020–22 మధ్య 1.51 లక్షల మందికి రూ.14 కోట్ల విలువైన 1.36 లక్షల లీటర్ల పురుగు మందులను పంపిణీ చేయగా, ఈ ఏడాది ప్రస్తుత రబీలో ఇప్పటికే రూ.18.57లక్షల విలువైన 1657 లీటర్ల పురుగుల మందులను 6వేల మంది రైతులకు పంపిణీ చేశారు. ఆర్బీకేలు లాభాపేక్షతో కూడిన వాణిజ్య కేంద్రాలు కాదు. రైతులకు గ్రామ స్థాయిలో ఏర్పాటైన సేవా కేంద్రాలన్న విషయాన్ని గుర్తించుకోవాలి. ఆర్బీకేల ద్వారా ఎరువులు, పురుగుల మందుల అమ్మకాలు వ్యాపారం కాదు..ఒక సదుపాయం మాత్రమే. కేంద్రంతో పాటు పలు రాష్ట్రాలు, ఇథియోపియా, బంగ్లాదేశ్, జర్మనీ, వియత్నాం వంటి విదేశీ ప్రతినిధుల బృందాలు ఆర్బీకే సేవలను శ్లాఘిస్తున్నాయి. అనతికాలంలోనే అవార్డులు, రివార్డులతో పాటు ప్రపంచ స్థాయి ఖ్యాతి గడించిన ఆర్బీకేలపై ఈనాడు విషం కక్కడం పట్ల రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఆనంద 'ఖేలి'

తుది దశకు 'ఆడుదాం ఆంధ్ర'

- టైటిల్‌కు చేరువలో జట్లు
- పురుష క్రికెట్ మినహా అన్ని క్రీడల ఫైనల్స్ నేడే
- ఉత్సాహంగా సిద్ధమవుతున్న క్రీడాకారులు


ఏయూ మైదానంలో హోరాహోరీగా ఖోఖో

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్రప్రభుత్వం యువతను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్లు టైటిల్ పోరుకు చేరువయ్యాయి. గ్రామ/వార్డు స్థాయి జట్లు ఐదు దశల్లో కొనసాగుతూ చివరిదైన రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాయి. విశాఖ వేదికగా ఈ పోటీలు జరుగుతుండగా 26 జిల్లాల జట్లు తలపడుతున్నాయి. ఒక్క మెన్ క్రికెట్ టైటిల్ పోరు మినహా మిగిలిన వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో ఫైనల్స్ సోమవారం జరగనున్నాయి. మహిళల కేటగిరీలో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో ఫైనల్స్ సోమవారమే నిర్వహించనున్నారు. విశాఖలోని ఆరు వేదికల్లో పోటీలు జరుగుతున్నాయి. వైఎస్సార్ బీ గ్రౌండ్‌తో పాటు ఏఎంసీ, స్టీల్ ప్లాంట్ గ్రౌండ్, కేవీకే గ్రౌండ్లలో క్రికెట్ పోటీలు జరుగుతుండగా వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలకు ఏయూ, బ్యాడ్మింటన్ పోటీలకు జీవీఎంసీ ఇండోర్ ఎన్‌క్లేవ్‌లు వేదికలుగా నిలిచాయి. ఖోఖో పురుష, మహిళా విభాగాల్లో ఆదివారం ప్రీక్వార్టర్ ఫైనల్స్ ముగియగా విజయం సాధించిన జట్లు క్వార్టర్స్‌కు అర్హత సాధించాయి. మిగిలిన అన్ని పోటీలూ సోమవారం పూర్తికానున్నాయి. మహిళా క్రికెట్‌లో తొలి సెమీస్ ముగియగా రెండో సెమీస్ జరగనుంది. విజయం సాధించిన జట్లు ఫైనల్స్ సోమవారం ఆడనున్నాయి. పురుషుల క్రికెట్ విభాగంలో రెండు జట్లు సెమీస్‌కు చేరుకోగా మరో రెండు క్వార్టర్‌ఫైనల్స్ జరగాల్సి ఉంది. గెలిచిన జట్లు సెమీస్‌కు అర్హత సాధించిన జట్లతో తలపడనున్నాయి. అనంతరం ఫైనల్స్ ఈనెల 13న రాష్ట్ర ముఖ్యమంత్రి సమక్షంలో వైఎస్సార్ స్టేడియంలో జరగనుంది. బ్యాడ్మింటన్ పురుష, మహిళా విభాగాల్లో సెమీస్‌లో విజయం సాధించిన జట్లు సోమవారం ఫైనల్స్ ఆడనున్నాయి. వాలీబాల్ మహిళా, పురుష విభాగాల్లోనూ రెండేసి జట్లు ఇప్పటికే సెమీస్‌కు చేరుకోగా విజయం సాధించినవి ఫైనల్స్‌లో తలపడనున్నాయి. మొత్తమ్మీద పురుష క్రికెట్ మినహా.. మిగతా అన్ని క్రీడాంశాలను సోమవారంతో ముగించాలని నిర్వాహకులు షెడ్యూల్ ఖరారు చేశారు. ఐదు క్రీడాంశాల్లో విజేతలతోపాటు రన్నరప్, సెకండ్ రన్నరప్ జట్లు ట్రోఫీలతోపాటు భారీ నగదు ప్రోత్సాహకాలను అందుకోనున్నాయి.

చివరి రోజు తలపడనున్న జట్లు ఇవే..

మహిళా క్రికెట్: తొలి సెమీస్‌లో పల్నాడు జట్టుపై ఎన్టీఆర్ జిల్లా జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది. మూడో స్థానం కోసం సోమవారం జరిగే పోటీలో పల్నాడు జట్టు ఆడనుంది. టోర్నీ 19వ మ్యాచ్‌గా రెండో సెమీస్ తూర్పుగోదావరి, తిరుపతి జట్ల మధ్య సోమవారం జరగనుంది. గెలిచిన జట్టు ఫైనల్స్‌లో ఎన్టీఆర్ జిల్లా జట్టుతో ఆడనుంది. ఓడిన జట్టు మూడోస్థానం కోసం పల్నాడు జిల్లా జట్టుతో తలపడుతుంది.

పురుష క్రికెట్: సెమీస్‌కు ఏలూరు, తూర్పుగోదావరి జట్లు చేరుకోగా క్వార్టర్ ఫైనల్స్‌లో గుంటూరుతో వైఎస్సార్ కడప, అనంతపురంతో ఎన్టీఆర్ జట్లు తలపడనున్నాయి. విజయం సాధించిన జట్లు సెమీస్‌కు అర్హత సాధించనున్నాయి.

మహిళా బ్యాడ్మింటన్: సెమీస్‌లో కర్నూలుతో బాపట్ల జట్టు తలపడనుండగా పశ్చిమగోదావరి జట్టు సెమీస్‌కు చేరుకుంది.

పురుష బ్యాడ్మింటన్: సెమీస్‌లో తిరుపతితో వైఎస్సార్ కడప జట్టు, ఏలూరుతో పల్నాడు జట్టు తలపడనున్నాయి. గెలిచిన జట్లు ఫైనల్స్ ఆడనుండగా ఓడిన జట్లు మూడోస్థానానికి పోటీపడనున్నాయి.

మహిళా వాలీబాల్: సెమీస్‌కు అన్నమయ్య జట్టుతోపాటు విశాఖ జట్టు చేరుకున్నాయి. క్వార్టర్‌ఫైనల్స్ చివరి రెండు మ్యాచ్‌లలో గెలిచిన జట్లు సెమీస్‌కు అర్హత సాధించనున్నాయి.

పురుష వాలీబాల్: క్వార్టర్ ఫైనల్స్‌లో విజయంతో అనకాపల్లి, పార్వతీపురం మన్యం జట్లు సెమీస్‌కు అర్హత సాధించగా వీటితో తలపడేందుకు క్వార్టర్ ఫైనల్స్‌లో చివరి రెండు మ్యాచ్‌లు గెలిచిన జట్లు సిద్ధపడనున్నాయి.

మహిళా కబడ్డీ: సెమీస్‌లో అనకాపల్లి జట్టుతో ప్రకాశం జట్టు, అనంతపురం జట్టుతో విశాఖ జట్టు తలపడనున్నాయి. విజయం సాధించిన జట్లు ఫైనల్స్‌కు అర్హత సాధించనుండగా ఓడిన జట్లు మూడోస్థానానికి పోటీ పడనున్నాయి.

పురుష కబడ్డీ: క్వార్టర్‌ఫైనల్‌లో విశాఖ జట్టుతో కర్నూలు జట్టు తలపడనుంది.

మహిళా ఖోఖో: క్వార్టర్‌ఫైనల్స్‌లో అనకాపల్లితో కృష్ణా, ప్రకాశంతో ఏలూరు, కాకినాడతో నెల్లూరు, విజయనగరంతో అనంతపురం జట్లు తలపడనున్నాయి. విజయం సాధించిన జట్లు సెమీస్‌కు అర్హత సాధించనున్నాయి.

పురుష ఖోఖో: క్వార్టర్‌ఫైనల్స్‌లో కాకినాడతో ప్రకాశం, కర్నూలుతో కృష్ణా, అనంతపురంతో బాపట్ల, శ్రీకాకుళంతో అనకాపల్లి జట్లు తలపడనున్నాయి. విజయం సాధించిన జట్లు సెమీస్‌కు చేరుకోనున్నాయి.

సోషల్ మీడియాలో.. 504 కోట్ల మంది



సాక్షి, అమరావతి: ప్రపంచాన్ని సోషల్ మీడియా ఊపేస్తోంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాలోని వివిధ యాప్‌లలో గంటలు గంటలు గడిపేస్తున్నారు. గ్లోబల్ వెబ్ ఇండెక్స్ పరిశోధన ప్రకారం.. ప్రపంచ జనాభాలో ఏకంగా 62.30 శాతం మంది సోషల్ మీడియాను వినియోగిస్తున్నట్లు తేలింది. గతేడాదితో పోలిస్తే 26.60 కోట్ల మంది కొత్త వినియోగదారులు సోషల్ మీడియాలోకి వచ్చినట్లు నివేదిక పేర్కొంది. మొత్తంగా యూజర్ల సంఖ్య 504 కోట్లకు చేరిందని వెల్లడించింది. వీరిలో 46.50 శాతం మంది మహిళలు, 53.50 శాతం మంది పురుషులు ఉన్నారు. సగటున ఒక వ్యక్తి రోజువారీ సోషల్ మీడియా వినియోగం 2.23 గంటలుగా నమోదయ్యింది. ఇక ఇంటర్నెట్ ఉపయోగిస్తున్న వారిలో అత్యధికంగా 94.20 శాతం మంది సోషల్ మీడియాలోనే ఉంటున్నారని నివేదిక పేర్కొంది.

అమెరికాలో యూట్యూబ్ టాప్

గతంలో సగటున ఒక వ్యక్తి సోషల్ మీడియా ప్లామ్‌ఫారమ్‌ల వినియోగం 6.9 శాతంగా ఉంటే ఇప్పుడు 6.7 శాతానికి తగ్గడం విశేషం. మరోవైపు టాప్–4 సోషల్ మీడియా ప్లామ్‌ఫారమ్‌లలో మూడు 'మెటా'కు చెందినవే ఉన్నాయి. అగ్రస్థానంలో ఫేస్‌బుక్, యూట్యూబ్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ కొనసాగుతున్నాయి. అమెరికాలో మాత్రం ఫేస్‌బుక్‌ను వెనక్కి నెడుతూ యూట్యూబ్ ఎక్కువ మంది వినియోగదారులను ఆకర్షించింది.

జిల్లా వార్తలు

తూర్పులో టీడీపీకి షాక్

- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు
- టీఎన్‌టీయూసీ నాయకుడు గోర్ల గోవింద్, అనుచరులు పార్టీలో చేరిక
- పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన దేవినేని అవినాష్


వైఎస్సార్ సీపీ కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దేవినేని అవినాష్, పూనూరు గౌతమ్‌రెడ్డి

కృష్ణలంక(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. భారీ సంఖ్యలో ఆటో కార్మికులు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు గోర్ల గోవిందు నాయకత్వంలో 150 ఆటో కార్మిక కుటుంబాల సభ్యులు వైఎస్సార్ సీపీలో చేరారు. కృష్ణలంక, 22వ డివిజన్‌లోని సత్యంగారి హోటల్ సెంటర్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో వారందరికీ అవినాష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం అవినాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వానికి మద్దతు తెలుపుతూ పార్టీలో చేరడం శుభపరిణామం అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజకంగా పరిపాలన అందిస్తున్నారని చెప్పారు. ప్రజల మద్దతుతో రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని తెలిపారు. రూ.650 కోట్లతో తూర్పు నియోజకవర్గం అభివృద్ధి చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. కులం, మతం, పార్టీలు చూడకుండా సచివాలయం వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే పథకాలు అందిస్తున్నామన్నారు.

గ్యారంటీ ఇప్పుడు ఎలా ఇస్తారు...?

భవిష్యత్ గ్యారంటీ అని చంద్రబాబు అంటున్నారని, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసినప్పుడు ఇవ్వలేని గ్యారంటీ ఇప్పుడు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు ఎన్ని అబద్ధపు ప్రచారాలు, కుట్రలు చేసినా మరో 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఉంటారని తెలిపారు. కొత్త, పాత నాయకుల కలయికలో తూర్పు నియోజకవర్గంలో వైస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామన్నారు. గోర్ల గోవింద్ మాట్లాడుతూ 16 ఏళ్లుగా టీడీపీకి కష్టపడి పనిచేస్తున్నా ఎటువంటి గుర్తింపు ఇవ్వకపోగా అవమానం జరగడంతో పార్టీని వీడినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ సిద్ధాంతాలు, ప్రభుత్వం అమలు సంక్షేమ పథకాలు, అవినాష్ మంచితనానికి ఆకర్షితుడినై పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో పట్నాల చిరంజీవి, పి.శ్రీను, సరస్వతి రాజు, భూపతి, యేసు, రాము, సత్తిబాబు, నూకరాజు, రమణ, నాగేష్, చిన్నా, రాజు, సింహాచలం, వరాలరావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి, కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొరివి చైతన్య, గాంధీ కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ జోగా రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పులిపాటి దుర్గారెడ్డి, కసగాని దుర్గారావు, మీర్ హుస్సేన్, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, టీపీ రెడ్డి, సుబ్బారెడ్డి, పవన్, దర్గా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ అంబేడ్కర్ కలలు నిజం చేస్తున్న సీఎం జగన్

ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్



అంబేడ్కర్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విక్టర్ ప్రసాద్, ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అందరికి చెందిన వ్యక్తిగా చేయడమే ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనతో చెప్పారని... ఆ మాటకు కట్టుబడి నేడు ఆయన ఆ దిశగా అడుగులు వేయడం చాలా గర్వకారణంగా ఉందని ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. సింగ్‌నగర్ అమెరికన్ హాస్పటల్ వద్ద ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ గ్రంథాలయం, విగ్రహ పునఃప్రతిష్టాపన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ముందుగా ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. రిబ్బన్ కట్‌చేసి గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని నిర్మించేందుకు డాక్టర్ అంబేడ్కర్ ఎన్నో నిందలు, అవమానాలు ఎదుర్కోవడంతో పాటు ఎన్నో పోరాటాలు చేశారన్నారు. మన దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, నిరుపేదలు ఎదుర్కొంటున్న అంటరానితనాన్ని, వెనకబాటుతనాన్ని రూపుమాపేందుకు ఆయన చేసిన కృషి యావత్ ప్రపంచానికి ఆదర్శనీయమని కొనియాడారు. భారత రాజ్యాంగాన్ని పూర్తిచేసిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కోరారు.

దేశానికే వన్నె తెచ్చేలా అంబేడ్కర్ విగ్రహం

అంబేడ్కర్ కన్న కలలను నిజం చేసి చూపుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మన దేశానికే వన్నె తెచ్చేలా విజయవాడలో ఏర్పాటుచేసిన భారీ అంబేడ్కర్ విగ్రహ ప్రతిమే దీనికి నిలువెత్తు నిదర్శనమన్నారు. అంబేడ్కర్ చెప్పినట్టుగా నిరుపేదలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, ఉండడానికి సొంతిల్లు, అన్ని రంగాలలో సమాన హక్కులను మన సీఎం జగనన్న కల్పిస్తున్నారని చెప్పారు. అంబేడ్కర్ జాతిగా చెప్పిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు జగనన్నకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ రుహుల్లాలు మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన ఆశయాలను సాధించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తుందన్నారు. సింగ్‌నగర్ ప్రాంతంలో అంబేడ్కర్ విగ్రహాన్ని, గ్రంథాలయాన్ని ఏర్పాటుచేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం అతిథులను విగ్రహ కమిటీ సభ్యులు సన్మానించారు. విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ నాగేశ్వరరావు, విగ్రహదాత రెబ్బా చంద్రరావు, డాక్టర్ రెబ్బా అంబేడ్కర్, లైబ్రరీ దాత అవుతు శ్రీనివాసరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అభ్యుదయ సేవా సమితి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాషకు వన్నె తెచ్చిన శ్రీకృష్ణదేవరాయలు


శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఆలయ ఏసీ చక్రధరరావు


నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

- వైభవంగా శ్రీకృష్ణదేవరాయల తెలుగు జైత్రయాత్ర మహోత్సవం
- ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళంలో శ్రీకృష్ణదేవరాయల తెలుగు జైత్రయాత్ర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ ఉత్సవాలను ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుభాషకు వన్నెతెచ్చిన మహానుభావుడు శ్రీకృష్ణదేవరాయలు అని కొనియాడారు. తెలుగుభాషను వ్యాప్తి చేసేలా శ్రీకృష్ణదేవరాయలు కృషి చేశారని చెప్పారు. ఈ సందర్భంగా కొంతమంది చిన్నారులతో ఆయన అక్షరాభ్యాసం చేయించారు. ఉదయం మహిళలకు సంప్రదాయ ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా 11 మంది వృద్ధ కళాకారులను సత్కరించారు. గుంటూరుకు చెందిన కేకే తరంగిణి ఈవెంట్స్ అధినేత, ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ కాసుల కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి, భక్తి రంజని కార్యక్రమం వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అభినవ నాట్య అకాడమీ కేవీ జ్యోతి శిష్య బృందంచే ప్రదర్శించిన కూచిపూడి నాట్య ప్రదర్శన, చిన్నారులకు ఆటల పోటీలు, తంబోల, హౌసీ పోటీలు, శ్రీకృష్ణదేవరాయలు, కాసుల పురుషోత్తమ కవి వేషధారణ, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఇంటర్మీడియట్ జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 20వ తేదీ వరకూ ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. ఇప్పటికే ఇంటర్ (ఒకేషనల్) విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కాగా ఆదివారం నుంచి ఎంపీసీ, బైపీసీ తదితర జనరల్ కోర్సులను అభ్యసించే విద్యార్థుల ప్రాక్టికల్స్‌ను అధికారులు ప్రారంభించారు. కృష్ణా జిల్లాలో ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి 16150 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. విద్యార్థులకు 77 కళాశాల్లో 131 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఎంపీసీకి సంబంధించిన 10,530 మంది విద్యార్థులు, బైపీసీకి సంబంధించి 5,620 మంది మొత్తం 16,150 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు 70,200 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్నారు. జనరల్ ప్రాక్టికల్ పరీక్షలకు 134 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రతి రోజూ ఉదయం తొమ్మిది నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ జరుగుతాయి.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ విజయ్ ఆదిత్య


మాట్లాడుతున్న విజయ్ ఆదిత్య

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పిల్లలకు చదువుతో పాటుగా సంస్కృతి, మానవ విలువలు గురించి పెద్దలు తెలియజేయాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం (ఆర్ఎస్ఎస్) ఆంధ్రప్రదేశ్ ప్రాంత ప్రచారక్ విజయ్‌ఆదిత్య చెప్పారు. సేవా భారతి ఆధ్వర్యంలో సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం బాలమేళా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యవక్తగా విజయ్ ఆదిత్య హాజరై విద్యార్థులను ద్దేశించి మాట్లాడారు. విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోగలమని చెప్పారు. సేవా భారతి ఆధ్వర్యంలో మురికి వాడల్లోని పిల్లలకు ఉచితంగా ప్రైవేటులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి అనేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. యు బ్లడ్ యాప్ ఫౌండర్ యలమంచిలి జగదీష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. యువత రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం అంటే ప్రాణదానంతో సమానమని, అందుకోసమే తాము యు బ్లడ్ అనే యాప్‌ను రూపొందించామని పేర్కొన్నారు. ముంబయికి చెందిన ఎండీఎల్ సంస్థ ప్రతినిధి వికాస్ కౌశిక్ మాట్లాడుతూ సేవా భారతి చేస్తున్న కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. సుజై బయోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆసక్తిని గమనించి ఆ రంగంలో ప్రోత్సహిస్తే ఉన్నత స్థాయికి చేరుకుంటారని చెప్పారు. సేవాభారతి అధ్యక్షుడు డాక్టర్ వై.సాయి కిషోర్, కార్యదర్శి ఎంఎస్.శేఖర్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా సేవా భారతి ఆధ్వర్యంలో మురికివాడల్లోని పిల్లలకు అభ్యాసిక పేరుతో ఉచితంగా ట్యూషన్లు చెబుతున్నామన్నారు. బాలమేళా సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి.

ఎవరితో కలిసినా.. ఎవరిని వదిలేసినా.. ఏం చేసినా

నా ప్రయోజనాలే రాష్ట్ర ప్రయోజనాలు

చంద్రబాబు అవకాశవాద రాజకీయాలకు 'రాష్ట్రం' ముసుగు

పవన్, బీజేపీ, కాంగ్రెస్... ఎవరితో కలిసినా, విడిపోయినా ఇదే మాట • స్వప్రయోజనాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నక్కజిత్తులు

- 1999తో వాజ్‌పేయితో కలిసినప్పుడు రాష్ట్ర హితం కోసమేనంటూ హడావుడి
- విడిపోయాక మతతత్వ పార్టీతో కలిసి తప్పు చేశానని పశ్చాత్తాపం
- 2014లో పాజిటివ్ ఓటు కోసం మళ్లీ రాష్ట్ర ప్రయోజనాలంటూ బీజేపీతో పొత్తు- 2019లో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే విడిపోయానంటూ డాంబికాలు
- మళ్లీ ఇపుడు రాష్ట్ర ప్రయోజనాలకోసమే బీజేపీతో కలిసే ప్రయత్నాలంటూ వ్యాఖ్యలు

సాక్షి, అమరావతి : ఈ మధ్య 'శరణు... శరణు' అంటూ బీజేపీతో పొత్తులు కుదుర్చుకోవటానికి చంద్రబాబు నాయుడు ఢిల్లీకి వెళ్లినపుడు ఎల్లో మీడియా మొత్తం ఒకటే రచ్చ. చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఢిల్లీకి వెళ్లారని, రాష్ట్ర హితం కోసం కాస్త తగ్గి అయినా బీజేపీతో పొత్తు పెట్టుకోవాలన్నది ఆయన ఉద్దేశమని!!. మరో పచ్చపత్రిక హద్దులన్నీ దాటేసి.. నారా వారు గెలవటం రాష్ట్రానికి చారిత్రక అవసరమని తేల్చిచెప్పేసింది!.

ఒక్కటి మాత్రం నిజం. జనం నవ్విపోతారన్న సిగ్గు బాబుకు, ఆయన మీడియాకు కాస్తయినా లేదు. ఎన్ని పనికిమాలిన పనులు చేసినా, ఎన్ని అపవిత్ర పొత్తులు పెట్టుకున్నా.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమేనని, రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని జనాన్ని నమ్మించడానికి బాబు, ఆయన ముఠా నిస్సిగ్గుగా ప్రయత్నిస్తున్నారంటే... ఎవ్వరినైనా మేనేజ్ చేయగలమన్న వీళ్ల తెంపరితనమే కారణమనుకోవాలి.


నీచపు ఎత్తుగడల్లో వేరెవ్వరికీ సాధ్యం కాని చారిత్రక ట్రాక్ రికార్డు చంద్రబాబు నాయుడిది. ఎందుకంటే ఆయన ఇప్పటిదాకా భారతీయ జనతా పార్టీతో రెండుసార్లు కలిశారు... రెండుసార్లు విడిపోయారు. మళ్లీ మూడోసారి కలవటానికి కాళ్ల బేరంతో సహా అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారిప్పుడు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌తోనూ ఇలాంటి బంధమే. 2014లో కలిశారు... 2019లో విడిపోయారు. మళ్లీ ఇపుడు కలిసిపోయారు. ఆఖరికి తన జన్మ విరోధి కాంగ్రెస్‌తోనూ 2019 తెలంగాణ ఎన్నికల్లో ప్రత్యక్ష పొత్తు పెట్టేసుకున్నారు. ఈసారి మాత్రం తెలంగాణతో పాటు ఏపీలోనూ పరోక్ష పొత్తుతో లాగిస్తున్నారు. ఇవన్నీ చూస్తే ఎవ్వరికైనా ''ఛీ.. అధికారం కోసం మరీ ఇంతలా దిగజారిపోవాలా?'' అనిపించకమానదు. కానీ బాబు పెంచి పోషిస్తున్న ఎల్లో మీడియా మాత్రం దీన్ని మరో కోణంలో చూపించడానికి ప్రయత్నిస్తోంది. ఎప్పటికప్పుడు బాబు చేసిన ఇలాంటి దిగజారుడు పనులన్నిటికీ 'రాష్ట్ర ప్రయోజనాల కోసమే' అనే ముసుగు వేస్తోంది. ప్రజాస్వామ్యం కోసం, రాష్ట్ర హితం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో బాబు ఇవన్నీ చేశారనే కలర్ ఇవ్వటానికి ప్రయత్నిస్తోంది. బాబు కూడా.. రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీతో కలిసే ప్రయత్నం చేస్తున్నట్లు పార్టీ నేతల సమావేశంలో చెప్పారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో తన సొంత ప్రయోజనం కోసం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ ఆయన రాష్ట్రం కోసం, ప్రజల కోసమే తీసుకున్న నిర్ణయాలుగా వివరించే ప్రయత్నాన్ని చూసి పార్టీ నేతలే నివ్వెరపోవాల్సి వచ్చిందని సమాచారం.

ఆది నుంచి స్వప్రయోజనాలే పరమావధి...

కాంగ్రెస్ పార్టీతో రాజకీయ జీవితాన్ని మొదలుపెట్టిన చంద్రబాబు... ఆ పార్టీ ఓడిపోవటంతో, దానికి బద్ధ శత్రువైన తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. అల్లుడు కాబట్టి చేర్చుకోవాల్సి వచ్చింది నాటి తెలుగుదేశాధిపతి ఎన్టీఆర్‌కు. ఆ తరవాత ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కుని.. ఇదంతా ప్రజాస్వామ్యాన్ని బతికించడానికే చేశానని నాటి తన ఎల్లో మీడియా సాయంతో చెప్పగలిగారు చంద్రబాబు. నిజాలు అందరికీ తెలిసినా... ఇప్పటికీ అదే అబద్ధాన్ని పదేపదే చెబుతూ ఉంటారు చంద్రబాబు. ఆ రోజు ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికే అలా చేయాల్సి వచ్చిందంటుంటారు. తన చెంచాలతో చెప్పిస్తుంటారు కూడా. ఇక 1999లో బీజేపీకి ఉన్న పాజిటివ్ ఓటు సాయంతో రాష్ట్రంలో గట్టెక్కవచ్చని భావించి... ఆ పార్టీతో పొత్తు పెట్టుకుని విజయం సాధించారు. బీజేపీతో అధికారాన్ని పంచుకుని కేంద్రంలో చక్రం తిప్పినట్లు మహా బిల్డప్ ఇచ్చి ఇప్పటికీ దాని గురించి చెప్పుకుంటూనే ఉంటారు.

మళ్ల బీజేపీతో జట్టుకట్టేశారు...

కానీ 2004 ఎన్నికలు వచ్చే సరికి పరిస్థితి మారిపోయింది. దేశవ్యాప్తంగా బీజేపీ వ్యతిరేక గాలి వీస్తోంది. అది తనమీదా పడొచ్చనే భయంతో ఆ పార్టీతో తెగ తెంపులు చేసుకుని బయటకు వచ్చేశారు. దాన్ని సమర్థించుకునే ప్రయత్నంలో... బీజేపీ మతతత్వ పార్టీ అని, ప్రజాస్వామ్యానికి-



లౌకిక తత్వానికి ప్రమాదకరమని ఆరోపణలు చేశారు. మతతత్వ బీజేపీతో పొత్తు పెట్టుకుని తప్పు చేశానని పశ్చాత్తాపం నటించారు. విచిత్రమేంటంటే రాష్ట్రాన్ని విభజించాలని కోరుతున్న టీఆర్‌ఎస్‌తో 2009 ఎన్నికల్లో పొత్తు పెట్టుకున్నారు. టీఆర్‌ఎస్, వామపక్షాలతో కలిసి మహాకూటమిగా ఏర్పడి అప్పట్లో దానిక్కూడా రాష్ట్ర ప్రయోజనాలనే ముసుగు వేసినా... ప్రజలు తిప్పికొట్టారు. ఇక 2014 ఎన్నికల్లో మోదీ హవా కొనసాగుతుండడంతో... మళ్లీ బీజేపీ పంచన చేరి, రాష్ట్ర ప్రయోజనాల కోసం తప్పలేదంటూ సమర్థించుకున్నారు. అప్పుడు కూడా కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారాన్ని పంచుకుని రాష్ట్రంలో చెలరేగిపోయారు. దోచుకో-పంచుకో-తినుకో అనే రీతిలో సహజ వనరులన్నిటినీ కొల్లగొట్టారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని తన అధికార భాగస్వామిని అడగకుండా... హోదా ఏమీ సంజీవని కాదు కదా? హోదా వస్తే అన్ని సమస్యలూ పోతాయా? అని ఎదురు ప్రశ్నించారు. కేంద్రంతో లాలూచీ పడి, ప్రత్యేక ప్యాకేజీ ఇస్తే చాలన్నారు. పోలవరాన్ని కేంద్రం నిర్మిస్తానని చెప్పినా... కమిషన్ల కోసం ఆ బాధ్యత తమకే ఇవ్వాలని పట్టుబట్టారు. బాబు కమిషన్ల యావను అర్థం చేసుకున్న బీజేపీ... ప్రత్యేక ప్యాకేజీ పేరిట డబ్బు మూటలు పంపి చేతులు దులుపుకొంది. హోదాను పక్కనబెట్టేసింది.

హోదా వద్దని... మళ్లే దానికోసం డ్రామా

2019 ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయి కేంద్రంలో కాంగ్రెస్ గెలుస్తుందనే అంచనాతో చంద్రబాబు చెలరేగిపోయారు. ఎన్డీఏ నుంచి బయటకు వచ్చి కాంగ్రెస్‌తో జత కట్టారు. తనకు భార్య, కొడుకు, మనవడు ఉన్నారని.. మోదీకి ఎవరున్నారని, అసలు మోదీ ఎవరని ప్రశ్నిస్తూ వ్యక్తిగతంగా నాటి ప్రధానిని దూషించారు. తిరుపతికి వచ్చిన అమిత్‌షాపై తన మనుషులతో రాళ్లు వేయించారు. అంతేకాదు.. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక హోదా కోసం ఉద్యమించడంతో తాను కూడా హోదా డిమాండ్‌ను ఎత్తుకున్నారు. ప్యాకేజీకి అంగీకరించిన నోటితోనే హోదా కావాలని ఎలా అడుగుతారని జనం ప్రశ్నించినా.. అదంతా రాష్ట్ర ప్రయోజనాల కోసమే చేశానంటూ నాలుక మడతేశారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయాక మళ్లీ బీజేపీ ప్రాపకం కోసం పాకులాడి... తొలుత తన పార్టీలోని అనుయాయులు కొందరిని ఆ పార్టీలోకి పంపేశారు. వారి సాయంతో ఇపుడు బీజేపీ అగ్రనేతల కాళ్లావేళ్లా పడి ఎలాగైనా ఆ పార్టీతో కలవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదంతా రాష్ట్ర ప్రయోజనాల కోసమే అని చెబుతున్నారు.

మద్య నిషేధానికీ ఇదే ముసుగు..

చంద్రబాబుది ఎంత దుర్మార్గపు పనులో... దాన్ని ఎల్లో మీడియా ఎలా కవర్ చేస్తుందో తెలియటానికి మద్య నిషేధాన్ని చక్కని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 1994లో అధికారంలోకి వచ్చాక నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తన మాట ప్రకారం... 1995 జూన్ నుంచీ సంపూర్ణ మద్య నిషేధాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. కానీ ఆయన్ను వెన్నుపోటు పొడిచి 1996లో అధికారాన్ని చేపట్టిన చంద్రబాబు... నిండా ఏడాది కూడా గడవక ముందే నిషేధాన్ని ఎత్తివేశారు. పక్క రాష్ట్రాల నుంచి మద్యం విచ్చలవిడిగా వస్తోందంటూ... దానివల్ల రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని, రాష్ట్ర హితం కోసం నిషేధాన్ని ఎత్తివేయక తప్పడం లేదని చెప్పి మళ్లీ మద్యాన్ని తెచ్చేశారు. పక్క రాష్ట్రాల నుంచి మద్యం వస్తుంటే అడ్డుకోవాలి గానీ, నిషేధాన్ని ఎత్తివేయటమేంటని వేసిన ప్రశ్నలకు ఇప్పటికీ జవాబుల్లేవు మరి!!. ఆయన జవాబివ్వనిది కూడా... రాష్ట్ర ప్రయోజనాలకోసమేనేమో!!.

'పట్టాల'పై పేట్రేగితే సహించను

- పేదలకు వాటి పంపిణీ కోసం నా రాజకీయ జీవితాన్ని సైతం ఫణంగా పెడుతున్నా
- ఈనెల 25లోపు సీఎం చేతుల మీదుగా పట్టాల పంపిణీ ప్రక్రియ పూర్తి
- అవాస్తవాలు రాస్తే 75 వేల మందితో పత్రికా కార్యాలయాలను ముట్టడిస్తా
- ఈనాడు, ఆంధ్రజ్యోతి తప్పుడు కథనాలపై బాలినేని ఫైర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు : 'పేదలకు ఇళ్ల పట్టాలిస్తుంటే ఎవరైనా సంతోషిస్తారు.. కానీ అందుకు భిన్నంగా ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు మాత్రం ఈ ప్రక్రియను ఎలా ఆపాలా అంటూ రోజూ తప్పుడు కథనాలు రాయడం ఆశ్చర్యంగా ఉంద'ని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదల పట్టాల పంపిణీ కోసం రాజకీయ జీవితాన్ని సైతం ఫణంగా పెట్టి తాను పోరాడుతున్నానని, ఇచ్చిన మాటకు కట్టుబడి కృషిచేస్తుంటే, ఎలాగైనా పట్టాల పంపిణీ నిలిచిపోయేలా కుతంత్రాలు చేస్తూ పేట్రేగితే మాత్రం సహించే ప్రసక్తేలేదని ఆ రెండు పత్రికలపై ఆయన తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. స్థానిక నర్సాపురం అగ్రహారం-మల్లేశ్వరపురం రైతుల వద్ద నుంచి జగనన్న కాలనీ కోసం పేదలకు పట్టాలిచ్చేందుకు కొనుగోలు చేసిన భూముల్లో అభివృద్ధి పనులను ఆదివారం బాలినేని స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల రాతలను తూర్పారబట్టారు.

ఒక్క రూపాయి తీసుకున్నా చెప్పుతో కొట్టండి..

తానేదో రైతుల వద్ద నుంచి కమీషన్లు తీసుకుంటున్నట్లు కథనాలు రాయడం ఏమిటంటూ బాలినేని మండిపడ్డారు. ఒక్క రూపాయి తాను తీసుకున్నా తనను చెప్పుతో కొట్టాలన్నారు. ఇప్పటికే భూములకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన డబ్బులు రూ.231 కోట్లు కలెక్టర్ బ్యాంకు ఖాతాలో జమయ్యాయని.. ఇందులో ఇప్పటికే 80 శాతం మందికి నగదు కూడా జమచేశారన్నారు. ఆదివారం కూడా 29 మందికి జమచేసినట్లు తెలిపారు. మిగిలిన కొంత భూమికి సంబంధించిన వివాదాలు ఉండడంతో వాటిని పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారని బాలినేని చెప్పారు. రోడ్లు, విద్యుత్, గుడి, బడి, పార్కులు ఇలా అన్ని రకాల మౌలిక వసతులతో ఒక సిటీని నిర్మిస్తున్నామన్నారు. రైతులు కూడా ముందుకొచ్చి సహకరిస్తున్నందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఇళ్లు కూడా మంజూరు చేయిస్తా..

ఇక ఈనెల 20 నుంచి 25లోగా 25 వేల మందికి సీఎం వైఎస్ చేతుల మీదుగా పట్టాలను ఇప్పించడమే కాక ఇళ్లు కూడా ప్రభుత్వం ద్వారా మంజూరు చేయిస్తానని బాలినేని హామీ ఇచ్చారు. పేదలకు పట్టాలు ఇచ్చేందుకు తాను ఇంతగా తాపత్రయపడుతుంటే ఆంధ్రజ్యోతి, ఈనాడు మాత్రం డబ్బులు పడవు, డబ్బులు రావు, పట్టాలు ఇవ్వరంటూ అడ్డగోలుగా కథనాలు రాశారని, తీరా నేడు ప్రభుత్వం డబ్బులు విడుదల చేయగానే కాగితాలు మాత్రమే ఇస్తారు, స్థలం చూపరు అంటూ వేరే కథనాలు అల్లుతున్నారని మండిపడ్డారు. టిడ్కో ఇళ్లకు భూసేకరణ సమయంలో భూములను ఎలా సేకరించారో, ఇప్పుడు భూముల కొనుగోలు ఎలా జరుగుతుందో ప్రజలందరికీ తెలుసునన్నారు.

అడ్డుకుంటే ముట్టడిస్తా..

ఏదో ఒక రూపంలో పేదల పట్టాలను అడ్డుకోవాలని చూస్తే మాత్రం సహించేదిలేదని, ఇంటికి ముగ్గురు చొప్పున 25 వేల పట్టాలకు సంబంధించి 75 వేల మందితో ఆ రెండు పత్రికల కార్యాలయాలను సైతం ముట్టడిస్తానని బాలినేని హెచ్చరించారు. పేదల సంక్షేమమే తనకు ముఖ్యమని తనపై ఎన్ని కేసులు పెట్టినా డోంట్ కేర్ అని స్పష్టంచేశారు. సమావేశంలో నగర మేయర్ గంగాడ సుజాత, నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్‌రావు తదితరులు ఉన్నారు.

నేను పార్టీలోనే ఉంటా..

అనంతరం.. టంగుటూరు మండలం అనంతవరం గ్రామంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ సచివాలయ సముదాయాన్ని మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌తో కలిసి బాలినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''ఆదిమూలపు సురేష్‌ను కొండపి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలిపించాలి. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఒక మాట చెప్పారు.. పార్టీ తల్లిలాంటిది.. పార్టీలో ఉండి ద్రోహం చేస్తే తల్లిపాలు తాగి రొమ్ము గుద్దడమే.. అధికారం ఉంటేనే ఏ పనైనా చేసుకోగలం. మంత్రి పదవులు ఇచ్చినా ఇవ్వకపోయినా పార్టీ అధికారంలోకి వచ్చి ఎమ్మెల్యే అయితే చాలు. నా గుండె నుంచి వస్తున్న మాటలివి. నేను పార్టీలోనే ఉంటాను'' అని బాలినేని స్పష్టంచేశారు. జగనన్న నాయకత్వంలో ప్రకాశం జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని ఆయన ధీమా వ్యక్తంచేశారు.

విగ్రహంపైనా టీడీపీ విష రాజకీయం

- పులివెందులలో ఏర్పాటుకు తెలంగాణ నుంచి రాజ్యాంగ నిర్మాత విగ్రహం
- లారీ నుంచి క్రేన్‌తో కిందికి దించిన విగ్రహం ఫొటో తీసి అవమానించారంటూ దుష్ప్రచారం
- అవాస్తవాలను వైరల్ చేస్తూ లబ్ధిపొందాలనే ఎత్తుగడ
- టీడీపీ ఎమ్మెల్సీ దిగజారుడు వైఖరిపై సర్వత్రా విమర్శలు



క్రేన్ సాయంతో పాతబస్టాండ్ సమీపంలో దించిన అంబేడ్కర్ విగ్రహం



కాంట్రాక్టర్ ఇంట్లో భద్రపరిచిన అంబేడ్కర్ విగ్రహం

సాక్షి ప్రతినిధి, కడప: కాదేదీ దుష్ప్రచారానికి అనర్హం అన్నట్లుగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు వ్యవహరిస్తున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిష్ట దెబ్బతీసేలా వారి వైఖరి ఉంది. వాస్తవాలతో నిమిత్తం లేకుండా దిగజారుడు రాజకీయాలకు తెరతీస్తున్నారు. ఈ క్రమంలోనే వైఎస్సార్ జిల్లా పులివెందుల కేంద్రంగా బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సైతం రాజకీయ లబ్ధికోసం వాడుకుంటున్న వైనం వెలుగులోకి వచ్చింది.

పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా వివిధ సర్కిల్స్‌లో జాతీయ నేతల విగ్రహాల ఏర్పాటుకు పాడా (పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను తెలంగాణ నుంచి తీసుకువచ్చారు. ఇవి శుక్రవారం సాయంత్రానికి పులివెందుల చేరుకున్నాయి. పాత బస్టాండు సమీపంలో డాక్టర్ వైఎస్సార్ విగ్రహం ఏర్పాటుకు పిల్లర్ సిద్ధం చేశారు. అక్కడే విగ్రహాలు క్రేన్ సహాయంతో లారీ నుంచి దించారు. వైఎస్సార్ విగ్రహాన్ని పిల్లర్‌పైన పెట్టారు. అలాగే జాతిపిత విగ్రహం ఆవిష్కరణకు కోర్టు సర్కిల్ వద్ద ఏర్పాట్లు చేశారు. గరండల్ బ్రిడ్జి సమీపంలో సుందరీకరణతోపాటు అక్కడే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయదలిచారు. ఇంకా పిల్లర్, సుందరీకరణ పూర్తికాకపోవడంతో కాంట్రాక్టర్ నిరంజన్‌రెడ్డి ఇంట్లో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని భద్రపర్చారు. అంతలోనే క్రేన్ నుంచి కిందికి దించిన విగ్రహాన్ని ఫొటో తీసి టీడీపీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సెల్ఫీ వీడియో విడుదల చేశారు. సోషల్ మీడియాలో అంబేడ్కర్ విగ్రహాన్ని వైఎస్సార్ విగ్రహం కింద ఉంచారంటూ దుష్ప్రచారం చేస్తున్నారు.

సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు

మోడల్ టౌన్‌లో భాగంగా సుందరీకరణ పనులు, జాతీయ నేతల విగ్రహాల ఏర్పాటుకు పాడా కృషి చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు పనులు కొనసాగుతున్నాయి. అంతలోనే రాజకీయ స్వలాభం కోసం సాక్షాత్తు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ప్రతిష్టను దెబ్బతీసేలా టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు మండిపడుతున్నారు. పిల్లర్ లేకుండా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సాధ్యమేనా అని ప్రశ్నిస్తున్నారు. క్రేన్ సహాయంతో వాహనం నుంచి దించి ఉన్న విగ్రహాన్ని ఫొటో తీసి ప్రచారం చేయడం ఎంతవరకు సబబని నిలదీస్తున్నారు. అంబేడ్కర్‌ను కించపరిచే విధంగా అవాస్తవాలు ప్రచారం చేసిన టీడీపీ శ్రేణులు భారత జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

అత్యంత సుందరంగా అంబేడ్కర్ విగ్రహం



పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా సుందరంగా రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసినట్లు కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం పులివెందులలో మాట్లాడుతూ స్థానిక గరండాల్ బ్రిడ్జి దగ్గర విగ్రహ ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్, పార్టీ పట్టణ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి స్థానిక ఎస్సీ, బీసీ నాయకులతో కలిసి స్థల పరిశీలించారని తెలిపారు. అందులో భాగంగా శిల్ప కళాకారుడితో ప్రత్యేకంగా కళాత్మకంగా రూపొందించిన అంబేడ్కర్ విగ్రహం కూడా పులివెందులకు చేరుకుందన్నారు. టీడీపీ నేతలు తమ స్వార్థ రాజకీయాల కోసం విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు.

టీడీపీ కుల రాజధానిలో

దళితులకు అవమానాలు

రేషన్ వాహనం నడుపుతున్న దళిత యువకుడిపై టీడీపీ నాయకుల దాడి

- దళితులను చంద్రబాబు, లోకేశ్ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు
- సీఎం జగన్ అణగారిన వర్గాలకు రాజరికాన్నిస్తుంటే టీడీపీ అవమానిస్తోంది
- బాధితుడిని పరామర్శించిన అనంతరం మీడియాతో బాపట్ల ఎంపీ నందిగం సురేష్



తాడేపల్లి రూరల్: నింగికి రాకెట్లు పంపిస్తున్న కాలంలో కూడా టీడీపీ నేతలు కుల దూషణలు, దాడులకు పాల్పడటం శోచనీయమని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అన్నారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి చిర్రావూరులో రేషన్ బియ్యాన్ని ఇంటింటికీ సరఫరా చేసే రాజశేఖర్‌పై టీడీపీకి చెందిన అగ్రవర్ణ నాయకులు ఆదివారం దాడికి పాల్పడి, కులం పేరిట అవమానించారు. మా ఇళ్ల ముందు మీ పెత్తనాలేంట్రా? మూడు నెలల్లో మీ సంగతి తేలుస్తామంటూ భయపెట్టారు. దీంతో బాధితుడిని ఎంపీ సురేష్ వైఎస్సార్‌సీపీ స్థానిక నేతలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ కుల రాజధానిలో దళితులు, మైనార్టీలు, బీసీల పట్ల వారి కపట ప్రేమ ఎప్పటికప్పుడు బయటపడుతోందన్నారు. అమరావతిలో దళితులను భయభ్రాంతులకు గురిచేసేందుకు టీడీపీ విశ్వప్రయత్నాలు చేస్తోందన్నారు. తండ్రీ కొడుకులిద్దరూ కలిసి, రాష్ట్రంలోని దళితులను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని ఆక్షేపించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నపుడు ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా? అని మాట్లాడిన ఆయన నైజం ప్రజలు మర్చిపోలేరన్నారు. ఆయన ప్రభుత్వంలో దళితులపై చాలా దాడులు జరిగాయని, మహిళలను వివస్త్రలను చేశారని గుర్తుచేశారు. మంగళగిరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వైఎస్సార్‌సీపీ వెంట ఉన్నారని, ఇక్కడ లోకేశ్‌కు మళ్లీ పరాభవం తప్పదని హెచ్చరించారు. 2014లో గంజి చిరంజీవిని పోటీలో నిలిపి, ఆర్థికంగా దెబ్బతీశారని, 2019లో కుల అహంకారంతో ధీమాగా బరిలో నిలిచిన లోకేశ్‌కు ఓటర్లు గట్టిగా బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. ఇప్పుడు కూడా వైఎస్సార్‌సీపీ నుంచి బరిలో నిలుస్తున్న బీసీ అభ్యర్థికి వస్తున్న మద్దతు తట్టుకోలేక, భయపెట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్నారని ఆరోపించారు. తమ పెత్తనం సాగట్లేదన్న అక్కసుతో టీడీపీకి చెందిన అగ్రవర్ణ నాయకులు దాడి చేస్తే దానికి జనసేన నాయకులు మద్దతు పలకడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఆ పార్టీల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఆలోచించాలని హితవు పలికారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బడుగులకు ప్రాధాన్యతనిస్తూ, రాజ్యాధికారంలో వారికి అవకాశం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబుకు, ఆయన చెంచా పార్టీలకు దమ్ము, ధైర్యం ఉంటే జగన్ మాదిరిగా సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. బాధితుడిని పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ చిర్రావూరు అధ్యక్షుడు మేకల సాంబశివరావు, న్యాయవాదులు శృంగారపాటి కార్తీక్, బాజీ, అమరా నాగయ్య, రేవేంద్రపాడు సర్పంచ్ పలుకూరి మేరీరాణి, పార్టీ తాడేపల్లి రూరల్ మాజీ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి తదితరులున్నారు.

తాడేపల్లిగూడెంలో పొత్తుల కత్తులు

- టీడీపీ-జనసేన ఇన్‌చార్జిల మధ్య మాటల యుద్ధం
- టికెట్ తమదేనంటున్న ఇరు పార్టీల నేతలు



బొలిశెట్టి శ్రీనివాస్



వలవల బాబ్జి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: టీడీపీ-జనసేన పొత్తు ఎలాగున్నా పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో మాత్రం ఆ రెండు పార్టీల నుంచి టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులు ఒకరిపై ఒకరు కత్తులు నూరుతున్నారు. వారిద్దరూ ఒకప్పుడు మంచి స్నేహితులు.. అంతకుమించి వ్యాపార భాగస్వాములు.. ప్రస్తుతం ఒకరు జనసేన, మరొకరు టీడీపీకి ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. గూడెం టికెట్ తనదేనని జనసేన ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్, కాదు తనదంటూ టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జిలు పరస్పర ప్రకటనలతో పొత్తుల కత్తులు దూసుకుంటున్నారు. జనసేన ప్రస్తుత ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ టీడీపీ హయాంలో మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. 2019లో జనసేన అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. వలవల బాబ్జీ గతంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. వీరిద్దరూ సివిల్ సప్లయ్ రవాణా కాంట్రాక్టు, ఎఫ్‌సీఐ గొడౌన్లకు గన్నీ బ్యాగ్‌ల సరఫరా కాంట్రాక్ట్, రియల్ ఎస్టేట్ వ్యాపారం కలిసి చేసేవారు. ఆ మిత్రులు కాస్తా ఇప్పుడు రాజకీయ శత్రువులుగా మారారు.

జనసేనకు సహకరించకుండా వలవల ఎత్తులు

పొత్తుకు ముందు వరకు తామిద్దరం మంచి స్నేహితులమని, ఎవరికి టికెట్ ఇచ్చినా మరొకరికి సహకరిస్తామని చెప్పారు. సీన్ కట్ చేస్తే.. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం మొదలైంది. కొద్దిరోజుల క్రితం వరకు సోషల్ మీడియాలో టికెట్ మాదంటే మాదంటూ అనుచరులతో పోస్టులు పెట్టించి హడావుడి చేశారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి కేడర్ మీటింగుల్లో, విలేకరుల సమావేశాల్లోనూ పరోక్ష విమర్శలు చేసుకుంటున్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో టీడీపీ 1990లో చివరిగా గెలిచింది. పొత్తుల్లో భాగంగా ఈ జిల్లాలో జనసేనకు మొదటగా ఇచ్చే సీటుగా గూడెం అనుకున్నారు. అయితే వలవల బాబ్జీ మాత్రం చంద్రబాబు సొంత సామాజిక వర్గ నేతలతో సన్నిహితంగా ఉంటూ టికెట్ కోసం హడావుడి చేశారు. జనసేనతో పొత్తు ఖరారైన తరువాత మరింత స్పీడ్ పెంచి పార్టీ కార్యకర్తల మీటింగుల్లో టికెట్ టీడీపీదేనని, తానే పోటీ చేస్తున్నానని ప్రకటించారు. జనసేన నేత బొలిశెట్టి శ్రీనివాస్ సినిమా షో చేస్తుంటాడని, ఎవరూ పట్టించుకోవద్దని.. పార్టీ కేడర్ వెళ్లవద్దని కార్యకర్తల సమావేశంలో చెప్పేవారు. జనసేన, టీడీపీ సంయుక్త కార్యక్రమాలకు అవకాశం ఇవ్వకుండా రాజకీయం చేసేవారు. గత పది రోజుల వ్యవధిలో రెండుమూడు సార్లు ఈ విషయం చెప్పడంతో పాటు.. బొలిశెట్టితో టచ్‌లో ఉన్న టీడీపీ నేతలపై అసహనం వ్యక్తం చేశారు.

టీడీపీ నేతలవి దౌర్భాగ్య రాజకీయాలు: బొలిశెట్టి

టీడీపీ నేతలు దౌర్భాగ్య రాజకీయాలు చేస్తున్నారని జనసేన ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. పవన్ కళ్యాణ్ సీటు తనకే ఇచ్చారని, కేడర్ కూడా సంబరాలు చేసుకుందని.. బాబ్జి ఇప్పుడు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు సభలకు తాను హాజరైతే.. టీడీపీ నాయకులు మాత్రం తమకు సహకరించకుండా, తమ కార్యక్రమాలకు రాకుండా చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరడంతో రాజకీయ పరిణామాలు ఎలా ఉంటాయోనని ఇరు పార్టీల శ్రేణులు ఆసక్తిగా వేచిచూస్తున్నాయి. ఒకవేళ సీటు రాకపోతే వైరి వర్గానికి సహకారం అందించడం అనుమానమేనని, ఓటు బదలాయింపు జరగకపోవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

• తెలంగాణ

ఆరు గ్యారంటీల అమలుపై అయోమయం!

- కాంగ్రెస్ మేనిఫెస్టో హామీలకు.. బడ్జెట్‌లో కేటాయింపులకు పొంతన లేదనే భావన
- చెప్పినవి చెప్పినట్లు అమలుచేస్తే ఏటా రూ.1.36 లక్షల కోట్లపైనే అవసరం
- కేటాయింపులు రూ.53 వేల కోట్లే!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుపై అయోమయం నెలకొంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను యథాతథంగా అమలుచేయాలంటే.. ఇప్పుడు బడ్జెట్‌లో పెట్టిన దానికి సుమారు మూడు రెట్లు ఎక్కువగా నిధులు అవసరమనే చర్చ జరుగుతోంది. హామీలను సంపూర్ణంగా అమలుచేయాలంటే ఏటా రూ.1.36 లక్షల కోట్లకుపైనే కావాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు రూ.53 వేల కోట్లను మాత్రమే కేటాయించింది. ఒకవేళ గ్యారంటీలను పూర్తిస్థాయిలో కాకుండా, కొందరికే పరిమితం చేసినా ఏటా రూ.80 వేల కోట్లకు పైనే అవసరమని అధికార వర్గాలు అంటున్నాయి. ఇక కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల పరిధిలో మొత్తం 13 పథకాలను అమలుచేయాల్సి ఉంది. వీటికి ఎన్ని నిధులు కేటాయించారంటే..

మహాలక్ష్మి.. : ఈ పథకం కింద కోటీ 39లక్షల మందికి ప్రతీనెలా రూ.2,500 లెక్కన ఏటా రూ.41,700 కోట్లు కావాల్సి ఉంటుంది. సిలిండర్ రూ.500కే ఇస్తామని హామీ ఇచ్చింది. ఏడాదికి పన్నెండు సిలిండర్లు ఇస్తే.. ఏటా రూ.4,200 కోట్లు గ్యాస్ కంపెనీలకు చెల్లించాల్సి ఉంటుంది. ఆరు సిలిండర్లకే పరిమితం చేస్తే రూ.2,100 కోట్లు చెల్లించాలి. ఇక మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణానికి ఏటా రూ.3,600 కోట్లు ఆర్టీసీకి చెల్లించాల్సి ఉంటుంది.

రైతుభరోసా.. : ఈ పథకానికి ఏటా సుమారు రూ.22,800 కోట్లు అవసరం. అలాగే, భూమిలేని కౌలు రైతులకు ఏటా రూ.15 వేల చొప్పున ఇచ్చేందుకు ఏటా రూ. 975 కోట్లు కావాలి. ఇక జాబ్‌కార్డులున్న కూలీలందరికీ పథకాన్ని వర్తింపజేస్తే ఏటా రూ.6,240 కోట్లు కావాలి, యాక్టివ్ వారికే ఇస్తే రూ.3,840 కోట్లు అవసరం. మరోవైపు.. వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పేర్కొంది. కోటీ 30లక్షల టన్నుల ధాన్యానికి ఇవ్వాలంటే రూ.6,500 కోట్లు అవసరం.

గృహజ్యోతి.. : ప్రస్తుతం గృహజ్యోతి అమలు కోసం సుమారు రూ.6,315 కోట్లను విద్యుత్ సంస్థలకు ఏటా చెల్లించాల్సి ఉంటుంది.

ఇందిరమ్మ ఇళ్లు.. : రాష్ట్రంలో సొంతిల్లు లేని పేదలకు 20 లక్షల ఇళ్లు కట్టిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఇస్తామన్న హామీ మేరకు.. 20లక్షల ఇళ్లకు మొత్తంగా రూ.లక్ష కోట్లు అవసరం. ఏటా బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించాల్సి ఉంటుంది. అయితే సర్కారు తాజాగా రూ.ఏడువేల కోట్లే కేటాయించింది.

చేయూత.. : రాష్ట్రంలో మొత్తం 43.68 లక్షల మంది వివిధ రకాల పింఛన్లు పొందుతున్నారు. దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు, ఇతర పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ లెక్కన ఏటా 5.5 లక్షల మంది దివ్యాంగుల పింఛన్లకు రూ.3,960 కోట్లు, సుమారు 38 లక్షల ఇతర పింఛన్లకు రూ.18,240 కోట్లు కేటాయించాల్సి ఉంటుంది.

యువ వికాసం.. : విద్యార్థుల ఫీజులు, కోచింగ్ చెల్లింపుల కోసం రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు ఇస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలో ఏటా దాదాపు ఆరు లక్షల మంది విద్యార్థులు డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఇంటర్మీడియట్ వంటివి పూర్తి చేసుకుంటున్నారు. యువ వికాసం పథకంపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పష్టతలేదు.


అమలాపురం వద్ద వినియోగంలోకి వచ్చిన ఎన్‌హెచ్‌-216 బైపాస్‌ రోడ్డు


పెనుకొండ పట్టణంలో రూ. 20 కోట్లతో నిర్మించిన డబుల్‌ లేన్‌ రోడ్డు


బుక్కపట్నం వద్ద పూర్తి కావస్తున్న రహదారి నిర్మాణం


సిద్ధమైన పుంగనూరు రహదారి

రహదారులు.. రాచబాటలు

సీఎం జగన్‌ పాలనలోనే హైవేల జోరు

వైఎస్సార్‌సీపీ హయాంలో పలు జాతీయ రహదారులకు మోక్షం


రాష్ట్రంలో అధిక శాతం రహదారులు రాచబాటలను తలపిస్తున్నాయి. జాతీయ రహదారులు, ఆర్‌ అండ్‌ బీ రోడ్లు అద్దాల్లా మెరుస్తున్నాయి. ఈ రోడ్లపై శ్రమ లేకుండా వాహన చోదకులు పయనిస్తున్నారు. గత ప్రభుత్వంలో రోడ్ల దుస్థితిని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ, పట్టుదలతో రూ.వేల కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణానికి నడుం బిగించారు. దీంతో ప్రాజెక్టులు రావడమే కాదు.. గత ప్రభుత్వ హయాంలో మూలుగుతున్న ప్రాజెక్టులకూ మోక్షం కలిగేలా కృషి చేశారు. నాడు అడుగుకొక గుంతతో కనిపించే ఆర్‌ అండ్‌ బీ రోడ్లు ఇప్పుడు సరికొత్త రూపును సంతరించుకున్నాయి.

-సాక్షి నెట్‌వర్క్‌

- నాడు రోడ్లు గుంతలు-నేడు కొత్తపుంతలు
- కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు ఎన్‌హెచ్‌-216
- రూ.580 కోట్లతో నరసాపురం-సఖినేటిపల్లి మధ్య వంతెన
- రూ.6,300 కోట్లతో విశాఖ-భోగాపురం 6 లేన్ల బీచ్‌ కారిడార్‌
- చిత్తూరు జిల్లాలో రూ.6,960 కోట్లతో 168 కిలోమీటర్ల రోడ్డు పనులు


ఇటీవల అందుబాటులోకి వచ్చిన అనకాపల్లి-ఆనందపురం ఎక్స్‌ప్రెస్‌ వే

విశాఖకు మహర్దశ



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రూ.6,300 కోట్లతో విశాఖపట్నం-భోగాపురం మధ్య 55 కి.మీ. మధ్య ఆరు లేన్ల బీచ్‌ కారిడార్‌ మంజూరైంది. దీని నిర్మాణాన్ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) చేపట్టనుంది. ప్రస్తుతం డీపీఆర్‌ దశలో ఉన్న ఈ ప్రాజెక్టు త్వరలో టెండర్లకు మార్గం సుగమం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. విశాఖ నగరంలోని కాన్వెంట్‌ జంక్షన్‌-షీలానగర్‌ రోడ్డుకు కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ రూ.680 కోట్లు మంజూరు చేసింది. అలాగే రూ.45 కోట్లతో నిర్మిస్తున్న ఈస్ట్‌ బ్రేక్‌వాటర్‌-కాన్వెంట్‌ జంక్షన్‌ రోడ్డు నెల రోజుల్లో అందుబాటులోకి రానుంది. రూ.22 కోట్లతో నిర్మాణం జరుగుతున్న ఎయిర్‌పోర్టు-కంటైనర్‌ టెర్మినల్‌ రోడ్డు కూడా మార్చి ఆఖరుకు పూర్తి కానుంది. ఇవి అందుబాటులోకి వస్తే నగరంలో ట్రాఫిక్‌ రద్దీ నుంచి ఒకింత ఉపశమనం కలగనుంది. ఇలా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆర్‌ అండ్‌ బీ రోడ్లకు రూ.919 కోట్లు వెచ్చించారు. శ్రీకాకుళం జిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారు రూ.1.58 కోట్లతో కొత్తగా వంతెన నిర్మాణం చేపట్టారు. బూర్జ మండలం కొల్లివలస-పెద్దపేట 24 కిలోమీటర్ల మేర రహదారికి రూ.2 కోట్లు, రొట్టవలస-ఎల్‌ఎన్‌ పేటకు రూ.1.50 కోట్లు, కొత్తవలస-గుత్తావిల్లి రహదారికి రూ.2 కోట్లు, రైల్వే స్టేషన్‌-కావలి రహదారికి రూ.2 కోట్లు, వాలిపల్లిపేట-పిల్లలవలస రహదారికి రూ.7 కోట్లు, కణుగులవలస-ముద్దాడపేట రహదారికి రూ.3.63 కోట్లు మంజూరు చేయడంతో రోడ్లు నిర్మాణం జరిగి కళకళలాడుతున్నాయి.

వైఎస్సార్‌ జిల్లాకు వరాలు..

- నేషనల్‌ హైవే 716 కడప-రేణిగుంట ఎక్స్‌ప్రెస్‌ హైవే నేషనల్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా నేతృత్వంలో చేపట్టనున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తి అయ్యాయి. జంగిల్‌ క్లియరెన్సు పనులు కొనసాగుతున్నాయి.
- చాగలమర్రి-ప్రొద్దుటూరు-వేంపల్లె-రాయచోటి జాతీయ రహదారికి శ్రీకారం చుట్టారు. పనులు కొనసాగుతోన్నాయి. 130 కిలో మీటర్లు ఈ రహదారిని రూ.724 కోట్లుతో చేపట్టారు.
- జమ్మలమడుగు-కొలిమిగుంట్ల జాతీయ రహదారిగా ప్రకటించి 42 కిలో మీటర్లు రహదారిని రూ.200 కోట్లుతో చేపట్టారు.
- ముద్దనూరు-పులివెందుల-కదిరి మీదుగా హిందూపురం వరకూ జిల్లాలను అనుసంధానం చేస్తూ 159 కిలోమీటర్లు జాతీయ రహదారి నిర్మాణానికి రూ.1600 కోట్లుతో నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు.
- నేషనల్‌ హైవే 67లో ముద్దనూరు-తాడిపత్రి రహదారి 55 కిలోమీటర్లు ఫోర్‌లైన్‌ రహదారి నిర్మాణానికి రూ.724 కోట్లు ఖర్చు చేశారు. ఈ రహదారిలో రైల్వేట్రాక్‌ గండికోట ముంపు నుంచి తరలించాల్సి ఉండగా ఐదేళ్ల టీడీపీ హాయాంలో ఎలాంటి పురోగతి లేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హాయాంలో రహాదారి పూర్తి అయ్యింది.
- జిల్లాలో రూ.180 కోట్లుతో 101 రోడ్లును రోడ్లు భవనాల శాఖ పరిధిలో నిర్మించారు.
- రూ.80కోట్లుతో కడప శివార్లులో చెమ్ముమియ్యాపేట సమీపంలో నూతనంగా రైల్వే ఓవర్‌ బ్రిడ్జిని నిర్మించారు.
- రూ.30కోట్లుతో రాజంపేట-కదిరి రహదారి నిర్మాణం చేపట్టారు.

గో'దారి' చెంత చకచకా ప్రయాణం


పశ్చిమ గోదావరి జిల్లా కోడేరు-నల్లజర్ల రోడ్డు ఇలా

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కత్తిపూడి-ఒంగోలు మధ్య జాతీయ రహదారి 216ను కేంద్ర ఉపరితల రవాణా శాఖ విస్తరిస్తోంది. ఈ పనులు గత ప్రభుత్వంలో ఆరంభం కాగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భూసేకరణ, హైవే విస్తరణ పనులు జోరందుకున్నాయి. కత్తిపూడి-ఒంగోలు మధ్య ఎన్‌హెచ్‌ 216 రోడ్డు అంబేడ్కర్‌ కోనసీమ జిల్లాలో ఐ.పోలవరం మండలం ఎదుర్లంక వారధి వద్ద నుంచి మొదలై ముమ్మిడివరం, అమలాపురం, తాటిపాక, రాజోలు, శివకోడు, దిండి వరకు ఉంది. సుమారు 381.73 కిలోమీటర్ల నిడివి గల ఈ రహదారిని విస్తరించడంతోపాటు ప్రధాన పట్టణాలలో బైపాస్‌ రోడ్ల నిర్మాణాలకు, కల్వర్టులు, వంతెనలు, రైల్వే ఫ్లై ఓవర్ల నిర్మాణాలు, విస్తరణ, కొత్త ప్రాంతాల్లో రహదారి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణకు ఎన్‌హెచ్‌ రూ.3,909 కోట్లను కేటాయించింది. గోదావరిపై సఖినేటిపల్లి-నర్సాపురం మధ్య వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. జాతీయ రహదారి 216 బైపాస్‌ రహదారిలో వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణానికి రూ.580.42 కోట్ల నిధులు మంజూరయ్యాయి. జిల్లాలోని శివకోడు నుంచి సఖినేటిపల్లి మీదుగా నరసాపురం వరకు బైపాస్‌ నిర్మించాలని సీఎం జగన్‌ కేంద్ర ఉపరితల రవాణా శాఖమంత్రి నితిన్‌ గడ్కరీని కోరారు. దీనిలో భాగంగానే రామరాజులంక వద్ద వశిష్ఠ గోదావరిపై 380 మీటర్ల మేర వంతెన నిర్మించనున్నారు. వంతెన, రహదారి నిర్మాణాలకు రూ.658.12 కోట్లకు ప్రతిపాదనలు పంపగా, రూ.580.42 కోట్లకు అనుమతి మంజూరు చేశారు. కిలోమీటరుకు రూ.26.18 కోట్లు అవుతుందని లెక్కలు కట్టిన ఎన్‌హెచ్‌ అథారిటీ అందుకు తగినట్టుగా నిధులు మంజూరు చేసింది. పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రధానంగా భీమవరం-తాడేపల్లిగూడెం రోడ్డు, పాలకొల్లు-పెనుగొండ, మార్టేరు-పిప్పర, పాలకొల్లు-నరసాపురం, తాడేపల్లిగూడెం గోపాలపురం రోడ్లు పెద్దపెద్ద గోతులు పడడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రోడ్లకు మరమ్మతులు చేయడమేగాక కొత్త రోడ్లు నిర్మించింది. ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రహదారుల పనులు చేపట్టడంతో జిల్లాలో దాదాపు రూ.1,000 కోట్ల వ్యయంతో రోడ్ల నిర్మాణం జరిగింది. ఇటీవల దాదాపు రూ.84 కోట్ల వ్యయంతో ఆరు నేషనల్‌ హైవేలు, 19 జిల్లా ప్రధాన రహదారులు 230 కిలోమీటర్ల పొడవున నిర్మాణ పనులు సాగుతున్నాయి. తాడేపల్లిగూడెం-చిలకంపాడు రోడ్డును సుమారు రూ.45 కోట్ల వ్యయంతో నాలుగు లైన్లుగా విస్తరించారు.

మైదుకూరు నుంచి సింగరాయకొండ రోడ్డు ఎన్‌హెచ్‌ 167(బీ), (కడప, నెల్లూరు, ప్రకాశం, నెల్లూరు, ప్రకాశం మీదుగా) మూడు జిల్లాల్లో సుమారు రూ.1,800 కోట్లతో ఎన్‌హెచ్‌167(బీ) రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డు (మైదుకూరు టు పోరుమామిళ్ల, సీతారాంపురం, సీఎస్‌పురం, పామూరు, కందుకూరు సింగరాయ కొండ వరకు) మొత్తం 189 కి.మీలు (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు ఎన్‌హెచ్‌(ఓ) గ్రాంట్‌తో), పొడవునా సాగుతుంది. ఎన్‌హెచ్‌167(బీ) రోడ్డు పనులు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 110 కి.మీ ఉంది. కనిగిరి నియోజకవర్గంలో 64 కి.మీ. వరకు రోడ్డు నిర్మాణం జరుగుతుంది. సీఎస్‌పురం నుంచి మాలకొండ వరకు సుమారు

కనీవిని ఎరుగని రీతిలో నిర్మాణం

రూ.230 కోట్లతో పనులు జరుగుతున్నాయి. పెద్దదోర్నాల కుంట నేషనల్‌ హైవే నిర్మాణ పనులకు సంబంధించిన ఏర్పాట్లు జోరందుకున్నాయి. రోడ్డు నిర్మాణంలో భాగంగా 22 కిలోమీటర్లకు కేంద్ర ప్రభుత్వం రూ.244.83 కోట్ల నిధులను విడుదల చేసింది.

ఆర్‌ అండ్‌ బీ రహదారిని చెన్నై, ముంబై జాతీయ రహదారి-219కు అనుసంధానం చేస్తూ పుంగనూరు బైపాస్‌ రోడ్డు ఏర్పాటు చేయాలని ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి 2017లో కేంద్ర మంత్రి నితిన్‌ గడ్కరీతో చర్చించి మంజూరు చేయించారు. సుమారు 55 కిలోమీటర్లు రూ.309 కోట్లతో చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్‌ పనులు ప్రారంభించడంతో అప్పటి తెలుగుదేశం ప్రజాప్రతినిధులు కోట్ల రూపాయల్లో వాటాలు కావాలని ఒత్తిడి చేయడంతో కాంట్రాక్టర్‌ పనులు నిలిపివేశారు. ఇలాంటి సమయంలో 2019 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో రోడ్డు ఏర్పాటుపై దృష్టి సారించి, పనులు పూర్తి చేయించారు. 2022 సంవత్సరం జూలై 17న సీఎం వర్చువల్‌ విధానంలో రోడ్డును ప్రారంభించారు. రాయచోటి-చాగలమర్రి హైవే పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కల్వర్టు నిర్మాణపు పనులు కొన్నిచోట్ల పూర్తికాగా మరికొన్నిచోట్ల నిర్మాణ దశలో ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో జాతీయ రహదారి నుంచి మార్కెట్‌యార్డు వరకు రూ. 40 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన డబుల్‌ లేన్‌ రోడ్డుతో ప్రయాణికుల కష్టాలు తీరాయి. పెనుకొండలోని మడకశిర సర్కిల్‌ నుంచి షీఫారం వరకు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ. 20 కోట్లు వెచ్చింది డబుల్‌ లేన్‌ రోడ్డును నిర్మించింది. అదే విధంగా మరో రూ. 14 కోట్లు వెచ్చించి పెనుకొండలో కొండపైకి రోడ్డును వేశారు. జిల్లాలో 2 జాతీయ రహదారులు, ఒక గ్రీన్‌ ఫీల్డ్‌ హైవే పనులు వేగంగా జరుగుతున్నాయి. జిల్లాలో 342 జాతీయ రహదారికి సంబంధించి ముదిగుబ్బ-బుక్కపట్నం-పుట్టపర్తి-గోరంట్ల మండలాల మీదుగా కోడూరుతోపు వరకు 79.5 కిలోమీటర్ల మేర రూ.1,650 కోట్లతో రెండు దశల్లో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ముద్దనూరు-పులివెందుల, కదిరి, ఓడీచెరువు, గోరంట్ల మీదుగా కొడికొండ చెక్‌ పోస్టు వరకు మరో జాతీయ రహదారి పనులు జోరుగా జరుగుతున్నాయి. ఇవికాకుండా కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి సమీపం నుంచి విజయవాడ జాతీయ రహదారిని కలుపుతూ ప్రకాశం జిల్లా మేదరమెట్ల వరకు 334 కిలోమీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్‌ హైవే పనులు ఊపందుకున్నాయి.


వేగంగా సాగుతున్న రాయచోటి-చాగలమర్రి నేషనల్‌ హైవే పనులు

నెల్లూరులో అధునాతన టెక్నాలజీతో ఫ్లైఓవర్‌

వైఎస్‌ జగన్‌ పాలనలో జిల్లాలో రూ.351.63 కోట్లు మంజూరు చేసి 337 కి.మీ మేర రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసింది. ఇందులో నెల్లూరు డివిజన్‌కు సంబంధించి ఆత్మకూరు, నెల్లూరు సిటీ, రూరల్‌, కోవూరు కొంత భాగం, సర్వేపల్లి నియోజకవర్గాల్లో రూ.153.63 కోట్లతో 64 పనుల ద్వారా 363.23 కి.మీ మేర రోడ్ల నిర్మాణాలు చేశారు. కావలి, కోవూరు, ఉదయగిరి, నియోజకవర్గాల్లో రూ.198 కోట్ల ఖర్చుతో 196 కి.మీ మేర రోడ్ల నిర్మాణాలు జరిగాయి. నెల్లూరు నగరంలో పెరిగిన ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని మినీ బైపాస్‌రోడ్డులోని హరనాథపురం కూడలిలో కేంద్ర నిధులు రూ.41.88 కోట్లతో అత్యాధునిక టెక్నాలజీతో ఫ్లైఓవర్‌ వంతెన నిర్మించారు. మైపాడురోడ్డులో రూ.9 కోట్లతో 2.7 కి.మీ మేర నాలుగులైన్ల సిమెంట్‌ రోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్మించారు. మైదుకూరు నియోజకవర్గంలో అల్లాడుపల్లె-ఏటూరు మధ్య 3.6 కి.మీ. చొప్పున అల్లాడుపల్లె దేవళాలు, శ్రీరాములపేట, పెద్దగురువళూరు, చిన్నగురువళూరు గ్రామాలను కలుపుతూ రహదారులు నిర్మించారు. 9 చోట్ల కల్వర్టు నిర్మించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హాయాంలో చాపాడు మండలం చియ్యపాడు నుంచి దువ్వూరు మండలం చింతకుంట వరకూ రూ.3.20కోట్లతో, రాజకొట్టాల నుంచి ఖాజీపేట మండలం తవ్వారుపల్లె వరకూ రూ.2.50కోట్లతో, నక్కలదిన్నె రామసుబ్బమ్మ కొట్టాలు నుంచి వెదురూరు వరకూ రూ.2.55 కోట్లతో ఇలా మైదుకూరు నియోజకవర్గంలోని మైదుకూరు, చాపాడు, దువ్వూరు బ్రహ్మంగారిమఠం, ఖాజీపేట మండలాల్లో రూ.29.50 కోట్లతో 23 రోడ్లను పునర్నిర్మించారు. ఇదే క్రమంలో బ్రహ్మంగారి మఠం వద్ద బ్రహ్మంసాగర్‌ కట్ట లీకేజీ మరమ్మతులను రూ.49 కోట్లతో చేపట్టారు. చక్రాయపేట మండలం కుప్పం, కె.రాజుపల్లె మధ్య పాపాఘ్ని నదిలో పూర్తి కావస్తున్న హైలెవెల్‌ బ్రిడ్జితో పలు ప్రాంతాలకు చెందిన సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. నదిలో ఉన్న తాత్కాలిక రోడ్డు కోతకు గురవుతున్నందున వాహనాలు తిరిగేవి కావు. ఈ విషయంపై గత ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే రోడ్డు మరమ్మతులు చేయించింది. రూ.24 కోట్లతో హైలెవెల్‌ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.పనులు 90 శాతం పూర్తయ్యాయి. అద్దాలమర్రి వద్ద హైలెవెల్‌ బ్రిడ్జికి రూ.54 కోట్లు మంజూరు చేశారు.ప్రస్తుతం అద్దాలమర్రి వద్ద కూడా పాపాఘ్ని నదిలో పనులు ప్రారంభమయ్యాయి. నెరుసుపల్లె వద్ద నుంచి కె.ఎర్రగుడి రహదారికి వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రు.16కోట్లు మంజూరు చేసింది.దీంతో నెరుసుపల్లె నుండి కె.ఎర్రగురి వరకు ఉన్న సింగిల్‌ రోడ్డు డబుల్‌ లేన్‌ రోడ్డుగా ముస్తాబైంది.


నెల్లూరు మినీ బైపాస్‌-హరనాథపురం కూడలిలో నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్‌

రూ.9,612 కోట్లతో రోడ్డు పనులు


నగరి-జంబాద మార్గంలో నిర్మించిన రహదారి

చిత్తూరు జిల్లాలో రెండు భారీ ప్రాజెక్టులను దాదాపు రూ.22 వేల కోట్లతో నిర్మాణ పనులు చేస్తుండగా వచ్చే సంవత్సరానికి వీటి పనులు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో చిత్తూరు జిల్లాలో రూ.6,960 కోట్లతో 168 కిలోమీటర్లు రోడ్డు పనులు జరుగుతున్నాయి. బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్‌ రోడ్డు మొత్తం ప్రాజెక్టు విలువ రూ.17,930 కోట్లతో నాలుగు వరసల్లో మొత్తం 262 కిలోమీటర్లు నిర్మించనున్నారు. చిత్తూరు జిల్లాలో రూ.4,260 కోట్లతో 93 కిలోమీటర్లు రోడ్డు నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు 32 కిలోమీటర్లు పూర్తి చేసి దానికి రూ.1,700 కోట్లు ఖర్చు చేశారు. చిత్తూరు-తచ్చూరు రోడ్డును మొత్తం 116 కిలోమీటర్లను రూ.4 వేల కోట్లతో నిర్మిస్తున్నారు. జిల్లాలో 75 కిలోమీటర్ల రూ.2,700 కోట్లతో నిర్మిస్తున్నారు. అందులో 22 కిలోమీటర్లను రూ.14,07 కోట్లతో నిర్మించారు. గత పాలనలో ఎన్‌హెచ్‌ 4 పరిధిలో మొత్తం 92 కిలోమీటర్లు అన్ని రకాల రోడ్డు నిర్మాణానికి రూ.245 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం 118 కిలోమీటర్ల రోడ్డును(భూసేకరణతో కలిపి) రూ.890 కోట్లతో నిర్మిస్తున్నారు. పంచాయతీరాజ్‌ పరిధిలో గత టీడీపీ పాలనలో జిల్లాలో అప్రోచ్‌, సీసీ రోడ్లు కలిపి మొత్తం 1397 కిలోమీటర్లు నిర్మించగా వాటికి రూ.580 కోట్లు ఖర్చు చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఈఎపీ, పీఎంజీఎస్‌వై కింద మొత్తం పల్లెలో కనెక్టివిటీ రోడ్లు 1,661 కిలోమీటర్లు నిర్మించగా వాటికి రూ.1,172 కోట్లు ఖర్చు చేశారు. టీడీపీ పాలనలో జిల్లా ఆర్‌అండ్‌బీ పరిధిలో 150 కిలోమీటర్లు రోడ్డు మరమ్మతు, నిర్మాణాలు చేయగా వాటికి రూ.300 కోట్లు వ్యయం చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జిల్లాలో 449 కిలోమీటర్లు మరమ్మతు, నిర్మాణానికి రూ.590 కోట్లు ఖర్చు చేశారు.

ప్రసిద్ధి గాంచిన బోయకొండ గంగమ్మ గుడికి మదనపల్లె నియోజకవర్గం, కర్ణాటక రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. కానీ ఈ దారిలో ఎక్కువగా మలుపులు ఉండటంతో తరుచూ ప్రమాదాలు జరిగేవి. దీంతో అక్కడ డబుల్‌ లైన్‌ రోడ్డుకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదన పంపారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం రూ.43 కోట్ల వ్యయంతో 22 కిలోమీటర్ల రోడ్డును అభివృద్ధి చేసింది. చిత్తూరు నియోజకవర్గంలో 19.40 కిలోమీటర్లను రోడ్డును రూ.5.16 కోట్ల వ్యయంతో మరమ్మతు చేశారు. చిత్తూరు-తిరుత్తణికు వెళ్లే మార్గంలో పచ్చనపల్లె రోడ్డు వర్షాల దెబ్బతో అధ్వానంగా మారింది. పీఆర్‌ పరిధిలో 2.2 కిలోమీటర్లు రూ.43.70 లక్షల వ్యయంతో బాగు చేశారు. జీడీనెల్లూరు నియోజకవర్గం ఉడమలకుర్తిలో రూ.27 కోట్లతో హై లెవల్‌ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అత్తిమంజరిపేట-బలిజకండ్రిగ, పాలసముద్రం అటవీ ప్రాంతంలో రూ.3 కోట్లతో రోడ్డు పనులు చేస్తున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో 820 కిలోమీటర్ల రోడ్లు ఉన్నాయి. ఇందులో 400 కిలోమీటర్లు కొత్త తారురోడ్లు. 100 కిలోమీటర్లు పాత తారురోడ్లపై కొత్తగా తారురోడ్డు వేశారు. దీనికోసం ప్రభుత్వం రూ.380 కోట్లు మంజూరు చేసింది.

స్వర్ణ ఉలితో మలిచిన శ్రీరామ నేత్రాలు


బంగారు ఉలి, వెండి సుత్తి, రాముని ప్రతిమ

అయోధ్యలో ప్రతిష్ఠించిన బాల రాముని విగ్రహాన్ని మలిచింది సాధారణ ఇనుప ఉలి, సుత్తితో కాదని దీనికి తాను వెండి సుత్తి, బంగారపు ఉలిని వాడానని మైసూరుకు చెందిన శిల్పి అరుణ్‌ యోగిరాజ్‌ తెలిపారు. ఈ మేరకు ఆయన తన ఇన్‌స్టాగామ్‌, ఎక్స్‌ ఖాతాల్లో ఆదివారం సంబంధిత ఫొటోలను షేర్‌ చేశారు. - మైసూరు

15 నుంచి విశాఖ శ్రీశారదా పీఠం వార్షికోత్సవాలు

- 19వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహణ
- శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి

పెందుర్తి (విశాఖ జిల్లా): విశాఖ శ్రీశారదాపీఠం వార్షిక మహోత్సవాలు ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు ఐదు రోజుల పాటు వైభవంగా జరుగనున్నాయి. ఉత్సవాల్లో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ రాజశ్యామల యాగం నిర్వహించనున్నారు. ఈ నెల 16న శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి కల్యాణం, 17న టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం, 18న వల్లీ కల్యాణం జరుగనున్నాయి. తొలి రోజు కనకధార స్తోత్రం, రెండో రోజు ఆదిత్య హృదయం, లలిత సహస్రనామాలు, మూడో రోజు విష్ణు సహస్రనామాలు, నాలుగో రోజు హనుమాన్‌ చాలీసా నిర్వహించనున్నారు. రథసప్తమి సందర్భంగా 16న అరుణ పారాయణ, 18న సుబ్రహ్మణ్యస్వామిని ఆరాధిస్తూ రథోత్సవం నిర్వహించనున్నారు. అదే రోజు చిన్నారులకు పౌరాణిక పాత్రధారణ పోటీలు ఉంటాయి. ఉత్సవాల్లో భాగంగా నిత్యం రాజశ్యామల అమ్మవారికి, 15న దక్షిణామూర్తికి, 16న వనదుర్గమాతకు, 17న దాసాంజనేయస్వామికి, 18న షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు జరుగనున్నాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ధార్మిక సమ్మేళనాన్ని తలపించేలా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ముగిసిన గుణదల మేరీమాత శతాబ్ది ఉత్సవాలు

- భారీగా తరలివచ్చిన విశ్వాసులు
- భక్తిశ్రద్ధలతో సమష్టి దివ్యబలి పూజ



గుణదల కొండ ఎక్కుతున్న భక్తులు

గుణదల (విజయవాడ తూర్పు): విజయవాడ గుణదల క్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మేరీమాత శతాబ్ది ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆఖరి రోజు భక్తులు భారీగా తరలివచ్చి మేరీమాతను దర్శించుకున్నారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రత్యేక సమష్టి దివ్యబలి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇండియా, నేపాల్‌ అపోస్తలిక పోప్‌ రాయబారి మోస్ట్‌ రెవరెండ్‌ లియోపోల్డో జిరెల్లీ మాట్లాడుతూ గుణదల మాత నిష్కళంక మాతగా భక్తుల నీరాజనాలు అందుకుంటోందన్నారు. అనంతరం భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ఆర్చి బిషప్‌ మల్లవరపు ప్రకాష్‌, వరంగల్‌ బిషప్‌ ఉడుముల బాల, విజయవాడ బిషప్‌ తెలగతోటి జోసెఫ్‌ రాజారావు, ఏలూరు బిషప్‌ పొలిమెర జయరావు, పుణ్యక్షేత్ర రెక్టర్‌ ఫాదర్‌ యేలేటి విలియం జయరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

విలీనం లేదు.. వేతన సవరణ ఊసే లేదు!

సాక్షి, హైదరాబాద్‌: ఇటు ప్రభుత్వంలో ఉద్యోగుల విలీనంలో స్పష్టత లేదు.. అటు బకాయి ఉన్న రెండు వేతన సవరణల జాడ లేదు.. ఆర్టీసీకి సంబంధించి ఈ కీలక అంశాలకు తెలంగాణ ప్రభుత్వం శాసనసభకు సమర్పించిన తాజా బడ్జెట్‌లో చోటు దక్కకపోవడంపై సంస్థ ఉద్యోగుల్లో చర్చనీయాంశమైంది. బడ్జెట్‌లో ప్రతిపాదించటం ద్వారా శుభవార్త అందుతుందని ఎదురు చూసిన తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు నిరాశే మిగిలింది. కేవలం 2013 వేతన సవరణకు సంబంధించి బకాయి ఉన్న బాండ్ల మొత్తం విడుదల ప్రకటన తప్ప ప్రధాన అంశాలను కనీసం మాట వరసకు కూడా ప్రస్తావించకపోవటంతో వారు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నా ఆర్టీసీ పెండింగు అంశాలపై ఎలాంటి నిర్ణయం వెలువడకపోవటంతో.. ఆర్టీసీ విషయంలో కొత్త ప్రభుత్వ పంథా ఏంటో అర్థం కాక అయోమయంలో పడిపోయారు.

మంచిమాట

"చేసిన పాపం చెప్పుకుంటే పోతుంది" ఇది జనుల వాడకంలో ఉంది, అందరి నోళ్లలోనూ నానుతూ ఉన్న మాట. పాపం అంటే ఇతరులకు అపకారం చేసినందువల్ల వచ్చే ఫలితం. దీనిని మామూలు మాటల్లో చెప్పాలంటే తప్పు. అందరూ అంగీకరించనిది. మానవమాత్రులు తప్పు చేయకుండా ఉండటం అసంభవం. తెలిసి కాకపోయినా, తెలియకుండా అయినా ఏదో ఒక తప్పు చేసే ఉంటారు.



చేసిన పాపం చెప్పుకుంటే పోతుంది

తప్పు అంటే ఏదైనా ఇతరులకి బాధ కలిగించే పని కాని, ధర్మానికి విరుద్ధమైన పని కాని చేయటం. ఎదుటివారికి మంచి అనుకుని చేసినది వారికి హాని కలిగించవచ్చు. అనుకోకుండా చేసినట్టయితే దానిని ''తప్పు అయి పోయింది'' అని ఒప్పుకొని ఎవరికి హాని కలిగిందో వారిని క్షమించమని అడిగితే సరి చేసుకునే అవకాశం ఉంటుంది. పరిహారం సమర్పించో, మరొక విధంగానో సద్దుబాటు చేసుకునే వీలు ఉంటుంది. ధర్మానికి అపచారం జరిగితే? .. .. దానిని కూడా ఒప్పుకొని పరిహారానికి ప్రయత్నం చేయాలి. ఇవి చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం అయితే పరిణామం వేరొక విధంగా ఉంటుంది.

చేసిన పాపం చెప్పుకుంటే పోతుంది అంటే తాను చెప్పుకోవటమే కాదు. ఈ పాపం గురించి పదిమంది చెప్పుకుంటే అని. ఏదైనా విషయం గురించి ఎంత మంది మాట్లాడుకుంటే దాని ఫలితాన్ని అంతమంది పంచుకుంటారు కదా! ఆ విధంగా తాను చేసిన పనికి సంబంధించిన ఫలితాన్ని ఎంతోమంది పంచుకోవటం కారణంగా కర్తకి ఆ పనివల్ల కలగవలసిన తీవ్ర నష్టం సద్దుబాటు చేయబడుతుంది.

''కర్తా కారాయితా చైవ ప్రేరకశ్చానుమోదకః / సుకృతే దుష్కృతే చైవ చత్వారిః సమ భాగినః''. కారయితలు (చేయించినవారు), ప్రేరకులు కాకపోయినా దాని గురించి మాట్లాడుకున్నవారికి కొంత ఫలితం చెందుతుంది. కనుక కర్తకి స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. కొన్ని పనుల వల్ల ఎవరికీ ఎటువంటి ఇబ్బంది ఉండదు. కాని, అది చేయకూడని పని అయితే చేయగలిగినది ఏమీ ఉండదు.

తాను చేసిన తప్పుని చెప్పటానికి ఎంతో ధైర్యం కావాలి. అటువంటి ధైర్యం ధర్మమార్గంలో నడిచే వారికి మాత్రమే ఉంటుంది. ''సత్యే ధర్మం ప్రతిష్ఠితా'', ధర్మం సత్యంలోనే నిలిచి ఉంటుంది. కనుక ఉన్నది ఉన్నట్టుగా చెప్పే వారు మాత్రమే ధర్మమార్గంలో ఉన్నట్టు. తన గొప్ప, ఘనతలు మాత్రమే కాక అపజయాలు, లోపాలు కూడా ఉన్నవి ఉన్నట్టుగా సందర్భం వచ్చినప్పుడు చెప్పగలగాలి. అప్పుడు అది ఎంతో మందికి మార్గదర్శక మౌతుంది. పొరపాట్లు ఎట్లా దొర్లుతాయి? వాటిని ఏ విధంగా అధిగమించవచ్చు? అని అవగాహన చేసుకోవటానికి గుణపాఠం అవుతుంది. తాను చేసిన పాపం అందరికీ తెలిస్తే గౌరవం తగ్గిపోతుందనే భయం ఉంటుంది సాధారణంగా. వాస్తవానికి తాత్కాలికంగా అదే జరిగినా, రాను రాను గౌరవం పెరుగుతుంది. నిజాయితీపరులు, మంచి చెడు తెలిసిన వారు అని. ఒకరి ద్వారా తెలియటం కాక తామే చెప్పటం వల్ల ఒక ఉపయోగం ఉంది. ఇతరులకి తెలిసి, వారు గోరంత విషయాన్ని కొండంత చేసి, ప్రచారం చేసే అవకాశం ఉండదు. ఈ పారదర్శకత నాయకుడుగా ఉండే వారికి తప్పని సరి.

చేసిన పాపం ఇతరులకి తెలిస్తే చులకన అయిపోతామేమో అనే ఆలోచనతో బయటికి చెప్పరు చాలమంది. చెప్పుకుంటే పరిహారం ఎట్లా చేయవచ్చో సూచనలు అందే అవకాశం ఉంటుంది. ఈ మాట అన్నంత మాత్రాన ప్రకటనలు చేయమని కాదు. శ్రేయోభిలాషుల వద్ద మనసులో ఉన్న బరువు దింపుకుంటే తేలిక అవుతుంది. లోలోపల కుమిలిపోవటం, బయట పడుతుందేమోననే భయం, ఆందోళన ఉండవు. అప్పుడు తరువాతి కర్తవ్యం గోచరిస్తుంది. ఇదంతా తప్పు చేశాననే భావన ఉన్న వారి విషయంలో. తప్పు అని ఒప్పుకోటానికే ఇష్టం లేనివారి గురించి చెప్పటానికి ఏమీ లేదు.

– ఎస్.అనంతలక్ష్మి

వాగ్గేయకార వైభవం



అమ్మా! గంగమ్మా!! నన్ను రక్షించు!!!

సర్వసాధారణంగా మనం ఏదయినా ఒక విషయాన్ని పరిశీలించాలనుకుంటే అనేక గ్రంథాలు చూడాల్సి ఉంటుంది. కానీ ప్రత్యక్షంగా అటువంటి అనుబంధం కలిగిన ఒక మహాపురుషుని నోటివెంట వచ్చిన కీర్తన అదే పెద్ద గంగ. శాబ్దిక గంగ. గంగలాగే ముత్తుస్వామి దీక్షితార్ చేసిన కీర్తన .. శాబ్దిక గంగ కూడా ప్రవహించింది. అది పెద్ద పల్లవి, పెద్ద పెద్ద చరణాలతో ఉండదు. సులభంగా ఉంటుంది.

గంగే మాం పాహి...అంటారు ఆయన. 'ఓ గంగమ్మా! నన్ను రక్షించు' అని. నిజానికి రక్షించేది ఎవరు ? దేవతలు. ఎప్పుడయినా ఏదయినా దుష్కర్మ అనుభవించాల్సి వస్తే, కష్టం తరుముకొస్తుంటే... దానిని తొలగించగలిగిన వాడు భగవంతుడు. కానీ గంగమ్మ కూడా అలాగే రక్షించగలదు–అన్న నమ్మకంతో దీక్షితార్ వారు 'అమ్మా గంగమ్మా! నన్ను రక్షించు' అన్నారు. నిజానికి ఆమె శక్తి ఏపాటిది అంటే....

భాగవతంలో పరీక్షిత్తు ఏడు రోజుల్లో మరణిస్తానని గంగానదీతీరంలో ప్రాయోపవేశం చేసాడు. దాన్ని ఆంధ్రీకరించిన పోతన ఎంత గొప్పగా చెప్పారంటే... ''అమ్మా! నిను? జూచిన నరు?/ బొమ్మా యని ముక్తి కడకు? బుత్తు వ?ట కృపన్/లెమ్మా నీ రూపముతో/ రమ్మా నా కెదుర గంగ! రమ్యతరంగా!' అంటారు. అమ్మా! అని తన వంక చూస్తే చాలట. పొమ్మా.. అని మోక్షానికి పంపించివేస్తుందట. అంతే.. పూజలు మరేమీ అఖ్కర్లేదు.' నీ రూపంతో ఒక్కసారి నాకు ఎదురుగా రామ్మా... గంగమ్మా... నిన్ను చూడాలని ఉందమ్మా.. అంటారు. ఆమె శక్తి అంత గొప్పది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

శ్రీనాథుడు కాశీఖండంలో ఓ మాటంటారు..''గంగానది, గంగానది, గంగానది...'' అని ఉచ్చరిస్తే చాలు.. అక్కడికి వెళ్ళి స్నానం కూడా చేయనక్కరలేదు. రాత్రి పడుకోబోయేముందో... పొద్దున లేస్తున్నప్పుడో... ఆ గంగానది వైభవాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ ...'గంగానది గంగానది గంగానది' అని ఎవరు తలచుకుంటారో వారి పాపాలన్నీ ఆమె తీసేస్తుంది... అంటారు. అదీ ఆమె ఘనత. గంగానదిలో ఉన్నది నీరు కాదు...ఆ నదికి ఒక అధిష్ఠాన దేవత ఉంది. ఆమె అనుగ్రహిస్తుందన్న నమ్మకం సనాతన ధర్మానిది.

దీక్షితార్ వారు'గంగే మాం పాహి' అన్నారంటే ... ఆయనకు అంత నమ్మకం. మరి ఆ నమ్మకాన్ని కలిగించినది ఎవరు... ఆయన ఏ కావ్యాలూ పఠించలేదు... ఎక్కడా చేరి చదువుకోలేదు. గురువుగారయిన చిదంబర యోగి శుశ్రూషలో తెలుసుకున్న విషయాలు అవి. గురువు గారి మీద నమ్మకం అంత గట్టిగా ఉండబట్టే... ఆయన నీవు గంగానదిలో మునిగి చెయ్యి పెట్టి తడుము... అనగానే మారుమాట మాట్లాడ కుండా వెళ్ళి వెతికితే.. ఆయనకు వీణ లభించింది .. అది ఆయనను వాగ్గేయకారుణ్ణి చేసింది. ఆ నమ్మకంతోనే ఆయన గంగమ్మను కొనియాడుతూ కీర్తన చేస్తూ... గంగేమాం పాహి!..అన్నారు. అది ఆయన నోటివెంట గంగా ప్రవాహంలా ... శాబ్దికగంగగా ప్రవహించింది. ఆయన ఎక్కడా శాస్త్రాలు చదువుకోక పోయినా ఈ కీర్తనలో ఆయన ఎన్నో పౌరాణిక విషయాలను ..అవి కూడా గాఢతతో ఉన్న విషయాలను సులభమైన భాషలో ప్రస్తావించారు.

బౌద్ధవాణి

పిచ్చుకతో పోలికా..?



వసంతకాలం వచ్చేసింది. చివురులు తొడిగిన చెట్లన్నీ పుష్పించాయి. పూత పిందెలుగా మారుతోంది. ప్రకృతి పూల పరిమళాలతో పరవశించి పోతోంది. ఆ మామిడితోటలో చల్లదనానికి తోడు చక్కని పరిమళాలు వీస్తున్నాయి. ఆ తోట ఒక అంచున పెద్ద కాలువ. నీరు బాగా ఇంకి పోయి ఉంది. పాయలు పాయలుగా సన్నని ధారలు ప్రవహిస్తున్నాయి. ఆ కాలువ గట్టు మీద పెద్ద మామిడిచెట్టు. సమయం మధ్యాహ్నం దాటింది. పొద్దు పడమటికి వాలింది. ఆ చెట్టు కింద భిక్షుగణంతో కూర్చొని ఉన్నాడు బుద్ధుడు.

భిక్షువులకి తాము తీసుకోవలసిన ఆహార నియమాల గురించి బోధిస్తున్నాడు.

''భగవాన్! నేను రోజుకు మూడు పూటలా తినేవాణ్ణి. చిన్నతనం నుండి అదే అలవాటు. బౌద్ధసంఘంలో చేరాక ఉదయం, సాయంత్రం కొన్నాళ్ళు తిన్నాను. మధ్యాహ్నం క్రమంగా మానేశాను. కొన్నాళ్ళు చాలా బాధ అనిపించింది. ఆకలికి తాళలేకపోయాను. కానీ... కొన్నాళ్ళకు అదే అలవాటైంది. ఆ తరువాత మీరు... ''రాత్రి భోజనం మానండి'' అన్నారు. నెమ్మదిగా మానేశాను. ఇప్పుడు రోజుకి ఒక్కపూట భోజనం చేస్తున్నాను. ఆరోగ్యంగా ఉన్నాను. ఉత్సాహంగా ఉన్నాను. తేలికపడ్డాను. చదువు పట్ల శ్రద్ధ పెరిగింది.'' అన్నాడు ఉదాయి అనే భిక్షువు.

అంతలో ఆ పక్కనే ఉన్న తుమ్మచెట్టు మీదనుండి పిచ్చుకల అరుపులు వినిపించాయి. కొందరు అటుకేసి చూశారు. అరుపులు నెమ్మదిగా సద్దుమణిగాయి. చిక్కని కొమ్మల్లో చిక్కుకుపోయిన పిచ్చుక నెమ్మదిగా బైటపడి, రెక్కలు దులుపుకుని లేచిపోయింది.

''భగవాన్! రాత్రిపూట చీకటిలో భిక్ష కోసం తిరగాలంటే.. ఎన్నో ఇబ్బందులు వచ్చేవి. ఒకసారి నేను మురికి గుంటలో పడ్డాను. మన ధర్మపాలుడైతే ముళ్ళ పొదలో చిక్కుకున్నాడు'' అన్నాడు ఒక భిక్షువు.

''నేనైతే... ఒకసారి దొంగలమూకతో కలసి పోయాను'' అన్నాడు ఇంకో భిక్షువు.

''భగవాన్! నా అనుభవం చెప్పడానికి మరీ ఇబ్బందికరం. ఆరోజు రాత్రి మబ్బు పట్టింది. నేను ఒకరి ఇంటికి వెళ్ళే సమయానికి పెద్ద మెరుపు మెరిసింది. ఇంటి పెరట్లో ఉన్న స్త్రీ నన్ను ఒక్కసారి చూసి భూతం అనుకొని భయపడింది. పెద్దగా అరిచింది. తెగ తిట్టి పోసింది. నేను ''చెల్లీ! నేను భిక్షువుని'' అని సర్ది చెప్పి బైటపడ్డాను'' అన్నాడు మరో భిక్షువు.

కానీ కొందరు భిక్షువులు మాత్రం అసహనంగా కూర్చొని ఉన్నారు. వారికి ఒంటిపూట భోజనం అలవాటు కావడం లేదు. మూడుపూటలా తింటే గానీ... ఆకలి శాంతించదు. కొందరు కనీసం రెండు పూటల'' అన్నారు.

అంతలో... తుమ్మచెట్టు మీద మరలా పిచ్చుకల అలజడి... చిక్కని కొమ్మల మధ్య చిక్కుకుపోయిన ఎండు పీచుల మధ్య చిక్కుకుపోయింది ఒక పిచ్చుక. అది అటూ ఇటూ కొట్టుకుంటుంది. కొట్టుకున్న కొద్దీ ఇంకా ఇంకా చిక్కుకు పోతోంది.

బుద్ధుడు నెమ్మదిగా... ''భిక్షువులారా! మీలో ఒకరు వెళ్లి ఆ బంధనాలు విడిపించండి'' అన్నాడు. ఒక భిక్షువు లాఘవంగా చెట్టెక్కి పిచ్చుక బంధనాల్ని తొలగించాడు. అది భయంతో తుర్రున ఎగిరిపోయింది.

''భిక్షువులారా! చూశారా! ఆ పిచ్చుక చిక్కుకున్న బంధాలు చిన్న చిన్న పీచులు. ఎండిపోయినవి. బలహీనమైనవి. కానీ, ఆ పిచ్చుక దాన్ని తెంచుకోలేక పోయింది.. కారణం?'' అని అడిగాడు.

''ఆ పిచ్చుక ఆ బంధనాల కంటే బలహీనమైంది'' అన్నాడు ఉదాయి.

''మరి, చాలా బలమైన గొలుసులతో తాళ్ళతో బంధించిన ఏనుగు ఆ బలమైన బంధనాన్ని సైతం తెగ తెంచుకోగలదు. ఆహారం విషయంలో మీలో కొందరు ఆ పిచ్చుకలాంటి వారే. మరికొందరు ఏనుగు లాంటివారు. కోరికల్ని తెగ తెంచుకోగలిగారు'' అన్నాడు.

''బుద్ధుడు, ఇంకా ఎందరో భిక్షువులు ఒంటిపూట భోజనంతో సంతోషంగా, ఆరోగ్యంగా, శక్తిమంతంగా ఉంటున్నారు. మేమెందుకు పిచ్చుకలంత బలహీనులం కావాలి?'' అనుకున్నారు ఆకలికి ఆగలేనివారు.

వారూ నెమ్మదిగా దాన్ని సాధించుకున్నారు. మాకు పిచ్చుకలతో పోలికా? అన్నట్లు దృఢచిత్తులయ్యారు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా


● సమంత

ఐయామ్ బ్యాక్

'ఐయామ్ బ్యాక్' అంటున్నారు సమంత. 2022లో తాను మయోసైటిస్ వ్యాధితో బాధపడుతున్నట్లుగా, ఇందుకు సంబంధించిన చికిత్స తీసుకుంటున్నట్లుగా సమంత వెల్లడించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఆ తర్వాత సమంత ఎక్కువ సినిమాలు సైన్ చేయలేదు. గత ఏడాది జూలైలో చికిత్సలో భాగంగా ఓ ఏడాది పాటు సినిమాలకు దూరంగా ఉంటానని తెలిపారు సమంత. అయితే ఇప్పుడు అనారోగ్య ఇబ్బందులు లేవనీ, పూర్తి స్థాయిలో 'ఐయామ్ బ్యాక్ టు వర్క్' అంటూ ఓ వీడియో రిలీజ్ చేశారు సమంత. గత కొన్ని నెలల విరామంలో ఆరోగ్యం గురించి కొన్ని పాడ్‌కాస్ట్‌లు చేసినట్లు, త్వరలోనే అవి విడుదల చేయనున్నట్లు కూడా ఆమె తెలిపారు. ఇక 'ది ఫ్యామిలీ మేన్ 2' వెబ్ సిరీస్ తర్వాత సమంత నటించిన 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ వెబ్ సిరీస్ ఈ వేసవిలో స్ట్రీమింగ్ కానుంది. వరుణ్ ధావన్ హీరోగా నటించిన ఈ వెబ్ సిరీస్‌కు 'ది ఫ్యామిలీమేన్' ఫేమ్ రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించారు.


● వివేక్ కూచిభొట్ల, టీజీ విశ్వప్రసాద్, రవితేజ, కావ్యా థాపర్, అవసరాల శ్రీనివాస్, కార్తీక్

నన్ను నేను నమ్మలేకపోయాను – రవితేజ

రవితేజ హీరోగా నటించిన చిత్రం 'ఈగల్'. ఇందులో కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదలైంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా సక్సెస్‌మీట్‌లో రవితేజ మాట్లాడుతూ– ''ఈగల్'కు ప్రేక్షకుల నుంచి వస్తోన్న స్పందన సంతోషాన్నిస్తోంది. కార్తీక్ 'ఈగల్' కథ చెప్పినప్పుడే సహదేవ వర్మ పాత్రకు ఎగ్జైట్ అయ్యాను. నా పాత్ర మేకోవర్‌కు మంచి ప్రశంసలు వస్తున్నాయి. సినిమాలోని కాళికాదేవి ఎపిసోడ్‌లో నన్ను నేను నమ్మలేకపోయాను. పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి అభినందనలు. హరీష్ శంకర్‌తో చేస్తున్న 'మిస్టర్ బచ్చన్' సినిమాతో ఈ బ్యానర్లో హ్యాట్రిక్ కొడుతున్నాం. కార్తీక్, కావ్యా థాపర్‌లకు మంచి భవిష్యత్ ఉంది'' అన్నారు. ''యాక్షన్ సినిమా తీయాలనే నా ఆశ రవితేజగారి 'ఈగల్'తో నెరవేరింది'' అన్నారు కార్తీక్. ''రవితేజగారితో 'ధమాకా'లాంటి బ్లాక్‌బస్టర్ ఇచ్చి, ఇప్పుడు 'ఈగల్'తో ఈ బ్లాక్‌బస్టర్‌ను కొనసాగించాం'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. దర్శకుడు హరీష్‌శంకర్, 'ఈగల్' యూనిట్ సభ్యులు ఈ సక్సెస్ సెలబ్రేషన్స్‌లో పాల్గొన్నారు.

ఇది నాకు స్పెషల్ ఫిల్మ్ – సందీప్ కిషన్

సందీప్ కిషన్ హీరోగా నటించిన ఫ్యాంటసీ అడ్వెంచరస్ మూవీ 'ఊరు పేరు భైరవకోన'. ఈ చిత్రంలో కావ్యా థాపర్, వర్ష బొల్లమ్మ కథానాయికలుగా నటించారు. వీఐ ఆనంద్ దర్శకత్వంలో అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో సందీప్ కిషన్ మాట్లాడుతూ– ''ఇది నాకు స్పెషల్ మూవీ. రెండున్నర సంత్సరాలుగా ఈ సినిమా కోసం కష్టపడుతూనే ఉన్నాం. ఫ్యాంటసీ, సూపర్ నేచురల్ ఎలిమెంట్స్ ఉన్న మంచి కమర్షియల్ సినిమా ఇది'' అన్నారు. ''ఊరు పేరు భైరవకోన' చిత్రం అద్భుతమైన జర్నీ. ఈ సినిమాలోని ప్రతి మూమెంట్ మాకు ఓ కొత్త అనుభవం. ఫ్యాంటసీ ఎలిమెంట్స్‌తో పాటు కథలో మంచి లవ్‌స్టోరీ కూడా ఉంది'' అన్నారు వీఐ ఆనంద్. ''ఈ సినిమాతో సందీప్ నెక్ట్స్ లెవల్‌కి వెళ్తాడు'' అన్నారు అనిల్ సుంకర. ''ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని ఇచ్చే చిత్రం ఇది. సాంగ్స్, ఆర్ఆర్ ప్రేక్షకులను మెప్పిస్తాయి'' అన్నారు సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర.


● వర్ష బొల్లమ్మ, సందీప్ కిషన్

స్వయంభూ కోసం స్వారీ

సవాల్ చేసే పాత్ర రావాలే కానీ ఎంత కష్టమైనా పడటానికి రెడీ అంటున్నారు సంయుక్తా మీనన్. ఆమెకు 'స్వయంభూ' సినిమా సవాల్ విసిరింది. నిఖిల్ హీరోగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ పాన్ ఇండియా మూవీలో సంయుక్తా మీనన్ కథానాయిక. ఈ చిత్రంలో చేస్తున్న ఓ లెజెండ్రీ యోధుడి పాత్ర కోసం నిఖిల్ ప్రత్యేకమైన ఆయుధాలు, మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకున్నారు. భారీ యుద్ధ సన్నివేశాలు ఉన్న ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ కూడా పోరాట సన్నివేశాలు చేయాల్సి ఉంటుంది. ఈ స్టంట్స్ చేయడానికి గుర్రపు స్వారీ నేర్చుకుంటున్నారు సంయుక్తా మీనన్. ''స్వయంభూ' కోసం గుర్రపు స్వారీ నేర్చుకుంటున్నా. ఇదొక అద్భుతమైన ప్రయాణం'' అన్నారు సంయుక్త. హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ప్రస్తుతం నిఖిల్, ఇతర తారాగణం పాల్గొనగా ఈ చిత్రం షూటింగ్ జరుగుతోంది.


● సంయుక్తా మీనన్

వినోదాల ఉత్సవం

రెజీనా కసాండ్రా, దిలీప్ ప్రకాశ్ జంటగా నటించిన చిత్రం 'ఉత్సవం'. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేష్ పాటిల్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మ్యూజిక్ ప్రమోషన్స్‌ని ప్రారంభించారు మేకర్స్. 'ఫస్ట్ కిస్..' అంటూ సాగే తొలి పాటని విడుదల చేసింది యూనిట్. చిత్ర సంగీతదర్శకుడు అనూప్ రూబెన్స్ స్వరపరచిన ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా రామ్ మిరియాల పాడారు. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''ప్రేమ, వినోదం, భావోద్వేగాలతో కూడిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'ఉత్సవం' రూపొందింది. హీరో, హీరోయిన్ల మధ్య వచ్చే 'ఫస్ట్ కిస్..' పాట యువతను ఆకట్టుకుంటుంది. యువతరంతో పాటు కుటుంబ ప్రేక్షకులందరూ చూడదగ్గ చిత్రం ఇది'' అన్నారు.


● దిలీప్ ప్రకాశ్, రెజీనా కసాండ్రా


మహేశ్ సరసన ఇండోనేషియా బ్యూటీ

హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ చిత్రం రానున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఇండోనేసియా బ్యూటీ చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ ఓ హీరోయిన్‌గా నటిస్తారనే వార్త కొన్ని రోజులుగా వస్తున్న సంగతి తెలిసిందే. ఈ వార్త నిజమయ్యే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే ఇన్‌స్టాగ్రామ్‌లో రాజమౌళిని ఫాలో అవుతున్నారు చెల్సియా. అలాగే మహేశ్‌బాబు– రాజమౌళి సినిమాల అప్‌డేట్స్‌ను ఇన్‌స్టాలో చెల్సియా ఫాలో అవుతున్నట్లుగా తెలుస్తోంది. దాంతో మహేశ్‌కు జోడీగా చెల్సియా ఆల్మోస్ట్ కన్ఫార్మ్ అంటున్నారు ఫిల్మ్‌నగర్ వాసులు. కేఎల్ నారాయణ నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది వేసవిలో ప్రారంభం కానుందట.


● చెల్సియా ఎలిజబెత్

పర్యావరణం నేపథ్యంలో...

ప్రకృతి, పర్యావరణం నేపథ్యంలో రూపొందుతున్న పాన్ ఇండియా మూవీ 'మైరా'. కన్నడంలో గుర్తింపు తెచ్చుకున్న స్మైల్ శ్రీను ఈ తెలుగు చిత్రానికి దర్శకుడు. త్రిదండి దేవనాథ రామానుజ చిన్న జీయర్ స్వామిని కలిసి 'మైరా' స్క్రిప్ట్‌కి పూజ చేయించి, ఆశీస్సులు తీసుకున్నారు శ్రీను. త్రిదండి చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ– ''ప్రకృతికి విరుద్ధంగా జీవిస్తూ, పర్యావరణాన్ని నాశనం చేస్తున్న ప్రస్తుత సమాజానికి ఉపయోగపడేలా 'మైరా' ఉంటుందని అనిపిస్తోంది'' అన్నారు. ''మైరా'కు తన ఆశీస్సులు, శిష్యుల సపోర్ట్ ఉంటుందని దేవనాథ రామానుజ జీయర్ స్వామివారు చెప్పడం ఆనందంగా ఉంది. ఈ సినిమాను తెలుగులో తీసి, కన్నడతో పాటు ఇతర భాషల్లో అనువాదం చేస్తాం. ఓ స్టార్ హీరోయిన్ మా సినిమాలో నటిస్తారు'' అన్నారు స్మైల్ శ్రీను.


● దేవనాథ రామానుజ చిన్న జీయర్ స్వామి, స్మైల్ శ్రీను

టీఎఫ్‌డీఏ నూతన అధ్యక్షుడిగా వీరశంకర్

తెలుగు సినీ దర్శకుల సంఘం (టీఎఫ్‌డీఏ) సంఘం నూతన అధ్యక్షుడిగా దర్శకుడు బి. వీరశంకర శ్రీనివాస్ (వీరశంకర్) గెలుపొందారు. 2024–2026 సంవత్సరాలకు గాను ఆదివారం హైదరాబాద్‌లో టీఎఫ్‌డీఏ ఎన్నికలు జరిగాయి. దర్శకుల సంఘంలో దాదాపు 2000 మంది సభ్యులున్నారు. ఎన్నికల్లో 1113 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్ష పదవికి బి. వీరశంకర శ్రీనివాస్, వి. సముద్రరావు, జి. రామ్ ప్రసాద్, ఏఎస్ రవికుమార్ చౌదరి, పానుగంటి రాజారెడ్డి పోటీ చేశారు. ఈ పోటీలో 536 ఓట్లతో వీరశంకర్ విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా నీలం సాయిరాజేశ్, ఎమ్‌వీఎన్ రెడ్డి (వశిష్ఠ), జనరల్ సెక్రటరీగా సీహెచ్ సుబ్బారెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా వద్దానం రమేశ్, కస్తూరి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పీఎస్ ప్రియదర్శి, డి. వంశీకృష్ణ జయకేతనం ఎగురవేశారు. ట్రెజరర్‌గా పీవీ రామారావు గెలుపొందారు. కార్యవర్గ సభ్యులుగా ఎ. కృష్ణమోహన్, అల్లా భక్ష్, రాజా వన్నెంరెడ్డి, శైలేష్ కొలను, శ్రీరామ్ ఆదిత్య తుర్లపాటి, కూరపాటి రామారావు, లక్ష్మణరావు చాపర్ల, ప్రవీణ మడిపల్లి, రమణ మొగిలి, కొండా విజయ్ కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం నూతన అధ్యక్షుడు వీరశంకర్ మాట్లాడుతూ– ''తెలుగు దర్శకుల సంఘం స్థాయిని నెక్ట్స్ లెవల్‌కి తీసుకుని వెళ్లేందుకు అందరం కలిసి కృషి చేస్తాం. ఇప్పుడు ఉన్న టీఎఫ్‌డీఏను 'టీఎఫ్‌డీఏ 2.ఓ' అన్నట్లుగా వర్క్ చేస్తాం. హైదరాబాద్‌కు ఎవరైనా పర్యాటకులు వస్తే టీఎఫ్‌డీఏ బిల్డింగ్ ముందు సెల్ఫీ తీసుకోవాలన్నట్లుగా చేస్తాం. మంచి ఆలోచనలుంటే ప్రభుత్వ సహకారం కూడా లభిస్తుంది'' అన్నారు.


● వీరశంకర్

ప్రజా సేవలో..

నంద కిశోర్, రోజా హీరో హీరోయిన్లుగా దుర్గా దేవ్ నాయుడు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ప్రవీణ్ ఐపీఎస్'. 'ఇక ప్రజా సేవలో..' అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఈ సినిమా ట్రైలర్‌ను దర్శకుడు సి. ఉమామహేశ్వరరావు, నిర్మాత వివేక్ కూచిభొట్ల రిలీజ్ చేశారు. ''విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ప్రవీణ్‌గారిలా వెండితెరపై కనిపించేందుకు ప్రయత్నం చేశాను'' అన్నారు నంద కిశోర్. ''ఇది నా తొలి చిత్రం'' అన్నారు దుర్గా దేవ్.


● నంద కిశోర్



చెన్నై ఓపెన్ చాంపియన్ సుమిత్ నగాల్

భారత టెన్నిస్ నంబర్‌వన్ సుమిత్ నగాల్ స్వదేశంలో తొలిసారి ఏటీపీ చాలెంజర్ టోర్నీ టైటిల్‌ను సాధించాడు. ఆదివారం ముగిసిన చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టోర్నీలో సుమిత్ విజేతగా నిలిచాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 121వ ర్యాంకర్ సుమిత్ 6-1, 6-4తో 114వ ర్యాంకర్ లుకా నార్డీ (ఇటలీ)పై గెలిచి తన కెరీర్‌లో నాలుగో ఏటీపీ చాలెంజర్ టోర్నీ టైటిల్ సాధించాడు. విజేతగా నిలిచిన సుమిత్‌కు 18,230 డాలర్ల (రూ. 15 లక్షల 13 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 100 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

భారత్‌ను గెలిపించిన శ్రీజేశ్

పురుషుల ప్రొ హాకీ లీగ్‌లో భాగంగా ఆదివారం భువనేశ్వర్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 'షూటౌట్'లో 4-2తో డిఫెండింగ్ చాంపియన్ నెదర్లాండ్స్‌కు షాక్ ఇచ్చింది. ఈ టోర్నీలో భారత్‌కిది రెండో విజయం. 'షూటౌట్'లో గోల్‌కీపర్ శ్రీజేశ్ నెదర్లాండ్స్ జట్టు రెండు ప్రయత్నాలను నిలువరించి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. అంతకుముందు నిర్ణీత సమయం ముగిసేసరికి రెండు జట్లు 2-2తో సమంగా నిలిచాయి.





ఉదయ్

కుర్రాళ్లూ వదిలేశారు

- అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో యువ భారత్ ఓటమి
- అన్నీ గెలిచి తుది మెట్టుపై బోల్తా పడ్డ టీమిండియా
- నాలుగోసారి టైటిల్ నెగ్గిన ఆస్ట్రేలియా

అచ్చు సీనియర్లలాగే... జూనియర్లూ సమర్పించుకున్నారు. ఆఖరి పోరు దాకా అజేయంగా నిలిచిన యువ భారత్ జట్టు ఆఖరి మెట్టుపై మాత్రం ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. గతేడాది వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ బృందం కూడా ఎదురులేని పోరాటంతో ఫైనల్ చేరింది. చివరకు ఆస్ట్రేలియా చేతిలోనే కంగుతింది. ఇక్కడా భారత జూనియర్ జట్టు ఫైనల్ చేరే క్రమంలో అన్ని మ్యాచ్‌ల్లో గెలిచి కీలకమైన తుది పోరులో ఆస్ట్రేలియా జట్టు చేతిలోనే ఓటమి చవిచూసింది. వెరసి మూడు నెలల వ్యవధిలో ఆస్ట్రేలియా సీనియర్, జూనియర్ జట్లు వన్డే ప్రపంచకప్ టైటిల్స్‌ను హాట్ ఫేవరెట్ అయిన భారత్‌పైనే గెలవడం పెద్ద విశేషం.



బెనోని (దక్షిణాఫ్రికా): ప్రపంచకప్ కోసం ప్రతీ మ్యాచ్‌లో చిందించిన చెమటంతా ఫైనల్‌కు వచ్చేసరికి ఆవిరైంది. యువ భారత్ జైత్రయాత్ర కప్ అందుకోవాల్సిన మ్యాచ్‌లో పేలవంగా ముగిసింది. అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ 79 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. మొదట ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగులు చేసింది. హర్జస్ సింగ్ (55; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ హ్యూగ్ వీగెన్ (48; 5 ఫోర్లు) రాణించారు. సీమర్లు రాజ్ లింబాని 3, నమన్ తివారి 2 వికెట్లు తీశారు. గతంలో ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచిన భారత జట్టు లక్ష్య ఛేదనలో తడబడింది. చివరకు 43.5 ఓవర్లలో 174 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ ఆదర్శ్ సింగ్ (77 బంతుల్లో 47; 4 ఫోర్లు, 1 సిక్స్), హైదరాబాద్ కుర్రాడు మురుగన్ అభిషేక్ (46 బంతుల్లో 42; 5 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బియర్డ్‌మన్ (3/15) కోలుకోలేని దెబ్బ తీయగా, రాఫ్ మెక్‌మిలన్ (3/43) ఇంకెవరినీ క్రీజులో నిలువనీయలేదు.

చక్కగా కట్టడి చేసినప్పటికీ...

టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా బ్యాటర్లెవరూ భారీ స్కోర్లు చేయకుండా భారత బౌలర్లు చక్కగానే కట్టడి చేశారు. హర్జస్ అర్ధసెంచరీ సాధించగా, వీగెన్, డిక్సన్ (56 బంతుల్లో 42; 3 ఫోర్లు, 1 సిక్స్), ఒలీవర్ (43 బంతుల్లో 46 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్)లను అర్ధశతకాల వరకు రానివ్వలేదు. లింబాని, నమన్ వరుస విరామాల్లో వికెట్లు తీశారు. అందువల్లే పెద్దస్కోరైతే నమోదు కాలేదు.


ఆదర్శ్

రాణించిన ఆదర్శ్, అభిషేక్

కష్టమైన లక్ష్యం కాదు... ఈ మెగా ఈవెంట్‌లో మన కుర్రాళ్ల ఫామ్ ముందు ఛేదించే లక్ష్యమే! పెద్దగా కష్టపడకుండా ఏ ఇద్దరు ఫిఫ్టీలు బాదినా... ఇంకో ఇద్దరు 30 పైచిలుకు పరుగులు చేసినా చాలు గెలవాల్సిన మ్యాచ్ ఇది! కానీ టాపార్డర్‌లో అర్షిన్ (3), ముషీర్ ఖాన్ (22), మిడిలార్డర్‌లో నమ్మదగిన బ్యాటర్లు కెప్టెన్ ఉదయ్ సహారణ్ (8), సచిన్ దాస్ (8)ల వికెట్లను పారేసుకోవడంతో 68/4 స్కోరు వద్దే భారత్ పరాజయం ఖాయమైంది. ఎందుకంటే తర్వాత వచ్చిన వారెవరూ సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు ఆడలేనివారే! ఆదర్శ్, అభిషేక్‌ల పోరాటం అంతరాన్ని తగ్గించేందుకు ఉపయోగపడింది.

1 అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో భారత్‌పై నెగ్గడం ఆస్ట్రేలియాకిదే తొలిసారి. ఈ రెండు జట్లు 2012, 2018 టోర్నీ ఫైనల్స్‌లోనూ తలపడగా రెండుసార్లూ భారత జట్టే గెలిచింది.

4 అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో భారత్‌ను ఓడించిన నాలుగో జట్టు ఆస్ట్రేలియా. గతంలో పాకిస్తాన్ (2006), వెస్టిండీస్ (2016), బంగ్లాదేశ్ (2020) ఫైనల్లో ఓడించి విజేతగా నిలిచాయి.

4 అండర్-19 ప్రపంచకప్ సాధించడం ఆస్ట్రేలియాకిది నాలుగోసారి. గతంలో ఆ జట్టు 1988, 2002, 2010లలో విజేతగా నిలిచింది.

2012 భారత అండర్-19 జట్టుపై 2012 తర్వాత ఆస్ట్రేలియా యువ జట్టు మళ్లీ గెలుపొందడం విశేషం. గత 12 ఏళ్లలో ఆస్ట్రేలియా జూనియర్ జట్టుతో ఆడిన 10 మ్యాచ్‌ల్లోనూ యువ భారత్ విజయం సాధించింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: డిక్సన్ (సి) అభిషేక్ (బి) తివారి 42; కొన్‌స్టాస్ (బి) లింబాని 0; వీగెన్ (సి) ముషీర్ (బి) తివారి 48; హర్జస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సౌమీ పాండే 55; హిక్స్ (ఎల్బీడబ్ల్యూ) (బి) లింబాని 20; ఒలీవర్ (నాటౌట్) 46; మెక్‌మిలన్ (సి అండ్ బి) ముషీర్ 2; ఆండర్సన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) లింబాని 13; స్ట్రేకర్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 253. వికెట్ల పతనం:** 1-16, 2-94, 3-99, 4-165, 5-181, 6-187, 7-221. **బౌలింగ్:** రాజ్ లింబాని 10-0-38-3, నమన్ తివారి 9-0-63-2, సౌమీ పాండే 10-0-41-1, ముషీర్ 9-0-46-1, అభిషేక్ 10-0-37-0, ప్రియాన్షు 2-0-17-0.

భారత్ ఇన్నింగ్స్: ఆదర్శ్ (సి) హిక్స్ (బి) బియర్డ్‌మన్ 47; అర్షిన్ (సి) హిక్స్ (బి) విడ్లెర్ 3; ముషీర్ (బి) బియర్డ్‌మన్ 22; ఉదయ్ (సి) వీగెన్ (బి) బియర్డ్‌మన్ 8; సచిన్ (సి) హిక్స్ (బి) మెక్‌మిలన్ 9; ప్రియాన్షు (సి) విడ్లెర్ (బి) ఆండర్సన్ 9; అవనీశ్ రావు (సి అండ్ బి) మెక్‌మిలన్ 0; అభిషేక్ (సి) వీగెన్ (బి) విడ్లెర్ 42; లింబాని (బి) మెక్‌మిలన్ 0; నమన్ (నాటౌట్) 14; సౌమీ (సి) హిక్స్ (బి) స్ట్రేకర్ 2; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (43.5 ఓవర్లలో ఆలౌట్) 174. వికెట్ల పతనం:** 1-3, 2-40, 3-55, 4-68, 5-90, 6-91, 7-115, 8-122, 9-168, 10-174. **బౌలింగ్:** విడ్లెర్ 10-2-35-2, ఆండర్సన్ 9-0-42-1, స్ట్రేకర్ 7.5-1-32-1, బియర్డ్‌మన్ 7-2-15-3, మెక్‌మిలన్ 10-0-43-3.

ఎలైట్ డివిజన్‌కు హైదరాబాద్, మేఘాలయ

రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ టైటిల్ పోరుకు అర్హత


తనయ్

సాక్షి, హైదరాబాద్: వరుసగా ఆరో మ్యాచ్‌లోనూ ఇన్నింగ్స్ తేడాతో విజయం సాధించిన హైదరాబాద్ జట్టు రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తద్వారా వచ్చే సీజన్‌లో ఎలైట్ డివిజన్‌లో పోటీపడేందుకు అర్హత సంపాదించింది. ఉప్పల్ స్టేడియంలో నాగాలాండ్ జట్టుతో ఆదివారం ముగిసిన తొలి సెమీఫైనల్లో హైదరాబాద్ ఇన్నింగ్స్ 68 పరుగుల తేడాతో గెలిచింది. మరోవైపు రెండో సెమీఫైనల్లో మేఘాలయ ఆరు వికెట్ల తేడాతో మిజోరం జట్టును ఓడించి హైదరాబాద్‌తో టైటిల్ పోరుకు సిద్ధమైంది. ఫైనల్ చేరడంతో మేఘాలయ జట్టు కూడా వచ్చే సీజన్‌లో ఎలైట్ డివిజన్‌లో ఆడుతుంది. హైదరాబాద్‌తో జరిగిన సెమీఫైనల్లో మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 20/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన నాగాలాండ్ 58.3 ఓవర్లలో 188 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ 81 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టగా... కెప్టెన్ తిలక్ వర్మ 30 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు.

మ్యాక్స్‌వెల్ మెరుపు సెంచరీ



అడిలైడ్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆస్ట్రేలియా జట్టు వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన రెండో టి20లో ఆస్ట్రేలియా 34 పరుగుల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 241 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ మ్యాక్స్‌వెల్ (55 బంతుల్లో 120 నాటౌట్; 12 ఫోర్లు, 8 సిక్స్‌లు) అసాధారణ బ్యాటింగ్‌తో ఐదో సెంచరీ చేశాడు. తద్వారా అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా రోహిత్ శర్మ (5 సెంచరీలు) పేరిట ఉన్న రికార్డును మ్యాక్స్‌వెల్ సమం చేశాడు. 242 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 207 పరుగులు చేసి ఓడిపోయింది.

భారీ ఆధిక్యంలో ఆంధ్ర


రికీ భుయ్

సాక్షి, విజయనగరం: ఉత్తరప్రదేశ్ జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ డివిజన్ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 334 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 19/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర మూడో రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్లు కోల్పోయి 271 పరుగులు చేసింది. కెప్టెన్ రికీ భుయ్ (100 బ్యాటింగ్; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతకం సాధించాడు. రషీద్ (42 బ్యాటింగ్; 5 ఫోర్లు)తో కలిసి భుయ్ ఆరో వికెట్‌కు 87 పరుగుల భాగస్వామ్యం జోడించాడు. విహారి (48; 6 ఫోర్లు), షోయబ్ (31; 6 ఫోర్లు) కూడా రాణించారు.

నిఖత్‌కు రజతం



సోఫియా: స్ట్రాంజా స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో భారత్‌కు రెండు స్వర్ణాలు, నాలుగు రజతాలు లభించాయి. మహిళల 50 కేజీల ఫైనల్లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ 2-3తో సబీనా (ఉజ్బెకిస్తాన్) చేతిలో, 66 కేజీల ఫైనల్లో అరుంధతి 1-4తో లి యంగ్ (చైనా) చేతిలో ఓడి రజత పతకాలను దక్కించుకున్నారు. పురుషుల 51 కేజీల ఫైనల్లో అమిత్ 5-0తో తష్కెంబే (కజకిస్తాన్)పై, 57 కేజీల ఫైనల్లో సచిన్ 5-0తో షఖ్‌జోద్ (ఉజ్బెకిస్తాన్)పై నెగ్గి స్వర్ణాలు సాధించారు. ఫైనల్స్‌లో బరున్ సింగ్ (48 కేజీలు), రజత్ (67 కేజీలు) ఓడి రజత పతకాలు గెలిచారు.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

నంద్యాల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో 13 పోస్టులు

నంద్యాల జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం..ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 13
» **పోస్టుల వివరాలు:** సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్-01, కేస్ వర్కర్-02, పారా లీగల్ పర్సనల్ లాయర్-01, పారా మెడికల్ పర్సనల్-01, సైకోసోషల్ కౌన్సిలర్-01, ఆఫీస్ అసిస్టెంట్-01, మల్టీ పర్పస్ స్టాఫ్/కుక్-03, సెక్యూరిటీ గార్డ్/నైట్ గార్డ్-03.
» **అర్హత:** హైస్కూల్, డిగ్రీ, పీజీ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 25 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును నంద్యాల జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 12.02.2024.
» **వెబ్‌సైట్:** https://nandyal.ap.gov.in

ఏఎన్‌యూ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్-2024

గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో సెల్ఫ్ సపోర్ట్ విధానంలో బీటెక్+ఎంటెక్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వివరాలు:** బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్.
» **మొత్తం సీట్ల సంఖ్య:** 510.
» **విభాగాలు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ.
» **అర్హత:** కనీసం 45శాతం మార్కులతో మ్యాథమేటిక్స్,ఫిజిక్స్,కెమిస్ట్రీతో 10+2 ఉత్తీర్ణులై ఉండాలి
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్, కౌన్సెలింగ్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **పరీక్ష విధానం:** మొత్తం 100 ప్రశ్నలు ఉంటాయి. మ్యాథ్స్(40 ప్రశ్నలు), ఫిజిక్స్(30 ప్రశ్నలు),కెమిస్ట్రీ(30 ప్రశ్నలు)సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు.ఇంగ్లిష్ మాధ్యమంలో పరీక్ష ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.03.2024
» **ఆలస్య రుసుము రూ.750తో ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.03.2024.
» **ఆలస్య రుసుము రూ.1250తో ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.03.2024.
» **హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేది:** 01.04.2024
» **ప్రవేశ పరీక్షతేది:** 07.04.2024.
» **ఫలితాల వెల్లడి తేది:** 10.04.2024.
» **వెబ్‌సైట్:** www.anucet.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సుల వివరాలు:** లైబ్రరీ ఆటోమేషన్ అండ్ నెట్‌వర్కింగ్‌లో డిప్లొమా; డిప్లొమా ఇన్ సైబర్ లాస్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్; డిప్లొమా ఇన్ కమ్యూనికేషన్ ఇంగ్లిష్; డిప్లొమా ఇన్ క్రిమినల్ జస్టిస్ అండ్ ఫోరెన్సిక్ సైన్స్; డిప్లొమా ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్; డిప్లొమా ఇన్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్; డిప్లొమా ఇన్ పంచాయతీరాజ్ గవర్నెన్స్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్; డిప్లొమా ఇన్ ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్; డిప్లొమా ఇన్ కమ్యూనిటీ ఐ హెల్త్; డిప్లొమా ఇన్ టెలికాం టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్.
» **కోర్సు వ్యవధి:** ఏడాది.
» **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.02.2024
» **వెబ్‌సైట్:** cdvl.uohyd.ac.in

ఓయూ దూరవిద్యలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ జి.రామ్ రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్.. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి దూరవిద్య విధానంలో(ఫేజ్-2) డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సుల వివరాలు:** ఎంబీఏ, ఎంసీఏ; ఎంఏ: హిందీ, ఉర్దూ, తెలుగు, సంస్కృతం, ఇంగ్లిష్, ఫిలాసఫీ, సోషియాలజీ, పబ్లిక్ పర్సనల్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ; ఎంఎస్సీ: మ్యాథ్స్, స్టాటిస్టిక్స్; ఎంకాం, బీఏ; బీకాం; బీబీఏ; అడ్వాన్స్‌డ్ డిప్లొమా: మ్యాథమేటిక్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్ అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ బయోఇన్ఫర్మేటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, డేటా సైన్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్, వేదిక్ ఆస్ట్రాలజీ; అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా: వేదిక్ ఆస్ట్రాలజీ; సర్టిఫికేట్ కోర్సు: యోగా.
» **అర్హత:** కోర్సును అనుసరించి పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఫేజ్-2 అడ్మిషన్లకు చివరితేది:** 31.03.2024.
» **వెబ్‌సైట్:** www.oucde.net

టెట్‌కు సిద్ధమా

» ఏపీలో టెట్ నోటిఫికేషన్ విడుదల
» ఫిబ్రవరి 27 నుంచి మార్చి 9 వరకు పరీక్షలు
» డీఎస్సీ నియామకాల్లో టెట్‌కు 20 శాతం వెయిటేజీ
» మెథడాలజీ, పెడగాజీలే మంచి మార్కులకు కీలకం



టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్.. 'టెట్'గా సుపరిచితమైన పరీక్ష! బీఈడీ, డీఈడీ పూర్తి చేసి.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ కొలువులు సొంతం చేసుకోవాలనుకునే వారు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సిన పరీక్ష! టెట్‌లో పొందిన మార్కులకు డీఎస్సీ ద్వారా చేపట్టే టీచర్ నియామక ప్రక్రియలో 20 శాతం వెయిటేజీ లభిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా ఏపీ టెట్-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఏపీ టెట్ వివరాలు, పరీక్ష విధానం, పరీక్షలో రాణించేందుకు ప్రిపరేషన్ తదితర వివరాలు..

టెట్ ఉత్తీర్ణతతోనే.. డీఎస్సీకి అర్హత

ఎన్‌సీటీఈ, విద్యా శాఖ నిబంధనల ప్రకారం-టెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తేనే.. డీఎస్సీకి అర్హత లభిస్తుంది. డీఎస్సీ నిర్వహణకు రంగం సిద్ధం చేసిన ఏపీ సర్కారు.. టెట్ నిర్వహణ సైతం చేపడుతోంది. దీనిద్వారా ఇప్పటి వరకు టెట్‌లో ఉత్తీర్ణత సాధించని వారికి మరో అవకాశం కల్పించినట్లయింది. అంతేకాకుండా టెట్ స్కోర్‌కు జీవిత కాల గుర్తింపు ఉంటుంది.

నాలుగు పేపర్లుగా టెట్

ఏపీ టెట్‌ను పేపర్-1ఎ, 1బి, పేపర్-2ఎ, 2బిల పేరుతో మొత్తం నాలుగు పేపర్లుగా నిర్వహించనున్నారు. బోధన తరగతుల వారీగా అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించాల్సిన విధంగా ఈ పేపర్లను వర్గీకరించారు. ఆ వివరాలు..

- **పేపర్-1ఎ:** ఒకటి నుంచి అయిదో తరగతి వరకు ఉపాధ్యాయులుగా బోధించాలనుకునే వారు హాజరవ్వాల్సిన పేపర్.
- **పేపర్-1బి:** ఒకటి నుంచి అయిదో తరగతి వరకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా బోధించాలనుకునే వారు హాజరవ్వాల్సిన పేపర్.
- **పేపర్-2ఎ:** ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు స్కూల్ అసిస్టెంట్‌గా బోధించాలనుకునే వారు ఉత్తీర్ణత సాధించాల్సిన పేపర్.
- **పేపర్-2బి:** ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్‌గా బోధించాలనుకునే వారు హాజరు కావల్సిన పరీక్ష.

అర్హతలు

ఆయా పేపర్‌ను బట్టి ఇంటర్మీడియెట్, బ్యాచిలర్స్ డిగ్రీ, పీజీతోపాటు డీఈడీ /బీఈడీ/లాంగ్వేజ్ పండిట్ లేదా తత్సమానం తదితర అర్హతలు ఉండాలి. సదరు అర్హత పరీక్షల్లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.

లాంగ్వేజ్ టీచర్ అర్హతలివే

ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు.. లాంగ్వేజ్ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు సదరు లాంగ్వేజ్ ఆప్షనల్ సబ్జెక్ట్‌గా బ్యాచిలర్ డిగ్రీ లేదా బ్యాచిలర్ ఆఫ్ ఓరియెంటల్ లాంగ్వేజ్ ఉతీర్ణులవ్వాలి. లేదా.. సంబంధిత లాంగ్వేజ్‌లో పీజీ ఉత్తీర్ణతతోపాటు లాంగ్వేజ్ పండిట్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సు లేదా సదరు లాంగ్వేజ్ మెథడాలజీతో బీఈడీలో ఉత్తీర్ణత తప్పనిసరి.

టెట్ పేపర్లు-పరీక్ష విధానాలు

- **పేపర్-1ఎ, 1బి:**
పేపర్-1ఎ, పేపర్-1బిలను అయిదు విభాగాల్లో 150 మార్కులకు నిర్వహిస్తారు. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ; లాంగ్వేజ్-1, లాంగ్వేజ్-2, మ్యాథమెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ సబ్జెక్ట్‌లు ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 150 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. లాంగ్వేజ్-1 సబ్జెక్ట్ కింద తెలుగు, ఉర్దూ, హిందీ, బెంగాలీ, కన్నడ, మరాఠి, తమిళం, గుజరాతీ లాంగ్వేజ్‌లను ఎంచుకోవచ్చు.
- **పేపర్-2ఎ:**
ఈ పేపర్‌లో నాలుగు విభాగాలు ఉంటాయి. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ 30 ప్రశ్నలు-30 మార్కులు; లాంగ్వేజ్-1, 30 ప్రశ్నలు-30 మార్కులు; లాంగ్వేజ్-2, ఇంగ్లిష్ 30 ప్రశ్నలు-30 మార్కులు; సంబంధిత సబ్జెక్ట్, 60 ప్రశ్నలు-60 మార్కులకు పరీక్ష ఉంటుంది. మొత్తం 150 ప్రశ్నలు-150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. నాలుగో విభాగంగా నిర్వహించే సంబంధిత సబ్జెక్ట్ విషయంలో.. మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ టీచర్స్ అభ్యర్థులు మ్యాథ్స్ అండ్ సైన్స్ విభాగాన్ని; సోషల్ టీచర్లు సోషల్ స్టడీస్ విభాగాన్ని, లాంగ్వేజ్ టీచర్లు సంబంధిత లాంగ్వేజ్‌ను ఎంచుకుని పరీక్ష రాయాలి.
- **పేపర్-2బి:**
పేపర్-2బిని కూడా పేపర్-2ఎ మాదిరిగా నాలుగు విభాగాల్లో నిర్వహిస్తారు. మొదటి మూడు విభాగాలు పేపర్-2ఎ లోనివే ఉంటాయి. నాలుగో విభాగంగా మాత్రం.. డిజేబిలిటీ స్పెషలైజేషన్ సబ్జెక్ట్ అండ్ పెడగాజీ ఉంటుంది. ఈ విభాగంలో 60 మార్కులకు-60 ప్రశ్నలతో పరీక్ష నిర్వహిస్తారు. మొత్తం నాలుగు విభాగాలు కలిపి 150 ప్రశ్నలతో 150 మార్కులకు పరీక్ష ఉంటుంది. నాలుగో విభాగంలో అభ్యర్థులు తాము స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో చదివిన సబ్జెక్ట్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. అన్ని పేపర్లు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. ప్రతి పేపర్‌కు 2:30 గంటల సమయం అందుబాటులో ఉంటుంది.

కనీస అర్హత మార్కుల నిబంధన

టెట్‌లో.. అన్ని పేపర్లకు సంబంధించి కనీస ఉత్తీర్ణత మార్కులు పొందాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం అరవై శాతం మార్కులతో, బీసీ కేటగిరీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల కేటగిరీలకు చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులు సాధించాలి.

ఏపీ టెట్-2024 ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఫిబ్రవరి 18
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్:** ఫిబ్రవరి 23 నుంచి
- **టెట్ తేదీలు:** 2024 ఫిబ్రవరి 27 - మార్చి 9
- **ఫలితాల వెల్లడి:** 2024, మార్చి 14
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://aptet.apcfss.in

మంచి మార్కులకు మార్గమిదే

చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి

ఈ విభాగంలో శిశువు మనస్తత్వం సంబంధిత అంశాలపై దృష్టి పెట్టాలి. వికాస దశలు, వికాస అంశాలైన శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలు మొదలైన అంశాలను క్షుణ్నంగా చదవాలి. శిశువు ప్రవర్తనలో మార్పునకు సంబంధించిన అభ్యాసం, అభ్యసన బదలాయింపు అంశాలను చదవాలి. ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం-నాయకత్వం-గైడెన్స్-కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి.

లాంగ్వేజ్-1,2

లాంగ్వేజ్-1లో అభ్యర్థులు తాము ఎంచుకున్న భాషలో.. అదే విధంగా లాంగ్వేజ్-2గా పేర్కొన్న ఇంగ్లిష్‌లో భాషా విభాగాలకు సంబంధించిన సాధారణ వ్యాకరణ అంశాలు, బోధన పద్ధతులపై ప్రశ్నలు ఉంటాయి. స్కూల్ స్థాయిలో తెలుగు సబ్జెక్ట్ పుస్తకాలతో పాటు తెలుగు బోధన పద్ధతులను చదవాలి. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్ అండ్ ఇన్ డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ .. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

మ్యాథమెటిక్స్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

పేపర్-1లో ఉండే ఈ సబ్జెక్టుల్లో ప్రాథమిక అంశాలపై ఒకటి నుంచి అయిదో తరగతి స్థాయి వరకు; పేపర్-2లో మ్యాథమెటిక్స్, సైన్స్‌పై ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నల క్లిష్టత ఇంటర్ స్థాయిలో ఉంటుంది. ఎన్విరాన్‌మెంటల్ పేపర్‌లో సైన్స్‌తోపాటు సమకాలీన అంశాలపైనా ప్రశ్నలు ఎదురవుతాయి. కాబట్టి అభ్యర్థులు ఏపీ ప్రాధాన్యం ఉన్న అంశాలను ప్రత్యేక దృష్టితో చదవడం లాభిస్తుంది.

సైన్స్

ఎనిమిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలు ఔపోసన పట్టాలి. పేపర్-2 కోసం ప్రత్యేకంగా ఆరు నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు చదవాలి. అదే విధంగా ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్ వంటివి ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

సోషల్ స్టడీస్

హైస్కూల్ స్థాయి పాఠ్య పుస్తకాలను చదవాలి. అదే విధంగా ఒక అంశానికి సంబంధించి అన్ని కోణాల్లోనూ అధ్యయనం చేయాలి. ఉదాహరణకు సివిక్స్‌కు సంబంధించి రాజ్యాంగంలోని ఆర్టికల్స్ మొదలు.. తాజా సవరణల వరకు సమన్వయంతో చదవాలి.

మెథడాలజీ

ఈ విభాగంలో ప్రధానంగా బోధనా పద్ధతులు; టీచర్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం); బోధన ఉద్దేశాలు, విలువలు, లక్ష్యాలను చదవాలి. పేపర్-1, పేపర్-2లో అడిగే అంశాలు ఒక్కటే అయినా.. వాటి క్లిష్టత స్థాయిలో తేడా ఉంటుంది. దీన్ని గుర్తించి ప్రిపరేషన్ కొనసాగించాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	167	71,595
నిఫ్టీ ▲	65	21,783

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	15,991	▲	197
డోజోన్స్	38,672	▼	55
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,573	▼	23
డాక్స్	16,927	▼	37
షాంఘై (బుధవారం ముగింపు)	2,866	▲	36
నికాయ్	36,897	▲	67

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.57	83.59
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.55	106.09
€	యూరో	ఎస్‌బీఐ	88.33	90.67
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.00	54.94
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	43.00	68.00
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.36	64.06
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.71	23.50
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.42	12.50

ఆర్థిక విజయానికి రామబాణం



- సవాళ్లను ఎదుర్కోవాల్సిందే
- రిస్క్ నిర్వహణ తెలియాలి
- పెట్టుబడుల్లో తగినంత వైవిధ్యం
- నిపుణుల మార్గదర్శకం అవసరం
- సన్మార్గంలోనే సంపద సృష్టి

కోట్లాది మంది దశాబ్దాల స్వప్నం సాకారమై, అయోధ్యలో బాలరాముడు కొలువు దీరాడు. రామాయణాన్ని గృహస్థ ధర్మానికి అద్భుతమైన నిదర్శనంగా పేర్కొంటారు. శ్రీరాముడి జీవన మార్గాన్ని పరిశీలించి చూస్తే వ్యక్తిగత ఆర్థిక విషయాల్లో ఎలా నడుచుకోవాలనే విషయమై విలువైన పాఠాలు కనిపిస్తాయి. శ్రీరాముడిని విశ్వసించే ప్రతి ఒక్కరూ, తమ ఆర్థిక విజయానికి కావాల్సిన సూత్రాలను రామాయణం నుంచి తీసుకోవచ్చు.

రాముడి వనవాసం.. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు తగిన ప్రణాళిక అవసరాన్ని గుర్తు చేస్తుంది. వ్యక్తిగత ఆర్థిక జీవితానికి ఆలోచనాత్మక ఆర్థిక ప్రణాళిక ఎంతో అవసరమని నిపుణులు తరచూ సూచిస్తుంటారు. ఆర్థిక లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవడం, వాటికి తగిన బడ్జెట్ కేటాయించుకోవడం, వ్యూహాత్మకంగా పెట్టుబడులు పెట్టడం వల్ల జీవితంలో అనిశ్చితులు ఎదురైనా, వాటిని సులభంగా అధిగమించొచ్చు. ఎన్ని కష్టాలు ఎదురైనా రాముడు తన బాధ్యతలను ఏనాడూ విస్మరించలేదు. అందుకే ఊహించని పరిస్థితులు ఎదురైతే వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవడం ఎలా అన్నది రాముడి చేసి చూపించాడు. మనం కూడా ఆర్థిక ప్రణాళిక ఆధారంగా జీవితంలో ఎదురయ్యే సవాళ్లకు సన్నద్ధత ఏర్పాటు చేసుకోవాలి. జీవితానికి తగినంత బీమా కవరేజీ, ఆరోగ్య బీమా తీసుకోవాలి. అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి. జీవిత లక్ష్యాలు, అందుకు కావాల్సిన మొత్తం, చేయాల్సిన పెట్టుబడి, వివిధ సాధనాల మధ్య రిస్క్ ఆధారంగా కేటాయింపులు.. వీటన్నింటికీ ఆర్థిక ప్రణాళిక మార్గం చూపిస్తుంది.

హద్దులకు కట్టుబడి ఉండడం

సంపద సృష్టి కోరుకునే వారు అందుకు అడ్డదారులు (షార్ట్‌కట్స్) వెతుక్కోకూడదు. లంకాధిపతి రావణుడు సీతమ్మ వారిని కోరుకోవడం వల్ల ఎంతటి ఉపద్రవం జరిగిందో రామాయణం చెబుతోంది. కోరికలపై నియంత్రణ అవసరమని, సన్మార్గమే శ్రేష్ఠమని ఇది సందేశం ఇస్తుంది. పెట్టుబడులపై రాబడుల విషయంలోనూ కోరికలను అదుపులో పెట్టుకుని వ్యవహరించాలి. తమకంటూ ఆర్థిక సరిహద్దులు ఏర్పాటు చేసుకోవాలి. ఉద్రేకంతో కూడిన నిర్ణయాలకు చోటు ఇవ్వకూడదు. టిప్స్‌ను అనుసరించడం కాకుండా కాల పరీక్షకు నిలిచిన బలమైన పెట్టుబడుల వ్యూహాలను అనుసరించాలి. దీనివల్ల విజయం తేలిక అవుతుంది.

ఓపిక, క్రమశిక్షణ

సముద్రంలో రామసేతు వారధి నిర్మాణం ఎంతో ఓపిక, పట్టుదలతో, ఎంతో మంది కృషితో, సుదీర్ఘ కాలానికి కానీ సాధ్యం కాలేదు. సంపద సృష్టి కూడా అంతే. స్వల్ప కాలంలో కుబేరులు కావడం అనేది ఆచరణలో అంత సులభం కాదు. క్రమశిక్షణతో దీర్ఘకాలం పాటు పెట్టుబడులు కొనసాగించడం ద్వారానే ఇది సాధ్యపడుతుంది. సిప్ అవసరాన్ని ఇక్కడ గుర్తించాలి. సిప్ రూపంలో ప్రతి నెలా ఇన్వెస్ట్ చేస్తూ వెళితే, చిన్న మొత్తమే దీర్ఘకాలంలో పెద్ద మొత్తంగా మారుతుంది. దీర్ఘకాలంలో సంపద సృష్టిని సిప్ సులభతరం చేస్తుంది. స్థిరత్వం, సహనం అనేవి దీర్ఘకాల ప్రయాణానికి ఎంతో అవసరం. లక్ష్మణుడి కోసం ఆంజనేయుడు సంజీవని కోసం వెళ్లడం, దాన్ని గుర్తించలేక తన చేత్తో మొత్తం సుమేరు పర్వతాన్ని పెకిలించి చేత్తో తీసుకురావడం తెలిసిందే. ప్రతీ ఇన్వెస్టర్ సంజీవని వంటి కంపెనీలను గుర్తించలేకపోవచ్చు. అలాంటప్పుడు వారి ముందున్న మార్గం మ్యూచువల్ ఫండ్స్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్. ఇన్వెస్టర్లు ఒక్కో కంపెనీ వారీ రిస్క్‌ను తగ్గించుకునేందుకు మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. సూచీల్లో ఇన్వెస్ట్ చేసే ప్యాసివ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్ల.. అందులోని కొన్ని స్టాక్స్ బలహీన పనితీరు చూపించినా కానీ, మిగిలిన వాటి అండతో దీర్ఘకాలంలో మంచి రాబడులు సొంతం చేసుకోవచ్చు.

ధర్మ మార్గం

ధర్మం పట్ల రాముడి అచంచలమైన నిబద్ధత ఆయన జీవన గమనానికి మూలస్తంభంగా కనిపిస్తుంది. వ్యక్తిగత ఆర్థిక జీవితంలో నైతిక ఆర్థిక విధానాల ఆచరణ అవసరాన్ని ఇది తెలియజేస్తుంది. ఇదే దీర్ఘకాలంలో విజయానికి బాటలు పరుస్తుంది. నిజాయితీ, చిత్తశుద్ధి, ఆర్థిక నిర్ణయాల్లో పారదర్శకత, క్రమశిక్షణ, భావోద్వేగాల నియంత్రణ, వేగంగా ధనవంతులు కావచ్చనే ప్రచారానికి ఆకర్షితులు కాకపోవడం వంటివి ఆర్థిక విజయాలకు భరోసానిస్తుంది. ఆర్థిక విషయాల్లో ధర్మానికి కట్టుబడి ఉండడం వల్ల అది స్థిరమైన, నైతిక సంపద సృష్టికి దారితీస్తుంది.

రిస్క్ నిర్వహణ

రావణుడితో రాముడు సాగించిన యుద్ధం.. ధైర్యం, రిస్క్ నిర్వహణ ప్రాధాన్యతను తెలియజేస్తుంది. వ్యక్తిగత ఆర్థిక విషయాల్లోనూ వీటి అవసరం ఎంతో ఉంది. సంపద సృష్టికి, ఆర్థిక లక్ష్యాల సాధనకు ధైర్యంగా, తమకు సరిపడే రిస్క్‌లను తీసుకోవాల్సిందే. రిస్క్‌లను మదించే విషయమై, అనిశ్చితులను అధిగమించేందుకు అవసరమైతే నిపుణుల సాయం తీసుకోవడాన్ని మర్చిపోవద్దు.



ధర్మం కోసం రాముడు యుద్ధం చేయక తప్పలేదు. అలాగే, సంపద సృష్టి కోరుకునే వారు కూడా రిస్క్‌తో కలిసి నడవాల్సిందే. అది కూడా తాము భరించే స్థాయిలోనే రిస్క్‌ను పరిమితం చేసుకోవాలి. పెట్టుబడికి సైతం ముప్పు ఉంటుందని ఈక్విటీలకు దూరంగా ఉండడం సరికాదు. రాబడులకు, పెట్టుబడి రక్షణకూ ప్రాధాన్యం ఇవ్వాలి. ఏ ఒక్కదాని దృష్టితోనో పరుగులు తీయకూడదు.



సరళతరం

వనవాస సమయంలో రాముడి నిరాడంబర, సాధారణ జీవన శైలి.. పొదుపు ధర్మాన్ని తెలియజేస్తుంది. వ్యక్తిగత ఆర్థిక జీవితంలోనూ పొదుపుతో కూడిన జీవనశైలిని అనుసరించడం, అనవసర దుబారాని నియంత్రించడం ఆర్థిక శ్రేయస్సుకు దారి చూపుతుంది. నేడు ప్రతి ఒక్క అవసరానికీ సులభంగా రుణాలు లభిస్తున్నాయి. అవసరాలు, కోరికల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాలి. అవసరాలకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి. రుణాలతో కోరికలు తీర్చుకోవడం ఆర్థిక శ్రేయస్సుకు మేలు చేయదు. పొదుపు మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలి. తెలివిగా ఖర్చు చేస్తూ, పొదుపు, పెట్టుబడులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా ఆర్థిక క్రమశిక్షణ ఎంతో ముఖ్యం. క్రెడిట్ కార్డ్ రుణాల నుంచి త్వరగా బయటకు రావాలి. అధిక ఖర్చుకు కళ్లెం వేయాలి. సరైన అవకాశాలు, అనుకూల సమయం కోసం వేచి చూస్తూ ఈక్విటీ మార్కెట్లో వచ్చే విలువైన అవకాశాలను కోల్పోవద్దు. సహనం, పట్టుదల కష్టపడి సంపాదించిన ధనానికి రక్షణగా నిలవాలి.

మార్గదర్శకం

రాముడి విధేయత, తన అనుచరులతో ఉన్న బలమైన బంధం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పెట్టుబడుల విషయంలోనూ సత్సంబంధాలు ఎంతో అవసరం. పరస్పర గౌరవం, నమ్మకం, మద్దతు అనేవి ఆర్థిక సవాళ్లను అధిగమించేందుకు సాయపడతాయి. అవసరం మేరకు ఆర్థిక నిపుణుల సాయాన్ని, మద్దతును, మార్గదర్శకాన్ని తీసుకోవాలి. ఇన్వెస్టర్ రిస్క్‌ను మదింపు వేసి, అనుకూలమైన పెట్టుబడి సాధనాలు, ఆర్థిక లక్ష్యాల సాధనకు ఆచరించాల్సి మార్గాన్ని వారు సూచిస్తారు. ఆర్థిక ప్రపంచంలో ఉండే సంక్లిష్టతలను అధిగమించేందుకు సాయపడతారు.



వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియో



రాముడి సైన్యంలో కనిపించే వైవిధ్యాన్ని, తమ పెట్టుబడులకూ అన్వయించుకోవాలి. వానరాలు, ఎలుగుబంట్లు, ఉడతలు, గద్దలు ఇవన్నీ రామదండులో కనిపిస్తాయి. ఇదే మాదిరిగా పెట్టుబడుల్లోనూ వైవిధ్యం ఉండాలి. కేవలం పొదుపు, ఫిక్స్‌డ్ డిపాజిట్లకే (ఎఫ్‌డీలు) పరిమితం కాకూడదు. అన్ని ముఖ్య సాధనాల్లోకీ పెట్టుబడులు వర్గీకరించుకోవాలి. దీనివల్ల రిస్క్‌ను తగ్గించుకోవచ్చు. రాబడులు స్థిరంగా ఉండేలా చూసుకోవచ్చు. దీన్నే అస్సెట్ అలోకేషన్ అని చెబుతారు. ఈక్విటీలు, డెట్, గోల్డ్, ఏఐఎఫ్‌లకు పెట్టుబడులు కేటాయించుకోవచ్చు.

నేనే సుపీరియర్ అనుకోవద్దు..!

పెట్టుబడుల విషయంలో అంతా తనకే తెలుసన్న అహంకారం అస్సలు పనికిరాదు. రావణుడి పతనానికి ఇదే దారితీసింది. మెరుగైన పనితీరు చూపించని సాధనాల విషయంలో అహంకారం విడిచి పెట్టి ఆలోచించాలి. నిర్ణీత కాలానికోసారి సమీక్షించుకుని పెట్టుబడుల్లో మార్పులు చేసుకోవాలి. అలా కాకుండా ఇన్వెస్ట్ చేసి పని అయిపోందని అనుకోవడం ఆర్థిక విజయాలకు దారితీయదు. సంపద సృష్టికి, పెట్టుబడుల మార్గంలో తప్పొప్పులను అంగీకరించాలి. దీనివల్ల నష్టాలను పరిమితం చేసుకునేందుకు వీలుంటుంది. మారుతున్న పరిస్థితులను ఆహ్వానించడం ఆర్థిక శ్రేయస్సుకు అవసరం.



శ్రీరాముడి జీవితంలో పొందుపరిచిన జ్ఞానం కేవలం ఆధ్యాత్మికతకు పరిమితం కాదు. ఒక వ్యక్తి జీవితంలో ఎదురయ్యే పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో తెలియచెపుతుంది. ఇన్వెస్టర్లకు విలువైన అంశాలను తెలియజేస్తుంది. రామాయణాన్ని చదవడం, అందులోని ముఖ్యమైన అంశాలను గ్రహించి, వాటిని తమ పెట్టుబడులకు అన్వయించుకోవడం వల్ల ఆర్థిక విజయాలకు మార్గాన్ని సులభం చేసుకోవచ్చు. చెడుపై మంచి విజయం సాధించడం రామాయణంలో కనిపిస్తుంది. అదే మాదిరిగా ఇన్వెస్టర్లు ఆర్థిక అవరోధాలను అధిగమించి, మంచి ఆర్థిక అలవాట్లతో, క్రమశిక్షణతో మెలగడం ద్వారా సంపద సృష్టికి చేరువకావచ్చు.

ఫండ్ స్ట్రీట్

హెచ్‌ఎస్‌బీసీ మల్టీ అస్సెట్ అలోకేషన్ ఫండ్



హెచ్‌ఎస్‌బీసీ మ్యూచువల్ ఫండ్ మల్టీ అస్సెట్ అలోకేషన్‌తో కూడిన నూతన పథకాన్ని ప్రారంభించింది. ఈ నెల 22వ తేదీ వరకు ఈ నూతన పథకం (ఎన్‌ఎఫ్‌వో) పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సాధనాలు, డెట్, మనీ మార్కెట్ సెక్యూరిటీలు, గోల్డ్/సిల్వర్ ఈటీఎఫ్‌లలో ఈ పథకం పెట్టుబడులు పెడుతుంది. అస్థిరతలు తగ్గించడం, వైవిధ్యం, దీర్ఘకాలంలో పెట్టుబడుల వృద్ధి లక్ష్యంగా ఈ పథకం పనిచేస్తుంటుంది. దీని వల్ల ఒకే పథకం ద్వారా ఒకటికి మించిన సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

యాక్సిస్ సెన్సెక్స్ ఇండెక్స్ ఫండ్



యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ 'యాక్సిస్ సెన్సెక్స్ ఇండెక్స్ ఫండ్' పేరుతో నూతన పథకాన్ని (ఎన్‌ఎఫ్‌వో) ఈ నెల 8న ప్రారంభించింది. ఈ నెల 22 వరకు పెట్టుబడులు స్వీకరించనుంది. ఈ కాలంలో రూ.100 కోట్లను ఇన్వెస్టర్ల నుంచి సమీకరించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నట్టు సంస్థ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ ఆశిష్ గుప్తా తెలిపారు. భిన్న రంగాలు, పెద్ద కంపెనీలతో కూడిన సెన్సెక్స్‌లో పెట్టుబడులు ఇన్వెస్టర్లకు వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియోతోపాటు వృద్ధి అవకాశాలకు వీలు కల్పిస్తుందని ఫండ్ ఎండీ, సీఈవో బి.గోపకుమార్ ప్రకటించారు.

బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ లార్జ్, మిడ్ క్యాప్ ఫండ్



బజాజ్ ఫిన్‌సర్వ్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ కొత్తగా లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 20తో ముగుస్తుంది. ఇతర సంస్థలతో పోటీపడగలిగే, నిలబడగలిగే సామర్థ్యాల ప్రాతిపదికన ఇది వివిధ సంస్థల్లో ఇన్వెస్ట్ చేస్తుందని ఫండ్ వర్గాలు పేర్కొన్నాయి. వేగవంతమైన వృద్ధి, లాభదాయకత, గణనీయంగా పోటీతత్వం ప్రదర్శించగలిగే అవకాశమున్న వ్యాపారాలను గుర్తించేందుకు ఈ వ్యూహం ఉపయోగపడగలదని బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ సీఈవో గణేష్ మోహన్ తెలిపారు.

జోస్ ఆలుక్కాస్ 'ఓరిస్' వజ్రాభరణ కలెక్షన్



హైదరాబాద్: ఆభరణాల విక్రయ సంస్థ జోస్ ఆలుక్కాస్ 'ఓరిస్' పేరుతో కొత్త వజ్రాభరణాల కలెక్షన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. తేలికపాటి, సొగసైన ఈ కొత్త కలెక్షన్‌ను మోడల్ రాఫెట్ సిక్వేరా ఆవిష్కరించారు. మహిళలు రోజువారీగా ధరించడం కోసం కచ్చితత్వంతో తీర్చిదిద్దిన ఈ అధునాతన కలెక్షన్‌లో ఒక క్యారెట్ బరువున్న స్టడ్స్ కలిగిన పెండెంట్స్ ఉన్నాయి. ''నేటి మహిళల కోసం ప్రత్యేకంగా తీర్చిద్దిన బ్రాండ్ 'ఓరిస్'. అందరికీ అందుబాటు ధరల్లో వజ్రాభరణాలు అందించడానికి జోస్ ఆలుక్కాస్ అంకితమైంది'' అని చైర్మన్ జోస్ ఆలుక్కాస్ తెలిపారు.

ఓఎన్‌జీసీ లాభం 14 శాతం డౌన్..



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ. 9,536 కోట్ల లాభం (స్టాండెలోన్) ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో నమోదైన రూ. 11,045 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు 14 శాతం తక్కువ. సమీక్షాకాలంలో చమురు, గ్యాస్ ధరలు తగ్గడమే.. లాభాల క్షీణతకు కారణమని సంస్థ తెలిపింది. క్యూ3లో క్రూడాయిల్ ఉత్పత్తి 3.3 శాతం తగ్గి 5.2 మిలియన్ టన్నులకు పరిమితం కాగా, గ్యాస్ ఉత్పత్తి 4.3 శాతం క్షీణించి 5.12 బిలియన్ ఘనపు మీటర్లుగా నమోదైంది. క్యూ3లో స్థూల ఆదాయం 10 శాతం తగ్గి రూ. 34,789 కోట్లుగా నమోదైంది. సమీక్షాకాలానికి షేరు ఒక్కింటికి రూ. 4 చొప్పున కంపెనీ రెండో మధ్యంతర డివిడెండు ప్రకటించింది. ఇందు కోసం సుమారు రూ. 5,032 కోట్లు అవుతుందని తెలిపింది.

అశోకా బిల్డ్‌కాన్ | ఐడీబీఐ క్యాపిటల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 175 టార్గెట్: రూ. 206

ఎందుకంటే: మౌలిక సదుపాయాల రంగ కంపెనీ అశోక్ బిల్డ్‌కాన్ యాజమాన్యం.. భవిష్యత్ అవకాశాలపై ఇటీవల సమావేశాన్ని నిర్వహించింది. దీనిలో భాగంగా కంపెనీ ఎంవోపీఏ ఎయిర్‌పోర్ట్ లింక్ రోడ్(ఏఎల్ఆర్) ప్రాజెక్టును సందర్శించాం. ఏఎల్ఆర్ ప్రాజెక్టు సుమారు 82 శాతం పూర్తయ్యింది. ఈ ఏడాది(2024) మార్చికల్లా ప్రాజెక్టు ప్రారంభంకావచ్చని అంచనా. నిజానికి ప్రభుత్వ(ఎంవోఆర్‌టీహెచ్) మార్గదర్శకాల ప్రకారం 2024 ఆగస్ట్ కల్లా పూర్తికావలసి ఉంది. కంపెనీ ఆస్తుల మానిటైజేషన్ ప్రక్రియలో భాగంగా చేపట్టిన 9 హైబ్రిడ్ యాన్యుటీ మోడ్(హెచ్ఏఎం) ప్రాజెక్టులు పూర్తయ్యే పురోగతిలో ఉన్నాయి. ఈ మార్చికల్లా వాటా కొనుగోలు ఒప్పందం(ఎస్‌పీఏ) స్థాయికి చేరే అవకాశముంది. అయితే బీవోటీ పద్ధతిలోని ప్రాజెక్టు(చెన్నై ఓఆర్ఆర్, నయాగావ్)కు ఎన్‌వోసీ అనుమతులు లభించవలసి ఉంది. దీంతో ఈ బీవోటీ ఆస్తుల మానిటైజేషన్ వచ్చే ఆర్థిక సంవత్సరానికి(2024-25) వాయిదాపడవచ్చని అంచనా. అసెట్ మానిటైజేషన్ పూర్తయితే కన్సాలిడేటెడ్ రుణభారం రూ. 7,200 కోట్లమేర తగ్గే వీలుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) తొలి అర్థభాగం(ఏప్రిల్-సెప్టెంబర్)లో నిర్వహణలాభ(ఇబిటా) మార్జిన్లు నిలకడను సాధించడం, ఈ ఏడాది ఆదాయానికి రెండు రెట్లు అధికంగా రూ. 14,800 కోట్ల విలువైన ఆర్డర్‌బుక్ సానుకూల అంశాలుగా పేర్కొనవచ్చు. వీటికితోడు ప్రస్తుతం 7 శాతం వాటాను ఆక్రమిస్తున్న అంతర్జాతీయ ఈపీసీ ప్రాజెక్టులు మరింత పెరగే వీలుంది. ప్రభుత్వం రోడ్ ప్రాజెక్టులను హెచ్ఏఎం/ఈపీసీ విధానాలను వీడి బీవోటీలో కేటాయించనుంది. కంపెనీ మరిన్ని కొత్త ప్రాజెక్టులకు బిడ్డింగ్ చేయనుంది.



టార్క్ | యూఎల్‌జేకే రీసెర్చ్ | కొనొచ్చు


ప్రస్తుత ధర: రూ. 165 టార్గెట్: రూ. 225

ఎందుకంటే: గతంలో అనంత్‌రాజ్ గ్లోబల్ లిమిటెడ్‌గా కార్యకలాపాలు సాగించిన రియల్టీ రంగ కంపెనీ టార్క్.. ప్రధానంగా ఢిల్లీలో విలాసవంత హౌసింగ్ ప్రాజెక్టులపై దృష్టిపెట్టి పనిచేస్తోంది. బహుళ అంతస్తుల(హైరైజ్) బిల్డింగుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోంది. నిర్మాణ రంగ కంపెనీగా ప్రారంభమైన సంస్థ రియల్ఎస్టేట్ అభివృద్ధిలోకి మార్పు చెందింది. దీనిలో భాగంగా న్యూఢిల్లీ, గురుగ్రామ్, మనేసర్, గ్రేటర్ నోయిడాలలో పూర్తిగా సొంతమైన 500 ఎకరాల భూమిని కలిగి ఉంది. ప్రస్తుతం త్రిపుంద్ర, కైలాస, ఇష్వా పేరుతో మూడు ప్రాజెక్టుల నిర్మాణాలను చేపట్టింది. అంతే కాకుండా మరోవైపు ఢిల్లీ, గురుగ్రామ్‌లలో అదనపు ప్రాజెక్టుల అభివృద్ధికీ ప్రణాళికలు వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం(2024-25)లో ఈ ప్రాజెక్టుల అమ్మకాలను ప్రారంభించాలని యోచిస్తోంది. వెరసి వచ్చే ఏడాది నుంచి ఈ వెంచర్ల ద్వారా రూ. 7,500 కోట్లమేర ఆదాయం సమకూరవచ్చని కంపెనీ అంచనా వేస్తోంది. 2022లో పీఈ సంస్థ బెయిన్ క్యాపిటల్ మార్పిడిరహిత డిబెంచర్ల(ఎన్‌సీడీలు) ద్వారా రూ. 1,330 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. ఫలితంగా అన్నిరకాల ఆర్థిక బకాయిల చెల్లింపులనూ పూర్తి చేసేందుకు టార్క్‌కు వీలు చిక్కింది. అంతేకాకుండా నిర్మాణం చేపట్టిన ప్రాజెక్టులను కొనసాగించేందుకు పెట్టుబడులు లభించాయి. కాగా.. ఈ ఎన్‌సీడీలను చెల్లించేందుకు అంతర్గత వనరులను వినియోగించాలని కంపెనీ ప్రణాళికలు వేసింది. ఈ నేపథ్యంలో కంపెనీ పటిష్ట అమ్మకాలు సాధించే వీలుండటం, ప్రస్తుతం చేపట్టిన మూడు ప్రాజెక్టుల నిర్మాణాలు సక్రమంగా కొనసాగుతుండటం, రానున్న కాలంలో మరో మూడు ప్రాజెక్టుల విడుదలకు సన్నాహాలు వంటి అంశాలు సానుకూలంగా కనిపిస్తున్నాయి.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

పెట్టుబడికి బదులు బంగారం తీసుకోవచ్చా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఎన్‌పీఎస్ టైర్1 ఖాతాదారులకు అదనంగా రూ.50,000 పెట్టుబడి మొత్తంపై పన్ను ఆదా ఉందని తెలిసింది. నూతన పన్ను విధానంలోనూ దీన్ని వినియోగించుకోవచ్చా? – జయంతి రామన్

నూతన పన్ను విధానం కింద, ఎన్‌పీఎస్ టైర్1 ఖాతాలో ఇన్వెస్ట్ చేస్తున్నట్టు అయితే, మీరు అదనంగా రూ.50,000 మొత్తంపై పన్ను ఆదా చేసుకునేందుకు అవకాశం లేదు. పాత పన్ను విధానంలో ఉన్న వారే రూ.50,000 మొత్తంపై అదనపు పన్ను ప్రయోజనాన్ని క్లెయిమ్ చేసుకోగలరు. కాకపోతే మీరు పనిచేసే సంస్థలో మీ తరఫున యాజమాన్యం ఎన్‌పీఎస్ ఖాతాకు జమ చేస్తున్నట్టు అయితే అప్పుడు అదనపు క్లెయిమ్‌కు అవకాశం ఉంది. మీ మూల వేతనం, డీఏలో గరిష్ఠంగా 10% మేర పన్ను మినహాయింపును పొందొచ్చు. ఒకవేళ మీరు ప్రభుత్వ ఉద్యోగి అయితే మూలవేతనం, డీఏలో 14% పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు.

నా వద్ద 2016-17 సంవత్సరానికి సంబంధించి 20 యూనిట్ల సావరీన్ గోల్డ్ బాండ్లు (ఎస్‌జీబీలు) ఉన్నాయి. 2024 నవంబర్ 17తో వీటి గడువు ముగిసిపోతుంది. నగదు బదులు 20 గ్రాముల బంగారం తీసుకోవచ్చా? – వసంత పరిమి

సావరీన్ గోల్డ్ బాండ్లలో పెట్టుబడుల కాల వ్యవధి ముగిసిన సమయంలో భౌతిక బంగారాన్ని క్లెయిమ్ చేసుకునేందుకు అవకాశం లేదు. భౌతిక బంగారాన్ని కలిగి ఉండడానికి ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన సాధనం ఎస్‌జీబీ. ఎస్‌జీబీ కాల వ్యవధి ఎనిమిదేళ్లు. ఐదేళ్ల పాటు పెట్టుబడులకు లాకిన్ ఉంటుంది. ఐదేళ్లు ముగిసిన తర్వాత ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉంది. లాభంపై పన్ను మినహాయింపు కోరుకునే వారు ఎనిమిదేళ్ల పాటు కొనసాగించాల్సి ఉంటుంది. మెచ్యూరిటీ ముగిసే తేదీకి మూడు రోజుల ముందు 24 క్యారట్ల బంగారం సగటు ధర ఆధారంగా చెల్లింపులు చేస్తారు. ఇన్వెస్టర్ ఎస్‌జీబీ కొనుగోలు సమయంలో ఇచ్చిన బ్యాంక్ ఖాతాతోనే గడువు అనంతరం మెచ్యూరిటీ మొత్తం జమ అవుతుంది.

పన్ను ఆదా ప్రయోజనంతో కూడిన ఈఎల్ఎస్ఎస్ పథకంలో నాకు పెట్టుబడులు ఉన్నాయి. వీటిని అదే అస్సెట్ మేనేజ్‌మెంట్ నిర్వహించే పన్ను ఆదా ప్రయోజం లేని ఇతర ఈక్విటీ పథకంలోకి మార్చుకోవచ్చా? – రవి గుప్తా

ఇందుకు అవకాశం లేదు. ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్) పెట్టుబడులకు మూడేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. కనుక ఈ మూడేళ్ల లాకిన్ పూర్తయిన తర్వాతే సదరు ఈఎల్ఎస్ఎస్ ఫండ్‌లోని పెట్టుబడులను ఇతర పథకంలోకి మార్చుకునేందుకు వీలుంటుంది. ఒక పథకం నుంచి మరో పథకంలోకి పెట్టుబడులు మళ్లించుకోవడాన్ని స్విచింగ్‌గా పిలుస్తారు. అన్ని మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు దీన్ని ఆఫర్ చేస్తున్నాయి. అదే ఏఎంసీకి చెందిన రెండు పథకాల మధ్య పెట్టుబడులను స్విచింగ్ చేసుకోవచ్చు. బ్యాంక్ ఖాతాలోకి పంపించుకుని, ఇన్వెస్ట్ చేయాల్సిన అవసరం ఇక్కడ ఏర్పడదు. ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ గడువు లోపు (మూడేళ్లు) స్విచింగ్‌ను అనుమతించడం లేదు. ఒకవేళ ఇన్వెస్టర్ మరణించిన సందర్భంలో.. సంబంధిత పెట్టుబడికి కనీసం ఏడాది ముగిసిన తర్వాతే నామినీ ఉపసంహరించుకోవడానికి అనుమతి ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-2-2024	
విశాఖ	555-00
చిత్తూరు	583-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	530-00
విజయవాడ	530-00
రిటైల్ ధర (డజను)	72.00
11-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	545-00
వరంగల్	547-00
రిటైల్ ధర	6.05

మనబడికి అంతర్జాతీయ ఖ్యాతి

- జపాన్ సకురా సైన్స్ ఫెయిర్‌కు ఏపీ విద్యార్థులు
- ప్రభుత్వ పాఠశాలల నుంచి ఏడుగురు ఎంపిక



సాక్షి, అమరావతి : సరైన సదుపాయాలు కల్పిస్తే తామెంతో అద్భుతంగా రాణించగలమని రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిరూపిస్తున్నారు. జాతీయ స్థాయిలోనే కాదు.. అంతర్జాతీయ స్థాయిలోనూ ఇప్పుడు వీరు తమ ప్రతిభను చాటుతున్నారు. నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్ది, విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. దీంతో అక్కడి సైన్స్ ల్యాబ్స్, నిష్ణాతులైన ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో కేంద్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం నిర్వహించే 'ఇన్‌స్పైర్' పోటీల్లో వారిప్పుడు తమ సత్తా చాటుతున్నారు. 2019 నుంచి 2022 విద్యా సంవత్సరం వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు తమ సైన్స్ ప్రతిభతో 'జపాన్ సకురా' పోటీలకు ఎంపిక కాగా, వీరిలో ముగ్గురు జపాన్‌లో పర్యటించి వచ్చారు. మరో నలుగురు వచ్చే మేలో జపాన్ వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

10 నుంచి మూడో స్థానానికి..

నిజానికి.. 2019కి ముందు జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ 10వ స్థానంలో ఉంటే ఇప్పుడు 3వ స్థానానికి చేరుకుంది. గతంలో రెండు మూడేళ్లకు ఒక్కరు ఈ పోటీలకు ఎంపికవడమే గగనంగా ఉండే పరిస్థితి నుంచి ఇప్పుడు ఏటా ముగ్గురు నుంచి నలుగురు ఎంపికవుతుండడం విద్యా ప్రమాణాలు, సదుపాయాల పెరుగుదలకు, ఉపాధ్యాయుల శిక్షణ కారణమని విద్యావేత్తలు అభినందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థుల్లో 10 మంది గత సెప్టెంబరులో అమెరికా, యూఎన్‌ఓలో ప్రసంగించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే స్థాయిలో ఇన్‌స్పైర్ విద్యార్థులు జపాన్‌కు వెళ్లి ఏపీ విద్యా ప్రగతిని చాటుతున్నారు.

జాతీయ పోటీలకు ఏటా 40 మంది..

'ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్' (ఇన్‌స్పైర్) పేరుతో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం సైన్స్ పోటీలను నిర్వహిస్తోంది. దీనిద్వారా పాఠశాల స్థాయిలోని విద్యార్థులు తమ దైనందిన జీవితంలో చూసిన సమస్యలకు పరిష్కారాలను చూపుతూ నమూనాలను తయారుచేయాలి. ఇందుకోసం ఇన్‌స్పైర్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుంటే.. ఆకర్షణీయమైన అంశాలపై ప్రాజెక్టు చేసేందుకు అవకాశం కల్పిస్తుంది. గత నాలుగేళ్లగా 40 వేల మందికి పైగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రాజెక్టులు నమోదుచేస్తున్నారు. వీటి నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు 400 వరకు ఎంపికవుతుండగా, జాతీయ పోటీలకు 40 నుంచి 45 ప్రాజెక్టులు ఎంపికవుతున్నాయి. జాతీయ పోటీల్లో రాష్ట్రం నుంచి ఇంత పెద్దస్థాయిలో విద్యార్థుల ప్రాజెక్టులు ఎంపికవడం ఇప్పుడే జరుగుతోంది.

ఉత్తమ ప్రాజెక్టులకు పేటెంట్ రైట్స్..

గతేడాది గుంటూరు జిల్లా అత్తోట జెడ్పీ స్కూల్ విద్యార్థిని పి. కీర్తి వీధుల్లో కూరగాయలు అమ్ముకునే వారికి ఉపయోగపడే వెండర్స్ ఫ్రెండ్లీ సోలార్ కార్ట్‌ను రూపొందించింది. రూ.10 వేల ఖర్చుతో తయారుచేసిన ఈ బండిపై ఆకు కూరలు వారంరోజుల పాటు ఫ్రెష్‌గా ఉంటాయి. అలాగే..

- చిత్తూరు జిల్లా ఏఎల్‌పురం జెడ్పీ స్కూల్ విద్యార్థిని కె. ప్రణయ దాదాపు 15 రోజులపాటు కూరగాయలు పాడవకుండా ఫ్రెష్‌గా నిల్వచేసుకునే గార్లిక్ బ్యాగ్‌ను రూపొందించింది. వెల్లుల్లి పేస్టును గోనె సంచికి పూసి తయారుచేసిన ఈ సంచిని నిపుణులు సైతం పరిశీలించి, ప్రణయను అభినందించారు. వెల్లుల్లి ఉన్నచోట బ్యాక్టీరియా చేరదని, రూ.25 ఖరీదుతో చేసిన ఈ బ్యాగ్ రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని విద్యార్థిని చెబుతోంది.
- ఇక చిత్తూరు జిల్లా జంగంపల్లి జెడ్పీ స్కూల్ విద్యార్థి పి. చరణ్ తేజ బైక్‌పై ప్రయాణించే మహిళలు పడిపోకుండా రక్షణగా ఉండే సైడ్ సీట్‌ను రూపొందించాడు.

ఇలా.. రైతు కుటుంబాలకు చెందిన ఈ ముగ్గురు విద్యార్థులు తాము ప్రతిరోజూ చూస్తున్న సమస్యలకు పరిష్కారంగా ఈ ఆవిష్కరణలు చేసి, జాతీయ ప్రతినిధులను మెప్పించారు. తమ ఆవిష్కరణలకు పేటెంట్ హక్కులు పొందడంతో పాటు గత నవంబరులో జపాన్ వెళ్లి వచ్చారు. మేలో మరో నలుగురు విద్యార్థులు జపాన్ పర్యటనకు సిద్ధమవుతున్నారని స్టేట్ సైన్స్ ఆఫీసర్ డాక్టర్ భాగ్యశ్రీ 'సాక్షి'కి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ల్యాబ్స్ సదుపాయాలు, బోధనా పద్ధతులు మెరుగుపడ్డాయని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ ప్రతాప్‌రెడ్డి చెప్పారు. 2022–23 సంవత్సరపు ఇన్‌స్పైర్ పోటీలు జిల్లా స్థాయిలో ఇప్పటికే ప్రారంభమయ్యాయని, గతంకంటే ఈసారి అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే మన విద్యార్థులు పెరుగుతారని ఆయన చెబుతున్నారు.

ఈఈఎంటీ–2024 ఫలితాల విడుదల

- రాష్ట్ర వ్యాప్తంగా 29 వేల మంది విద్యార్థులు నమోదు
- 17న విజేతలకు బహుమతుల ప్రదానం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు 'ఎడ్యుకేషనల్ ఎపిఫని' స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన ఎడ్యుకేషనల్ ఎపిఫని మెరిట్ టెస్ట్–2024 (ఈఈఎంటీ) పరీక్ష ఫలితాలను ఆదివారం విడుదల చేశారు. జనవరి 30న ప్రిలిమినరీ, ఫిబ్రవరి 7న మెయిన్స్ పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 26 జిల్లాల నుంచి 29,000 మందికి పైగా 7, 10 తరగతుల విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగా, వారికి కోడ్‌తంత్ర సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫారం ద్వారా ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించారు. ఫలితాలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ విడుదల చేశారు. ఇందులో 75 మంది 10వ తరగతి, 98 మంది ఏడో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో తొలి 3 స్థానాల్లో నిలిచిన విజేతలను ఈనెల 17న పాఠశాల సురేష్ కుమార్ చేతుల మీదుగా విజయవాడలో సత్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 10వ తరగతి విభాగంలో రాష్ట్ర స్థాయిలో తొలి స్థానంలో నిలిచిన వారికి రూ.30 వేలు, ద్వితీయ విజేతకు రూ.25 వేలు, తృతీయ స్థానానికి రూ.20 వేలు నగదు బహుమతి అందించనున్నారు. ఏడో తరగతి విభాగంలో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.20 వేలు, ద్వితీయ స్థానం రూ.15 వేలు, తృతీయ స్థానంలో నిలిచినవారికి రూ.10 వేలు అందించనున్నారు. జిల్లా స్థాయి విజేతలకు కూడా నగదు పురస్కారాలతో సత్కరించనున్నారు. ఫలితాలను ఎడ్యుకేషనల్ ఎపిఫని సంస్థ వెబ్‌సైట్‌లో ఉంచారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ ఎపిఫని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తవనం వెంకటరావు, ఉపాధ్యక్షుడు హేమచంద్ర పాల్గొన్నారు.

విశాఖలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు

నేటి నుంచి 5 రోజుల పాటు నిర్వహణ

సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తోన్న నేపథ్యంలో ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ అందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా నిర్ణయించారు. ఇందుకోసం విశాఖ వేదికగా సోమవారం నుంచి 5 రోజుల పాటు మొదటి ఫేజ్–1 శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఏయూలోని కెమికల్ ఇంజినీరింగ్ బ్లాక్‌లో ముఖేష్‌కుమార్ మీనా శిక్షణ తరగతులు ప్రారంభించనున్నారు. లోక్‌సభ ఎన్నికలు నిర్వహించే ఏఆర్వోలకు, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఏఆర్వోలు, ఆర్వోలకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ట్రైనింగ్ క్లాసులు జరుగుతాయని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు.

'మిషన్ లైఫ్'లో ఏపీ ఆదర్శం

సీఐసీ చీఫ్ కమిషనర్ హీరాలాల్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హీరాలాల్ సమారియా

సాక్షి, అమరావతి: తిరుపతి, విశాఖలో 'మిషన్ లైఫ్' వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఏపీ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని కేంద్ర సమాచార కమిషన్ ప్రధాన కమిషనర్ హీరాలాల్ సమారియా అన్నారు. కేంద్ర విద్యుత్ శాఖకు చెందిన బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ(బీఈఈ) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డా.ఎంసీఆర్ హెచ్ఆర్డీ(హైదరాబాద్) డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్‌తో కలిసి మిషన్ లైఫ్ ప్రచార పోస్టర్‌ను సమారియా ఆవిష్కరించారు. ఈ వివరాలను బీఈఈ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు ఎ.చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఇంధన సామర్థ్యంపై దృష్టి సారించి.. అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిన ఏపీని సమారియా అభినందించారు. పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రజలను, సంస్థలను ప్రోత్సహిస్తూ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు 'మిషన్ లైఫ్' ప్రాజెక్టు అడుగులు వేస్తోందని ఆయన చెప్పారు. పర్యావరణ మార్పుల వల్ల ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. 2028 నాటికి భారత్‌లోని 80 శాతం గ్రామాలు, పట్టణాలు, స్థానిక సంస్థల్లో పర్యావరణ అనుకూల పద్ధతులను అవలంబించేలా ప్రోత్సహించడమే మిషన్ లైఫ్ లక్ష్యమన్నారు. 2022–28 మధ్య కనీసం ఒక బిలియన్ మంది భారతీయులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలను ఈ మిషన్‌లో భాగస్వామ్యం చేయాలని సూచించారు.

వినూత్న విధానాలతో వ్యాపారంలో వృద్ధి



లబ్బీపేట (విజయవాడ తూర్పు): అంకిత భావంతో కృషి, వినూత్న పద్ధతుల అమలుతో వ్యాపారంలో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చని పూర్వ ఐపీఎస్ అధికారి కిరణ్‌బేడీ అన్నారు. బిజినెస్ నెట్‌వర్క్ ఇండియా(బీఎన్ఐ) ఆంధ్రప్రదేశ్ శాఖ సమావేశం విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కిరణ్‌బేడీ మాట్లాడుతూ.. వ్యాపారవేత్తలు ఒకరికొకరు సహకరించుకోవడం ద్వారా పరస్పర వ్యాపారాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. బీఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జై దేశాయ్, విశాల్ దేశాయ్ మాట్లాడుతూ పరస్పర సహకారంతో వ్యాపారం అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సదస్సు కోశాధికారి త్రినాథ్ నండూరి తదితరులు పాల్గొన్నారు.

ఈ–కామర్స్ టు సోషల్ కామర్స్!

ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, బిగ్‌బాస్కెట్ వంటి ఆన్‌లైన్ మార్కెట్ల నుంచి మనకు అవసరమైన వస్తువులేవో కొంటుండటం కామనే. దీన్నే ఈ–కామర్స్ అంటారు. కానీ కొంతకాలం నుంచి 'సోషల్ కామర్స్' కొనుగోళ్లు పెరుగుతున్నాయి. అంటే ఇన్‌స్టాగామ్, వాట్సాప్, టిక్‌టాక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు వేదికగా జరుగుతున్న ఆన్‌లైన్ కొనుగోళ్లు అన్నమాట. నెటిజన్లు రెగ్యులర్ ఆన్‌లైన్ మార్కెట్ల నుంచి, మెల్లగా సోషల్ కామర్స్ వైపు మళ్లుతున్నారని స్టాటిస్టా మార్కెట్ ఇన్‌సైట్స్ అధ్యయనంలో తేలింది. 2018 నాటితో పోలిస్తే.. సోషల్ కామర్స్ పుంజుకుందని వెల్లడైంది.

ప్రేమికులూ జరభద్రం!

సర్‌ప్రైజ్ గిఫ్ట్ అంటూ బురిడీ కొట్టిస్తున్న కేటుగాళ్లు

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు ఇప్పుడు ప్రేమికులపై ఫోకస్ పెట్టారు. వాలంటైన్స్ డే దగ్గర పడుతుండడంతో డిస్కౌంట్‌లు, ఆఫర్లు, సర్‌ప్రైజ్ గిఫ్ట్ లు, గిఫ్ట్ కూపన్లు అంటూ సరికొత్త మోసాలకు తెర తీస్తున్నారు. ఏటా ఈ తరహా మోసాలు షరా మామూలే అయినా.. ఎప్పటికప్పుడు సైబర్ నేరగాళ్ల బారిన పడే బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉందని సైబర్ భద్రత నిపుణులు పేర్కొంటున్నారు. సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో మోసాలకు తెరతీస్తున్నారు. మీకు అత్యంత సన్నిహితులు వాలంటైన్స్ డే సందర్భంగా మీకు సర్‌ప్రైజ్ గిఫ్ట్ పంపారు.. దాన్ని పొందాలంటే మేం చెప్పిన ఖాతాకు కస్టమ్స్ చార్జి కోసం కొంత మొత్తం పంపండి అంటూ వల వేస్తున్నారని పోలీసులు పేర్కొంటున్నారు. దీనిపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.